
'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

PARIS 2024

సంపుటి: 17 సంచిక: 126

శనివారం 27-7-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పాక్ కుట్రలు ఫలించవు: మోదీ

విజయ్ దివస్ సందర్భంగా ప్రధానమంత్రి కార్గిల్ సందర్శన - 6లో



నేడు నీతి ఆయోగ్ భేటీ

హాజరుకానున్న బెంగాల్ సీఎం మమత

ఆరుగురు సీఎంల బహిష్కరణ - 6లో

అబద్ధపు పత్రాలు

హామీల అమలుపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే శ్వేతపత్రాల పేరుతో డ్రామా

సాక్ష్యాధారాలతో సీఎం చంద్రబాబును కడిగిపారేసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



- ఎన్నికలకు ముందు రూ.14 లక్షల కోట్ల అప్పులతో ఆర్థిక విధ్వంసం చేశారని ఆరోపించావు
- రూ.పది లక్షల కోట్ల అప్పులున్నాయని గవర్నర్‌తో తప్పులు చెప్పించావు
- ఇంతకూ ఏ లెక్క కరెక్ట్ బాబూ..?
- వాస్తవంగా ఉన్న అప్పులు రూ.7.48 లక్షల కోట్లేగా.. తక్కువ అప్పుతో ఆర్థిక క్రమశిక్షణ పాటించామని మా ప్రభుత్వాన్ని కేంద్ర సామాజిక ఆర్థిక సర్వే ప్రశంసించలేదా?
- 2019 మే 30 నాటికి ఖజానాలో రూ.100 కోట్లే ఉన్నా మేం రూ.2.27 లక్షల కోట్లతో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాం
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం
- ఇప్పుడు ఖజానాలో రూ.7-8 వేల కోట్లున్నా ఎందుకు పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టలేదు బాబూ?
- అలా చేస్తే నీ ప్రచారం అంతా అబద్ధాలేనని తేలిపోతుందనే కదా నీ భయం
- హామీల అమలుపై ప్రజలు నిలదీస్తారనే భయంతో మాపై దాడులు, విధ్వంసాలు
- ఆంధ్రప్రదేశ్ అంటే అరాచకం.. ఆటవికం.. రెడ్‌బుక్ పరిపాలనగా మార్చేశావు..
- శాసనసభలో మేం నిలదీస్తామనే భయంతోనే ప్రతిపక్షంగా గుర్తించడం లేదు

2 లో

“ శాసనసభలో ఉన్నది రెండు పక్షాలే. ఒకటి అధికారపక్షం.. రెండు ప్రతిపక్షం. కానీ ప్రజల గొంతుక విన్పించకూడదనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీని ప్రతిపక్షంగా గుర్తించకుండా కుట్రలు చేస్తున్నారు. ప్రతిపక్షంగా గుర్తిస్తే ప్రజల గొంతుక విన్పించేందుకు అసెంబ్లీలో తగిన సమయం కేటాయించాల్సి వస్తుంది. అదే జరిగితే పాలక పక్షం సాగిస్తున్న ఆటవిక పాలన, విధ్వంసకాండ గురించి గళమెత్తుతాం. ఈ భయంతో మమ్మల్ని ప్రతిపక్షంగా గుర్తించకపోతే మిన్నకుండిపోము. మీడియా ద్వారా ప్రజల గొంతుక విన్పిస్తాం. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తాం. - వైఎస్ జగన్

చంద్రబాబూ..



జీవనాడిని గాడిలో పెట్టిన మాపై నిందలా?

పోలవరాన్ని కట్టాల్సింది కేంద్రమే అయినా కమీషన్ల కోసం తలకెత్తుకున్నావు.. నీ తప్పుల వల్లే కదా ప్రాజెక్టు దెబ్బతిన్నది.



ల్యాండ్ టైట్లింగ్‌పై యూటర్న్ ఎందుకు?

ఈ చట్టంపై ఎన్నికల ముందు ఎంత దుష్ప్రచారం చేశావుబాబూ? ల్యాండ్ రిఫామ్స్ చేపట్టే రాష్ట్రాలకే వడ్డీలేని రుణాలు ఇస్తామని కేంద్రం ప్రకటించడంతో ఇప్పుడు యూటర్న్ తీసుకున్నావు. ఇదేంటి బాబూ?



'మత్తు' మాటలవి!

- మద్యం అమ్మకాల పరిమాణం తగ్గి.. ప్రభుత్వానికి ఆదాయం పెరిగితే కుంభకోణమా?
- బాగా మందు తాగిన వ్యక్తి కూడా నీలా అబద్ధాలు ఆడడు



ఉచితం అన్నారు.. దోచేస్తున్నారు

మా హయాంలో ఇసుక వల్ల ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.765 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.3,825 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పుడు మీ ఎల్లో బ్యాచ్ దోచేస్తోంది. మరి దేనిని స్కాం అంటారు బాబూ..?



అరాచకం.. ఆటవికం.. 'రెడ్' రూల్!

- హామీలపై నిలదీస్తారనే టీడీపీ భయోత్పాతం
- ఏకంగా రెడ్‌బుక్ పేరిట హోర్డింగ్‌లు



గనుల లీజులపై గలీజు మాటలు

- 2023–24 నాటికి ఏకంగా రూ.3 వేల కోట్లకుపైగా ఆదాయం
- ఖజానాకు ఆదాయం పెరిగితే అవినీతి అవుతుందా?



అందరి నోటా అదే మాట

- జగన్ సీఎంగా ఉండి ఉంటే.. మాకు ప్రతి పథకం ఠంచన్‌గా అందేది అనే చర్చ అప్పుడే మొదలైంది..

- వివరాలు 10,11లో

వరద బాధిత కుటుంబాలకు

రూ.3 వేలు తక్షణ సాయం

- శాసన సభలో సీఎం చంద్రబాబు ప్రకటన
- 25 కిలోల బియ్యం, ఇతర వస్తువులు కూడా ఇస్తామని వెల్లడి
- 4,317 ఎకరాల్లో మాత్రమే వరి పూర్తిగా దెబ్బతిందని స్పష్టీకరణ
- మొక్కజొన్న 3,160 ఎకరాలు, పత్తి 960 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు వెల్లడి

12 లో



లాహిరి లాహిరి లాహిరిగా...

పారిస్ అంతా ఊగెనుగా...

ప్రపంచం ఎదురుచూసిన పారిస్ ఒలింపిక్స్‌కు శుక్రవారం జేగంట మోగింది. గత విశ్వక్రీడలకు భిన్నంగా... ఆతిథ్య వేదికకు దూరంగా... సాధారణ జనానికి దగ్గరగా ఆరంభ వేడుకలు పారిస్ నడిబొడ్డున... సెన్ నది పొడవున అట్టహాసంగా సాగాయి. మార్చ్‌పాస్ట్ మాటేలేదు... పతాకధారికి ప్రత్యేకతే లేదు. అన్ని దేశాలు లాహిరి లాహిరి లాహిరిగా అంటూ పడవల్లోనే పరేడ్ చేస్తూ ఒలింపిక్స్‌కు ఎన్నడూ లేని, ఎప్పుడూ చూడని కొత్త శోభ తెచ్చారు. ఫ్రెంచ్ కళలు అద్దారు. ఓ వైపు నదిలో వివిధ దేశాలకు చెందిన జట్లు విహరిస్తుంటే... నదితీరం వెంట ఫ్రెంచ్ కళలు, విభిన్న కళాకృతులు, నృత్యకారిణిల హొయలు అబ్బురపరిచాయి. భారత బృందానికి బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, టేబుల్ టెన్నిస్ స్టార్ ఆచంట శరత్ కమల్ పతాకధారులుగా వ్యవహరించారు. ప్రారంభోత్సవం ముగియడంతో నేటి నుంచి క్రీడాకారులు తమ పతకాల వేట మొదలుపెట్టనున్నారు.

14 లో

అన్నీ అసత్యాలు.. దుష్ప్రచారాలు

16 లో

- టీడీపీ కూటమి ప్రభుత్వం ఉభయ సభల సమావేశంలో మీతో అవాస్తవాలు చెప్పించింది
- గత ప్రభుత్వంపై చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలే
- అంశాల వారీగా అసలు నిజాలను గుర్తించండి
- గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ లేఖ

ఇదండీ సంగతి




రికార్డుల్లో బాగానే ఉంది! బయటే మరోలా ఉంది డాక్టర్!

సూపర్-6 అంటే భయమేస్తోంది

ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి

రూ.100 రాబడి వస్తుంటే రూ.113 ఖర్చు ఉంటోంది



- కేంద్రం రూ.15 వేల కోట్లు అప్పు ఇప్పిస్తాం అని అంటే ఆనందపడ్డా
- ప్రాజెక్టులను 'పీపీపీ' మోడల్‌లో ప్రైవేటుకు ఇద్దాం
- సంపద సృష్టించే మార్గాలను సభ్యులు అన్వేషించాలి
- ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి గత ప్రభుత్వమే కారణం
- అమరావతి అభివృద్ధిని నిలిపివేయడంతో భారీ నష్టం
- రాష్ట్ర ఆర్థిక విధానంపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు శ్వేతపత్రం

- వివరాలు 12లో



చెన్నై–మైసూర్ మధ్య హైస్పీడ్ రైలు

చిత్తూరు మీదుగా పరుగులు

- 463 కి.మీ. మేర హైస్పీడ్ రైల్ కారిడార్ ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం
- రాష్ట్రంలో 83 కి.మీ. ప్రయాణించనున్న రైలు
- చిత్తూరులో ఎలివేటెడ్ రైల్వేస్టేషన్
- రైలు గరిష్ట వేగం గంటకు 350 కిలోమీటర్లు

- వివరాలు 16లో

అసలు అప్పెంత? బాబు బొంకెంత?

ఇదిగో మా వాస్తవ పత్రం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఎన్నికలప్పుడు రూ.14 లక్షల కోట్లు అన్నావ్..
గవర్నర్ ప్రసంగంలో రూ.10 లక్షల కోట్ల అప్పులని చెప్పించావ్
వాస్తవానికి ఉన్న అప్పులన్నీ రూ.7.48 లక్షల కోట్లే
హామీలపై తప్పించుకునేందుకే చంద్రబాబు దుష్ప్రచారం
ఆ అబద్ధాలు బట్టబయలవుతాయని భయంతోనే
రెగ్యులర్ బడ్జెట్ ప్రవేశపెట్టకుండా డ్రామాలు
ఏడు నెలలకు ఓట్ ఆన్ అకౌంట్ దేశంలో ఎక్కడా చూడలేదు

"ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర అప్పులు రూ.14 లక్షల కోట్లు అని చంద్రబాబు దుష్ప్రచారం చేశారు. సూపర్ సిక్స్, సూపర్ టెన్ అంటూ ఎడాపెడా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక రూ.10 లక్షల కోట్లు అప్పు ఉందంటూ గవర్నర్ ప్రసంగంలో చెప్పించారు. కానీ రాష్ట్రానికి ఉన్న మొత్తం అప్పులు రూ.7.48 లక్షల కోట్లే. గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించడం ధర్మమేనా? మీతో తప్పులు చెప్పించిన సీఎం చంద్రబాబును మందలించాలని కోరుతూ గవర్నర్‌కు లేఖ రాస్తా."



2019, మే 30 తేదీ నాటికి రాష్ట్ర ఖజానాలో ఉంది రూ.100 కోట్లు మాత్రమేనని తెలియజేస్తూ ఈనాడులో వచ్చిన కథనం

"2019 మే 30 నాటికి మేం అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ఖజానాలో రూ.వంద కోట్లే ఉన్నాయని స్వయంగా చంద్రబాబు గెజిట్ 'ఈనాడు' కథనాన్ని ప్రచురించింది. ఇప్పుడు చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన జూన్ 12 నాటికి ఖజానాలో రూ.7-8 వేల కోట్లు అందుబాటులో ఉన్నాయి. నాడు రూ.వంద కోట్లే ఉన్నా రూ.2.27 లక్షల కోట్లతో 2019-20 పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాం. హామీలన్నీ అమలు చేశాం. ఇప్పుడు రూ.7-8 వేల కోట్ల నిధులున్నా పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు చంద్రబాబు భయపడుతున్నారు. పూర్తి బడ్జెట్ ప్రవేశపెడితే అప్పులపై తాను చెప్పినవన్నీ అబద్ధాలేనన్న విషయం ప్రజలకు తెలుస్తుందన్నది బాబు భయం. హామీల అమలుకు నిధులు కేటాయించకుండా తప్పించుకునేందుకే పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం లేదు

ఏ నెలలో ఏ పథకం ఇస్తామో క్యాలెండర్ ప్రకటించి మరీ డీబీటీ ద్వారా అర్హులందరికీ కుల మతాలు, పార్టీలు, ప్రాంతాలు చూడకుండా రూ.2.71 లక్షల కోట్లు నేరుగా వివక్ష లేకుండా అందించాం. మాకు ఓటు వేయని వారికి కూడా ఇంటికి వెళ్లి తలుపు తట్టి మరీ ఇచ్చాం. ఏ నెలలో ఏ పథకం ఇస్తామో చెప్పి బటన్ నొక్కి అందచేశాం. మరి మీరిచ్చిన హామీలను అమలు చేసే చిత్తశుద్ధి ఎక్కడుంది?"

\- వైఎస్ జగన్

ఎక్కువ అప్పులు చేసిన బాబు గొప్పవాడా?
తక్కువ చేసిన మేం ఆర్థిక విధ్వంసకారులమా?

ఎన్నికల ప్రచారంలో రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్లు అప్పు ఉందని దుష్ప్రచారం చేస్తూనే.. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, సూపర్ టెన్ అంటూ చంద్రబాబు హామీలిచ్చారు. హామీలన్నీ అమలు చేయాలని ప్రజలు అడుగుతుండటంతో రూ.14 లక్షల కోట్ల అప్పు ఉందంటూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. వాస్తవంగా రూ.14 లక్షల కోట్ల అప్పులు లేవు. బడ్జెట్‌లో చూపించలేక అధికారులతో రెండుసార్లు సమీక్ష చేశారు. చివరకు గవర్నర్ ప్రసంగంలో రూ.14 లక్షల కోట్లు కాస్తా రూ.10 లక్షల కోట్లకు తగ్గించారు. పోనీ నిజాలు చెప్పించారా? అంటే అదీ లేదు!

- చంద్రబాబు గతంలో అధికారంలోకి రాకముందు అంటే 2014 జూన్ 2 నాటికి రూ.1,18,051 కోట్ల అప్పులు ఉంటే ఆయన దిగిపోయే నాటికి రూ.2,71,798 కోట్ల అప్పులున్నాయి. ఆ అప్పులు 2024 జూన్ నాటికి రూ.5.18 లక్షల కోట్లకు చేరాయి.
- ఈ అప్పులకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన అప్పులు గతంలో చంద్రబాబు అధికారంలోకి రాక మునుపు అంటే 2014 జూన్ 2 నాటికి రూ.5,744 కోట్లు ఉండగా ఆయన హయాం ముగిసే నాటికి రూ.50 వేల కోట్లకు ఎగబాకాయి. అనంతరం మా హయాం ప్రారంభమయ్యే నాటికి రూ.50 వేల కోట్లతో మొదలైన అప్పులు చివరకు రూ.1.06 లక్షల కోట్లకు చేరాయి.
- ప్రభుత్వ గ్యారంటీ లేని అప్పులు.. అంటే విద్యుత్ సంస్థల అప్పులు చూస్తే గతంలో చంద్రబాబు అధికారంలోకి రాక మునుపు 2014 జూన్ 2 నాటికి రూ.26 వేల కోట్లు ఉంటే ఆయన హయాం ముగిసే నాటికి రూ.86,215 కోట్లకు ఎగబాకాయి. మా హయాం చివరికి అవి రూ.1.23 లక్షల కోట్లకు చేరాయి.
- మొత్తంగా అప్పులు ఎంత? అని చూస్తే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అప్పు, రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన అప్పులు, గవర్నమెంట్ గ్యారంటీతో సంబంధం లేకుండా ఉన్న అప్పులు గతంలో చంద్రబాబు హయాంలో 2014 జూన్ 2 నాటికి రూ.1,23,343 కోట్లు ఉంటే ఆయన వైదొలగే నాటికి రూ.4.08 లక్షల కోట్లకు ఎగబాకాయి.
- మేం అధికారం చేపట్టే నాటికి రూ.4.08 లక్షల కోట్లతో మొదలు పెడితే దిగిపోయే నాటికి రూ.7.48 లక్షల కోట్ల అప్పులున్నాయి.
- చంద్రబాబు హయాంలో అప్పుల వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) 21.63 శాతం ఉంటే మా హయాంలో అది 12.93 శాతమే ఉంది. అంటే 21.63 శాతం అప్పులు చేసిన వాడు గొప్పవాడా? ఆర్థిక విధ్వంసకారుడా? 12.93 శాతమే అప్పులు చేసిన మేం ఆర్థికంగా ధ్వంసం చేసినట్లా? ఒక్కసారి ప్రజలు ఆలోచించాలి.
- రాష్ట్రానికి సంబంధించి 2024 మార్చి వరకు రూ.4.85 లక్షల కోట్లు మాత్రమే అప్పులున్నట్లు రాజ్యసభకు తెలియచేశారు. నేను జూన్ వరకు తీసుకున్నా కాబట్టి పెంచి చూపించా. వాళ్లు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో రూ.4.85 లక్షల కోట్లు మాత్రమే అని ఉంది. మరి ఎక్కడ నుంచి వచ్చింది ఈ రూ.పది లక్షల కోట్లు అప్పు? లేనిది ఉన్నట్టుగా.. ఉన్నది లేనట్టుగానే చిత్రీకరించి చూపించడం ధర్మమేనా?


సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం చంద్రబాబు ప్రకటించిన శ్వేతపత్రం అబద్ధాలమయమని, అదో తప్పుడు పత్రమని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర అప్పులపై తాము ఫ్యాక్ట్ షీట్ విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. కాగ్, ఆర్బీఐ, కేంద్ర సామాజిక ఆర్థిక సర్వే నివేదికలను ఉదహరిస్తూ అప్పులపై చంద్రబాబు చెబుతున్నవన్నీ అబద్ధాలేనని సాక్ష్యాధారాలతో నిరూపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

అసలు రంగు తెలిసిపోతుందనే భయంతో..

గత 52 రోజులుగా రాష్ట్రం పురోగమిస్తోందో తిరోగమిస్తోందో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి. బాధితులపైనే అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అణిచివేసే పాలన కొనసాగుతోంది. ఈ ప్రభుత్వం ఎంత అధ్వాన పరిస్థితిలో ఉందంటే.. పూర్తి స్థాయి రెగ్యులర్ బడ్జెట్ కూడా ప్రవేశపెట్టే ధైర్యం లేక ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను తీసుకొచ్చింది. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే మోసపూరిత హామీలకు బడ్జెట్‌లో కేటాయింపులు చూపించాల్సి వస్తుందని, హామీలు అమలు చేయకుంటే ప్రజలు రోడ్డు మీదకు వచ్చి నిలదీస్తారని చంద్రబాబు భయపడుతున్నారు. రెగ్యులర్ బడ్జెట్ ప్రవేశపెడితే వాల్యూమ్ 6, వాల్యూమ్ 5 ప్రకారం రాష్ట్రానికి ఎంత అప్పులు ఉన్నాయి? రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన అప్పు ఎంత? లాంటి అంశాలు వెల్లడించాల్సి వస్తుంది. అప్పుడు ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర అప్పులపై తాను చెప్పినవన్నీ అబద్ధాలేనన్నది ప్రజలకు తెలిసిపోతుందన్నది చంద్రబాబు భయం. అందుకే రెగ్యులర్ బడ్జెట్ ప్రవేశపెట్టకుండా చంద్రబాబు దాటవేస్తున్నారు.

వంచన.. దగా.. మోసమే చంద్రబాబు విధానం

చంద్రబాబు మోడస్ ఆపరండీ ఏమిటంటే.. వంచన, గోబెల్స్ ప్రచారం! ఒక మనిషిని అప్రతిష్ట పాల్జేయాలనుకున్నా... హామీల అమలుపై తప్పించుకోవాలన్నా దాన్ని అమలు చేస్తారు. ముందుగా ఒక కథ సిద్ధం చేసి తాను చెబుతారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5లతో ఆ కథను ముమ్మరంగా ప్రచారం చేస్తారు. దానిపై చర్చలు కూడా పెడతారు. మంత్రుల నుంచి కింది స్థాయి వరకు అందరితో అవే మాటలు మాట్లాడిస్తారు. టీవీ చర్చల్లో అభిప్రాయాలు చెప్పేవారు కూడా చంద్రబాబు మనుషులే. చివరికి రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది కాబట్టి చంద్రబాబు హామీలను అమలు చేసే పరిస్థితి లేదని తీర్మానం చేస్తారు. ఇవాళ రాష్ట్రంలో ఇదే జరుగుతోంది. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినప్పుడు.. బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పుడు.. వేరు పడినప్పుడు.. మళ్లీ ఇప్పుడు పొత్తు పెట్టుకున్నప్పుడూ ఇదే కథ! ఎన్నికల్లో హామీలు ఇచ్చినప్పుడు.. వాటిని ఎగ్గొట్టేటప్పుడు కూడా ఇదే విధానం! ఇప్పుడు మొదటి కథగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది.. అందుకే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టలేకపోతున్నారంటూ ప్రచారం చేస్తున్నారు. మరి రాష్ట్రం నిజంగా ఆర్థికంగా ధ్వంసమైందా? లేదా అన్నది ఒక్కసారి గమనిద్దాం. వాస్తవాలు ప్రజలకు తెలియాలి. వాటిపై అందరూ ఆలోచించాలి.



ప్రశంసించిన కేంద్ర ఆర్థిక సర్వే

కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సర్వే మా హయాంలో ఆర్థిక నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌ను ప్రశంసించింది. ఎఫ్ఆర్‌బీఎం అనుమతించిన దానికంటే తక్కువ అప్పు తీసుకున్నారని అభినందించింది. నేరుగా నగదు బదిలీ లాంటి గొప్ప కార్యక్రమాలు చేయడమే దీనికి కారణం. 'క్వాలిటీ ఆఫ్ స్పెండింగ్ బై స్టేట్ గవర్నమెంట్ ఇంప్రూవ్డ్' అని సామాజిక ఆర్థిక సర్వే కితాబిచ్చింది.

ధర్మం వైపు నిలవండి..

చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన జూన్ 12వతేదీకి రెండు రోజుల ముందు కేంద్రం నుంచి రాష్ట్రానికి పన్నుల వాటా కింద రూ.5,655 కోట్లు వచ్చాయి. రెండోసారి కూడా కేంద్రం నుంచి పన్నుల వాటా డబ్బులు జమయ్యాయి. ఆయన ప్రమాణ స్వీకారం చేసే నాటికి కనీసం రూ.7–8 వేల కోట్లు ఖజానాలో ఉన్నాయి. అంత డబ్బు ఉన్నా డ్రామాలాడుతూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం దేశ చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. చంద్రబాబు శ్వేతపత్రంలో చెప్పిన అంశాలను.. వాస్తవపత్రం పేరుతో నేను చెప్పిన వాటిని ఒక్కసారి బేరీజు వేసి పరిశీలించండి. మీరంతా ధర్మం వైపు నిలబడాలని కోరుతున్నా.

విపత్తులోనూ ఆచితూచి అప్పులు

- కోవిడ్ సమయంలో కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా గణనీయంగా తగ్గింది.
- కేంద్ర పన్నుల వసూళ్లు అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 2019–20లో –3.38% తగ్గాయి. 2020–21లో ఆ పెరుగుదల 0.85 శాతం మాత్రమే ఉంది.
- సాధారణంగా ఏటా కేంద్ర ప్రభుత్వ పన్నుల వసూళ్లలో పెరుగుదల 18 నుంచి 19 శాతం ఉంటుంది.
- కోవిడ్‌తో కేంద్ర ప్రభుత్వ పన్నుల వసూళ్లు గణనీయంగా తగ్గడంతో రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర పన్నుల్లో వాటా కూడా బాగా తగ్గింది.
- కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాని జీఎస్‌డీపీ నిష్పత్తిలో తీసుకుంటే చంద్రబాబు హయాంలో 3.72 శాతం వస్తే మా హయాంలో కోవిడ్ కారణంగా 2.92 శాతానికి పడిపోయింది.
- కోవిడ్ వల్ల మనకు బాగా నష్టం జరిగింది. అలాంటి పరిస్థితుల్లో కేంద్రమే కాదు.. ప్రతి రాష్ట్రం కూడా అప్పులు ఎక్కువగా చేసుకునే అవకాశం కల్పించినా చంద్రబాబు హయాంతో పోలిస్తే తక్కువే తీసుకున్నాం.
- చంద్రబాబు హయాంలో కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్ ఆఫ్ లయబిలిటీస్ 21.63 శాతం అయితే మా హయాంలో 12.90 శాతమే ఉంది. 2014–19 మధ్య టీడీపీ హయాంలో అప్పులు 18.15 శాతం పెరగ్గా 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ పాలనలో కేవలం 13.80 శాతమే పెరిగాయి.

రాష్ట్ర విభజన నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వ అప్పులు ఇవీ.. (రూ.కోట్లలో)

అంశం	2014, జూన్ 2 వరకు	2019, మే వరకు	2024, జూన్ వరకు
ప్రభుత్వ అప్పు	1,18,051	2,71,798	5,18,708
అప్పుల సగటు వార్షిక వృద్ధి రేటు(సీఏజీఆర్)		18.15 శాతం	13.80 శాతం
ప్రభుత్వ గ్యారంటీతో అప్పులు	5,744	50,157	1,06,437
ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చిన అప్పుల్లో సగటు వార్షిక వృద్ధి		54.25 శాతం	16.24 శాతం
విద్యుత్ సంస్థలపై అప్పులు	26,658	64,674	1,11,864
విద్యుదుత్పత్తి సంస్థలకు చెల్లించాల్సిన అప్పులు	2,893	21,541	11,603
మొత్తం విద్యుత్ రంగ అప్పులు	29,552	86,215	1,23,467
విద్యుత్ సంస్థలపై అప్పుల్లో సగటు వార్షిక వృద్ధి		23.88 శాతం	7.45 శాతం
మొత్తం అప్పులు	1,53,347	4,08,170	7,48,612
మొత్తం అప్పుల్లో సగటు వార్షిక వృద్ధి		21.63 శాతం	12.90 శాతం


(నోట్: ఆర్బీఐ, కాగ్ గణాంకాల ప్రకారం 2014–19 మధ్య సీఏజీఆర్ 21.63 శాతం కాగా, 2019–24 మధ్య సీఏజీఆర్ 12.90 శాతం)

కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా(జీఎస్‌డీపీలో)

సంవత్సరం	కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా	జీఎస్‌డీపీ	జీఎస్‌డీపీ ప్రకారం కేంద్ర పన్నుల్లో వాటా	కేంద్ర పనుల్లో సగటు వాటా(జీఎస్‌డీపీ)
2015-16	21,791.61	6,04,228.62	3.61	3.72 (టీడీపీ ప్రభుత్వ హయాంలో)
2016-17	26,174.40	6,84,415.87	3.82	
2017-18	28,972.87	7,86,135.42	3.69	
2018-19	32,780.59	8,73,721.11	3.75	
2019-20	28,011.64	9,25,839.12	3.03	2.92 (వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో)
2020-21	24,460.33	9,77,815.00	2.50	
2021-22	36,357.92	11,48,471.00	3.17	
2022-23	38,381.95	13,03,524.00	2.94	

(నోట్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కరోనా విపత్కర పరిస్థితుల్లో కేంద్ర పనుల్లో రాష్ట్ర వాటా 2.92 శాతానికి తగ్గిన నేపథ్యంలో అప్పులు చేసుకోవడానికి ఎఫ్ఆర్‌బీఎం చట్టం నుంచి కేంద్రం వెసులుబాటు కల్పించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తక్కువ అప్పులు చేసింది)


ఆర్థిక శాఖ సమీక్ష సందర్భంగా రాష్ట్ర అప్పులు రూ.14 లక్షల కోట్లు అని అంచనా వేసినట్టు వెల్లడించిన సీఎం చంద్రబాబు


గవర్నర్ ప్రసంగంలో మాత్రం రాష్ట్ర అప్పులు రూ.10 లక్షల కోట్లుగా పేర్కొన్న దృశ్యం

అబద్ధపు పత్రాలు

హామీల అమలుపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే శ్వేతపత్రాల పేరుతో డ్రామా
సాక్ష్యాధారాలతో సీఎం చంద్రబాబును కడిగిపారేసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రజల దృష్టిని మళ్లించడానికే సీఎం చంద్రబాబునాయుడు శ్వేత పత్రాల పేరుతో డ్రామాలాడుతున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పచ్చి అబద్ధాలు వల్లె వస్తూ చంద్రబాబు విడుదల చేసిన శ్వేత పత్రాలన్నీ తప్పుడు పత్రాలేనని స్పష్టం చేశారు. ఆ శ్వేతపత్రాల్లో తప్పులను సాక్ష్యాధారాలతో ఎత్తిచూపుతూ.. వాస్తవ పత్రాల(ఫ్యాక్ట్ షీట్స్)ను తాము విడుదల చేస్తున్నామని చెప్పారు. శ్వేతపత్రాల్లో చంద్రబాబు చెప్పిన అంశాలను.. ఫ్యాక్ట్ షీట్స్‌లో తాము చెబుతున్న వాస్తవాలను పరిశీలించి.. ధర్మం వైపు నిలబడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రాలన్నీ అబద్ధపు, తప్పుడు పత్రాలేనని సాక్ష్యాధారాలు, గణాంకాలతో నిరూపించారు. పోలవరం ప్రాజెక్టును కట్టాల్సింది కేంద్రమే అయినా కమీషన్ల కోసం నిర్మాణ బాధ్యతలు తీసుకుని పూర్తి చేయలేక పోవడం అటుంచి డయాఫ్రం వాల్ దెబ్బతినేలా చేశారని మండిపడ్డారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేసి.. ఇప్పుడు యూటర్న్ తీసుకునే పరిస్థితి వచ్చిందని దెప్పిపొడిచారు. ఉచిత ఇసుక ఎక్కడ ఇస్తున్నారని ప్రశ్నించారు. తమ హయాంలో మద్యం అమ్మకాలు తగ్గాయని, ఆ డిస్టిలరీలన్నీ బాబు అనుమతులిచ్చినవేనని చెప్పారు. గనుల ఆదాయం కూడా తమ హయాంలోనే బాగా పెరిగిందన్నారు.

బండారం బయట పడుతుందని నాటకాలు

2019 మే 30 నాటికి తాము అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్ర ఖజానాలో కేవలం రూ.వంద కోట్లే ఉన్నప్పటికీ, 2019–20కి సంబంధించి రూ.2.27 లక్షల కోట్లతో పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని గుర్తు చేశారు. కానీ జూన్ 12 నాటికి రాష్ట్ర ఖజానాలో రూ.7–8 వేల కోట్ల నిధులు ఉన్నా, పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడానికి సీఎం చంద్రబాబు భయపడుతున్నారని దెప్పి పొడిచారు. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు నిధులు కేటాయించాల్సి వస్తుందని, నిధులు కేటాయించకపోతే.. హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజలు రోడ్డెక్కుతారని చంద్రబాబు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర అప్పుపై తాను చెప్పినవన్నీ అబద్ధాలేనన్నది బయట పడుతుందనే భయంతోనే పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా.. ఏడు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పేరుతో డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. దేశ చరిత్రలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి చోటుచేసుకున్న దాఖలాలు లేవని ఎత్తిచూపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు నిలదీస్తారనే భయంతో ప్రశ్నించే స్వరం ఉండకూడదనే లక్ష్యంతో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, ఆస్తుల విధ్వంసంతో ప్రభుత్వం అణగదొక్కాలని చూస్తోందని మండిపడ్డారు. 52 రోజులుగా రాష్ట్రంలో సాగుతోన్న నరమేధమే అందుకు నిదర్శనమని చెప్పారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

హామీలన్నీ వెంటనే నిలబెట్టుకున్నాం

వ్యవస్థలో మార్పులు తీసుకు రావాలన్న దృఢ నిశ్చయంతో ఆనాడు మేము నవరత్నాలు ప్రకటించాం. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం. రాష్ట్రంలో ఇప్పటికీ రాజకీయ, ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యాన్ని పొందలేక పోతున్న వారి కోసం ఉద్యోగాల స్థాయిని, కాలేజీ సీట్ల స్థాయిని దాటి నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ కాంట్రాక్ట్‌ల్లోనూ వారి వాటాను కూడా నిర్ణయిస్తూ ఏకంగా చట్టాలు చేశాం. గ్రామాలను మార్చేందుకు గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశాం. మద్యాన్ని తగ్గించి, మాన్పించే విధానాన్ని అమలు చేశాం. పరిశ్రమల్లో ఉద్యోగాలు రాక మన పిల్లలు అవస్థలు పడుతున్నారని, పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు కచ్చితంగా స్థానికులకే ఇస్తామని ఏకంగా చట్టాలు చేశాం. భారతదేశ సామాజిక న్యాయ చరిత్రలోనే కనీవినీ ఎరగని విధంగా బడుగులు, బలహీన వర్గాలు, మహిళలకు పెద్ద పీట వేస్తూ, అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే చరిత్ర గతిని మార్చే చట్టాలు తీసుకువచ్చాం. శాశ్వత ప్రాతిపదికన గతంలో ఎప్పుడూ లేనట్లుగా బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేశాం. భారతదేశ రాజకీయ చరిత్రను మలుపులు తిప్పే సామాజిక న్యాయం చేసే విధంగా చట్టాలు తీసుకువచ్చాం.

హామీలపై నోరుమెదపని చంద్రబాబు

ఇప్పుడు.. ఇచ్చిన హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తావంటే చంద్రబాబు సరైన సమాధానం చెప్పడు. పోలవరం ఎప్పుడు కడతావంటే.. ఎప్పటికి అవుతుందో తెలియదు అంటాడు. పోనీ అమరావతి అయినా ఎప్పుడు కడతావు అంటే.. నువ్వు చెప్పు అని ఎదురుప్రశ్న వేస్తాడు. ఎన్నికల్లో ట్రూ అప్ కరెంటు ఛార్జీలు తగ్గిస్తానన్నావు.. ఎప్పుడు చేస్తావు అంటే నోరు మెదపడు. ఇసుక ఉచితం అన్నావు.. ఇప్పుడు ఇంతలా అమ్ముతున్నావంటే ఏం.. మీ ఇంటికి తెచ్చి పోస్తానని చెప్పానా? అంటాడు. మెగా డీఎస్సీ అన్నాడు.. నువ్వు రాకముందే 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. నువ్వు ఇచ్చింది 10 వేల పోస్టులే కదా.. ఇది మెగా ఏంటి? అంటే దానికీ సమాధానం ఉండదు. ఆ రిక్రూట్‌మెంట్ కూడా వాయిదా వేసుకుంటూ వెళ్లారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానని వారిని రోడ్డున పడేశారు. ఇంటింటికీ రేషన్ సప్లైని ఆపేశారు. పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటూ కత్తిరింపులు ఉంటాయని చెప్పకనే చెబుతున్నారు. ఇవన్నీ అడగకూడదని ఇక ఏం చేస్తున్నారు అంటే.. హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, ఆస్తులకు నష్టం చేకూర్చడం, ఒక భయాన్ని క్రియేట్ చేయడం.. ఇదీ ఇవాళ రాష్ట్రంలో ప్రభుత్వం తీరు.

అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే కీలక చట్టాలు

అసెంబ్లీ మొట్టమొదటి బడ్జెట్ సమావేశాల్లోనే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇస్తూ చట్టం చేశాం. అది మా ప్రభుత్వం మాత్రమే చేసింది. అదే రకంగా బీసీలకు, ఎస్సీలకు, ఎస్టీలకు, మైనారిటీలకు నామినేటెడ్ పనుల్లో కూడా 50 శాతం రిజర్వేషన్లు ఇస్తూ మరో చట్టం చేశాం. పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇచ్చేలా, వారి నైపుణ్యం పెంచేలా ప్రభుత్వమే నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు పెట్టే విధంగా మొట్టమొదటి బడ్జెట్ సమావేశాల్లోనే చట్టం చేశాం. మద్య నియంత్రణలో భాగంగా రాష్ట్రంలో బెల్టు షాపులు మూయించడమే కాకుండా, అవి శాశ్వతంగా మూతబడాలని, అవి మళ్లీ తెరిచే అవకాశం ఉండకూడదని, 2019 అక్టోబరు 1 నుంచి కేవలం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు నడిపేలా నిర్ణయం తీసుకున్నాం. భూ యజమానుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా దాదాపు 16 లక్షల మంది కౌలు రైతులకు మేలు జరిగేలా ఉచితంగా పంటల బీమా, పంటల పరిహారం అందించేలా చట్టం చేశాం. అది కూడా అధికారంలోకి వచ్చిన కేవలం రెండున్నర నెలల్లోనే.

పవర్‌పై అన్నీ కోతలే

విద్యుత్ రంగంపై శ్వేతపత్రం పేరుతో సీఎం చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. విద్యుత్ విషయంలో గోల్డ్ మెడల్ ఇవ్వాల్సి వస్తే దేశంలో ముందు ఏపీనే కనిపిస్తుందని, ఇక్కడ ఆ రంగంలో అన్ని సంస్కరణలు జరిగాయన్నారు. చంద్రబాబు రాక ముందు 2014–15లో పంపిణీ సంస్థల విద్యుత్ నష్టాలు రూ.6,625.88 కోట్లు ఉంటే.. చంద్రబాబు గత ఐదేళ్ల పాలనలో.. 2018–19 నాటికి అవి ఏకంగా రూ.28,715 కోట్లకు ఎగబాకాయన్నారు. అంటే 34 శాతం పెరిగాయని చెప్పారు. అదే తమ ప్రభుత్వ హయాంలో రూ.28,715 కోట్లతో మొదలైన విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలు కొంతే పెరిగి.. 2023–24 నాటికి రూ.29,110 కోట్లకు చేరాయన్నారు. అంటే ఐదేళ్లలో పెరిగిన విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలు కేవలం 0.34 శాతమేనని, ఆ మొత్తం రూ.395 కోట్లేనని చెప్పారు. అదే చంద్రబాబు హయాంలో ఆ నష్టాలు ఏకంగా 34 శాతం పెరిగాయన్నారు. రాష్ట్రంలో వ్యవసాయానికి 30 ఏళ్ల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేసేలా 'సెకీ'తో ఒప్పందం కుదుర్చుకున్నామని, దీనిపైనా దుష్ప్రచారం ధర్మమేనా.. అని ప్రశ్నించారు.

రివర్స్ టెండరింగ్

కమీషన్లు, దోపిడీకి మారుపేరుగా మారిన పరిస్థితుల్లో ఆ వ్యవస్థను మార్చి ప్రతి రూపాయికి జవాబుదారీతనం ఉండాలన్న సంకల్పంతో మొత్తం టెండరింగ్ పద్ధతిలోనే సంస్కరణలు చేపట్టాం. ఆ మేరకు జ్యుడిషియల్ ప్రివ్యూ యాక్ట్.. చట్టం తీసుకువచ్చాం. టెండరు పనుల ప్రారంభ ప్రక్రియను పూర్తిగా హైకోర్టు జడ్జి ముందు పెడుతూ ఆయన నిర్ణయమే తుది నిర్ణయంగా మారుస్తూ దేశ చరిత్రలోనే ఎప్పుడూ జరగని విధంగా తొలిసారిగా టెండర్ల ప్రక్రియలో అత్యుత్తమ విధానానికి శ్రీకారం చుట్టాం. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే 60 శాతానికి పైగా వ్యవసాయ కనెక్షన్లకు పగటి పూటే 9 గంటల పాటు కరెంటు సరఫరా చేశాం. ఆక్వా రైతులకు రూపాయిన్నరకే యూనిట్ కరెంటు ఇస్తూ తద్వారా రూ.720 కోట్ల మేర వారికి ప్రయోజనం కలిగించాం. ఇంకా పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం కోసం గతంలో ఎప్పుడూ జరగని విధంగా రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశాం.

వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు కిడ్నాప్

భార్యకు ఫోన్‌చేసి రూ.2 కోట్లు డిమాండ్

భాకరాపేట(తిరుపతి జిల్లా): చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు భాస్కర్‌ను కిడ్నాప్ చేశారు. భాస్కర్ భార్య గురువారం తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు ఎఫ్‌ఐఆర్‌ను భాకరాపేట పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. బుధవారం తిరుపతి నుంచి స్వగ్రామం అయిన చెరువుముందరపల్లె దళితవాడకు భాస్కర్ వచ్చారు. ఆ రాత్రి అక్కడే తన స్వగృహంలో ఉన్నారు. గురువారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరుతూ తిరుపతి ఇంట్లో ఉన్న భార్యకు ఫోన్‌చేసి తిరుపతికి వస్తున్నానని చెప్పారు. సాయంకాలం అయినా ఆయన ఇంటికి రాలేదు. ఇలా ఉండగా వేరేవాళ్ల సెల్ నుంచి భాస్కర్ భార్యకు ఎవరో కాల్ చేసి భాస్కర్‌తో మాట్లాడించారు. తనను కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆమెకు భాస్కర్ తెలియజేశారు. దీంతో కంగారు పడ్డ భార్య తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో భాకరాపేట, తిరుచానూరు సీఐతో కలిసి బృందంగా ఏర్పడి ఫోన్ కాల్స్ డేటా ఆధారంగా విచారణ చేపట్టారు. తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారి మార్గంలో నిఘా వేశారు. నిందితులు పీలేరు నుంచి తిరుపతి వైపు వస్తున్నట్లు గుర్తించి వారిని వెంబడించారు. ఎట్టకేలకు వారి వాహనాలను ఛేజ్ చేసి నలుగురు నిందితులను పట్టుకుని.. భాస్కర్‌ను విడిపించారు. భాస్కర్ నుంచి రూ.2 కోట్లు డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై భాకరాపేట పోలీసులను వివరణ కోరగా తిరుపతి ఎస్పీ కార్యాలయంలో విచారణ జరుగుతోందని, శనివారం వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఆగని టీడీపీ శ్రేణుల దాష్టీకాలు

- ఒంటరిగా ఉన్న మహిళతో అనుచిత ప్రవర్తన
- స్థలం విషయంలో గొడవకు దిగి దౌర్జన్యం
- గ్రామ సచివాలయంలోకి చొరబడి మాజీ సీఎం జగన్ చిత్రానికి పెయింట్
- రైతుభరోసా కేంద్రం, సచివాలయ బోర్డుల తొలగింపు
- ద్విచక్ర వాహనం దహనం
- వైఎస్సార్‌సీపీ జెండా పోల్ ధ్వంసం


ప్రకాశం జిల్లా లింగసముద్రంలో రేకుల షెడ్డును తొలగిస్తున్న టీడీపీ నాయకులు



పల్నాడు జిల్లా మర్సపెంట తండాలో ధ్వంసమైన బైక్, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో దగ్ధమవుతున్న బైక్

సాక్షి నెట్‌వర్క్: కూటమి ప్రభుత్వం వచ్చినప్పటినుంచి రెచ్చిపోయి ప్రవర్తిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తల దాష్టీకాలు గురువారం రాత్రి, శుక్రవారం కూడా యథేచ్ఛగా కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల అడ్డూఅదుపు లేకుండా ప్రవర్తించారు. ఒంటరిగా ఉన్న మహిళ ఇంటిపైకి వెళ్లి అనుచితంగా ప్రవర్తించడమేగాక ప్రశ్నించినందుకు పలు వాహనాలను ధ్వంసం చేశారు. అన్యాయాన్ని ప్రశ్నించినందుకు వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడిచేశారు. గ్రామ సచివాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రానికి పెయింట్ వేశారు. రైతుభరోసా కేంద్రం, సచివాలయం బోర్డులు తొలగించారు. వైఎస్సార్‌సీపీ జెండాపోల్‌ను ధ్వంసం చేశారు.

☛ పల్నాడు జిల్లా మర్సపెంట తండాలో టీడీపీకి చెందిన ఓ యువకుడు గురువారం అర్ధరాత్రి వైఎస్సార్‌సీపీకి చెందిన ఒక మహిళ ఇంటి తలుపు కొట్టాడు. ఒంటరిగా ఉన్న మహిళను దుర్భాషలాడాడు. ఈ విషయమై స్థానికులు టీడీపీ వారిని నిలదీశారు. దీంతో మరింత రెచ్చిపోయిన టీడీపీ వర్గీయులు రాళ్లు, కర్రలతో ఇళ్లముందున్న ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. ఒక్కసారిగా వారు గృహాలపై దాడులకు తెగబడినట్లు గ్రామ సర్పంచ్ రవీంద్ర నాయక్ చెప్పారు. ఆ మహిళ శుక్రవారం వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

☛ ప్రకాశం జిల్లాలో మండల కేంద్రమైన లింగసముద్రంలో వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ వరికూటి కృష్ణారెడ్డిపై దాడిచేశారు. లింగసముద్రం గ్రామకంఠం సర్వే నంబర్ 79లో ఆర్యవైశ్యులకు 89 సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలాన్ని 50 ఏళ్లుగా వారు ఉమ్మడిగా వినియోగించుకుంటున్నారు. తమ అవసరాల నిమిత్తం ఓ రేకుల షెడ్డు నిర్మించుకున్నారు. ఇది ప్రభుత్వస్థలం అంటూ శుక్రవారం టీడీపీ నాయకులు ఆ షెడ్డును పడగొట్టేందుకు ప్రయత్నించారు. అడ్డుకున్న ఆర్యవైశ్యులను పక్కకి నెట్టిపడేశారు. అదే సమయంలో వెళ్లిన వరికూటి కృష్ణారెడ్డిపై దాడిచేసి కొట్టారు. సమాచారం అంది వచ్చిన పోలీసులు వారిని చెదరగొట్టారు. కృష్ణారెడ్డిపై దాడిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్, నేతలు ఖండించారు.

☛ అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం గంగాదేవిపల్లిలో పలువురు గడ్డపారలు, ఇతర పనిముట్లతో గ్రామ సచివాలయంలోకి చొరబడ్డారు. ఈ హఠాత్పరిణామంతో నివ్వెరపోయిన సచివాలయ ఉద్యోగులు భయంతో బయటకు పరుగుతీశారు. దుండగులు సచివాలయంపై ఉన్న జగన్ ఫొటోతో పాటు శిలాఫలకానికి పెయింట్ వేశారు. అక్కడ పికెట్‌లో ఉన్న పోలీసులు కనీసం అడ్డుకోలేదు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సమాచారం ఇవ్వడంతో తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ పోలీసుస్టేషన్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి స్పందించి ఎస్‌ఐ సాగర్‌తో పాటు సిబ్బందిని గ్రామానికి పంపించారు. టీడీపీ మద్దతుదారుల చర్యలను పోలీసులు అడ్డుకుని హెచ్చరించి పంపేశారు.

☛ ఏలూరు జిల్లా పెదవేగి మండలం వేగివాడలో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం బోర్డులను తొలగించారు. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అధికారుల పేర్లు ఉన్న శిలాఫలకాలను తొలగించడంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ ద్విచక్ర వాహనాన్ని పెట్రోల్ పోసి దహనం చేశారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడం గమనించిన శివప్రసాద్ ఇంట్లో నుంచి బయటికి వచ్చేసరికి దుండగులు పరారయ్యారు. దీనిపై పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

☛ గుంటూరు జిల్లా మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని అంజిరెడ్డినగర్‌లో వైఎస్సార్‌సీపీ జెండా పోల్‌ను ధ్వంసం చేశారు. దీనిపై పోలీసుల్ని ఆశ్రయించనున్నట్లు వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి చెప్పారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ వర్గీయుల దాడి

బొల్లాపల్లి: టీడీపీ వర్గీయుల దాడిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, ఆయన కుటుంబ సభ్యులకు గాయాలైన ఘటన పల్నాడు జిల్లా బ్రిడ్జి తండాలో శుక్రవారం జరిగింది. వైఎస్సార్‌సీపీ కార్యకర్త భూక్యా రామాంజనాయక్ ఇంటిపై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. దాడిలో రామాంజనాయక్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారం రోజులుగా చెరువు మట్టితోలకం, సొంత స్థలంలో ఏర్పాటు చేసుకున్న బడ్డీ కొట్టును తొలగించమని టీడీపీవారు బెదిరింపులకు గురిచేశారని బాధితులు తెలిపారు. శుక్రవారం రాత్రి పోలీసులు సమక్షంలోనే సుమారు 15 మంది కర్రలతో ఇంటిపై దాడికి పాల్పడ్డారు. దాడిలో రామాంజనాయక్ తమ్ముడు రాములు నాయక్, తల్లి చిలుకా బాయిలకు స్వల్ప గాయాలయ్యాయి.

కూటమి ప్రజా వ్యతిరేక పాలనపై కన్నెర్ర



టీడీపీ కూటమి ప్రభుత్వ అరాచక పాలనకు నిరసనగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధర్నా నిర్వహించాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అసమర్థ పాలనలో 52 రోజుల్లోనే రాష్ట్రంలో అనేక అత్యాచారాలు, హత్యలు, దాడులు జరిగాయని వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. హామీలను అమలు చేసే వరకూ ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయప్రోలు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో భారీగా పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

– భీమవరం

టీడీపీ నేతల వేధింపులు.. జనసేన కార్యకర్త ఆత్మహత్య

- ఏలూరు జిల్లాలో ఘటన
- మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు

కైకలూరు: కూటమి నేతలు ఇప్పటి దాకా వైఎస్సార్‌సీపీ శ్రేణులనే వేధించారు. తాజాగా కూటమి భాగస్వామ్య పక్షాల కార్యకర్తలపైనా వేధింపులకు పాల్పడుతున్నారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం సానారుద్రవరంలో జనసేన కార్యకర్త ఆత్మహత్య రాష్ట్రంలో ఈ పరిస్థితికి అద్దం పడుతోంది. ఏలూరు జిల్లా కలిదిండి మండలం సానారుద్రవరానికి చెందిన విన్నకోట రామకృష్ణ(49) అనే జనసేన కార్యకర్త గురువారం రాత్రి గ్రామంలో వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూటమి విజయం తర్వాత కొద్ది రోజులుగా గ్రామంలో మట్టి మైనింగ్ చేస్తున్నాడు. ఈ నెల 23న అతని మట్టి లారీని, జేసీబీని కలిదిండి పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇదే గ్రామానికి చెందిన మైనింగ్ వ్యాపారులు వలవల రవితేజ (జనసేన), మారుబోయిన పూర్ణచంద్రరావు(టీడీపీ) పోలీసులకు సమాచారం అందించారని తెలుసుకున్న రామకృష్ణ.. ఇదే మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన టీడీపీ కీలక నేత వల్లభనేని శ్రీనివాసచౌదరి వద్దకు వెళ్లి స్టేషన్ నుంచి లారీని, జేసీబీని విడిపించాలని కోరాడు. దీంతో సదరు టీడీపీ నేత కులాల ప్రస్తావన తీసుకొచ్చి అవమానించడంతో రామకృష్ణ మానసికంగా కృంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్తను భయపెట్టిన రవితేజ, పూర్ణచంద్రరావుతో పాటు వీరికి అండగా నిలిచిన శ్రీనివాసచౌదరిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య సుధారాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరుకు తరలించారు. కాగా, టీడీపీ నేతలను అరెస్టు చేయాలంటూ మృతుడి బంధువులు, జనసేన కార్యకర్తలు కైకలూరు ప్రభుత్వాస్పత్రి ఎదుట జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. అయితే, రామకృష్ణ ఉరి వేసుకుని మృతి చెందాడని చెబుతుండగా.. మృతదేహం ఉన్న తీరు చూస్తే ఇది హత్యా.. ఆత్మహత్యా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి కాళ్లు నేలకు తాకి ఉన్నాయి. భార్య సుధారాణి సైతం తన భర్తను చంపి ఉరి వేసి ఉండవచ్చని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కైకలూరు జాతీయ రహదారిపై జనసేన కార్యకర్తలు, మృతుడి బంధువుల ఆందోళన

అధికార పార్టీ వేధింపులు..

వైఎస్సార్‌సీపీ నేత ఆత్మహత్య

మృతుడు పంచాయతీ వార్డు మెంబర్

- ఆస్పత్రి వద్ద పార్టీ శ్రేణుల నిరసన
- కాకినాడ జిల్లాలో ఘటన

సామర్లకోట: వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నేతల వేధింపులు కొనసాగుతున్నాయి. తాజాగా అధికార పార్టీ వేధింపులు తాళలేక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆత్మహత్య చేసుకున్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండలం వేట్లపాలెం వార్డు సభ్యుడు బొబ్బిలి వీరవెంకట సత్యనారాయణ(34)ను సోషల్ మీడియాలో టీడీపీ అసభ్యకరమైన పోస్టింగ్‌లతో వేధింపులకు గురిచేస్తోంది. దీంతో కొంత కాలంగా ఆయన మానసిక వేదనకు గురవుతున్నాడు. ఇదే విషయాన్ని స్నేహితులు, బంధువుల వద్ద చెప్పి ఆవేదన చెందేవాడు. ఈ నేపథ్యంలో సత్యనారాయణ శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. వెంటనే డీఎస్పీ లతా కుమారి వేట్లపాలెం చేరుకుని సమాచారం సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కుటుంబ సభ్యుల డిమాండ్ మేరకు 306 సెక్షన్ కింద కేసు నమోదు చేస్తున్నామని ప్రకటించారు. బాధితులకు న్యాయం చేయాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

వైఎస్ జగన్ పిటిషన్‌పై విచారణ 30కి వాయిదా



సాక్షి, అమరావతి: శాసన సభలో వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా, తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ ఆ అధినేత, పార్టీ శాసన సభాపక్ష నేత వైఎస్ జగన్ దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణను హైకోర్టు 30కి వాయిదా వేసింది. జగన్ దాఖలు చేసిన వ్యాజ్యానికి విచారణార్హత లేదని, ఈ అంశంపై స్వయంగా వాదనలు వినిపిస్తానని, విచారణ వాయిదా వేయాలని ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ చేసిన అభ్యర్థన మేరకు హైకోర్టు విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీకి 11 సీట్లు వచ్చాయన్న కారణంతో తమ పార్టీకి ప్రతిపక్ష హోదా, తనకు ప్రతిపక్ష పార్టీ నేత హోదా ఇచ్చే విషయంలో స్పీకర్ నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తున్నారని, ప్రతిపక్ష హోదా ఇచ్చే ఉద్దేశం లేనందునే ఇలా చేస్తున్నారంటూ వైఎస్ జగన్ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం శుక్రవారం జస్టిస్ రవి ముందుకు విచారణకు వచ్చింది. ఆ వెంటనే ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. తాను శాసన వ్యవహారాలు, న్యాయ శాఖ కార్యదర్శి తరఫున హాజరవుతున్నానని తెలిపారు. ప్రస్తుతం తాను అందుబాటులో లేనని, విచారణ రెండు రోజులు వాయిదా వేయాలని కోరారు. ఈ సమయంలో జగన్ తరఫున సీనియర్ న్యాయవాది సుబ్రహ్మణ్య శ్రీరామ్ స్పందిస్తూ.. ఈ వ్యాజ్యంలో ఇతర ప్రతివాదులు కూడా ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వారి వైఖరి ఏమిటో తెలుసుకోవాలన్నారు.

సింగిల్ జడ్జి ముందుకు నేహా రెడ్డి వ్యాజ్యం

విశాఖపట్నం భీమిలి సముద్ర తీరం సమీపంలో ఉన్న తమ ప్రహరీని కూల్చివేసేందుకు గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు జారీ చేసిన తుది ఉత్తర్వులను సవాలు చేస్తూ ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి కుమార్తె పెనకా నేహా రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై సింగిల్ జడ్జి విచారణ జరపడం సబబని హైకోర్టు సీజే నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. నేహారెడ్డి వ్యాజ్యాన్ని సింగిల్ జడ్జి ముందుంచాలని, సోమవారం విచారణకు వచ్చేలా చూడాలని రిజిస్ట్రీని ఆదేశించింది. అధికారుల ఉత్తర్వులు చట్ట విరుద్ధంగా ఉంటే వాటిని సవాలు చేసే హక్కు నేహా రెడ్డికి ఉందని ధర్మాసనం తెలిపింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

లాయరుగారి 'గంజాయి' డ్రామా

- అడ్డంగా దొరికిన టీడీపీ విజయనగరం నేత
- ప్రత్యర్థి ఇంట్లో 18 కిలోలు పెట్టించి పోలీసులకు సమాచారం
- విచారణలో ఆయనే దానిని పెట్టించినట్లు తేటతెల్లం
- టీడీపీ నేత ఉండ్రాళ్ల రాజేష్‌పై కేసు నమోదు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరానికి చెందిన న్యాయవాది, టీడీపీ నాయకుడి గంజాయి నాటకం రట్టయ్యింది. తన వద్దనున్న 18 కిలోల గంజాయిని ప్రత్యర్థి ఇంట్లో పెట్టించి కేసులో ఇరికిద్దామనుకొని, చివరకు తానే ఇరుక్కుపోయాడు. అధికార పార్టీ నాయకుల మధ్యవర్తిత్వంతో బయటపడదామని చివరివరకూ ప్రయత్నించినా అప్పటికే విషయం బయటకు పొక్కడంతో పప్పులుడకలేదు. చివరకు అతనిపై కేసు నమోదుచేసిన విజయనగరం పోలీసులు... నిందితుడు పరారీలో ఉన్నాడని చెబుతున్నారు. శుక్రవారం సాయంత్రం వరకూ నాటకీయ పరిణామాల తర్వాత కేసు వివరాలను రెండో పట్టణ సీఐ కోరాడ రామారావు వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో గంజాయి రవాణాదారులు టీడీపీ నేతలేనన్న విషయం తేటతెల్లమైంది. ఒక వ్యక్తి వద్ద 18 కిలోల గంజాయి ఉన్నదంటే రాష్ట్రంలోని బడా టీడీపీ నేతల వద్ద ఇంకెంత ఉందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సీఐ రామారావు కథనం ప్రకారం.. విజయనగరంలోని కమ్మ వీధికి చెందిన న్యాయవాది ఉండ్రాళ్ల రాజేష్ 16వ వార్డు టీడీపీ నాయకుడిగా చక్రం తిప్పుతున్నారు. అదే వార్డులో ఆనంద్ అనే మరో టీడీపీ నాయకుడితో వైరం ఉంది. ఇటీవల ఆనంద్ ఇంటికి పెయింటింగ్ పనుల కోసం వెళ్లిన దుర్గాప్రసాద్, మణికంఠలతో కలిసి రాజేష్ పన్నాగం పన్నాడు. తన వద్దనున్న 18 కిలోల గంజాయిని రహస్యంగా ఆనంద్ ఇంట్లో పెట్టించాడు. ఆనంద్ ఇంట్లో గంజాయి ఉందని అతనే టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం చేరేలా చేశాడు. పోలీసుల విచారణలో పెయింటర్ల గురించి తెలిసింది. వారిని విచారిస్తే రాజేషే ఆ పని చేసిన విషయం బయటపడింది. కేసు తన పీకకు చుట్టుకుంటుందని గ్రహించిన రాజేష్ తాను అధికార పార్టీ నాయకుడినని, న్యాయవాదినని అంటూ పోలీస్ స్టేషన్‌లోనే కాసేపు వీరంగం చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గంజాయి కేసుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తుండటంతో రాజేష్ ఆటలు సాగలేదు. అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తెచ్చినా ఉపయోగం లేకపోయింది. రాజేష్ వ్యవహారం అప్పటికే బయటకు తెలిసిపోయింది. చివరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు రాజేష్ పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతున్నారు.

> ఏదైతే అత్యంత ప్రకాశవంతమైనదో, ఏదైతో సూక్ష్మాతి సూక్ష్మమైనదో, దేనిలోనైతే సమస్త లోకాలు- వాటిలోని సకల లోకులతో యుక్తంగా స్థితమై వున్నాయో, అదే అనశ్వరమైన బ్రహ్మ.
>
> – ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 27 జూలై 2024

ఆర్టీఐని బతకనివ్వరా?!

విధాన నిర్ణయాలపై అనవసర గోప్యత పాటించటం, నిజాలు రాబట్టే ప్రయత్నాలకు పాతరేయటం ప్రజాస్వామ్యానికి చేటు తెస్తుంది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పుట్టి దాదాపు రెండు దశాబ్దాలు గడిచింది. లోటుపాట్లు సరిదిద్దుకుంటూ మరింత పదునెక్కాల్సిన ఆ చట్టం కాస్తా ప్రభుత్వాల పుణ్యమా అని నానాటికీ నీరుగారుతోంది. తాజాగా ఆ చట్టం తమకు వర్తించదంటూ జవాబిచ్చి మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆ జాబితాలో చేరింది. షోపూర్ జిల్లా కునోలో ఉన్న వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, మాందసార్ జిల్లాలో నెలకొల్పబోయే మరో వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల గురించి, ముఖ్యంగా చిరుతల సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి సమాచారం కావాలంటూ అడిగిన సమాచార హక్కు కార్యకర్త అజయ్ దూబేకు కళ్లు తిరిగి కింద పడేలా ప్రభుత్వ అటవీ విభాగం సమాధానమిచ్చింది. అలాంటి సమాచారం వెల్లడిస్తే దేశ భద్రతకూ, సార్వభౌమత్వానికీ ముప్పు ఏర్పడుతుందట. దేశ సమగ్రత, వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతింటాయట. వేరే దేశంతో సంబంధాలు కూడా దెబ్బతినవచ్చుట. కాబట్టి చట్టంలోని సెక్షన్ 8(1)(ఏ) ప్రకారం ఇవ్వడం కుదరదట. ఒక చిరుత కూన కాలికి కట్టు కట్టినట్టున్న ఫొటో చూసి మొన్న ఫిబ్రవరిలో పులుల జాతీయ సంరక్షణ ప్రాధికార సంస్థకు దూబే ఫిర్యాదు చేశాడు. ఎట్టకేలకు అటవీశాఖ స్పందించింది. కానీ ఆ సమాచారం వెల్లడిస్తే మిన్ను విరిగి మీదపడుతుందన్న స్థాయిలో సమాధానమిచ్చింది.

ప్రభుత్వాల పనితీరుపై అవధుల్లేని సమాచారం పౌరులకు లభ్యమైనప్పుడే ప్రజాస్వామ్యానికి పునాదిగా భావించే స్వేచ్ఛ, సమానత్వాలు సాధించుకోవటం, వాటిని కాపాడుకోవటం సాధ్యమవుతుందని జగజ్జేత అలెగ్జాండర్‌కు గురువైన గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ చెబుతాడు. అరిస్టాటిల్ క్రీస్తు పూర్వం రెండో శతాబ్దినాటివాడు. సమాచారం ఇవ్వటానికి ససేమిరా అంటున్న మన ప్రభుత్వాలు మానసికంగా తాము ఏకాలంలో ఉండిపోయామో తెలుసుకోవటం ఉత్తమం. ఇప్పుడే కాదు... 2005లో ఆర్టీఐ చట్టాన్ని తీసుకొచ్చినప్పుడే దేశభద్రత పేరు చెప్పి 22 సంస్థలకు మినహాయింపు ఇచ్చి దాని స్ఫూర్తిని దెబ్బతీశారు. తర్వాత కాలంలో ఆ జాబితా పెరుగుతూ పోయింది. ఆర్టీఐ పరిధిలోకి రాబోమని వాదించే వ్యవస్థలు, విభాగాలు ఎక్కువవుతున్నాయి. రాజకీయ పార్టీలు మొదలుకొని న్యాయవ్యవస్థ వరకూ ఇందులో ఎవరూ తక్కువ తినలేదు. పారదర్శకత తమవల్ల కాదని అందరికందరూ నిర్మొహమాటంగా చెబుతున్నారు. అసలు ఏ సమాచారమైనా కోరితే 30 రోజుల్లో దాన్ని అందజేయాలని ఆర్టీఐ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. అది ఎక్కడా అమలవుతున్న దాఖలా లేదు.

అప్పీల్ కోసం వెళ్తే అక్కడ మరో కథ. చాలా రాష్ట్రాల్లో సమాచార కమిషనర్లు, ఇతర సిబ్బంది తగినంతమంది ఉండటం లేదు. కొన్నిచోట్ల ప్రధాన కమిషనర్ల జాడలేదు. అయిదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం కేంద్ర రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ల, కమిషనర్ల పదవీకాలం, వారి జీతభత్యాలు, సర్వీసు నిబంధనలు రూపొందించే నిర్ణయాధికారాన్ని తన చేతుల్లోకి తీసుకుంటూ ఆర్టీఐకి సవరణలు తెచ్చింది. ఈ సవరణలు సహజంగానే సమాచార కమిషన్ వ్యవస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీశాయి. పార్లమెంటులో తగిన సంఖ్యాబలం ఉన్నది కనుక చట్ట సవరణలకు సులభంగానే ఆమోదం లభించింది. కానీ సంబంధిత వర్గాలతో మాట్లాడాకే ఆ సవరణలు తీసుకురావాలన్న కనీస సంప్రదాయాన్ని పాలకులు విస్మరించారు. పౌరులు ప్రధానంగా ప్రభుత్వాల నుంచే సమాచారం రాబట్టాలని కోరుకుంటారు. ఆ ప్రభుత్వమే రకరకాల ప్రయత్నాలతో దానికి అడ్డుపుల్లలు వేయదల్చుకుంటే ఇక ఆ చట్టం ఉండి ప్రయోజనమేమిటి? ఆర్టీఐ తీసుకొచ్చిన ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగే తర్వాత కాలంలో దాన్ని 'మితిమీరి' వినియోగిస్తున్నారంటూ మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా పాలకులందరిదీ ఇదే బాణీ. పాలనలో పారదర్శకత కోసం, ప్రభుత్వాలకు జవాబుదారీతనం పెంచటం కోసం వచ్చిన చట్టం హద్దులు దాటుతున్నదని పాలకులతోపాటు ఉన్నతాధికార గణం కూడా విశ్వసిస్తోంది. ఆర్టీఐని వమ్ము చేయటానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. కనుకనే సమాచారం కోరినవారి ఆనుపానులు క్షణాల్లో అవతలివారికి వెళ్తున్నాయి. సమాచార హక్కు ఉద్యమకారుల ప్రాణాలు గాల్లో దీపాలవుతున్నాయి. ఇప్పటివరకూ వందమందికి పైగా కార్యకర్తలను దుండగులు హత్యచేశారు.

ఈ ఏడాది మొదట్లో ఎలక్టోరల్ బాండ్స్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పౌరుల సమాచార హక్కు ప్రాధాన్యతనూ, ప్రజాస్వామ్యంలో అది పోషించే కీలకపాత్రనూ తెలియజెప్పింది. రాజ్యాంగదత్తమైన ప్రాథమిక హక్కుల్లో దాన్నొకటిగా గుర్తించింది. ఏదైనా చట్టం వచ్చినప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకునే వారున్నట్టే దుర్వినియోగం చేద్దామనీ, స్వప్రయోజనాలు సాధించు కుందామనీ ప్రయత్నించేవారు ఉంటారు. అంతమాత్రంచేత ఆ చట్టాన్ని నీరుగార్చకూడదు. కార్గిల్ అమర జవాన్ల కుటుంబాలకు ఉద్దేశించిన ఆదర్శ్ హౌసింగ్ సొసైటీలోకి రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు చొరబడి ఫ్లాట్లు కొట్టేసిన వైనం ఆర్టీఐ చట్టం లేకపోయివుంటే బయటికొచ్చేదే కాదు. అలాగే మధ్యప్రదేశ్‌లో వ్యాపమ్ కుంభకోణం, పశ్చిమ బెంగాల్‌లో టీచర్ రిక్రూట్‌మెంట్ల అక్రమాలు ఎప్పటికీ వెలుగుచూసేవి కాదు. వ్యక్తులుగా ఎవరైనా దుర్వినియోగానికి పాల్పడితే శిక్షించే విధంగా నిబంధనలు తెస్తే తప్పులేదు. కానీ ఆ సాకుతో మొత్తం చట్టాన్నే నీరుగార్చాలని చూడటం, దేశ భద్రత పేరు చెప్పి అందరినీ బెదరగొట్టడం ప్రమాదకరమైన పోకడ. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యాన్నీ, జవాబుదారీతనాన్నీ దెబ్బతీస్తాయి. నిరంకుశత్వానికి బాటలు పరుస్తాయి.

నిషేధాలే గానీ సేవలు గుర్తుండవా?

అభిప్రాయం



చెన్నమనేని విద్యాసాగరరావు

58 ఏళ్ల కిందట నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలలో పాల్గొననకుండా ప్రభుత్వోద్యోగులపై నిషేధం విధించింది. ఆ నిషేధాన్ని మొన్న జూలై 9న కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. దానితో ప్రతిపక్ష నేతలు గగ్గోలు పెడుతున్నారు. సంస్థ భావజాలం, కార్యకలాపాలు నచ్చితేనే ఎవరైనా చేరడమో లేదా పరోక్షంగా మద్దతు ఇవ్వడమో చేస్తారు. చైనాతో జరిగిన యుద్ధంలో భారత సైన్యానికి తోడుగా ఆర్ఎస్ఎస్ కీలక పాత్ర పోషించింది. ప్రకృతి వైపరీత్యాల కాలాల్లో సేవలు అందించింది. గాంధీ హత్య ఘటనలో పోలీసుల దర్యాప్తు, కోర్టు విచారణ అనంతరం ఆర్ఎస్ఎస్‌పై వచ్చిన ఆరోపణలన్నీ సత్యదూరమని తేలిపోయింది. అయినాకూడా ఆర్ఎస్ఎస్‌ను ఇప్పటికీ మహాత్మగాంధీ హత్యతో ముడిపెట్టడం ఎంత దారుణమో ఆలోచించాలి.

గోవధను వ్యతిరేకిస్తూ లక్షలాది ప్రజల మద్దతును కూడగట్టిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను నిలువరించేందుకు 1966 నవంబర్ 30న, అంటే 58 ఏళ్ల కిందట నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలలో పాల్గొననకుండా ప్రభుత్వోద్యోగులపై నిషేధం విధించింది. ఆ నిషేధాన్ని మొన్న జూలై 9న కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. దానితో ప్రతిపక్ష నేతలు గగ్గోలు పెడుతున్నారు. ఆర్ఎస్ఎస్ మీద విధించిన నిషేధాల గురించే తప్ప... ఆ నిషేధాల ఎత్తివేత గురించి గానీ, పాకిస్తాన్, చైనా మన దేశం పైన యుద్ధం చేసిన సమయాల్లో, ప్రకృతి వైపరీత్యాల కాలాల్లో సామాన్య ప్రజలకు స్వయంసేవకులు అందించిన సేవలను మరిచిపోయారు.

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పినట్టు... మహాత్మా గాంధీ హత్యానంతరం 1948 ఫిబ్రవరి 4న ఆర్ఎస్ఎస్‌పై పటేల్ విధించిన నిషేధాన్ని 18 నెలల తర్వాత ఆయనే హోంమంత్రి హోదాలో ఎత్తివేశారు. గాంధీ హత్య ఘటనలో పోలీసుల దర్యాప్తు, కోర్టు విచారణ అనంతరం ఆర్ఎస్ఎస్‌పై వచ్చిన ఆరోపణలన్నీ సత్యదూరమని తేలిపోయింది. అప్పుడు ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్‌గా ఉన్న గురూజీ (ఎంఎస్ గోల్వాల్కర్)కి పటేల్ రాసిన లేఖలో సంఘ్ సేవలను ప్రశంసించడమే గాక, స్వయంసేవకులు కాంగ్రెస్‌లో చేరి సేవలను కొనసాగించాలని ఆహ్వానించారు. 1948 సెప్టెంబర్ 11న సర్దార్ పటేల్ రాసిన ఈ లేఖ 'జస్టిస్ ఆన్ ట్రయల్' పుస్తకంలో ఉంది.

ఆర్ఎస్ఎస్ శాఖను మహాత్మా గాంధీ సందర్శించిన సంఘటనను మనం గుర్తు చేసుకోవాలి. గాంధీజీ 1936లో వార్ధాకు దగ్గరలో జరిగిన సంఘ్ శిబిరాన్ని సందర్శించారు. ఆ తరువాతి రోజు ఆయన్ని కలుసుకోవడానికి డా. హెడ్గేవార్ వారి నివాసానికి వెళ్లారు. అక్కడ వారితో జరిపిన సుదీర్ఘమైన సంభాషణ వివరాలు పుస్తకరూపంలో లభిస్తున్నాయి. దేశ విభజన సమయంలో ఢిల్లీలోని తన నివాసానికి దగ్గరగా ఉన్న సంఘ్ శాఖకు గాంధీజీ మరోసారి వచ్చారు. స్వయంసేవకులతో మాట్లాడారు. ఈ వివరాలు 1947 సెప్టెంబర్ 27 నాటి 'హరిజన్' పత్రికలో ప్రచురితమయ్యాయి. స్వయంసేవకుల క్రమశిక్షణాయుత, కులభేదాలకు అతీతమైన వ్యవహారశైలిని ఆయన మెచ్చుకున్నారు.

1939 మే 12న పూనా నగరంలో జరిగిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తల శిబిరానికి సంఘ్ కార్యకర్తల ఆహ్వానం మేరకు బాబాసాహెబ్ అంబేడ్కర్ ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంస్థాపకులు డా.కేశవరావు హెడ్గేవార్, ఇతర ఆర్ఎస్ఎస్ స్థానిక ప్రముఖులు, అంబేడ్కర్ అనుయాయి బాలాసాహెబ్ సాలుంకే ఉన్నారు. వీరు 1957–62 మధ్య లోక్‌సభ సభ్యులు. వీరి ఆత్మకథలో ఈ ఘటనను పేర్కొన్నారు. 1957 ఏప్రిల్ 1 ఉగాది రోజున పూనాలో జరిగిన ఆర్ఎస్ఎస్ ఉత్సవంలో ఈ ఘటనను వారు బహిరంగ సభలో తెలియజేశారు. ఆర్ఎస్ఎస్‌ను అంబేడ్కర్ ఎక్కడా విమర్శించిన



సందర్భాలే లేవు.

చైనాతో జరిగిన యుద్ధంలో భారత సైన్యానికి తోడుగా ఆర్ఎస్ఎస్ ఎంతో కీలక పాత్ర పోషించింది. అది చూసిన నాటి ప్రధాని నెహ్రూ ఎంతో ప్రభావితం అయ్యారు. ఆర్ఎస్ఎస్‌లోని ఒక దళం పూర్తి యూనిఫాం, బ్యాండ్‌తో 1963 గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొనేందుకు ఆహ్వానించారు. 1965 నాటి ఇండో-పాక్ యుద్ధ కాలంలో కూడా భారత సైన్యానికి ఆర్ఎస్ఎస్ అందించిన సేవలను గుర్తించి నాటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి అప్పటి ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ ఎం.ఎస్.గోల్వాల్కర్‌ను ప్రశంసించారు.

ఇందిరా గాంధీ ప్రభుత్వం 1975లో విధించిన అత్యవసర పరిస్థితి సందర్భంలో ఒకసారి... అనంతరం 1992లో బాబ్రీ మసీదు ఘటన సందర్భంలో మరోసారి ఆర్ఎస్ఎస్‌పై నిషేధాలు విధించడం ... వివిధ ప్రభుత్వ శాఖల దర్యాప్తులు, న్యాయస్థానాల విచారణల అనంతరం ఎత్తివేయడం జరిగింది. సంఘ్ మీద ఏ సందర్భంలో నిషేధం విధించినా అవన్నీ రాజకీయ కారణాల వల్ల అప్పటి ప్రభుత్వాలు విధించినవే తప్ప ఒక్క ఆరోపణ కూడా కోర్టు విచారణల్లో రుజువు కాలేదు.

ఇందిర సర్కారు నిషేధం విధించడానికి ముందే ఈ అంశంపై కోర్టు తీర్పులను పరిశీలిస్తే... పంజాబ్ ఉద్యోగి రాంపాల్ అనే వ్యక్తి ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలలో పాల్గొంటున్నాడనే కారణంతో ఉద్యోగం నుంచి తొలగించగా... ఆర్ఎస్ఎస్ రాజకీయ పార్టీ కాదంటూ పంజాబ్ – హరియాణా కోర్టు అతని తొలగింపు సమర్థనీయం కాదని తీర్పునిచ్చింది. మరో సంఘటన కర్ణాటకలోని రాయచూర్ జిల్లాకు సంబంధించినది. 1966లో అక్కడ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఉన్న రంగనటచార్ అనే వ్యక్తి ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడనే కారణంతో ఆయన పదోన్నతికి ఆటంకం కలుగగా... ఆర్ఎస్ఎస్ రాజకీయ సంస్థ కాదనీ, హిందువేతరులకు అది వ్యతిరేకం కాదనీ 1966 జూలై 6న మైసూర్ హైకోర్టు తీర్పునిచ్చింది.

ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలలో పాల్గొనే విషయంలో ప్రభుత్వోద్యోగులపై నిషేధం ఉన్నా, లేకపోయినా.. సంస్థ సిద్ధాంతం, భావజాలం, కార్యకలాపాలు తమకు నచ్చితేనే ఎవరైనా చేరడమో లేదా పరోక్షంగా మద్దతు ఇవ్వడమో చేస్తారు తప్ప, నిషేధం ఎత్తివేసినంత మాత్రాన దేశంలోని ప్రభుత్వోద్యోగులందరూ మూకుమ్మడిగా ఏ సంస్థ కార్యకలాపాల్లోనూ పాల్గొనరు గదా? అందువల్ల ప్రభుత్వోద్యోగులపై ఇన్నేళ్లు ఉన్న నిషేధాన్ని ఎత్తివేసినందుకు ఏదో జరిగిపోతుందన్నట్టు గగ్గోలు పెట్టడంలో అర్థం లేదు.

కాంగ్రెస్‌లో ఒకప్పటి అగ్రనేత, ఆ పార్టీ సర్కారులో కేంద్రమంత్రి, దేశ మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ 2018లో ఆర్ఎస్ఎస్ స్వయంసేవకుల తృతీయ వర్ష ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాటి కాంగ్రెస్ వర్గాలు ఎంత వ్యతిరేకించినా ప్రణబ్ ఈ వేడుకలో భాగస్వామి అయ్యారు. 'నేను ఈ రోజున భరతమాత గొప్ప సంతానమైన డా. కేశవ బలిరామ్ హెడ్గేవార్‌కు అంజలి సమర్పించడానికి వచ్చాను' అని రాశారు. అదే ఏడాది కేరళలోని కొట్టాయంలో డిసెంబర్ 31న జరిగిన ఆర్ఎస్ఎస్ ప్రాథమిక శిక్షవర్గ ముగింపు కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ థామస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'భారత్‌లో ప్రజలు ఎందుకు సురక్షితంగా ఉన్నారని ఎవరైనా నన్ను అడిగితే – మొదట రాజ్యాంగం, రెండవది ప్రజాస్వామ్య వ్యవస్థ, మూడు సైన్యం, నాలుగు ఆర్ఎస్ఎస్ వల్ల అని జవాబు చెపుతాను' అన్నారు. వీరేగాక లోకమాన్య జయప్రకాశ్ నారాయణ్, శాస్త్రవేత్తలైన జి.మాధవన్ నాయర్, కె. రాధాకృష్ణన్, కె.కస్తూరి రంగన్ వంటి పెద్దలు సైతం సంఘ్ కార్యకలాపాలను ప్రశంసించారు.

ఆర్ఎస్ఎస్ పైన నిషేధాన్ని ఎత్తివేసిన రెండు దశాబ్దాల తరువాత ఇందిరాగాంధీ నేతృత్వంలోని ప్రభుత్వం మహాత్మగాంధీ హత్యకు జరిగిన కుట్రపై విచారణ జరిపేందుకు ఒక కొత్త జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జె.జె. కపూర్‌ను చైర్మన్‌గా నియమించారు. ఆ కమిషన్ దాదాపు వందకు పైగా సాక్షులను విచారించి 1969లో నివేదిక సమర్పించింది. 'నేరస్థులు ఆర్ఎస్ఎస్ సభ్యులన్న విషయం ఎక్కడా రుజువు కాలేదు. ఆ సంస్థకు హత్యలో భాగం ఉందని నిరూపితం కాలేదు' అని కపూర్ కమిషన్ (సంపుటి -1, పేజీ–186) స్పష్టీకరించింది. దేశ విదేశాలలో కోట్లాదిమంది స్వయంసేవకులు ప్రతిరోజూ ప్రాతఃస్మరణంలో గాంధీజీ పేరును తలుచుకుంటారు. అయినప్పటికీ ఆర్ఎస్ఎస్‌ను మహాత్మాగాంధీ హత్యతో ముడిపెట్టడం ఎంత దారుణమో ఆలోచించాలి. ఈ నిరాధారమైన ఆరోపణలు చేసేవారిని శిక్షార్హులుగా ప్రకటించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

వ్యాసకర్త మహారాష్ట్ర మాజీ గవర్నర్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నెరవేరని కల



ఇవ్వాళ (జూలై 26) ఒలింపిక్స్ ప్రారంభోత్సవం. కానీ ఒక అఫ్గాన్ మహిళగా నా పోరాటం వల్ల నేను ఎంపిక కాలేదు. స్వేచ్ఛ కోసం నా పోరాటం ఒలింపిక్స్‌లో నా స్థానాన్ని కోల్పోయేలా చేస్తుందని గ్రహించలేక పోయాను. లింగవివక్ష పూరిత అఫ్గానిస్తాన్‌లో మహిళ కల నెరవేరదు.

– మర్జియే హమీదీ, తైక్వాండో అథ్లెట్

సైనికులకు వందనం



కార్గిల్ విజయ్ దివస్ (జూలై 26) రోజున, అసమానమైన ధైర్యం, త్యాగాలతో మన దేశ పర్వత శిఖరాలను వెనక్కి పొందిన మన సాహస సైనికులకు నివాళి. మన త్రివర్ణ పతాకం సగర్వంగా ఎగిరేలా చేసిన వారి అసాధారణ శూరత్వం, అంకితభావాలను గుర్తుచేసుకోవాల్సిన రోజు ఇది.

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

వదలని మురికి



మురిక్కాలువలను శుభ్రం చేస్తూ జనాలు చనిపోయే దేశం ప్రపంచంలో ఇండియా ఒక్కటే. సఫాయి కర్మచారీ ఆందోళన్ గణాంకాల ప్రకారం, గత ఆరు నెలల్లో మురిక్కాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేస్తూ 43 మంది చనిపోయారు.

– పమేలా ఫిలిపోస్, జర్నలిస్ట్

అదో తమాషా



ఏ2 నెయ్యి అని ఒక యాడ్ కనబడింది. ఏ2 నెయ్యి? మామూలు కంటే ఐదు రెట్లు ఎక్కువ ధరకు? ఏ1, ఏ2 ప్రొటీన్లు. కానీ నెయ్యి అనేది 99.5 నుంచి 99.7 వరకు కొవ్వు, తేమ. అందులో ఏ1, ఏ2 ఏ ప్రొటీన్ ఉండదు.

– నిఖిల్ చితలే, డైరీ ఇండస్ట్రియలిస్ట్

నేను నయం



ఇండియన్, హిందూ సంస్కృతికి చెందినామె కాబట్టి కమలా హారిస్‌కు ఓటు వేస్తామని (అమెరికాలోని) ఇండియన్స్ చెబుతున్నారు. ఆమె నరాల్లో సగం భారతీయ రక్తం ప్రవహిస్తోంది, అంతవరకే. నా నరాల్లో ఏ భారతీయ రక్తమూ లేదు. కానీ నేను ఆమె కన్నా వెయ్యి శాతం ఎక్కువ భారతీయురాలిని, హిందువును. మేలుకోండి!

– రెనీ లిన్, హిందూ యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

ఈ స్ఫూర్తి కొనసాగాలి

దేశంలో నక్సలైట్ ఉద్యమానికి ఆద్యుడు కామ్రేడ్ చారు మజుందార్ 52వ వర్ధంతి రేపు. ఈ సందర్భంగా దేశంలో ఉన్న పరిస్థితులను పునః పరిశీలించడం అవసరం. ఎమర్జెన్సీ కాలం నుంచి ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని దేశ వ్యాప్తంగా విస్తరించిన కమ్యూనిస్టులు ఫాసిస్టు శక్తులకు సింహస్వప్నంగా మారారు. ఎప్పుడూ పీడితుల పక్షానే నిలిచారు. తమ విధానాన్ని కొనసాగిస్తూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా 'ఇండియా' కూటమిలో చేరి పోరాడారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఫాసిస్ట్ పాలనను తీవ్రంగా దెబ్బతీశారు. ఇందులో ఈ రోజు పార్టీ పునర్వ్యవస్థీకరణ 50వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సీపీఐ (ఎమ్ఎల్) లిబరేషన్ భాగస్వామి అయ్యి బిహార్ వంటి చోట్ల విజయం సాధించింది.



రేపు చారు మజుందార్ వర్ధంతి

బీజేపీ తన సొంత మెజారిటీని కోల్పోయింది. ప్రభుత్వం గణనీయంగా బలహీనపడింది. కానీ అది మాత్రం ఏమీ జరగలేదన్నట్లు వ్యవహరిస్తోంది. మోదీ మళ్లీ ప్రధాని, అమిత్ షా మళ్లీ హోం మంత్రి, ఓం బిర్లా స్పీకర్! ప్రజల జీవనోపాధిపై, రాజ్యాంగంపై, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థపై నిరంతర దాడులతో రెండో దఫాలో నిర్వహించిన పాలనా విధానాన్నే మోదీ ప్రభుత్వం మూడవసారి కూడా కొనసాగించడానికి ప్రయత్నిస్తుంది. సంఘ్ బ్రిగేడ్‌కు చెందిన లించ్ గుంపులు, అల్లరి మూకలు హింసా వలయాన్ని పునఃప్రారంభించి, దానికి రాజ్య హింసను, చట్ట వ్యతిరేక బహిరంగ హింసను జోడిస్తూ వీధుల్లో స్వైరవిహారం చేస్తాయి. వీటిని ఎదుర్కోవడానికి ప్రజలకు మద్దతుగా నిలుస్తారు కమ్యూనిస్టులు.

2024 ఎన్నికల తీర్పుకు సంబంధించిన దిశను, స్ఫూర్తిని పరిశీలిస్తే, పార్లమెంటు లోపలా, వెలుపలా ప్రతి సమస్యపై మోదీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవటానికి 'ఇండియా'కు తగినంత బలాన్ని ఇస్తూ... ప్రజలు మోదీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సంఘ్ పరివార్ శక్తులకు వ్యతిరేకంగా రాజకీయ, సామాజిక శక్తులు... ప్రజా ఉద్యమాల ఆధారంగా విశాల ఐక్య వేదిక ఏర్పడాలి అన్న ప్రజాకాంక్షను నిజం చేస్తూ 'ఇండియా' కూటమిలో చేరాం. ఈ కూటమి స్థానికంగా పరస్పరం పోరాడే శక్తులతో సహా, అఖిల భారత స్థాయిలో రాజకీయ శక్తుల సమగ్ర ఐక్యతగా రూపుదిద్దుకుంది. తదుపరి అసెంబ్లీ ఎన్నికల క్రమంలో కూడా ఎన్డీఏని తీవ్రంగా దెబ్బతీసేందుకు ఈ ప్రక్రియను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించడంలో ప్రజాస్వామిక వాదులంతా ఏకమవ్వాలి.

– మామిండ్ల రమేష్ రాజా । సీపీఐ (ఎమ్ఎల్) లిబరేషన్ టీఎస్ కార్యదర్శి

వ్యక్తి స్వేచ్ఛకు ప్రమాద ఘంటికలు!

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

మన న్యాయచట్టాల నుండి రాజద్రోహాన్ని తొలగించారని అనుకుంటున్నాం. ఆ మేర ప్రకటనలు, పబ్లిసిటీలు చేస్తున్నారు కూడా. దానికన్నా భయంకరమైన సెడిషన్ తరహా కొత్త నేరాన్ని సృష్టించారు. తమకు పడని వారిపై కేసులు పెట్టడం, తమ పార్టీలో చేరిన పాత నేరగాళ్లను ప్రభువులను చేయడం చూస్తున్నాం.

పోలీసు ఆఫీసర్లకు విపరీతమైన అధికారాలు ఇచ్చారు. ఉదాహరణకు పోలీసు అధికారుల ఆదేశాలకు అవిధేయులైనవారినీ, ప్రతిఘటించే వారినీ; రాజ్యాంగ బద్ధంగా నిరాహార దీక్షలు, ధర్నాలు, సమ్మెలు చేసే వారినీ జైలుకు పంపించే అధికారం అదనంగా ఈ చట్టాలు పోలీసులకు ఇస్తున్నాయి. నింద పడగానే నిందితులకు బేడీలు వేసే అధికారాన్ని ఈ చట్టాల ద్వారా వారికి లభిస్తోంది.

నేరాల పరిశోధనలో చాలా కాలం అనుమానితుణ్ణి కస్టడీలో ఉంచడానికి, ఎఫ్ఐఆర్ చేయాలా వద్దా అనే విచక్షణాధికారం కూడా వారికి దఖలు పడుతున్నాయి. ఇది దారుణం కాదా?

తుషార్ గాంధీ, తనికా సర్కార్ వంటి వేలాది మంది ప్రముఖులు ఈ కొత్త నేర చట్టాలను పూర్తిగా పరీక్షించి, సమీక్షించి, జనం కూడా చర్చించుకున్న తరువాత ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కానీ వీరి విన్నపాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు.

ఇవి భయానకమైన నిర్ణయాలని మామూలు జనానికి అర్థం కావడం లేదు. ఈ కొత్త నేర చట్టాలు 'టెర్రరిజా'నికి కొత్త భాష్యాన్ని ఇచ్చి జనాన్ని జనాన్ని జైళ్లకు పంపే ప్రమాదాన్ని సిద్ధం చేశాయి. 'మాట్లాడే హక్కు అని అడుగుతారా' అని కోపించి 'నోర్మూయ్' అంటూ జనాన్ని వెళ్లగొట్టే బలాన్ని పోలీసులకు ఇచ్చే చట్టాలివి.

ఇప్పటికే ఈ చట్టాలను పోలీసులు ఎడాపెడా ఉపయోగించి కేసులు నమోదు చేస్తున్నారు. హైదరాబాదు చార్మినార్ పోలీసు స్టేషన్‌లో భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 281 కింద, మోటారు వాహనాల (ఎమ్వీ) చట్టం సెక్షన్ 177, 80(ఎ) కింద చట్టం అమలులోకి వచ్చిన తెల్లవారు జామునుంచే కేసుల నమోదు మొదలయ్యింది. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ బ్రిడ్జి కింద తోపుడు బండి మీద చిన్న చితక వస్తువులు అమ్ముకుని పొట్టపోసుకునే

ఇవీ మన కొత్త చట్టాలు-1



మామూలు చిన్న వ్యాపారులపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 281 కింద కొత్తకేసులు పెట్టడం మొదలు పెట్టారు.

మొత్తం దేశంలో రాబోయే కాలంలో ఎన్ని లక్షలు, కోట్ల జనాలపై కొత్త కేసులు పెడతారో ఎవరూ చెప్పలేరు. 650 జిల్లాలలో, 16 వేల పోలీసు స్టేషన్లలో ఈ నేరపు చట్టాలను హడావిడిగా అమలు చేయడం ప్రారంభించారు. పాత క్రిమినల్ ప్రొసీజర్ సెక్షన్ 154 కిందకు వచ్చే నేరాలకు కొత్త న్యాయ చట్టం సెక్షన్ 173 కింద కేసులు పెడుతున్నారు.

ఇదివరకు 511 ఐపీసీ సెక్షన్ కింద నమోదు చేసే కేసులను ఇప్పుడు భారత న్యాయ సంహిత సెక్షన్ 398 కింద నమోదు చేయడానికి అవకాశం కల్పించారు. వాటికి తోడు మరో 20 కొత్త నేరాలనూ ఇందులో చేర్చారు. మొత్తం మీద 33 కొత్త శిక్షలు, 83 కొత్త రకం జరిమానాలు విధించే అవకాశం కల్పించారు. 23 కొత్త నేరాలకు 'కనీస కారాగార శిక్ష'లను కనిపెట్టారు. ఇవి గాక 'సామాజిక సేవ' అనే పేరుతో 6 నేరాల్లో వినూత్న విభిన్న నియమాలు తయారు చేశారు.

పార్లమెంట్‌లోనూ, బయటా సరైన చర్చ జరగకుండానే, హడావిడిగా కొత్త క్రిమినల్ న్యాయ చట్టాలను ఎందుకు ఆమోదించి అమలులోకి తెచ్చారో అర్థం కాదు. ఇలా చేయడం కూడా నేరమే కదా. ఇక్కడ ఒక పెద్ద సమస్య గురించి మరిచిపోవడం శోచనీయం. ఇప్పటికే ఐపీసీ సెక్షన్ల కింద నమోదైన కేసులను ఆ సెక్షన్ల కిందే కోర్టుల్లో విచారణ చేయాలి. 2024 జూలైలో అమలులోకి వచ్చిన కొత్త న్యాయ చట్టాల ప్రకారం పెట్టిన కేసులను కొత్త చట్టాల ప్రకారమే విచారించాలి. పోనీ రెండు రకాల కేసులను విచారణ చేయడానికి విడి విడిగా ఏమైనా ఏర్పాట్లు చేశారా అంటే అదీ లేదు. దాదాపు కోటి పాత కేసులు వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పాత కేసులను విచారించడానికి ఎన్నేళ్ల కాలం పడుతుందో తెలియదు.

మరి కొత్త న్యాయ చట్టాల ప్రకారం 2024 జూలై నుంచి నమోదైన కేసులను ఎవరు విచారణ చేస్తారు, ఎన్నేళ్లు చేస్తారు? పాత కేసులను ఇప్పుడున్న కోర్టుల విచారణా పరిధుల్లో ఉంచి, కొత్త చట్టాల ప్రకారం విచారించడానికి సుప్రీం కోర్టు నుంచి కింద స్థాయి కోర్టుల వరకూ కొత్త న్యాయ స్థానాలను ఏర్పాటు చేస్తారా? ఇది సాధ్యమయ్యే పనేనా? ఏకకాలంలో పాత చట్టాలు, కొత్త చట్టాల కింద పాత, కొత్త కేసులపై విచారణ చేయడం సాధ్యమవుతుందా? కొత్త చట్టాలపై సాధికారత సాధించడానికే చాలా కాలం పట్టవచ్చు. మొత్తంగా కోర్టులపైనా, అందులో పనిచేసే న్యాయమూర్తులు, లాయర్లూ ఇతర సిబ్బందిపైనా విపరీతమైన ఒత్తిడి ఏర్పడటం ఖాయం అనిపిస్తోంది. ఇంత ఒత్తిడిలో సక్రమంగా బాధితులకు న్యాయం అందుతుందా అనేది ప్రశ్నార్థకమే. ఏతా వాతా ఈ మొత్తం ప్రహసనంలో ఇబ్బందులు ఎదుర్కొనేది సామాన్యులే అని వేరే చెప్పనవసరం లేదు.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

మోక్ష నిరోధకాలు

భ్రమలో ఉండేవారిని అజ్ఞానం ఎంతగానో తికమక పరుస్తుంది. అటువంటివారు అనాత్మను ఆత్మగానూ, ఆత్మను అనాత్మగానూ (అనగా శరీరము, మనస్సు, బుద్ధిగా) తలచి ఒకదానిపై వేరొకదానిని ఆరోపించుకుంటున్నారు. వారి సహజ ప్రకృతియే సచ్చిదానందం అనే వాస్తవాన్ని మరిచిపోతున్నారు. ప్రాపంచిక విషయాల్లో మునిగిపోయి వాటి నుండి సంతోషం పొందుతామని అనుకుంటున్నారు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

భ్రమలో ఉండేవారు ఆత్మనే పరమాత్మ అనే వాస్తవాన్ని తెలుసుకోలేకపోతున్నారు. అటువంటివారికి విగ్రహారాధన మొదటి మెట్టుగా పెద్దలు చెప్పారు. ఆత్మనే ఎల్లప్పుడు బంధ రహితంగా ఉంటుందనే సత్యం తెలియనంతవరకు అల్ప ప్రాణులు అనేక దీక్షలు, వ్రతాలు, తీర్థయాత్రలు చేయడానికి పూనుకొంటారు. యాత్రా స్థలాలను దర్శించటం వల్ల, అక్కడ నివసించడం వల్ల మోక్షం సాధించగలమని వారు తలుస్తారు. ఎవరైనా సరే... ఎంతకాలం ఈ శరీరమే 'నేను' అనే భావాన్ని కలిగి ఉంటారో, అంతకాలం పైన పేర్కొన్న కార్యకలాపాలు ఆత్మసాక్షాత్కారాన్ని కలిగించలేవు. ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించి చూచినప్పుడు శారీరక స్పృహ అజ్ఞానమే.

వాసనలు మూడు రకాలు: దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసన. దేహ ధర్మాలను ఆత్మపై ఆరోపించడమే దేహవాసన. 'నేను సాధించాను, నేను పండితుడను, నేను శాస్త్రాన్ని పఠించాను' అనే భావన శాస్త్రవాసన. ఈ భౌతిక ప్రపంచమే యథార్థమైందని తలచి దానితో సంబంధం కలిగి ఉండటం లోకవాసన.

ఈ వాసనలు ఉన్నంత కాలం మోక్షం లభించదనే వాస్తవాన్ని సాధకుడు తెలుసుకోవాలి. వాసనలను దూరం చేయడానికి వేదాలు అనేక మార్గాలను సూచిస్తున్నాయి. దివ్యనామ సంకీర్తన, నిరంతరం దైవదర్శనం అనేవి అందరికీ అందుబాటులో ఉన్నవే. అలాగే వీటిని సులభంగా ఆచరించనూవచ్చు. నీవు మనసారా మోక్షాన్ని కోరుకుంటున్నట్లయితే పూర్వ సంస్కారాలను విడిచిపెట్టి, పైన తెలిపిన మార్గాలను నిజాయితీగా ఆచరించాలి.

మానవుడంటే శరీరం, మనస్సు, బుద్ధి మాత్రమే కాదు, ఒక ఆత్మ స్వరూపం అనీ వేదాలు చెబుతున్నాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.సప్తమి రా.1.04 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** రేవతి సా.5.27 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ఉ.6.16 నుండి 7.45 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.40 నుండి 7.22 వరకు, **అమృతఘడియలు:** ప.3.12 నుండి 4.41 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.32.




తిరుమల శ్రీవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత, మారిషస్ మంత్రి జార్జెస్ పీఎర్రే లెజాన్‌గార్డ్ శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అలాగే పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎల్లా వెంకటేశ్వరరావు కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. - తిరుమల

కాప్సూల్ ఇంట్లో కులాసాగా..

రాష్ట్రంలో అందుబాటులోకి కొత్త తరహా ఇళ్ల నిర్మాణం


ఫోల్డింగ్ హౌస్


రిమోట్‌తో పనిచేసే కర్టెన్

- నాసా స్పేస్ టెక్నాలజీతో అభివృద్ధి
- స్పేస్ షిప్‌లో ఉన్న అనుభూతి
- ఒక చోట నుంచి మరో చోటకు తరలించే అవకాశం

సాక్షి, అమరావతి: ఈ ఇంటిని చూస్తే.. సైంటిఫిక్ ఫిక్షన్ సినిమాలో ఇంటిలాగానో, అంతరిక్ష ప్రయోగానికి సిద్ధం చేసిన స్పేస్ షిప్‌లాగానో ఉంది కదూ! ఈ ఇంటి లోపల చూస్తే నిజానికి అదే అనుభూతి కలుగుతుంది. స్పేస్ కాప్సూల్ హౌస్‌గా పిలిచే ఈ ఇంటిని 20 ఏళ్ల క్రితం 'నాసా' స్పేస్ టెక్నాలజీతో తయారు చేశారు. ఈ తరహా మోడల్ హౌసెస్ సైంటిఫిక్ ఫిక్షన్ సినిమాలైన మార్వెల్ మూవీస్‌లో సైతం కన్పిస్తుంటాయి. అమెరికాలో అభివృద్ధి చెందిన ఈ టెక్నాలజీని చైనా శాస్త్రవేత్తలు అందిపుచ్చుకొని విశ్వవ్యాప్తం చేశారు. ఈ ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే సాంకేతిక, పరికరాలన్నీ చైనా నుంచే ప్రపంచ దేశాలు దిగుమతి చేసుకుంటున్నాయి. ప్రస్తుతం అమెరికాతో పాటు చైనా, యూరప్, గల్ఫ్ దేశాల్లో విస్తృతంగా వాడుకలోకి ఉన్న ఈ ఇళ్ల నిర్మాణ టెక్నాలజీ మన ఆంధ్రప్రదేశ్‌లో కూడా అందుబాటులోకి వచ్చింది. రాజమహేంద్రవరానికి చెందిన సీబాక్స్ హౌసెస్ కంపెనీ రాష్ట్రానికి ఈ కొత్త ఇళ్లను పరిచయం చేసింది. ఈ ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే మెటీరియల్ అంతా విదేశాల నుంచే దిగుమతి చేసుకున్నదే. ఇంటి అవుట్ సైడ్ బాడీ అల్యూమినియంతోనూ, ఇన్‌సైడ్ బాడీ స్ట్రక్చర్ పూర్తిగా గల్వనైజ్ ఐరన్‌తోనూ నిర్మిస్తారు. ఇక తలుపులు, కిటికీల కోసం గట్టిగా ఉండే అత్యాధునిక


స్పేస్ కాప్సూల్ హౌస్

ప్లాస్టిక్ ఉడ్‌ని వాడుతున్నారు. 500 నుంచి 1000 చదరపు అడుగుల స్థలం ఉంటే చాలు.. కావాల్సిన మోడల్స్‌లో సింగిల్ బెడ్ రూమ్, డబుల్ బెడ్ రూమ్, ట్రిబుల్ బెడ్ రూమ్ ఇంటిని అత్యంత సులువుగా నిర్మించుకోవచ్చు.

45 రోజుల్లో ఇంటి నిర్మాణం

ఇంటి నిర్మాణానికి కేవలం 45 రోజుల సమయం పడుతుంది. మోడల్‌ను బట్టి రూ. 25 లక్షల నుంచి రూ. 55 లక్షల వరకు అవుతుంది. ఇవి 50 ఏళ్ల వరకు చెక్కుచెదరవు. క్రేన్ సహాయంతో కంటైనర్లు తరలించే భారీ లారీలపై ఒకచోట నుంచి మరొక చోటకు అత్యంత సులభంగా తరలించుకుపోవచ్చు. మైదాన ప్రాంతాల కంటే కొండ ప్రాంతాల్లో నిర్మించుకుంటే ఆకర్షణీయంగా ఉంటాయి. ఫామ్ హౌసెస్, రిసార్ట్స్ నిర్మాణానికి ఇవి ఎంతగానో అనుకూలం.

మడత పెట్టే ఫోల్డెడ్ హౌసెస్

మడత పెట్టే కుర్చీలు, మంచాల మాదిరిగానే దేశంలోనే తొలిసారి మడతపెట్టే ఫోల్డెడ్ హౌసెస్ కూడా మన రాష్ట్రంలో అందుబాటులోకి వచ్చాయి. కేవలం గంటలోనే వీటిని ఫిక్స్ చేయవచ్చు. 1 బీహెచ్‌కే నుంచి 4 బీహెచ్‌కే ఫోల్డబుల్ హౌసెస్ నిర్మించుకోవచ్చు. వీటి నిర్మాణానికి జీఏ మెటీరియల్‌ను వినియోగించడం వలన చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. కేవలం రూ. 11.5 లక్షల్లోనే ఆకర్షణీయమైన ఇల్లు అందుబాటులోకి వస్తుంది.

కంటైనర్ హౌసెస్ కాదు


విశాలమైన బెడ్ రూమ్

- ఇవి కంటైనర్ హౌసెస్ లాంటివి కాదు. పూర్తి రక్షణతో కూడుకున్న గృహాలు.
- ఇవి సన్ ప్రూఫ్‌తో పాటు ఫైర్ ప్రూఫ్, సౌండ్ ప్రూఫ్ కూడా. నిర్మాణంలో అన్ బ్రేకబుల్ డీజీ గ్లాసెస్‌ను వినియోగిస్తున్నారు.
- సెంట్రలైజ్డ్ ఏసీతో పాటు పగలు, రాత్రి ఉష్ణోగ్రతలకు తగ్గట్టుగా తనకు తానుగా మార్చుకునే ఆటో టెంపరేచర్ కంట్రోల్ ఫ్లోర్ ఈ ఇంటి ప్రత్యేకం.
- ఆహ్లాదం గొలిపేలా అత్యంత ఆకర్షణీయమైన రీతిలో ఇంటీరియర్స్ ఉంటాయి.
- అత్యంత లగ్జరీగా ఉండే లివింగ్ రూమ్, కిచెన్, బెడ్‌రూమ్స్, బాత్ రూమ్స్, స్మార్ట్ టాయిలెట్, రిమోట్‌తో పనిచేసే ఆటోమేటిక్ కర్టెన్స్, విద్యుత్ దీపాలు, ఫ్యాన్‌లు ఇలా ఎన్నో ప్రత్యేకతలు ఈ ఇళ్ల సొంతం.

దేశంలోనే తొలి ప్రయోగం



ఏడాది క్రితం చైనాకు వెళ్లినప్పుడు ఈ తరహా మోడల్స్ చూశాం. చాలా బాగున్నాయనిపించి వీటిని మన దేశానికి తీసుకురావాలన్న సంకల్పంతో సీబాక్స్ హోమ్స్‌ను ప్రారంభించాం. మన దేశంలో స్పేస్ టెక్నాలజీతో ఈ తరహా ఇళ్ల నిర్మాణం చేపట్టడం ఇదే తొలిసారి. మెటీరియల్ పూర్తిగా చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పటికే హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి 8 ఇళ్ల నిర్మాణానికి ఆర్డర్స్ వచ్చాయి. రాజమహేంద్రవరంలోని జేఎన్‌రోడ్‌లో మోడల్ హౌసెస్‌ను ఏర్పాటు చేశాం. వీటితో పాటు ఫోల్డెడ్ హౌసెస్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చాం. ఈ తరహా ఇళ్ల నిర్మాణం దేశంలో మరెక్కడా అందుబాటులో లేవు. ఏడాది పాటు సర్వీస్ పూర్తిగా ఉచితం. ఆ తర్వాత సర్వీస్ చార్జీ ఉంటుంది. ప్రస్తుతం ఈ ఇళ్ల నిర్మాణం కోసం చైనాలో శిక్షణ పొందిన 10 మంది సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

– ఎం.ప్రదీప్, మేనేజర్, సీబాక్స్ హోమ్స్

నమ్మించి.. మత్తులో ముంచి..

విద్యార్థినిపై మరో విద్యార్థిని దాష్టీకం

- తరచూ ఇంటికి తీసుకెళ్లి భర్తతో కలిసి గంజాయి సేవనం
- ఆపై భర్తతో లైంగికదాడి చేయిస్తూ.. ఫొటోలు, వీడియోలు
- ఆమెకు వివాహం కుదరడంతో డబ్బు కోసం బ్లాక్ మెయిల్
- తిరుపతిలో దారుణం


నిందితులు కృష్ణకిషోర్‌రెడ్డి, ప్రణవకృష్ణ

తిరుపతి రూరల్ : ఫ్రెండ్ అని నమ్మించింది.. ప్రాణం కన్నా ఎక్కువ అని నమ్మబలికింది.. ఇంటికి తీసుకెళ్లి భర్తకు పరిచయం చేసింది.. నమ్మి వచ్చిన ఫ్రెండ్‌కు భర్తతో కలిసి గంజాయి మత్తును అలవాటు చేసింది. మత్తులో ఉన్న ఫ్రెండ్‌పై భర్తతో లైంగిక దాడి చేయించింది.. ఆ సమయంలో ఫొటోలు, వీడియోలు తీసింది. ఆపై బ్లాక్ మెయిల్‌కు పాల్పడటం మొదలెట్టింది. శారీరకంగా, మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యే శరణ్యం అనుకుంటున్న సమయంలో అమ్మకు చెప్పి, పోలీసులకు ఫిర్యాదు చేసింది.. తిరుపతిలో జరిగిన దారుణానికి సంబంధించిన వివరాలు.. రాయలసీమకు చెందిన విద్యార్థిని(22) తిరుపతి శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో ఎల్ఎల్‌బీ మూడో సంవత్సరం చదువుతోంది. తిరుపతి రూరల్ మండలం పుదిపట్లకు చెందిన కృష్ణకిషోర్‌రెడ్డి భార్య ప్రణవకృష్ణ కూడా ఆమె చదువుతున్న క్లాస్‌లోనే సహ విద్యార్థినిగా ఉంది. తన తోటి విద్యార్థినిని నమ్మించి పుదిపట్లలోని తన ఇంటికి తీసుకెళ్లి భర్త కృష్ణకిషోర్‌రెడ్డికి పరిచయం చేసింది ప్రణవకృష్ణ. అనంతరం ఇద్దరు కలిసి విద్యార్థినికి గంజాయిని అలవాటు చేశారు. మత్తులో ఉన్న విద్యార్థినిపై కృష్ణకిషోర్‌రెడ్డి లైంగికదాడి చేసేవాడు. దీనిని ప్రణవకృష్ణ ఫొటోలు, వీడియోలు తీసింది. ఇదంతా గతేడాది జూన్ 13 నుంచి డిసెంబర్ 28వ తేదీ వరకు కొనసాగింది. ఇటీవల రాయలసీమకు చెందిన విద్యార్థినికి తమ కుటుంబ సభ్యులు చూసిన వ్యక్తితో నిశ్చితార్థం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రణవకృష్ణ, కృష్ణకిషోర్‌రెడ్డి విద్యార్థినిని బ్లాక్ మెయిల్ చేయసాగారు. నగ్నంగా ఉన్న ఫొటోలు, వీడియోలు చూపించి డబ్బు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో విద్యార్థిని వద్ద బంగారు గొలుసు, నిశ్చితార్థం ఉంగరం, నగదును సైతం లాక్కున్నారు. మరిన్ని డబ్బులతో తిరుపతికి వచ్చి సెటిల్ చేసుకోకపోతే వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరించారు. ఆలస్యం అవుతుందని శారీరకంగా, మానసికంగా దాడులు చేస్తూ వేధించారు. ఇంట్లో చెప్పుకోలేక, వేధింపులు భరించలేక విద్యార్థిని ఆత్మహత్యే శరణ్యం అని భావించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 23వ తేదీన విద్యార్థిని తల్లి పద్మావతి సొంతూరు నుంచి తిరుపతిలోని వర్సిటీకి వచ్చింది. బిడ్డ దుస్థితి చూసి లోతుగా ఆరా తీసింది. దీంతో జరిగిన ఘటన, బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యవహారంపై తల్లి వద్ద వాపోయింది. దీంతో ఈ నెల 25న తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తల్లితో కలిసి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ తెలిపారు. కేసులో నిందితులైన ప్రణవకృష్ణ, కృష్ణకిషోర్‌రెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా.. కోర్టు రిమాండ్ విధించింది. ఇదిలా ఉండగా, ప్రణవకృష్ణను సస్పెండ్ చేస్తున్నట్టు వర్సిటీ అధికారులు ప్రకటించారు.

నోరు జారాను.. చింతిస్తున్నా: విష్ణుకుమార్‌రాజు

విశాఖ సిటీ: 'వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన వారిపై నోరు జారాను. చింతిస్తున్నాను' అని విశాఖ ఉత్తర నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు వివరణ ఇచ్చారు. 'వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన వారు అన్నం తింటున్నారా? లేదా మరేదైనా..?' అంటూ విష్ణుకుమార్ రాజు అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు రావడంతో ఆయన శుక్రవారం తన తప్పును అంగీకరిస్తూ లేఖ విడుదల చేశారు. వెంటనే ఆ మాటలను ఉపసంహరించుకోవాలని అనుకున్నప్పటికీ, కొన్ని నిమిషాల్లోనే సభ ముగిసిందని తెలిపారు. ఓటర్లపై మాట్లాడిన మాటలు రికార్డుల నుంచి తొలగించాలని ఈ నెల 24న స్పీకర్, అసెంబ్లీ సెక్రటరీకి లేఖ ఇచ్చినట్లు తెలిపారు. ఎవరి మనోభావాలను దెబ్బతీయడం తన ఉద్దేశం కాదని వివరించారు.

బాలికపై లైంగిక దాడి

- పునుగులు కొనిస్తానంటూ తీసుకెళ్లి ఘాతుకం
- యువకుడిపై కేసు నమోదు


నిందితుడు వెంకటేశ్వర్లు

కుక్కునూరు: ఏడేళ్ల బాలికపై యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డ ఘటనలో శుక్రవారం ఏలూరు జిల్లా కుక్కునూరు పోలీసులు నిందితుడిపై అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేశారు. కుక్కునూరు ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అమరవరం పంచాయతీ చెరువు కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బాలిక(7) గురువారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చి మరో బాలికతో ఆడుకుంటోంది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన మడకం వెంకటేశ్వర్లు ఇద్దరు బాలికలతో పునుగులు కొనిస్తానని చెప్పి ట్రాక్టర్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లాడు. బాలికలిద్దరికీ గోదావరి చూపించి తిరిగి వచ్చేటప్పుడు రోడ్డు పక్కనే ఉన్న ఒక పాత భవనంలోకి ఏడేళ్ల బాలికను తీసుకెళ్లాడు. ఆ సమయంలో రెండో బాలికను ట్రాక్టర్‌పైనే ఉంచాడు. లోపలికి తీసుకెళ్లిన బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు.. ఆమె ఏడుస్తుండటంతో తీసుకొచ్చి ఇంటి సమీపంలో వదిలి వెళ్లిపోయాడు. బాధతో బాలిక ఏడుస్తుండటం చూసిన ఆమె తల్లి ఏమైందని చిన్నారిని దగ్గరకు తీసుకోగా దుస్తులపై రక్తపు మరకలు కనిపించాయి. దీంతో కంగారుపడిన తల్లి ఏం జరిగిందని ప్రశ్నించగా.. బాలిక జరిగినదంతా చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

న్యాయం చేయాలి: తమ కుమార్తెకు జరిగిన అన్యాయంపై తమకు న్యాయం చేయాలంటూ బాధితురాలి తల్లి కన్నీరుమున్నీరయ్యారు. జంగారెడ్డిగూడెం ఆస్పత్రి ప్రాంగణంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వైద్య పరీక్షల కోసం తమ కుమార్తెను జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తీసుకొస్తే ఇక్కడ పరీక్షలు చేసిన వైద్యురాలు.. ఏమీ జరగకుండానే మీరెందుకు ఇలా చెబుతున్నారని తమతో అంటోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కేసును నీరుగార్చే యత్నాలు జరుగుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దుర్గమ్మకు కానుకగా బంగారు నాణెం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు భక్తులు బంగారు నాణేన్ని కానుకగా సమర్పించారు. హైదరాబాద్ యూసఫ్‌గూడకు చెందిన కొమ్మరాజు శివరామకృష్ణ కుటుంబం అమ్మవారిని దర్శనానికి గాను శుక్రవారం ఇంద్రకీలాద్రికి వచ్చి ఆలయాధికారిని కలిసి రూ.2 లక్షల విలువైన 31 గ్రాముల బంగారు నాణేన్ని అందజేసింది. అలాగే, ఆలయ బంగారు తాపడం పనులకు గాను పశ్చిమ గోదావరి జిల్లా విస్సాకోడూరుకు చెందిన మీసాల రేణుకా స్వాతి 1,000 సింగపూర్ డాలర్లను కానుకగా సమర్పించారు. దాతలకు అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనాన్ని, అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.



బంగారు నాణేన్ని అందజేస్తున్న దాతలు

గంజాయి స్మగ్లర్లుగా ఇద్దరు విద్యార్థులు



పలమనేరు (చిత్తూరు జిల్లా): జల్సాలకు డబ్బు సంపాదించేందుకు గంజాయి స్మగ్లర్లగా మారిన ఇద్దరు విద్యార్థులను పలమనేరు సెబ్ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో సంబంధం ఉన్న మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన ఇద్దరు నిందితుల నుంచి రూ. 20 వేలు విలువజేసే రెండు కిలోల గంజాయిని సీజ్ చేశారు. పలమనేరు సెబ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పక్కా సమాచారంతో స్థానిక సెబ్ అధికారులు మండలంలోని మండిపేట క్రాస్ వద్ద కాపుగాచి స్కూటీలో వస్తున్న ఇద్దరిని పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరు తిరుపతిలోని హాస్టళ్లలో ఉంటూ ఇంటర్న్‌షిప్ చేస్తున్న బైరెడ్డిపల్లి మండలం మోట్లపల్లికి చెందిన పునీత్‌రెడ్డి(22), బురిశెట్టిపల్లికి చెందిన బంగి అనిల్‌కుమార్(21)గా గుర్తించారు. వీరు బైక్‌లపై వైజాగ్ వెళ్లి అక్కడి గంజాయి కొనుగోలు చేసి ఇక్కడి ఏజెంట్లకు అమ్ముతున్నట్లు గుర్తించారు. ఇదే కేసుకు సంబంధించి గంగవరం మండలం కొత్తూరుకి చెందిన పులగూర కార్తీక్ (22), పలమనేరు మండలం చెత్తపెంటకు చెందిన తళారి మణికంఠ(26), ఎల్లప్పగారి గణపతి (24)లపై ఎన్‌డీపీఎస్ చట్టం మేరకు కేసు నమోదు చేశామని వీరిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.



మదురో

- వెనిజులాలో రేపు అధ్యక్ష ఎన్నికలు
- మచాడోకు వెల్లువలా ప్రజా మద్దతు
- అధ్యక్షుడు మదురోకు ముచ్చెమటలు
- దేశ చరిత్రలోనే అత్యంత ఆసక్తికరమైన పోరుకు రంగం సిద్ధం



మచాడో

సామ్యవాద కోటలో నారీ భేరి

వెనిజులా. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిక్షేపాలున్న లాటిన్ అమెరికా దేశం. అయినా అత్యంత నిరుపేద దేశాల జాబితాలో అగ్రస్థానంలో ఉంది. పాతికేళ్లుగా సాగుతున్న స్వయం ప్రకటిత సామ్యవాద కూటమి నియంతృత్వ పాలనే అందుకు ప్రధాన కారణం. నిరసనలపై ఉక్కుపాదం, హక్కుల అణచివేత, విపక్ష నేతలకు సంకెళ్లు తదితరాలతో వెనిజులా యువత విసిగిపోయింది. దీనికి తోడు అంతర్జాతీయ సమాజం ఆంక్షలతో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి ఉపాధి అవకాశాలూ లేకపోవడంతో కట్టకట్టుకుని దేశం వీడుతోంది. నిండా 3 కోట్ల జనాభా కూడా లేని దేశంలో గత పదేళ్లలో ఏకంగా 80 లక్షల మంది విదేశీ బాట పట్టారు! సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం వంటి కీలక వ్యవస్థలన్నింటినీ ప్రభుత్వమే గుప్పెట్లో పెట్టుకోవడంతో పాతికేళ్లుగా వెనిజులాలో అధ్యక్ష ఎన్నికలు కూడా ఏకపక్షమే. 2018 ఎన్నికల్లోనైతే విపక్షాలన్నీ కట్టకట్టుకుని ఎన్నికలనే బహిష్కరించేంతగా ప్రభుత్వ అధికార దుర్వినియోగం శ్రుతి మించిపోయింది. దాంతో ప్రహసనప్రాయంగా సాగిన ఆ ఎన్నికల్లో అధ్యక్షుడు నికొలస్ మదురో తిరుగులేని మెజారిటీ సాధించి అధికారాన్ని నిలబెట్టుకున్నారు. అలాంటి వెనిజులాలో ఆరేళ్ల అనంతరం ఆదివారం మళ్లీ అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. కానీ పరిస్థితులు మాత్రం ఎప్పట్లా లేవు! విపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి మదురోపై ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాయి. విపక్షాల ప్రచార సభలకు జనం విరగబడుతున్నారు. ఎన్నికల ప్రక్రియపై ఎప్పుడూ లేనంత ఆసక్తి, ఉత్సుకత వారిలో కనిపిస్తున్నాయి. దాంతో అంతర్జాతీయ సమాజం కూడా ఈసారి ఎన్నికలను అత్యంత ఆసక్తితో వీక్షిస్తోంది. ఇన్ని మార్పులకు కారణం ఒక్క మహిళ. ఒకే ఒక్క మహిళ. మదురోకు ముచ్చెమటలు పోయిస్తున్న ఆమే...విపక్ష నేత మరియా కొరీనా మచాడో.

అనర్హత వేటేసినా...

వెనిజులా అధ్యక్ష ఎన్నికల బరిలో 10 మంది ఉన్నారు. ప్రధాన పోటీ 61 ఏళ్ల మదురో, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి ఎడ్మండో గొంజాలెజ్ రూపంలో ఇద్దరి మధ్య కేంద్రీకృతమైంది. కానీ అసలు పోటీలోనే లేని 56 ఏళ్ల మచాడో పేరు మాత్రమే దేశమంతటా మారుమోగిపోతోంది! ఎన్నికల ప్రచారం పొడవునా ఆమే సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. అటు అధికార యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులా, ఇటు విపక్ష 'యూనిటరీ ప్లాట్‌ఫాం' కూటమి ప్రచారమంతా ఆమెనే కేంద్రంగా చేసుకుని సాగడం విశేషం. ముఖ్యంగా మదురో ప్రసంగాలన్నీ ఆద్యంతం మచాడోను విమర్శిస్తూనే సాగాయి. ఆమె ఎన్నికల పోటీకి దూరమైన వైనమూ ఆసక్తికరమే. విపక్ష అభ్యర్థిని తేల్చేందుకు గతేడాది జరిగిన ప్రైమరీలో దేశవ్యాప్తంగా జనం వెల్లువలా వచ్చి మచాడోకు ఓటేశారు. దాంతో ఆమె రికార్డు స్థాయిలో ఏకంగా 93 శాతం ఓట్లు సాధించారు. ఆ వెంటనే ప్రభుత్వం ఆమెపై అవినీతి ఆరోపణలు మోపి ఎన్నికల్లో పోటీకి అనర్హురాలిగా ప్రకటించింది. విపక్ష ప్రైమరీనే చట్టవిరుద్ధంగా ప్రకటించింది. మచాడో మద్దతుదారులైన నాయకులు, జర్నలిస్టులు, హక్కుల నేతలు తదితరులందరినీ జైలుపాలు చేసింది. ప్రభుత్వ గుప్పెట్లో ఉన్న సుప్రీంకోర్టు కూడా వేటునే సమర్థించింది. అయినా మచాడో వెనక్కు తగ్గకుండా పెద్ద జనాకర్షణ శక్తి లేని మాజీ దౌత్యవేత్త గొంజాలెజ్‌ను తనకు బదులుగా రేసులో దించారు. తనపై వేటునే అతి పెద్ద ప్రచారాస్త్రంగా మలచుకుని సుడిగాలి ప్రచారంతో హోరెత్తించారు. మదురో ప్రభుత్వ అవినీతి, అస్తవ్యస్త పాలనపై ఆమె విమర్శలకు ప్రజల నుంచి విపరీతమైన స్పందన లభించింది. దాంతో అందరి దృష్టీ ఆదివారం జరిగే పోలింగ్ మీదే కేంద్రీకృతమైంది.

– సాక్షి, నేషనల్ డెస్క్



విపక్షాల ఉమ్మడి అభ్యర్థి గొంజాలెజ్

40 లక్షల మంది ఓటర్లపై 'వేటు'

వెనిజులా మొత్తం ఓటర్లే 2.1 కోట్లు. వారిలో 40 లక్షల మందికి పైగా విదేశాల్లో ఉన్నారు. మదురో పాలనపై వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొన్న నేపథ్యంలో వారెవరూ ఓటేసే వీల్లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. లెక్కలేనన్ని కొత్త నిబంధనలు తేవడంతో ప్రవాసుల్లో 69 వేల మంది మాత్రమే ఓటింగ్‌కు అర్హత పొందారు!

బస్సు డ్రైవర్ నుంచి అధికార పీఠం దాకా...

నికొలస్ మదురో మోరోస్. ఒకప్పుడు సాదాసీదా బస్సు డ్రైవర్. అనంతరం కార్మిక సంఘాల నేతగా మారారు. మెల్లిగా రాజకీయంగా ఒక్కో మెట్టే ఎక్కుతూ అధ్యక్ష పీఠం దాకా ఎదిగారు. 2000లో నేషనల్ అసెంబ్లీకి ఎన్నికవడం మదురో కెరీర్లో కీలక మలుపు. వెనిజులా చరిత్రలో అత్యంత జనాకర్షక నేతగా పేరొందిన హ్యూగో చావెజ్ అభిమానం చూరగొనడంతో ఆయన దశ తిరిగింది. చావెజ్ హయాంలో నేషనల్ అసెంబ్లీ స్పీకర్‌గా, విదేశాంగ మంత్రిగా చేసి 2012లో దేశ ఉపాధ్యక్షుడయ్యారు. ఏడాదికే చావెజ్ క్యాన్సర్ బారిన పడ్డారు. 2013లో మదురోను తన తాత్కాలిక వారసునిగా ప్రకటించి మరణించారు. మదురో గద్దెనెక్కుతూనే అధ్యక్ష పదవికి తూతూ మంత్రంగా ప్రత్యేక ఎన్నికలు జరిపించి తనకు 50 శాతానికి పైగా ఓట్లొచ్చాయని ప్రకటించుకున్నారు. నాటినుంచి నేటిదాకా అధికారంలో కొనసాగుతున్నారు. ఆయన 11 ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లోనూ కుప్పకూలిందంటూ జనం ఆగ్రహంగా ఉన్నారు. కొన్నేళ్లుగా మదురోపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత తీవ్రతరమవుతోంది.

బిల్లులు ఎందుకు ఆపేశారో చెప్పండి

కేంద్ర హోంశాఖ, కేరళ, బెంగాల్ గవర్నర్ల కార్యదర్శులకు సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ: కేరళ, పశ్చిమ బెంగాల్ శాసనసభల్లో ఆమోదించిన బిల్లులకు ఆయా రాష్ట్రాల గవర్నర్లు అంగీకారం తెలియజేయకుండా సుదీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టడం పట్ల సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. గవర్నర్ల వైఖరిని సవాలు చేస్తూ కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణకు స్వీకరించింది. కేంద్ర హోం శాఖకు, కేరళ గవర్నర్ అరిఫ్ మొహమ్మద్ ఖాన్, బెంగాల్ గవర్నర్ ఆనందబోసు కార్యదర్శులకు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. బిల్లులను ఎందుకు పెండింగ్‌లో కొనసాగిస్తున్నారో మూడు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అలాగే పిటిషన్‌లో కేంద్ర హోంశాఖను సైతం ఒక పార్టీగా చేర్చాలని బెంగాల్ ప్రభుత్వానికి సూచించింది. తమ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులకు గవర్నర్ అంగీకారం తెలియజేయడం లేదంటూ కేరళ ప్రభుత్వం ఈ ఏడాది మార్చి నెలలో సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

బీజేపీ చౌకబారు ప్రచారం కోసమే!

పరువు నష్టం కేసుపై రాహుల్ వ్యాఖ్యలు, కోర్టుకు హాజరు



సుల్తాన్‌పూర్(యూపీ): కేవలం చౌకబారు ప్రచారం కోసమే బీజేపీ నేతలు తనపై పరువు నష్టం వేశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. శుక్రవారం ఆయన సుల్తాన్‌పూర్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే కేసులను విచారించే ప్రత్యేక కోర్టులో హాజరయ్యారు. తాను ఎవరిపైనా పరువు నష్టం కలిగించేంతటి ఆరోపణలు చేయలేదని జడ్జి శుభమ్ వర్మ ఎదుట తెలిపారు. దీంతో, జడ్జి కేసు తదుపరి విచారణను ఆగస్టు 12వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అదే రోజు రాహుల్ వాంగ్మూలాన్ని రికార్డు చేస్తామని చెప్పారు. రాహుల్ కోర్టుకు రానవసరం లేదని పేర్కొన్నారు. అనంతరం కోర్టు వెలుపల రాహుల్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ నేతలు చౌకబారు ప్రచారం కోసమే తనపై కేసు వేశారన్నారు.

రాహుల్ కొత్త చిరునామా..!

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సునహరీ బాగ్ రోడ్‌లోని ఐదో నంబర్ బంగ్లాకు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేబినెట్ హోదా కలిగిన ప్రతిపక్ష నేతకు నిబంధనల ప్రకారం టైప్-8 బంగ్లాను కేటాయించాల్సి ఉంటుంది. రాహుల్ గాంధీకి సునహరీ బాగ్‌లోని ఐదో నంబర్ బంగ్లాను కేటాయించినట్లు హౌస్ కమిటీ వర్గాలు శుక్రవారం తెలిపాయి.

ఆక్స్‌ఫర్డ్ చాన్సలర్ పదవికి ఇమ్రాన్ పోటీ!



ఇస్లామాబాద్/లండన్: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ విఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ చాన్సలర్ పదవికి పోటీపడనున్నారు. ప్రస్తుతం జైల్లో ఉన్న ఇమ్రాన్ ఆన్‌లైన్ బ్యాలట్ విధానంలో జరిగే ఎన్నికల్లో పాల్గొంటారని అంతర్జాతీయ వ్యవహారాల్లో ఆయనకు సలహాదారుడైన వ్యాపారవేత్త సయ్యద్ జుల్ఫీ బుఖారీ శుక్రవారం జియో న్యూస్‌కు తెలిపారు. ఇమ్రాన్ ఆక్స్‌ఫర్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి. ఎకనమిక్స్, పొలిటికల్ సైన్స్ చదివారు. 2005–2014 దాకా ఆయన బ్రాడ్‌ఫోర్డ్ యూనివర్సిటీ చాన్సలర్‌గా పనిచేశారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ చాన్సలర్ పదవికి గౌరవ హోదా.. పూర్వ విద్యార్థులు దీని కోసం పోటీపడటానికి అర్హులు. రాజకీయ నాయకులకు ఈ పదవి దక్కడం ఆనవాయితీగా వస్తోంది. బ్రిటన్ మాజీ ప్రధానులు టోనీ బ్లెయిర్, బోరిస్ జాన్సన్‌లు కూడా ఈసారి పోటీలో ఉన్నారు.

ఎస్పీ ఆఫీసు ఎదుట రాజ్యాంగ స్తూపం



లక్నో: లక్నోలోని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) ప్రధాన కార్యాలయం ఎదుట రాజ్యాంగ స్తూపం(సంవిధాన్ మాన్‌స్తంభ్) ఏర్పాటైంది. శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఎస్పీ నేతల సమక్షంలో ఆ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఒక స్తూపంపై రాజ్యాంగ ప్రతిని ఉంచడం ద్వారా రాజ్యాంగ స్తూపాన్ని ఆవిష్కరించారు. 'ఒకప్పటి కొల్హాపూర్ మహారాజు ఛత్రపతి సాహూ తన సంస్థానంలో మహాత్మా జ్యోతిబా పూలే కలలుగన్న రిజర్వేషన్ల అమలును సరిగ్గా ఇదే రోజున ప్రారంభించారు. అందుకే జూలై 26వ తేదీన రాజ్యాంగ స్తూపాన్ని ఏర్పాటు చేసినట్లు అనంతరం అఖిలేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

భర్త తర్వాత భార్య

కర్నాటక చీఫ్ సెక్రటరీగా శాలినీ రజనీష్



బెంగళూరు: ఒక రాష్ట్రానికి ప్రధాన కార్యదర్శిగా పనిచేయడమంటే.. ప్రభుత్వానికి కళ్లు, చెవులు అన్నీ తానై వ్యవహరించడం. కర్నాటకలో ఈ కీలక పోస్టును భర్త తర్వాత భార్య చేపట్టి అరుదైన రికార్డును రజనీష్ గోయల్, శాలినీ రజనీష్‌లు దక్కించుకున్నారు. ప్రస్తుతం చీఫ్ సెక్రటరీగా ఉన్న రజనీష్ గోయల్ ఈనెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో నూతన ప్రధాన కార్యదర్శిగా శాలినిని నియమిస్తూ కర్నాటక ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. 1989 ఐఏఎస్ బ్యాచ్ టాపర్ అయిన శాలిని గ్రామీణాభివృద్ధిలో పీహెచ్‌డీ చేశారు. మేనేజ్‌మెంట్, వ్యక్తిత్వ వికాసం, మహిళా సాధికారికతలపై పలు పుస్తకాలు రచించారు. రజనీష్ దంపతులకంటే ముందు కర్నాటకలో మరో జంట కూడా ప్రధాన కార్యదర్శులుగా పని చేసింది. 20 ఏళ్ల కిందట బి.కె.భట్టాచార్య, ఆయన భార్య థెరెసా భట్టాచార్యలు ఇద్దరూ సీఎస్‌లుగా చేశారు.

మద్దతు ధరపై కమిటీ: శివరాజ్ సింగ్



న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)పై శుక్రవారం రాజ్యసభలో ప్రతిపక్షాలు తీవ్ర అలజడి సృష్టించాయి. సభా కార్యకలాపాలకు అడ్డుతగిలాయి. ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలంటూ నినాదాలతో హోరెత్తించాయి. ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ రైతాంగం సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు వివరించారు. కనీస మద్దతు ధర వ్యవస్థను బలోపేతం చేసేందుకు కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా మద్దతు ధరపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కంటే రైతుల శ్రేయోభిలాషి ఇంకెవరూ ఉండరని వెల్లడించారు. ఎంఎస్పీకి చట్టబద్ధత గురించి మాట్లాడకుండా దాటవేశారు. దీంతో కాంగ్రెస్ ఎంపీలు జైరామ్ రమేశ్, రణదీప్ సూర్జేవాలా సహా విపక్ష ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు.

కమలకు ఒబామా మద్దతు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థిగా పోటీకి దిగుతున్న కమలా హారిస్‌కు సొంత పార్టీ నుంచి మద్దతు నానాటికీ పెరుగుతోంది. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా సైతం ఆమెకు అండగా నిలిచారు. అమెరికాకు కమలా హారిస్ అద్భుతమైన అధ్యక్షురాలు అవుతారని ప్రశంసల వర్షం కురిపించారు. తాను, తన భార్య మిషెల్ కలిసి ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నామని, తోడుగా ఉంటామని చెప్పారు. ఎన్నికల్లో కమల విజయం కోసం తాను చేయగలిగినదంతా చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు ఒబామా శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకుంటున్నట్లు ఆదివారం జో బైడెన్ ప్రకటించిన తర్వాత డెమొక్రటిక్ అభ్యర్థిగా కమలా హారిస్ పేరు తెరపైకి వచ్చింది. కానీ, ఆమెకు బరాక్ ఒబామా వెంటనే మద్దతు తెలియజేయపోవడం పట్ల రకరకాల ఊహాగానాలు చెలరేగాయి. కమల అభ్యర్థిత్వం పట్ల ఒబామా అయిష్టంగా ఉన్నారంటూ వార్తలొచ్చాయి. కానీ, అదంతా వట్టిదేనని తేలిపోయింది. కమలతో తాము ఇప్పటికే ఫోన్‌లో మాట్లాడామని ఒబామా 'ఎక్స్'లో వెల్లడించారు. ఆమెకు తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. దేశం ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో కమల విజయం కోసం తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కమలను చూసి తాను గర్విస్తున్నానని, వచ్చే ఎన్నికల్లో ఆమె చరిత్రాత్మక విజయం సాధించడం తథ్యమని మిషెల్ ఒబామా పేర్కొన్నారు. తనకు మద్దతు ప్రకటించిన ఒబామా దంపతులకు కమలా హారిస్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నీతిఆయోగ్ భేటీకి ఆరుగురు సీఎంలు దూరం

న్యూఢిల్లీ: హస్తినలో శనివారం జరగబోయే నీతి ఆయోగ్ పాలకమండలి భేటీని విపక్ష 'ఇండియా' కూటమి పార్టీలకు చెందిన ఆరుగురు సీఎంలు బహిష్కరించారు. కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో తీవ్ర వివక్ష చూపారంటూ ఈ నిర్ణయం తీసుకున్నారు. వీరిలో కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి (తెలంగాణ), సిద్ధరామయ్య (కర్ణాటక), సుఖ్వీందర్ సింగ్ సుఖూ (హిమాచల్ ప్రదేశ్)తో పాటు ఎంకే స్టాలిన్ (తమిళనాడు), విజయన్ (కేరళ), భగవంత్ మాన్ (పంజాబ్) ఉన్నారు. ఢిల్లీ ప్రభుత్వమూ భేటీని బాయ్‌కాట్ చేసింది.

ప్రణాళికా సంఘమే కావాలి: మమత

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ మాత్రం భేటీలో పాల్గొంటానని స్పష్టంచేశారు. ''బడ్జెట్ కేటాయింపుల్లో విపక్షాలపాలిత రాష్ట్రాలపై మోదీ సర్కార్ వివక్షను భేటీలో ప్రస్తావిస్తా. బెంగాల్‌లో విభజన రాజకీయాలు తెస్తూ పొరుగురాష్ట్రాలతో వైరానికి వంతపాడుతున్న కేంద్రాన్ని కడిగేస్తా. నీతి ఆయోగ్ ప్రణాళికలు ఒక్కటీ అమలుకావడం చూడలేదు. ప్రణాళికా సంఘంలో ఒక విధానమంటూ ఉండేది. రాష్ట్రాల సూచనలకు విలువ ఇచ్చేవారు. నీతిఆయోగ్‌లో మా మాట వినే అవకాశం లేదు. పట్టించుకుంటారన్న ఆశ అస్సలు లేదు. అందుకే ప్రణాళికా సంఘాన్ని పునరుద్ధరించాలి'' అని మమత అన్నారు.

నేడు మోదీ నేతృత్వంలో భేటీ

2047 ఏడాదికల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై చర్చించేందుకు నేడు ప్రధాని మోదీ అధ్యక్షతన 9వ నీతిఆయోగ్ పాలకమండలి సమావేశం జరగనుంది. ఈ భేటీకి కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు హాజరుకానున్నారు. అయితే పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ఈ భేటీకి రావట్లేదని తెలుస్తోంది. పుదుచ్చేరిలో రంగస్వామికి చెందిన ఏఐఎన్ఆర్‌సీ పార్టీ బీజేపీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజాజీవనాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్రాలు ఎలా మరింత సమన్వయంతో పనిచేయాలనే అంశాలనూ ఈ భేటీలో చర్చించనున్నారు. వికసిత భారత్‌కు దార్శనిక పత్రం రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలను ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ క్రతువులో రాష్ట్రాల పాత్రపై విస్తృతస్థాయిలో చర్చ జరగనుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. గత ఏడాది డిసెంబర్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల మూడో జాతీయ సదస్సులో చేసిన సిఫార్సులనూ సమావేశంలో పరిశీలించనున్నారు.



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం లక్నోకు వెళ్తూ సుల్తాన్‌పూర్ శివార్లలో చెప్పులు కుట్టే దుకాణం వద్ద ఆగారు. దుకాణదారు రామ్ చేత్‌తో మాటలు కలిపారు. ఆయనతో కలిసి కూల్ డ్రింక్ తాగారు.

పొలిమేరల నుంచే హెచ్చరిస్తున్నా...

పాక్ కుట్రలు ఫలించవు

- విజయ్ దివస్ సందర్భంగా ప్రధాని కార్గిల్ సందర్శన
- అమర జవాన్లకు ఘనంగా నివాళులు

ద్రాస్ (లద్దాఖ్): కార్గిల్ యుద్ధంలో చావుదెబ్బ తిన్నా పాకిస్తాన్‌కు ఇంకా బుద్ధి రాలేదంటూ ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. ఉగ్రవాదం ముసుగులో పరోక్ష యుద్ధాలతో ఇప్పటికీ కవ్వింపు చర్యలకు దిగుతోందని దుయ్యబట్టారు. 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించారు. ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమర జవాన్లకు నివాళులర్పించారు. వారి కుటుంబీకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా పాక్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ''1999లో కార్గిల్ యుద్ధంలో మన సైనిక వీరుల శౌర్యం ముందు పాక్ ముష్కరులు మోకరిల్లారు. అయినా ఆ దేశం ఎన్నో వికృత యత్నాలకు పాల్పడింది. అవన్నీ దారుణంగా విఫలవుతున్నా గుణపాఠం నేర్వడం లేదు. పొలిమేరల నుంచి వారికి నేరుగా వినబడేలా హెచ్చరిస్తున్నా. ఉగ్ర మూకల దన్నుతో పన్నుతున్న ఇలాంటి కుట్రలు సాగవు. ముష్కరులను మన సైనిక దళాలు నలిపేస్తాయి. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించివేస్తాం'' అన్నారు. పాతికేళ్ల కింద కార్గిల్ యుద్ధ సమయంలో ఓ సామాన్యునిగా సైనికుల మధ్య గడిపే అదృష్టం తనకు దక్కిందని మోదీ గుర్తు చేసుకున్నారు. భూతల స్వర్గమైన కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత శాంతిభద్రతలు నెలకొంటున్నాయన్నారు. సైనికులకు ఇవ్వాల్సిన పెన్షన్ నిధులను ఆదా చేసుకునేందుకే అగ్నిపథ్ పథకం తెచ్చారన్న విపక్షాల విమర్శలను మోదీ తీవ్రంగా ఖండించారు.



విజయ్ దివస్ సందర్భంగా ద్రాస్‌లో మాట్లాడుతున్న మోదీ

అది సైన్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు, నిత్యం యువ రక్తం ఉండేలా, సదా యుద్ధ సన్నద్ధంగా ఉండేలా చూసేందుకు తెచ్చిన పథకమన్నారు. ''వేల కోట్ల కుంభకోణాలతో సైన్యాన్ని బలహీనపరిచిన వాళ్లే ఇప్పుడిలా దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశంపై మతిలేని విమర్శలకు దిగడం సిగ్గుచేటు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్‌పై తప్పుడు వాగ్దానాలు చేసింది కూడా వారే. మేం విజయవంతంగా అమలు చేస్తున్నాం'' అన్నారు.

టన్నెల్‌లో మోదీ 'బ్లాస్ట్'

లేహ్‌కు అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ బయటి ప్రపంచంతో సంబంధాలు కల్పించనున్న షింకున్ లా టన్నెల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వర్చువల్‌గా తొలి బ్లాస్ట్ చేసి పనులను ప్రారంభించారు. 15,800 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న ఈ ట్విన్ ట్యూబ్ టన్నెల్ పొడవు 4.1 కి.మీ. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఉన్న సొరంగంగా నిలవనుంది.

'విజయ్ దివస్'లో ముర్ము

న్యూఢిల్లీ: విజయ్ దివస్ సందర్భంగా అమర జవాన్లకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఘనంగా నివాళులర్పించారు. ''1999లో ఉగ్రవాదుల ముసుగులో కశ్మీర్ మంచుకొండల్లోకి చొరబడ్డ పాక్ సైన్యాన్ని మన సైనిక దళాలు అసమాన శౌర్య సాహసాలతో చావు దెబ్బ తీశాయి. ఆ క్రమంలో అమరుడైన ప్రతి సైనికునికీ శిరసు వంచి అభివాదం చేస్తున్నా'' అని పేర్కొన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్మీ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ తదితరులు కూడా నివాళులర్పించారు.

మోదీపై విపక్షాల ధ్వజం

సైన్యం కోరిన మీదటే అగ్నిపథ్ తెచ్చామంటూ మోదీ పచ్చి అబద్ధాలు చెప్పారని విపక్షాలు విమర్శించాయి. విజయ్ దివస్ ప్రసంగంలో కూడా అబద్ధాలు చెప్పి అమర జవాన్లను అవమానించారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. ఏ ప్రధానీ ఇలా దిగజారలేదంటూ ధ్వజమెత్తారు. ఈ పథకం ప్రస్తావనతో ఆశ్చర్యపోయామని నాటి ఆర్మీ చీఫే చెప్పారని కాంగ్రెస్ పేర్కొంది. సైన్యం సామర్థ్యాన్ని పెంచేందుకు, యువ రక్తం నింపేందుకు అగ్నిపథ్ పథకం తెచ్చామనడం ద్వారా మన సైనికులను మోదీ ఘోరంగా అవమానించారని తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) తదితర పార్టీలు దుయ్యబట్టాయి.

ఫ్రాన్స్‌లో దుండగుల దుశ్చర్య

- ఒలింపిక్స్ ప్రారంభమైన రోజే హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌పై దాడి
- నిలిచిపోయిన రైళ్ల రాకపోకలు

పారిస్: ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇస్తున్న ఫ్రాన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు విధ్వంసానికి పాల్పడ్డారు. హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగారు. భారత కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి 11 గంటలకు క్రీడోత్సవాలు ప్రారంభం కాగా, దుండగుల దుశ్చర్య కారణంగా ఉదయం నుంచే పలు ప్రాంతాల్లో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని ఆలస్యంగా నడిచాయి. మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ సబ్ స్టేషన్లపై దాడి చేశారు. కేబుళ్లు తెంపేశారు. ఫలితంగా ఫ్రాన్స్‌తో పాటు యూరప్‌లోని పలు ప్రాంతాల నుంచి పారిస్‌కు రైల్వే సేవలు నిలిపివేయాల్సి వచ్చింది. వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైళ్లలో వెళ్లాల్సిన ఒలింపిక్ క్రీడాకారులను బస్సుల్లో పారిస్‌కు తరలించారు. ఒలింపిక్స్ ప్రారంభమైన రోజే పథకం ప్రకారం జరిగిన ఈ చర్యల వెనుక కుట్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. వామపక్షవాద మిలిటెంట్లు లేదా పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారులు ఈ దాడులకు పాల్పడినట్లు భావిస్తున్నారు. తమ డిమాండ్లను ప్రపంచం దృష్టికి తీసుకురావాలన్నదే వారి ఎత్తుగడ కావొచ్చని చెబుతున్నారు. అయితే, ఒలింపిక్ క్రీడలతో ఈ దాడులకు ప్రత్యక్ష సంబంధం లేదని భావిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. క్రీడలను అడ్డుకోవాలన్నది దుండగుల ఆలోచన కాకపోవచ్చని తెలిపారు. హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను స్తంభింపజేసిన దుండగులను గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించారు. నేరం రుజువైతే వారికి పదేళ్ల నుంచి 20 ఏళ్ల దాకా జైలు శిక్షపడే అవకాశం ఉందని చెప్పారు. తాజా ఘటనలపై ఫ్రాన్స్ ప్రధానమంత్రి గాబ్రియెల్ అటాల్ స్పందించారు. ఇవి ముందస్తు పథకం ప్రకారం జరిగిన దాడులేనని చెప్పారు. ఉత్తర, తూర్పు, పశ్చిమ ప్రాంతాల నుంచి పారిస్‌కు దారి తీసే రైలు మార్గాలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడ్డారని తెలిపారు. పారిస్‌కు వెళ్లే రైళ్లను అడ్డుకోవాలన్నదే వారి ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. దుండగుల కోసం గాలింపు ప్రారంభమైందన్నారు. మధ్యాహ్నం తర్వాత రైళ్ల రాకపోకలు కొనసాగాయని రవాణా మంత్రి పాట్రిస్ వెర్‌గ్రిటే చెప్పారు. ఒలింపిక్స్ సందర్భంగా ముష్కరులు విధ్వంసానికి పాల్పడే అవకాశం ఉందని ఫ్రాన్స్ నిఘా వర్గాలు నెల రోజుల క్రితమే హెచ్చరించాయి.



పారిస్‌లోని ఓ లోకల్ రైల్వేస్టేషన్లో రైళ్ల కోసం ప్రయాణికుల ఎదురుతెన్నులు

61 నుంచి 17కు

- నీట్-యూజీలో పడిపోయిన టాప్ ర్యాంకర్ల సంఖ్య
- రీ-రివైజ్డ్ జాబితా విడుదల

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నీట్-యూజీ ప్రవేశపరీక్ష ఫలితాల రీ-రివైజ్డ్ తుది జాబితాను ఎన్‌టీఏ శుక్రవారం విడుదల చేసింది. ఐదు మార్కులు తీసేయడంతో టాప్ ర్యాంకర్ల సంఖ్య 61 నుంచి 17కు పడిపోయింది. ఫిజిక్స్‌లో ప్రశ్నకు నాలుగో ఆప్షన్ సరైనదని ఐఐటీ ఢిల్లీ నిపుణుల బృందం తేలిచ్చింది. దాంతో అందరి ర్యాంకులు మారిపోయాయి. గతంలో 67 మంది 720కి 720 మార్కులు సాధించారని ప్రకటించారు. ఆరుగురికి గ్రేస్ మార్కులను తీసేయడంతో టాపర్లు 61కి తగ్గారు. తాజాగా వారి సంఖ్య 17కు తగ్గింది.

టాప్ 100 జాబితా..

రీ-రివైజ్డ్ జాబితా ప్రకారం టాప్-100 జాబితాలో 17 మంది 720కి 720 మార్కులు సాధించారు. ఆరుగురు 716 మార్కులు సాధించారు. 77 మంది 715 మార్కులు సాధించారు. కేరళ, చండీగఢ్, తమిళనాడు, పంజాబ్, బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి తలొకరు, రాజస్తాన్ నుంచి నలుగురు, మహారాష్ట్ర నుంచి ముగ్గురు, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ నుంచి చెరొకరు.. 17 మంది టాపర్లుగా నిలిచారు. వీరిలో నలుగురు అమ్మాయిలు! టాప్-100లో అమ్మాయిలు 22 మంది ఉన్నారు. స్కోర్‌కార్డులు, కౌన్సిలింగ్‌కు తాజా సమాచారం కోసం exams.nta.ac.inను చూడాలని ఎన్‌టీఏ పేర్కొంది.

మెక్సికో డ్రగ్ లార్డ్ అరెస్ట్

అమెరికాకు చిక్కిన జంబాడా

- ఎల్‌చాపో కుమారుడు జోక్విన్ గుజ్మాన్ కూడా
- మభ్యపెట్టి వారి విమానాన్ని అమెరికాలో ల్యాండ్ చేసిన వైనం

వాషింగ్టన్: మెక్సికోలో మాదకద్రవ్యాల వ్యాపారంతో వేలకోట్ల రూపాయల నేరసామ్రాజ్యాన్ని విస్తరించిన డ్రగ్ లార్డ్ ఇస్మాయిల్ 'ఎల్ మాయో' జంబాడా గార్షియా ఎట్టకేలకు అమెరికా పోలీసులకు చిక్కాడు. 76 ఏళ్ల జంబాడా వాస్తవానికి విమానంలో వేరే ప్రాంతానికి వెళ్లాల్సి ఉండగా అతనికి తెలీకుండా చాకచక్యంగా ప్రైవేట్ విమానాన్ని అమెరికాలో ల్యాండ్ చేశారు. గురువారం టెక్సాస్ రాష్ట్రంలోని ఎల్ పాసో సిటీ శివారులోని చిన్న ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయిన అదే విమానంలో ఉన్న డ్రగ్ లార్డ్ ఎల్‌చాపో కుమారుడు జోక్విన్ 'ఎల్ చాపో' గుజ్మాన్(38)నూ పోలీసులు అరెస్ట్‌చేసి గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లి విచారిస్తున్నారు. దశాబ్దాలుగా జంబాడా అరెస్ట్‌కోసం అమెరికా ప్రయత్నిస్తోంది. అతని జాడ చెప్తే రూ.125 కోట్ల నజరానా ఇస్తామని గతంలో ప్రకటించింది. 'అమెరికాలోకి వందల కోట్ల డాలర్ల విలువైన ఫెంటానిల్, మెథాంఫెటమైన్ డ్రగ్స్‌ను సరఫరా చేస్తూ అమెరికా యువతను మాదకద్రవ్యాల మత్తులో ముంచేసిన నేరానికి వీరికి కఠిన శిక్ష పడనుంది' అని ఎఫ్‌బీఐ డైరెక్టర్ క్రిస్టఫర్ అన్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపార నిమిత్తం వెళ్తున్నామని అబద్ధం చెప్పి జంబాడాను జోక్విన్ గుజ్మానే విమానం ఎక్కించాడని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.



జంబాడా

అత్యంత హింసాత్మక, శక్తివంత 'సినోలా కార్టెల్'

మాదకద్రవ్యాల అక్రమ తయారీ, ఎగుమతికి ప్రపంచ కేంద్రస్థానంగా నిలిచే మెక్సికోలో అత్యంత హింసాత్మక, శక్తివంతమైన డ్రగ్స్ ముఠాల్లో సినోలా కార్టెల్ కూడా ఒకటి. దీనిని ఎల్ చాపో గుజ్మాన్, జంబాడా, మరొకరు సంయుక్తంగా స్థాపించి డ్రగ్స్‌ను విచ్చలవిడిగా అమ్మడం మొదలెట్టారు. వందల కోట్ల డ్రగ్స్ సామ్రాజ్యానికి అధిపతిగా కొనసాగిన జాక్విన్ అర్చివాల్డో గుజ్మాన్ లోయెరా (ఎల్‌చాపో)ను 2019లో మెక్సికో ప్రభుత్వం అరెస్ట్‌చేసి అమెరికాకు అప్పగించడంతో అక్కడే జీవితకాలకారాగార శిక్ష అనుభవిస్తున్నారు. దీంతో ఎల్ చాపో కుమారులు రంగంలోకి దిగి అక్రమ వ్యాపారాన్ని మరింత విస్తరించారు. అమెరికా సహా విదేశాలకు సరకు అక్రమ రవాణా మొత్తం జంబాడా కనుసన్నల్లో జరుగుతోంది. ప్రత్యర్థి డ్రగ్స్ ముఠా సభ్యులు చిక్కితే వారి తల నరకడం, చర్మం ఒలిచేయడం, శరీరాన్ని ముక్కలుగా నరకడం వంటి హేయమైన నేరాలకు పాల్పడటం అక్కడి ముఠాలకు మామూలు విషయం.



నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి కృష్ణ లంకకు చెందిన కోట వేణుగోపాల్ కుటుంబ సభ్యులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.



యూపీహెచ్‌సీ పరిశీలన

మచిలీపట్నంటౌన్:గిలకలదిండిలోని యుపీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జి.గీతా బాయి శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు.



పవిత్రోత్సవాలకు సర్వం సిద్ధం

మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు శనివారం నుంచి 29వ తేదీ వరకు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

జిల్లా కోర్టులో మెగా మెడికల్ క్యాంప్



చిలకలపూడి(మచిలీపట్నం): బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సంఘ భవనంలో శుక్రవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక క్యాంపు ప్రారంభించారు. అనంతరం ఆమె కంటి పరీక్షలు చేయించుకున్నారు. న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదులు, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. విజయవాడ కానూరులోని టాప్‌స్టార్స్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో బ్లడ్ షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలను డాక్టర్ తేజస్విని, డాక్టర్ అపూర్వ, డాక్టర్ కేఎం ప్రేమ్ నిర్వహించారు. మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో వైద్యులు నాగేశ్వరరావు, నారాయణరావు, శిరీష, శంకరరావు కంటి పరీక్షలు నిర్వహించారు. సాయిబాలాజీ డెంటల్ అడ్వాన్స్‌డ్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎ.దీప్తి దంత పరీక్షలు చేశారు. మెగా వైద్య శిబిరంలో 350 మంది న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయవాద గుమాస్తాలు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సిద్ధినేని సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఐటీఐ కౌన్సెలింగ్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో చేరాలనుకునే వారి కోసం శని, ఆదివారాలు మూడో విడత అడ్మిషన్ల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనక రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో చేరాలనుకునే వారు ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, వారికి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శనివారం మెరిట్ నంబరు 1 నుంచి 293 వరకు, ఆదివారం 294 నుంచి 566 మెరిట్ నంబరు వరకు కౌన్సెలింగ్ చేస్తామన్నారు. పదో తరగతి మార్కుల జాబితా, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఈడబ్ల్యుఎస్ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్స్ అన్ని ఒరిజినల్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 0866–2475575, 94906 39639, 77804 29468 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పశు పోషకులకు అందుబాటులో ఉండండి



విజయవాడస్పోర్ట్స్: పశు పోషకులకు నిత్యం అందుబాటులో ఉంటూ పశువుల ఆరోగ్యానికి రక్షణగా నిలవాలని పశు సంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముడావతు ఎం.నాయక్ జీవీకే 1962 అంబులెన్స్ కాల్ సెంటర్ నిర్వాహకులకు సూచించారు. విజయవాడ శివారు గొల్లపూడిలోని కాల్ సెంటర్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువుల ఆరోగ్యానికి రక్షణగా నిలిచేందుకు అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. జీవీకే సంస్థ ద్వారా రాష్ట్రంలో 340 అంబులెన్స్‌లను పశుపోషకులకు అందుబాటులో ఉన్నాయన్నారు. పశువులకు ఎద్దైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే జీవీకే అంబులెన్స్ అందుబాటులోకి వస్తుందన్నారు. అంబులెన్స్‌లను గ్రామాలకు దగ్గరలోనే ఉంచాలని, ఈ సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. ఏడీ డాక్టర్ సత్యకుమారి, నోడల్ అధికారి డాక్టర్ ప్రవుల్, జీవీకే సంస్థ నిర్వాహకుడు భాగేష్, మేనేజర్ ఖలీం ఉన్నారు.

29న పీఎఫ్‌పై అవగాహన సదస్సులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఈ నెల 29వ తేదీన భవిష్యనిధి పరిధిలోకి వచ్చే ఉద్యోగులు, పెన్షనుదారులు, ఇతర వాటాదార్లు, యజమానులు, లబ్ధిదారులతో నిధి ఆప్కే నికత్ కార్యక్రమం (ప్రావిడెంట్ ఫండ్ మీ ముంగిట) పేరుతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని భవిష్యనిధి కమిషనర్–2 శ్రీకాంత్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యనిధి పథకాలు, సేవలపై వాటాదార్లకు పూర్తి అవగాహన కల్పించేందుకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ నెల 29వ తేదీ సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివిధ సంస్థల యజమానులు, ఉద్యోగులు, పెన్షన్‌దారులు హాజరు కావాలని కోరారు. గాంధీనగర్‌లోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో, కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

ఇన్‌ఫెక్షన్ల సీజన్.. నిర్లక్ష్యమే రీజన్

వర్షాకాలంలో వైరస్‌లతో తస్మాత్ జాగ్రత్త



కంచికచర్ల మండలం కొత్తపేట గ్రామంలో పారిశుద్ధ్య మెరుగుదల చర్యలు చేపట్టిన సర్పంచ్ సునీత

- ఆహార విషయంలో జాగ్రత్తలు అవసరం
- అశ్రద్ధ చేస్తే కావొచ్చు ప్రాణాంతకం
- లివర్, కిడ్నీలపై చూపే అవకాశం
- అవగాహన ముఖ్యమంటున్న వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోడ్డుపై వెళ్తుంటే పక్కనే పానీపూరీ, ఛాట్ బండి కనిపిస్తే చాలు పిల్లలతో పాటు, పెద్దలు కూడా లొట్టలేసుకుంటూ తినేస్తుంటారు. కానీ వాటిలో వేల రకాల వైరస్‌లు ఉంటాయని, వ్యాధులకు కారణం అవుతాయని గ్రహించలేక పోతున్నారు. రోడ్డు పక్కన అశుభ్రమైన వాతావరణంలో విక్రయించే ఆహార పదార్థాలను ఎక్కువగా తినడం వల్ల పలు రకాల బ్యాక్టీరియా, వైరస్‌ల కారణంగా వైరల్ ఇన్‌ఫెక్షన్లకు గురవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో అలాంటి ఆహారం కారణంగా హెపటైటిస్, టైఫాయిడ్ వంటి వ్యాధులు ఎక్కువగా సోకుతున్నట్లు వివరిస్తున్నారు. ఈ వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

సోకుతున్న వ్యాధులివే..

కామెర్లు, పాంక్రియాస్ దెబ్బతినడం, కడుపునొప్పి, వాంతులు అవడం, క్రానిక్ డయేరియా, రక్త విరేచనాలు, మలబద్ధకం, లివర్‌లో ఇన్‌ఫెక్షన్లు సోకడం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారిని తరచూ చూస్తున్నామని వైద్యులు చెబుతున్నారు. ప్రాంకియాస్ ఇన్‌ఫెక్షన్ సోకిన వారిలో తీవ్రమైన కడుపు నొప్పి రావడం, వాంతులు, జ్వరం వస్తుంది. ఇలాంటి వారిలో 25 శాతం మందికి జెనిటిక్ కారణంగా కాగా, 75 శాతం మందిలో ఆహారపు అలవాట్లు, దెబ్బతగలడం, మందుల వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కారణంగా ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

ఎలర్జిక్ ఇన్‌ఫెక్షన్లు..

ఎలర్జిక్ ఇన్‌ఫెక్షన్లు బాగా పెరిగినట్లు వైద్యులు వివరిస్తున్నారు. ఇటీవల ఒక పాప శరీరం అంతా ఎలర్జీ రాగా, ఆమెకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆమె తాగుతున్న పాలు తన శరీరానికి సరిపడక మిల్క్ ప్రోటీన్ ఎలర్జీ వచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. ఇలా పిల్లలతో పాటు, పెద్ద వారికి సైతం చాలా మందికి కొన్ని ఆహార పదార్థాలు సరిపడవని, వాటిని గుర్తించక పోవడంతో ఎక్కువ మందిలో ఎలర్జిక్ ఇన్‌ఫెక్షన్లు సోకుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇలా నిత్యం పదుల సంఖ్యలో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

సహజ పదార్థాలు మేలు

కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వంటివి తీసుకోవడం ఎంతో మేలు. వాటిలో కావాల్సిన పోషకాలు లభించడంతో పాటు, వ్యాధులు సోకకుండా కాపాడవచ్చంటున్నారు. అంతేకాకుండా తినుబండారాలు సైతం ఇంట్లో తయారు చేయించినవే పిల్లలకు పెట్టాలి. బయట కొనుగోలు చేసిన పదార్థాలతో వేల రకాల వైరస్‌లు శరీరంలోకి వెళ్లి ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వాతావరణంలో మార్పులు, సీజన్‌లో మార్పులు వచ్చే సమయంలో ఎక్కువగా వైరల్ ఇన్‌ఫెక్షన్లు సోకుతుంటాయి. ఆ కారణంగా పిల్లలకు వైరల్ జ్వరాలు రావడం, ఇన్‌ఫెక్షన్లు సోకడం జరుగుతోంది. ఆహారం ద్వారా కూడా కొన్ని రకాల వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి ఇన్‌ఫెక్షన్లకు కారణంగా మారుతున్నాయి. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అశ్రద్ధ చేస్తే ఒక్కోసారి ప్రాణాంతకంగా కూడా మారవచ్చు.

– కొడాలి వెంకట ఉమాకాంత్, ఫిజీషియన్, విజయవాడ

బయట పదార్థాలు వద్దు



వర్షాకాలంలో కల్తీ ఆహారం విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రోడ్లపై ఉండే పానీపూరి, చాట్ వంటివి తినడం ప్రమాదకరం. కొన్ని రకాల వైరస్‌లు, బ్యాక్టీరియా వాటిలో ఉండి ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. తాజా ఆహార పదార్థాలు, కాచి చల్లార్చిన నీరు తాగటం మంచిది. బయట ఆహారం కంటే ఇంట్లో తయారు చేసినవి తీసుకోవడం ఉత్తమం.

– డాక్టర్ బీఎస్‌వీవీ రత్నగిరి గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, జీజీహెచ్

వైభవంగా ఆషాఢ మాసోత్సవాలు



దుర్గమ్మకు సారె తీసుకొచ్చిన భక్తులు

సారె సమర్పణకు తరలివచ్చిన భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి సారెను సమర్పించేందుకు శుక్రవారం తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బృందాలుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి సారెతో పాటు పూలు, పండ్లు, పలహారాలు, పసుపు, కుంకుమ సమర్పించారు. అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకుని సారెను చూపుతున్నారు. అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి పూజలు చేయించుకుంటున్నారు. అమ్మవారికి సమర్పించే చీరలను ప్రత్యేక కౌంటర్‌లో అందచేసి కంప్యూటర్ రశీదును పొందుతున్నారు.



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

కిటకిటలాడిన క్యూలైన్లు

అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసే భక్త బృందాలతో పాటు సాధారణ భక్తుల రద్దీతో ఆలయంలోని క్యూలైన్లు కిటకిటలాడాయి. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ.300 , రూ. 500 టికెట్లు కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.

మీరే మాకు స్ఫూర్తి...



పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలే లక్ష్యంగా క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి దేశ ఖ్యాతిని భారత క్రీడాకారులు ప్రపంచానికి చాటాలనే ఆకాంక్షతో ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు విజయవాడలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మీరే మాకు స్ఫూర్తి.. మీరే మాకు ఆదర్శం.. అనే నినాదాలతో క్రీడాకారులు ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం నుంచి ర్యాలీ ప్రారంభించారు. డీఎస్‌డీవో అజీజ్‌తో పాటు కోచ్‌లు రవి, ముంతాజ్, సంతోష్, సీతారామాంజనేయులు, శ్రీను, బాబురావు, సుధాకర్ ర్యాలీని పర్యవేక్షించారు. 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

– విజయవాడస్పోర్ట్స్

పరిశ్రమల ఏర్పాటుకు సత్వర అనుమతులు

డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ సృజన



డీఐఈపీసీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన చిత్రంలో జేసీ నిధి మీనా తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో సింగిల్ డెస్క్ విధానం ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన అనుమతుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సృజన అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం శుక్రవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, జిల్లా పరిశ్రమల అధికారి, మెంబర్ కన్వీనర్ ఎ.సుధాకర్, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు హాజరయ్యారు. 2023 డిసెంబర్ 31 నుంచి 2024 జూలై 25 మధ్యకాలంలో సింగిల్ డెస్క్ విధానం కింద అందిన దరఖాస్తుల పరిష్కారం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల మంజూరు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 225 దరఖాస్తులు అందాయని తెలిపారు. వీటిలో సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 205 దరఖాస్తులు ఆమోదం పొందాయని, 17 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. మిగిలిన వాటిని తిరస్కరించినట్లు పేర్కొన్నారు.

గడువులోగా పరిష్కరించాలి....

పరిశీలనలో ఉన్న దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఏపీఐఐసీ, ఏపీపీసీబీ, ఫ్యాక్టరీలు, అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు. ఐడీపీ (2015–20), ఐడీపీ (2020–23), బడుగు వికాసం కింద సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్ టారిఫ్ తదితర రాయితీల కింద మొత్తం 30 యూనిట్లకు గాను దాదాపు రూ. 1.14 కోట్ల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదం తెలిపింది. 2024, జూలై 6న జరిగిన స్క్రూటినీ వెరిఫికేషన్ కమిటీ (ఎస్‌వీసీ) సమావేశ నిర్ణయాలను తాజాగా కమిటీ ముందు ఉంచారు. సమావేశాలను ప్రతి నెలా నాలుగో శుక్రవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఫ్యాప్సియా ప్రెసిడెంట్ వి.మురళీకృష్ణ, మహిళా పారిశ్రామికవేత్తల అసోసియేషన్ ప్రతినిధి కనకదుర్గ, ఏపీఐఐసీ జెడ్ఎం కె.సీతారాం, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీటీసీ ఎం.పురేంద్ర, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

కలెక్టర్ డాక్టర్ జి.సృజన

విజయవాడస్పోర్ట్స్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన పటమటలోని సీహెచ్ఆర్‌కే స్టేడియంలో జరుగుతున్న బ్యాడ్మింటన్ పోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. విజయవాడకు చెందిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికలపై రాణించి నగరానికి క్రీడా రాజధానిగా గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. క్రీడల్లో రాణించిన వారికి సమాజంలో సముచిత స్థానం ఉంటుందని గుర్తు చేశారు. కృష్ణా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పరసా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి అండర్–11, 13, 15, 17, జూనియర్స్, సీనియర్స్ వయసు కేటగిరిలలో, సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు 460 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. మొదటి రోజు అండర్–11,13,15 కేటగిరిల్లో జట్లు క్వార్టర్స్‌కు చేరుకున్నాయన్నారు. ఈ పోటీలకు చీఫ్ రిఫరీగా తిరుమలశెట్టి కృష్ణప్రసాద్ (బాపట్ల) వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

ఉమ్మడి దేవాలయాల్లో అమ్మవార్లకు దుర్గమ్మ పట్టువస్త్రాలు

ఇంద్రకీలాద్రి: హైదరాబాద్‌లోని ఉమ్మడి దేవాలయాల్లో కొలువై ఉన్న అమ్మవార్లకు దుర్గమ్మ తరఫున ఆలయ అధికారులు శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ఉత్సవాలు నేపథ్యంలో అమ్మవార్లకు ఏటా దుర్గగుడి తరుపున పట్టువస్త్రాలు సమర్పిస్తారు. వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో ఈఈ రమాదేవి, ఏఈవో రమేష్‌బాబు తదితరులు ఉప్పుగూడలోని మహంకాళీ ఆలయం, లాల్ దర్వాజాలోని సింహవాహిని మహంకాళీ, గౌలిపురాలోని మహంకాళీ, సుల్తాన్‌షాహిలోని జగదాంబ, హరిబౌలిలోని శ్రీబేల ముత్యాలమ్మ, శ్రీబంగారు మైసమ్మ, అక్కన్న, మాదన్న, మిర్యాలమండలిలోని మహంకాళేశ్వర దేవాలయాల్లో అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.



ఉప్పుగూడలో అమ్మవారి ఆలయంలో దుర్గగుడి అధికారులు

ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు

ఆటోనగర్(విజయవాడతూర్పు):ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తక విక్రయ కార్యాలయ మేనేజరు ఏఎస్‌కే ఆంజనేయులు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు పంపిస్తున్నట్టు చెప్పారు. వారం రోజుల్లో వివిధ కాలేజీలకు పంపిణీ కార్యక్రమం పూర్తి అవుతుందన్నారు. కృష్ణాలో 25, ఎన్టీఆర్ జిల్లాలో 16 కళాశాలలకు పుస్తకాలు పంపిస్తున్నామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఉచిత ఇసుక విధానం అమలుకు చర్యలు

వీడియో కాన్ఫరెన్స్‌లో కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శుక్రవారం సాయంత్రం సచివాలయం నుంచి ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా ఉచిత ఇసుక విధానం అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉచిత ఇసుక అమలులో భాగంగా స్టాక్‌యార్డులలో అందుబాటులో ఉన్న ఇసుక వివరాలు, రవాణా చార్జీలు, సమస్యలు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా గనులు, రవాణా, భూగర్భ జల, ఎన్‌ఫోర్స్‌మెంట్, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గనులశాఖ ఇన్‌చార్జ్ ఏడీ కొండారెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎండీఎల్ సిద్దిఖ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి కీర్తి పతాక అల్లూరి

హజరత్తయ్య గుప్తాకు అల్లూరి జాతీయ సేవా భాస్కర పురస్కారం ప్రదానం



విజయవాడ కల్చరల్: తెలుగు వారి కీర్తి పతాక స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అని కృష్ణా జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ గద్దే శేషగిరి అన్నారు. ఏపీ అమరావతి సాంస్కృతిక సమితి సాంస్కృతికం, సినిమాలు, క్రీడలు సేవా సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి, న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తాకు అల్లూరి జాతీయ సేవా భాస్కర పురస్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గద్దే శేషగిరి అల్లూరి సేవలను వివరించారు. పురస్కార గ్రహీత వేముల హజరత్తయ్య గుప్తా గురించి మాట్లాడుతూ వాసవీ అంతర్జాతీయ అధ్యక్షుడిగా విశేష సేవలను అందించినట్లు తెలిపారు. వాసవీ జిల్లా గవర్నర్ కేవీఎల్ సతీష్, సంస్థ వ్యవస్థాపకుడు పైడిపాటి వెంకన్న, సభ్యుడు ప్రభల శ్రీనివాస్ పాల్గొన్నారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు చిత్ర గీతాలను ఆలపించారు.

జోరుగా ఇసుక దందా!

- తోట్లవల్లూరు మండలంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- రాత్రికి రాత్రే తరలిస్తున్న తెలుగుతమ్ముళ్లు

తోట్లవల్లూరు: మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. టీడీపీ అధికారంలోకి వచ్చి నెలన్నర రోజులు కూడా గడవకముందే తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో అక్రమ ఇసుక రవాణా జోరుగా జరుగుతోంది. అధికారులు, పోలీసుల ఉదాసీన వైఖరితో మూడు పువ్వులు ఆరుకాయలుగా ఇసుక రవాణా వర్ధిల్లుతోంది. వివరాల్లోకి వెళ్తే.. తోట్లవల్లూరు మండలంలో కృష్ణా కరకట్టను ఆనుకుని రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో ఇసుక రేవులు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమరవాణాకు అప్పటి పాలకులు ఎక్కడా అవకాశం ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగుతమ్ముళ్లు ఇసుక అక్రమ రవాణాకు తెరతీశారు.

చీకటి దందా..

కృష్ణానదికి వరదనీరు రావటంతో ఇసుకకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగినట్లయ్యింది. రాత్రి వేళల్లో ఇసుక అక్రమరవాణా ఎక్కువగా సాగుతోంది. క్వారీల నుంచి ఎడ్లబండ్లపై ఇసుకను గ్రామాల్లోకి తోలి నిల్వ చేయటం, దానిని ట్రాక్టర్ల ద్వారా బయటి ప్రాంతాలకు తరలించటం చేస్తున్నారు. రొయ్యూరు, వల్లూరుపాలెం, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, కళ్లంవారిపాలెం రేవుల నుంచి నేరుగా అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా రాత్రి వేళ ఇసుక రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉయ్యూరు, కంకిపాడు, చుట్టుపక్కల ప్రాంతాలకు తరలించి ట్రాక్టర్ ఇసుకను రూ. 3,500 నుంచి రూ. 5 వేల మధ్యలో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.



బొడ్డపాడు వద్ద ఇటీవల రెవెన్యూ సిబ్బంది తనిఖీల్లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

కన్నెత్తి చూడని అధికారులు..

కళ్లంవారిపాలెం, చాగంటిపాడు క్వారీల నుంచి గత మూడు నాలుగు రోజులుగా తెలుగుతమ్ముళ్లు ఇసుక అక్రమరవాణా పెద్ద ఎత్తున సాగిస్తున్నారు. చాగంటిపాడు ర్యాంపు నుంచి గురువారం రాత్రి 11 గంటల నుంచి ఏడు ట్రాక్టర్లు యథేచ్ఛగా ఇసుకను ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేశాయి. దీనిపై స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదని తెలిసింది. అధికారులు, పోలీసులు ఇప్పటికైనా స్పందించి మండల వ్యాప్తంగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని ప్రజాసంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటాం. ఈ విషయమై వీఆర్‌ఓలు, పోలీసులను అప్రమత్తం చేసి ఎక్కడా ఇసుక అక్రమంగా తరలిపోకుండా అవసరమైన చర్యలు చేపడతాం.

– ఎం. కుసుమకుమారి, తహసీల్దార్, తోట్లవల్లూరు

‘స్వాతంత్ర్య’ వేడుకకు స్టేడియాన్ని సిద్ధం చేయండి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వచ్చే నెల 15న నిర్వహించనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవానికి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియాన్ని సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేసి స్వాతంత్ర్య వేడుకలను విజయవంతం చేయాలన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ జి. సృజన, ఏపీఎస్పీ డీఐజీ బి. రాజకుమారి, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్రలతో స్టేడియాన్ని కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, గవర్నర్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు వేడుకలలో పాల్గొంటారన్నారు. ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, నగరపాలక సంస్థ, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో, ఫైర్, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను ప్రారంభించాలన్నారు. ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి స్టేడియంలో చేస్తున్న ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పోస్టింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో నిర్వహించిన వేడుకలలో ఎదురైన లోటుపాట్లను గుర్తించి అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓ బీహెచ్ భవానీ శంకర్, డీసీపీలు గౌతమ్ శాలి, ఏబీటీఎస్ ఉదయరాణి, కె. చక్రవర్తి పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

ఎన్టీఆర్ జిల్లా సైనిక సంక్షేమాధికారి కల్యాణ వీణ



మాజీ సైనికులను సత్కరించి జ్ఞాపికలు అందజేస్తున్న కల్యాణ వీణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కార్గిల్ యుద్ధంలో దేశం కోసం పోరాడి, అసువులుబాసిన వీర సైనికుల త్యాగాలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని, వారిని స్ఫూర్తిగా తీసుకొని దేశ రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని జిల్లా సైనిక సంక్షేమ అధికారి డాక్టర్ కె.కల్యాణ వీణ అన్నారు. శుక్రవారం జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో 25వ కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. అనంతరం కల్యాణవీణ మాట్లాడుతూ దొడ్డిదారిన భారత భూభాగాన్ని ఆక్రమించుకోవాలని ప్రయత్నించిన పాక్ సైనికులకు మన సైనికులు ''ఆపరేషన్ విజయ్'' పేరిట తమ ప్రతాపాన్ని చూపి, మన భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారన్నారు. ఆ సమయంలో అనేక మంది సైనికులు దేశం కోసం వీర మరణం పొందారన్నారు. కార్గిల్ విజయాన్ని పురస్కరించుకుని ఏటా జూలై 26వ తేదీన కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నామన్నారు. మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యుల సైనిక సంక్షేమ నిధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో సేవలందించిన మాజీ సైనికులు సుబేదార్ మేజర్, కె. రామకృష్ణారావు, నాయబ్ సుబేదార్లు జి. శివనాగేశ్వరరావు డి. శ్రీకృష్ణ ప్రసాద్, జూనియర్ వారెంట్ ఆఫీసర్ సీహెచ్ సత్యశ్రీనివాస్, హవల్దార్ జి.వెంకటేశ్వరరావు, కె. శ్రీధర్, సార్జెంట్ జి.ఎస్.వి.వి. ప్రసాద్, సిహెచ్ శివ పరమేశ్వరరావు నాయక్, ఉమామహేశ్వరరావు, ఆల్‌ఫ్రెడ్ వాసపోగులను ఘనంగా సత్కరించారు. మాజీ సైనికుల కుటుంబ సభ్యులు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యా? ఆత్మహత్యా?

- పంట పొలంలో శవమై కనిపించిన యువకుడు
- పోలీసులకు సమాచారమిచ్చిన వ్యవసాయ కూలీలు
- పని ఉందని ఇంటి నుంచి బయటకొచ్చి మృత్యువాత
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



మృతుడు కొమ్ము గాంధీ (ఫైల్)

కంకిపాడు: పని మీద బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువకుడు పంట పొలంలో శవమై కనిపించాడు. ఈ సంఘటన మండలంలోని కోలవెన్నులో చోటుచేసుకుంది. దీనిపై శుక్రవారం కంకిపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ వీ.శ్రీనివాసరావు, ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. ఉయ్యూరు మండలం సాయిపురం గ్రామానికి చెందిన కొమ్ము జయరాజుకు ముగ్గురు కుమారులు. ఆఖరివాడైన కొమ్ము గాంధీ (21) ఎనిమిదో తరగతి వరకూ విద్యనభ్యసించి తాపీ పని చేస్తున్నాడు. 20 రోజులు నుంచి పనులు లేకపోవటంతో కోలవెన్ను గ్రామంలోని తన చిన్నమ్మ సొంగ జ్యోత్స్న ఇంటికి వచ్చి ఇక్కడే పనులు చేసుకుంటున్నాడు. గురువారం రాత్రి పని నుంచి వచ్చిన తర్వాత పని ఉందని చెప్పి బయటకు వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం కోలవెన్ను–కుందేరు రోడ్డు మార్గంలోని వరి పొలంలో మృతదేహం ఉండటాన్ని కూలీలు గుర్తించి గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. జ్యోత్స్న కుటుంబ సభ్యులు కూడా ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా మృతుడు కొమ్ము గాంధీగా గుర్తించి సాయిపురంలోని కుటుంబ సభ్యులు, బంధువులకు సమాచారం ఇచ్చారు.

ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు..

విషయం తెలుసుకున్న కంకిపాడు పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఘటన జరిగిన పంట పొలానికి ఆనుకుని ఉన్న రోడ్డు మార్గం మార్జిన్‌లోనే గాంధీ వదిలిన బైక్, చెప్పులు ఉండటాన్ని గుర్తించారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ డి. సందీప్, అదనపు ఎస్ఐ తాతాచార్యులు, సిబ్బంది ఘటనాస్థలంలో వివరాలు సేకరించారు. క్లూస్ టీం బృందం ఘటనాస్థలానికి చేరుకుని బైక్, ఘటన పరిసరాల్లో ఆధారాల కోసం అన్వేషించారు. కోలవెన్ను, సాయిపురం వాసులను పోలీసులు ప్రాథమికంగా విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ డి.సందీప్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది హత్యా?, లేక ఆత్మహత్యా? అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సందీప్ తదితరులు



ఘటనాస్థలంలో మృతుడి బైక్

రేపు తైక్వాండో పోటీలు

విజయవాడస్పోర్ట్స్: తైక్వాండో అండర్–11, సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పోటీలను విజయవాడలోని ఆంధ్రా లయోల కాలేజీలో ఈ నెల 28వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా తైక్వాండో సంఘం కార్యదర్శి ఎం.అంకమ్మరావు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆ రోజు ఉదయం పోటీల ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. పోటీల అనంతరం ఆగస్టు 3, 4 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్లకు ఎంపిక చేస్తామన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం



కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ లెనిన్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. శుక్రవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ధర్నా కార్యక్రమం జరిగింది. విభజన హామీలు అమలు చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ మిగిల్చిందన్నారు. బడ్జెట్ వికసిత్ భారత్ కోసం కాదని, పేదలపై భారం మోపేందుకేనన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రకటించిన రూ. 15వేల కోట్లు గ్రాంట్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. కేంద్ర మంత్రులు మాటలు, ప్రచారం తప్ప నిధులు మంజూరు చేసింది లేదని విమర్శించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బీహార్ ప్రభుత్వం రూ. 58వేల కోట్లు గ్రాంట్ల రూపంలో సాధించిందని, ఇదే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంతో పోరాడి నిధులు సాధించాలన్నారు. సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, కార్యవర్గ సభ్యుడు కాశీనాథ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోయి సత్య బాబు, జిల్లా కమిటీ సభ్యుడు భూపతి రమణ రావు పాల్గొన్నారు.

కూచిపూడి నాట్య కళా పీఠంలో ప్రవేశాలపై సందిగ్ధత

కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో 2024–25 విద్యా సంవత్సరానికి కూచిపూడి నాట్యంలో ప్రవేశాలు ఉంటాయో.. లేదో తెలియక నాట్య విద్యార్థుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణలో ఉంది. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం పదేళ్ల పాటు ఉమ్మడి సేవల గడువు జూన్ 2వ తేదీతో ముగియటంతో విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్రం వరకే నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో ఆ విశ్వవిద్యాలయం పరిధిలోని కూచిపూడి, రాజమహేంద్రవరం, శ్రీశైలం కళాపీఠాల ప్రవేశాలపై సందిగ్ధత ఏర్పడింది. దీనిపై కూచిపూడిలో స్థానికంగా ఉన్న అధ్యాపకులకు కూడా సరైన సమాచారం లేదు. వీలైనంత త్వరగా నోటిఫికేషన్ ఇచ్చి.. అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం చేసి విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భర్తీ చేయగా మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి ఈ నెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టనున్నామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. విజయసారథి ఓ ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ ఆటోమొబైల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో సీట్లు ఖాళీలున్నాయని వివరించారు. పాలిసెట్–2024 పరీక్షకు హాజరైన వారితో పాటుగా, హాజరుకాని వారు కూడా ఈ స్పాట్ అడ్మిషన్లల్లో పాల్గొని సీటు పొందవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు పదో తరగతి మార్కుల జాబితా, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), 4 నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, కుల ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ ఒరిజినల్స్‌తో పాటుగా అన్నీ మూడు సెట్ల జిరాక్సులు, ఆరు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని వివరించారు. ఈ నెల 31వ తేదీ ఉదయం 9.30 నుంచి విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరిగే స్పాట్ అడ్మిషన్లకు నేరుగా హాజరు కావచ్చని పేర్కొన్నారు. సీటు పొందిన వారు కళాశాల వార్షిక ఫీజు రూ.4,700తో పాటుగా బీసీ, ఓసీలు రూ.1,100, ఎస్సీ, ఎస్టీలు రూ.350 కౌన్సెలింగ్ ఫీజును వెంటనే అక్కడే చెల్లించాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వారికి ప్రభుత్వ పరంగా ఎటువంటి స్కాలర్‌షిప్‌లు రావని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు

జి.కొండూరు: రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న లైంగిక దాడి ఘటనలతో ఆడపిల్లల తల్లిదండ్రులకు కంటి మీద కునుకులేకుండా పోతోంది. వరుస ఘటనలతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ముక్కు పచ్చలారని చిన్నారుల నుంచి ముసలి వయస్సు వరకు కామాంధుల చేతిలో బలవుతున్న తీరు విస్మయానికి గురి చేస్తోంది. అటువంటి ఘటనే ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండల పరిధి హెచ్. ముత్యాలంపాడు గ్రామంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఆరేళ్ల చిన్నారిపై ఓ వ్యక్తికి లైంగికదాడికి యత్నించడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు.

పూర్తి వివరాలు ఇవి..

హెచ్. ముత్యాలంపాడు గ్రామానికి చెందిన నానాది శ్రీనివాసరావు(49) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అయితే మద్యానికి బానిసైన శ్రీనివాసరావు ప్రవర్తన నచ్చని భార్య తన ఇద్దరు కుమారులను తీసుకొని ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ క్రమంలో శ్రీనివాసరావు ఈ నెల 24వ తేదీన మధ్యాహ్న సమయంలో తన ఇంటి వెనుక నివాసం ఉండే ఓ కుటుంబానికి చెందిన ఆరేళ్ల వయసున్న చిన్నారిని నేరేడు కాయలు ఆశ చూపి తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి ప్రయత్నించాడు. నిందితుడి చెర నుంచి తప్పించుకున్న చిన్నారి తన ఇంటికెళ్లింది. అయితే గురువారం సాయంత్రం సమయంలో తన ఇంటికి వెళ్తున్న శ్రీనివాసరావుని చూసిన ఆ చిన్నారి ఏడవడం ప్రారంభించింది. ఈ క్రమంలో తల్లిదండ్రులు చిన్నారిని బుజ్జగించి అడగడంతో జరిగిన విషయం తెలిపింది. దీనితో నిందితుడు శ్రీనివాసరావుకి దేహశుద్ధి చేసిన బాధిత కుటుంబ సభ్యులు జి.కొండూరు పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. నిందితుడు శ్రీనివాసరావుని అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విలేకరుల పేరుతో వసూళ్లు.. ముగ్గురు అరెస్ట్

తిరువూరు: తాము విలేకరులమని వాహనచోదకులను బెదిరిస్తూ రాత్రివేళలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను తిరువూరు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సెక్టార్–1 ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అంజనాపురానికి చెందిన వంగూరి చంద్రయ్య గురువారం రాత్రి బియ్యం బస్తాలను ఆటోలో తీసుకుని వెళ్తుండగా నలుగురు వ్యక్తులు తిరువూరు జైబావి సెంటర్లో అడ్డగించి డబ్బులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరువూరుకు చెందిన కొత్తపల్లి కార్తీక్, కొత్తపల్లి వెంకట్, నల్లగొర్ల జమలయ్యలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మరో నిందితుడు పాదిలి శ్రీనివాసరావును అరెస్టు చేయాల్సి ఉందన్నారు. వీరు రాత్రివేళ విలేకరులమని చెబుతూ పలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు కూడా ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్ఐ వివరించారు. నిందితులను తిరువూరు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు.

ఇంటి స్థలం పేరుతో రూ. 1.65లక్షలకు టోకరా

పెనమలూరు: జగనన్న కాలనీలో ఇంటి స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా అమ్మి.. ఆపై స్థలం కొన్న వారినే బెదిరించి, దూషించిన ఓ న్యూస్ చానల్(సాక్షి కాదు) విలేకరితో పాటు ఆమె తల్లిదండ్రులపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరుకు చెందిన మట్టా మహాలక్ష్మి, మట్టా బాబులకు వణుకూరు లేఅవుట్–2లో గత ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేసి, పత్రాలు ఇచ్చింది. అయితే అదే గ్రామానికి చెందిన పైలా విజయకు ఆ ఇంటి స్థలం అమ్ముతానని మట్టా మహాలక్ష్మి చెప్పటంతో గత ఏడాది రూ. 1.65 లక్షలు సొమ్ము విజయ ఇచ్చింది. ఇంటిపై వచ్చే ప్రభుత్వ రుణం చెరి సగం తీసుకోవాలని రూ. 100 స్టాంపుపై ఒప్పందం కూడా రాసుకున్నారు. అయితే రుణం కోసం దరఖాస్తు చేయాలని సొమ్ము ఇచ్చిన విజయ ఇల్లు అమ్మిన మహాలక్ష్మిని కోరింది. అయితే దానికి మహాలక్ష్మి, ఆమె భర్త బాబు స్పందించలేదు. ఈ విషయం మధ్యవర్తుల వద్ద పెట్టారు. దీంతో ఓ న్యూస్ చానెల్లో విలేకరిగా పనిచేసే మహాలక్ష్మి కుమార్తె మట్టా సాహిత్య తమకు స్థలం ఇవ్వాలని లేదని తెలిపింది. తీసుకున్న సొమ్ము రూ. 1.65 లక్షలు ఇప్పించే బాధ్యత తనదని సాహిత్య నమ్మించింది. అయితే ఆ తర్వాత వారు స్పందించకపోవటంతో విజయ తన సొమ్ము ఇవ్వాలని మహాలక్ష్మి, బాబు, సాహిత్యను అడిగింది. దీంతో వారు విజయను దూషించి బెదిరించారు. దీంతో జరిగిన మోసంపై బాధితురాలు విజయ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అభయాంజనేయుడి ఆలయానికి రూ. 2 లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానానికి రాజమహేంద్రవరానికి చెందిన వేళ్లపాలెం సాయి నిఖిల్‌రెడ్డి రూ. 2 లక్షల విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి కూచిపూడి శ్రీనివాస్‌కు ఆయన శుక్రవారం అందజేశారు. అనంతరం అభయాంజనేయ స్వామి వారికి నిఖిల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి శేషవస్త్రాలు, చిత్రపటాన్ని దాతకు బహుకరించారు.



దాత నిఖిల్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ అర్చకులు

ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌పై కేసు కొట్టివేత

గన్నవరం: ఏడాదిన్నర క్రితం గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌తో పాటు మరో 11 మందిపై నమోదైన కేసును శుక్రవారం కోర్టు కొట్టివేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. 2023 ఫిబ్రవరి 20న వైఎస్సార్ సీపీ, టీడీపీ నేతల మధ్య పరస్పర దాడుల నేపథ్యంలో గన్నవరం టీడీపీ ఆఫీస్ ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో పోలీసులు విధించిన ఆంక్షలను లెక్కచేయకుండా బోడే ప్రసాద్, మరో 11 మంది టీడీపీ నేతలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో పాటు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. అప్పటి ఎస్ఐ రమేష్ బాబు ఫిర్యాదు మేరకు వీరిపై కేసు నమోదు చేయడంతో పాటు జ్యూడిషీయల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

వ్యాధుల నుంచి కాపాడేందుకే ఫ్రైడే డ్రైడే

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రజలు దోమ కాటు వలన వచ్చే మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడకుండా వారిని కాపాడేందుకే ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం రాణిగారి తోటలో వీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ వీఎంసీ పరిధిలో ఉన్న 64 డివిజన్‌లలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ద్వారా ప్రజలకు మలేరియా, డెంగీ, చికున్ గున్యా జ్వరాల బారిన పడకుండా అవగాహన కల్పించడానికి వీఎంసీ విస్తృతంగా పనిచేస్తుందన్నారు. ప్రతి డివిజన్‌లో కార్పొరేషన్ సిబ్బంది ప్రజల ఇంటి వద్దకే వెళ్లి అక్కడ నిలువ ఉన్న నీటిని పరిశీలించి దోమల లార్వా పెరగకుండా అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా వారిని జ్వరాల బారిన పడకుండా చేస్తున్నారన్నారు. వర్షాకాలంలో పడుతున్న వర్షాల వలన ప్రజలకు తెలియకుండానే వారి పరిసరాల్లో నీరు నిలువ ఉండే అవకాశాలు ఉంటాయని వాటిని గుర్తించి, ఆ నీటి నిల్వ వలన జరిగే ప్రమాదాల గురించి వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ జనరల్ డాక్టర్ ఎ.మహేష్, అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, శివరామకృష్ణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ రామ కోటేశ్వరరావు, డాక్టర్ బాబు శ్రీనివాస్, 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రోడ్డు మీద వ్యర్థాలు పడేయడం వలన కలిగే సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అన్నారు. రాణిగారితోటలోని 17వ డివిజన్‌లో శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. పలు వీధుల్లో తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. స్థానికులు వారి ఇంటి ముందు ఉన్న మురుగునీటి సమస్యను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని, శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలను సిద్ధం చేసి తమ వద్దకు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిత్యం పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. అనంతరం కమ్యూనిటీ పబ్లిక్ టాయిలెట్స్ లోని మరుగుదొడ్ల పరిశుభ్రత, నీటి సరఫరాను పరిశీలించి ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని కేర్ టేకర్లను ఆదేశించారు. పలు చోట్ల సైడ్ డ్రైన్‌లలో పూడుకుపోయిన వ్యర్థాలను గమనించి సైడ్ డ్రైన్, మేజర్ అవుట్‌ఫాల్ డ్రైన్‌లలో పూడికలను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచాలని, ప్రజలు కూడా వీఎంసీ వ్యర్థ సేకరణ వాహనం వచ్చినప్పుడే వ్యర్థాలను వేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్-3 శివరామకృష్ణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్-3 డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-3 సామ్రాజ్యం, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ రజియ షబీన, 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, 17, 18 డివిజన్ల టీడీపీ నాయకులు రాయి రంగమ్మ, వేముల దుర్గారావు పాల్గొన్నారు.



17వ డివిజన్‌లో సైడ్ డ్రైన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

నగరాభివృద్ధికి నిరంతరం కృషి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



స్థాయీ సంఘం సమావేశం నిర్వహిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో శుక్రవారం మేయర్ ఆధ్వర్యంలో స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. మొత్తం 22 అంశాలు ఎజెండాలో ప్రతిపాదించగా వాటిలో ఒక అంశాన్ని ధ్రువీకరణ చేశారు. మరొక అంశాన్ని రికార్డు, ఇంకోటి ర్యాటిఫై, ఒక అంశాన్ని వాయిదా వేయగా 17 అంశాలను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలోని మొదటి అంతస్తులో హాలును గ్లోబల్ చెస్ అకాడమీకి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్‌కు ఏడాది డిసెంబర్ 24వ తేదీ వరకు కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనపై కమిటీ సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.

- విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని కాళేశ్వరరావు మార్కెట్ పార్కింగ్ సెల్లార్, గద్దబొమ్మ, వస్త్రలత వెనుక క్యాంటీన్ రోడ్డు పార్కింగ్‌కు రూ. 44.50 లక్షలకు టెండరు ఖరారు, వన్‌టౌన్ గాంధీపార్కు ఎదురుగా, ఎస్‌బీఐ వెనుకవైపు పార్కింగ్ ప్రదేశం నాలుగు చక్రాల వాహనాలు పార్కింగ్ రూ. 44.20 లక్షలకు టెండరు ఖరారుపై సభ్యులు ఆమోదం తెలిపారు.
- నగర పాలక సంస్థ పరిధిలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో గ్రీనరీ పెంపొందించేందుకు ముగ్గురు హార్టీకల్చర్ అధికారులను కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించుకున్నారు. ఒక్కొక్కరికీ రూ.34 వేలు వేతనం చొప్పున ముగ్గురికి ఏడాదికి రూ.12.29 లక్షలు కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి చెల్లించాలని వచ్చిన ప్రతిపాదనపై కమిటీ సభ్యులు ఒక్కరికి మాత్రమే చెల్లించేందుకు ఆమోదం తెలిపారు.
- విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని సర్కిల్-3 డివిజన్లలో సేకరించిన చెత్త బరువు చూసిన మహావీర్ వే బ్రిడ్జికి చెల్లించాల్సిన రూ. 28.80 లక్షలు కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి చెల్లించాలని వచ్చిన ప్రతిపాదనను వాయిదా వేశారు.

నాయకత్వం ఇతరులకు ప్రేరణ కల్గించాలి

రిటైర్డ్ మేజర్ జనరల్ రమేష్‌బాబు



మాట్లాడుతున్న రిటైర్డ్ మేజర్ జనరల్ రమేష్‌బాబు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నాయకత్వం అనేది టైటిల్ లేదా హోదా కాదని, ఇతరులకు ప్రేరణ కల్గించేలా, ఇతరులకు ప్రోత్సాహాన్ని అందించేలా ఉండాలని రిటైర్డ్ మేజర్ జనరల్, విశిష్ట సేవా పతక గ్రహీత ఎం.రమేష్‌బాబు చెప్పారు. స్థానిక వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి కొత్తగా ఎన్నికైన విద్యార్థుల మండలి సభ్యులకు బాధ్యతలను అప్పగించే కార్యక్రమం (స్కూల్ హెడ్ బాయ్ అండ్ గరల్స్ ఇన్వెస్టిచర్ ప్రోగ్రామ్) స్కూల్ ఆవరణలో శుక్రవారం జరిగింది. రమేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కృషి, పట్టుదల, నిజాయతీ, చిత్త శుద్ధి, నిష్పాక్షికత, శ్రద్ధ వంటి లక్షణాలను విద్యార్థి స్థాయి నుంచే అలవరచుకోవాలని ఆయన చెప్పారు. విద్యార్థులకు అప్పగించిన బాధ్యతలను నిస్వార్థంగా నిర్వర్తించాలన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. స్కూల్ హెడ్ బాయ్‌గా టి.తనూజ్ మాన్విక్, హెడ్ గర్ల్‌గా ఎం.సంహితతో పాటుగా పాఠశాల ఆధ్వర్యంలోని వివిధ క్లబ్‌ల ఇన్‌చార్జ్‌లకు, క్లాస్ లీడర్, ఎథిక్స్ లీడర్స్‌గా ఎన్నికైన వారికి రమేష్‌బాబు, స్కూల్ కన్వీనర్ సూరెడ్డి విష్ణు బ్యాడ్జీలను అందజేశారు. పాఠశాల విద్యార్థులతో పాటుగా ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనాథ మానసిక రోగుల కోసం అంబులెన్స్

మనోబంధు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు



అంబులెన్స్ ప్రారంభిస్తున్న డాక్టర్ ఇండ్ల విశాల్, చిత్రంలో డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అనాథలుగా వీధుల్లో తిరిగే మానసిక రోగులకు మూడేళ్లుగా సేవలు అందిస్తున్న మనోబంధు ఫౌండేషన్ కొత్త అంబులెన్స్‌ను ప్రారంభించడం చాలా సంతోషకరమని ఇండ్లాస్ శాంతివన్ రీహాబిలేషన్ డైరెక్టర్ డాక్టర్ విశాల్ ఇండ్ల అన్నారు. ఈ నూతన అంబులెన్స్‌ను శుక్రవారం సూర్యారావుపేటలోని ఇండ్లాస్ హాస్పిటల్ వద్ద డాక్టర్ విశాల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 6 కోట్ల మంది పలు రకాల మానసిక జబ్బులతో బాధపడుతున్నట్లు తెలిపారు. వారిలో 10 లక్షల మందికి పైగా నిరాశ్రయులుగా వీధుల్లో, మురికి నీళ్లు తాగుతూ, చెత్త నుంచి ఆహారాన్ని తింటూ, అత్యంత దయనీయ జీవితం గడుపుతున్నారన్నారు. అలాంటి వారిని చేరదీసి షెల్టర్ హోమ్స్‌లో ఉంచి, తర్వాత వారిని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స తర్వాత వారి స్వస్థలాలకు చేర్పించే బాధ్యతను మనోబంధు సంస్థ తీసుకోవడం చాలా అభినందనీయమని డాక్టర్ విశాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మనోబంధు సంస్థ మేనేజింగ్ ట్రస్టీలు భూపతిరాజు రామకృష్ణంరాజు, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డితో పాటు మానసిక వైద్యుడు శ్రీపతి సంతోష్‌గౌడ్, డాక్టర్ ఊహా మానస, డాక్టర్ ఇండ్ల స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు పలుచోట్ల అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్క్యూబ్రిడ్జి ఉపకేంద్రం, 11 కేవీ పోలీస్ కాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సత్యన్నారాయణనగర్, పోలీస్‌కాలనీ, హెడ్ పోస్టాఫీస్ కార్యాలయం, ఎస్‌బీఐ బాలాజీనగర్, ఉదయగిరి గంగయ్యరోడ్డు, కోర వారి వీధి, కొత్త ఆంజనేయస్వామిగుడితో పాటు జీఎల్‌రావు ఫ్లాట్స్, మహిత పబ్లిక్ స్కూలు, బాలాజీనగర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలియజేశారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

పటమట పరిధిలో...

పటమట పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా అయ్యప్పనగర్, వీఎస్ఎన్ స్ట్రీట్, శాంతిరోడ్డు, అలాగే ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కృష్ణానగర్, పాతచెక్‌పోస్టు ప్రాంతం, చౌదరిపేట, అశోక్‌నగర్, పండరీపురం, ఫరూఖ్‌నగర్, కరివేపాకు రోడ్డు, పప్పులమిల్లురోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

పేకాట ఆడుతున్న 25 మంది అరెస్టు

రూ.4.11 లక్షలు స్వాధీనం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జింఖానా క్లబ్‌పై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న 25 మందిని అరెస్టు చేశారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు గురువారం రాత్రి ఎస్ఎన్‌పురం సీఐ వెంకట నారాయణ తన సిబ్బందితో కలసి జింఖానా క్లబ్‌పై దాడి చేశారు. అందులో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి వారి నుంచి రూ.4.11 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన మహిళ పై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగర పాలక సంస్థలో శానిటేషన్ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన మహిళపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... కరోనా కాలంలో పాయకాపురం వడ్డెర కాలనీకి చెందిన వల్లెపు ధనలక్ష్మికి సుందరయ్యనగర్‌కు చెందిన కట్టా శశికుమారి పరిచయమైంది. వీఎంసీలో శానిటేషన్ వర్కరుగా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి శశికుమారి ధనలక్ష్మి నుంచి మూడు లక్షల రూపాయలు తీసుకుంది. అప్పటి నుంచి ఉద్యోగం ఇప్పించలేదని, డబ్బులు తిరిగి ఇమ్మంటే ఇవ్వలేదని ధనలక్ష్మి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రాణం తీసిన జాతీయ రహదారిపై గొయ్యి

రామవరప్పాడు: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన గురువారం ఎనికేపాడులో జరిగింది. జాతీయ రహదారిపై ఉన్న పెద్ద గొయ్యి ఓ మహిళ ప్రాణం తీసింది. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ చుట్టుగుంటకు చెందిన సయ్యద్ అన్వర్ జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. గురువారం మధ్యాహ్నం ఎనికేపాడులోని బీవీ రావు కల్యాణ మండపంలో జరిగే శుభకార్యానికి ద్విచక్రవాహనంపై అన్వర్, తన భార్య ఫాతిమా, కుమార్తె అఫ్రా పరహత్‌తో కలిసి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఎనికేపాడు డీమార్ట్ సమీపంలోకి వచ్చేసరికి జాతీయ రహదారిపై ఉన్న పెద్ద గొయ్యిలో వాహన చక్రం దిగబడింది. ఈ కుదుపులో ఫాతిమా అదుపు తప్పి జాతీయ రహదారిపై పడింది. అదే సమయంలో వెనుక విజయవాడ నుంచి గన్నవరం వస్తున్న ఆర్టీసీ బస్సు ఫాతిమాపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలవ్వడంతో దగ్గరలోని ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఈ ఘటనపై పటమట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఒలింపిక్స్ ఆర్చరీ పోటీల వీక్షణకు ఎల్ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు

విజయవాడస్పోర్ట్స్: పారిస్‌లో ఒలింపిక్స్ ఆర్చరీ పోటీలను ప్రజలు వీక్షించేందుకు విజయవాడ మహానాడురోడ్డులోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ వద్ద ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు అకాడమీ అధ్యక్షుడు చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. ఈ అకాడమీలో శిక్షణ పొందిన బొమ్మదేవర ధీరజ్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడన్నారు. ఈ నెల 25వ తేదీన జరిగిన ర్యాంకింగ్ రౌండ్‌లో అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాడన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో సాయంత్రం 5.45 గంటలకు ప్రారంభమయ్యే ఆర్చరీ పోటీలను ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వీక్షించాలని ప్రజలను ఈ సందర్భంగా ఆయన కోరారు.

నూతన సాంకేతిక, నైపుణ్యాలను అలవర్చుకోవాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రస్తుత సమాజానికి అనుగుణంగా నూతన నైపుణ్యాలను, సాంకేతికతను అధ్యాపకులు అలవర్చుకుని విద్యాబోధన సాగించాలని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన సూచించారు. కళాశాల, ఐసీటీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జరిగింది. ఈ ప్రోగ్రాం ఐదు రోజుల పాటు కొనసాగుతుందని, కార్యక్రమంలో ట్రైనర్‌లు వివరించిన నూతన సాంకేతిక అంశాలను పూర్తిగా అవగతం చేసుకోవాలని అధ్యాపకులకు సూచించారు.

విషపు రాతలు రాస్తున్న మీడియా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పేరం సత్యం

కృష్ణలంక(విజయవాడతూర్పు): దేవదాయశాఖ జాయింట్ కమిషనర్, గిరిజన మహిళ శాంతిపై విషపు రాతలు రాస్తూ స్త్రీ జాతి ఆత్మ గౌరవానికి భంగం కలిగిస్తున్న మీడియా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ పేరం సత్యం డిమాండ్ చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా రచయిత, ఉద్యమాల ఉపాధ్యాయుడు ఉ.సా(ఉప్పుమావులూరి సాంబశివరావు) 4వ వర్ధంతి సభ, ఉ.సా స్మారక సాహిత్య పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. తొలుత ఉ.సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉసా జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం జరిగిన సభలో పేరం సత్యం మాట్లాడుతూ శాంతిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆమె మొదటి భర్త మదన్‌మోహన్ స్త్రీ జాతిని అవమానపరుస్తున్నారని తెలిపారు. శాంతితో ప్రస్తుతం భర్తగా ఉన్న సుభాష్‌రెడ్డి ఎక్కడ ఉన్నాడో గుర్తించకుండా అతనిని ప్రశ్నించకుండా మహాన్యూస్, టీవీ 5, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ మీడియా సంస్థలు రాజకీయ కక్ష ధోరణితోనే అసత్య ప్రచారాలు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాయని మండిపడ్డారు. పై మీడియా సంస్థలు తమ వైఖరి మార్చుకోకపోతే గిరిజన జాతుల ఆగ్రహానికి, ప్రజా తిరుగుబాటుకు గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ధర్మ, బౌద్ధ రచయిత బొర్రా గోవర్దన్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, మహిళా సంఘాల నాయకులు రమాదేవి, పద్మ, వివిధ సంఘాల నాయకులు రాజునాయక్, రామచంద్రయ్య, సుధాకర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు



వైద్య శిబిరంలో రోగికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఎంవీ మధుసూదనరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బెంజిసర్కిల్ సమీపంలోనీ ఈశాఫ్(ఈఎస్ఏఎఫ్) బ్యాంకు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో సీతారామపురంలోని దీపక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన వైద్యులు, సిబ్బంది పాల్గొని బ్యాంకు సిబ్బందితో పాటు, కస్టమర్‌లు పలువురికి వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ ముక్తినేని వెంకట మధుసూదనరావుతో పాటు పలువురు సిబ్బంది బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలితో అనేక వ్యాధులు సోకుతున్నాయని, తరచూ స్క్రీనింగ్ చేసుకోవడం ద్వారా తొలిదశలోనే గుర్తించే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం మధుమేహం, రక్తపోటు, హైపోథైరాయిడ్ ఎక్కువగా ఉన్నాయన్నారు. ఆస్పత్రిలో చికిత్స అవసరమైన వారికి, ఎక్స్‌రే, సీటీ, ఎంఆర్‌ఐలు అవసరమైన వారికి రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్ తదితరులు నాల్గొన్నారు.

సర్వమత సారమే విశ్వవేద మహాగ్రంథం



ఆవిష్కరణ సభలో మండలి బుద్ధప్రసాద్, గోళ్ళ నారాయణరావు, రచయిత శివాజీ, రవీంద్రనాథ్

విజయవాడ కల్చరల్: సర్వమత సారమే విశ్వవేద మహాగ్రంథమని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు, అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం తాడికొండ శివాజీ రచించిన విశ్వవేద మహాగ్రంథం ఆవిష్కరణ సభ జరిగింది. గ్రంథాన్ని ఆవిష్కరించిన బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మతం సమాజ హితం కోరాలని సూచించారు. భారతదేశంలో అనాది నుంచి వస్తున్న మత గ్రంథాలు వాటిలో కామన్‌గా ఉన్న అంశాలను క్రోడీకరించి గ్రంథం రచించినట్లు తెలిపారు. పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ సత్యయుగ ధర్మాన్ని బట్టి సత్యాన్ని తెలియజేయడమే ఈ గ్రంథం యొక్క ముఖ్య ఉద్దేశమని వివరించారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏఐజీ ఎం.రవీంద్రనాథ్ మాట్లాడుతూ చారిత్రక అంశాలను వెలికి తీసి భావి తరాలకు అందించాల్సిన అవసరముందన్నారు. అధ్యాపకుడు డాక్టర్ ఐనాల మల్లేశ్వరరావు గ్రంథ విషయాలను తెలియజేశారు. ఆవిష్కరణ కార్యక్రమంలో గ్రంథ రచయిత తాడికొండ శివాజీ, వివిధ రంగాలకు చెందిన రూఫస్ కొలికపూడి, మహ్మమద్ యూసఫ్, బొంతపురి రవిప్రకాష్, సీనియర్ జర్నలిస్ట్ అన్నవరపు బ్రహ్మయ్య ప్రసంగించారు. నిర్వాహకులు రచయితలను, అతిథులను ఆత్మీయంగా సత్కరించారు.

'వీధి కుక్కలను చంపాలనడం చట్ట వ్యతిరేకం'

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రాణాలు తీస్తున్న వీధి కుక్కలను చంపేయమంటూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్‌తోపాటు కొన్ని అసోసియేషన్లు ప్రకటనలు చేయటం చట్ట వ్యతిరేకమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జీవ కారుణ్యం అండ్ రీసెర్చ్(భవానీపురం) చైర్మన్ మురాల వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారత రాజ్యాంగం 51ఏ (జీ) ప్రకారం ప్రతి ప్రాణికి జీవించే హక్కు ఉందని, ఈ సమాజమే వాటిని రక్షించాలని ఉన్నత న్యాయస్థానం సుప్రీం కోర్ట్, హైకోర్ట్ ఇచ్చిన ఉత్తర్వులను గుర్తు చేశారు. కొన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయటంతో పాటు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయిస్తున్నాయని, తద్వారా కొన్నేళ్లకు కుక్క జాతి తగ్గిపోతుందన్నారు. అయితే కొన్ని చోట్ల జరిగిన దుర్ఘటనల కారణంగా ఆ జాతిని నాశనం చేయమనటం సరికాదని చెప్పారు.

క్లుప్తంగా

వేద సంరక్షణకు కృషి చేయాలి



విజయవాడ కల్చరల్: వేద సంరక్షణకు కృషి చేయాలని ఆధ్యాత్మికవేత్త విశ్వనాథ గోపాల కృష్ణ శాస్త్రి అన్నారు. శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అభినవ శంకర విజయం వివరణాత్మక భాషణం ఆధ్మాత్మిక ప్రసంగం శుక్రవారం ముగిసింది. గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ నృసింహభారతి స్వామి ధర్మ స్థాపనలో తమదైన కృషితో జాతిని ప్రభావితం చేసిన మహనీయుడన్నారు. ధర్మ సంరక్షణకోసం శారదా పీఠం నిరంతరం కృషి చేస్తునట్లు తెలిపారు. నృసింహభారతి మహాస్వామి 33వ పీఠాధిపతిగా శృంగేరీ పీఠాధిపత్యం స్వీకరించినట్లు తెలిపారు. ఆయన నిరంతరం తపోధనుడని అన్నారు. వేదాలు పురాణాలు, ఉపనిషత్తులు భారత దేశ సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నట్లు తెలిపారు. ముగింపు శివరామ కృష్ణక్షేత్ర ధర్మాధికారి నిర్వహించారు.

బ్యూటీకేర్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళల్లో నైపుణ్యాలు పెంచి వారికి ఉపాధి చూపేందుకు ఆగస్టు 1వ తేదీ నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీకేర్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలు ఈ శిక్షణలో పాల్గొనడానికి అర్హులన్నారు. ఆసక్తిగల వారు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్ కార్డుతో ఆగస్టు 1వ తేదీలోగా విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం 0866-2470420 నంబరులో సంప్రదించాల్సిదిగా ఆమె కోరారు.

వైఎస్సార్‌సీపీ నాలుగో డివిజన్ కమిటీ ఎంపిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గంలోని నాలుగో డివిజన్‌కు వైఎస్సార్‌సీపీ నూతన కమిటీ నియమించినట్లు ఆ పార్టీ తూర్పు సమన్వయకర్త దేవినేని అవినాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ ప్రెసిడెంట్‌గా అబ్దుల్ రషీద్, వైస్ ప్రెసిడెంట్‌గా మాధవశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దేవినేని సాంబశివరావు, సెక్రటరీగా ఎస్.శంకరరావు, జాయింట్ సెక్రటరీగా బి.సునీత, కోశాధికారిగా జి.జయరాజులను నియమించినట్లు తెలిపారు. సభ్యులుగా బి.సామ్రాజ్యం, కె.రమణ, ఎండీ షౌకత్, బి.తరుణ్, వి.మల్లిఖార్జునరావు, జి.కృష్ణారెడ్డిలు నియమించినట్లు పేర్కొన్నారు.

సత్యనారాయణపురంలో బిజినెస్ ఎక్స్‌పో ప్రారంభం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బెజవాడ బిజినెస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని నాడార్స్ ఫంక్షన్ హాలులో శుక్రవారం బిజినెస్ ఎక్స్‌పో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి ప్రొఫెసర్ డాక్టర్ విస్సాప్రగడ శ్రీనివాస్ ఎక్స్‌పో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు సంతృప్తికరంగా నాణ్యమైన సేవలు అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ ప్రదర్శనలో గృహోపకరణాలు, పిండి వంటలు, పచ్చళ్లు, జ్యూట్ బ్యాగులు, వస్త్రాలు, పూజ సామగ్రి, హెర్బల్ ఉత్పత్తులు తదితర వస్తువుల ప్రదర్శన, అమ్మకం వినియోగదారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. వీటితో పాటు మూడు రోజుల పాటు జరిగే ప్రదర్శనలో ప్రముఖ వైద్యులతో ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సప్తగిరి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీదేవి, బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణమూరి, సంస్థ కార్యదర్శి గంగరాజు సూర్యకుమారి, శిష్టా కుసుమ లావణ్య, సువాణం కళ్యాణ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత అధికారుల సోదాలు



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలోని పలు తినుబండారాల తయారీ, విక్రయ దుకాణాలను ఫుడ్‌సేఫ్టీ కంట్రోలర్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌చౌదరి తన బృందంతో ఈ సోదాలు నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. పచ్చళ్ల తయారీ, స్వీట్ షాపులు, కారం పొడి దుకాణాలను తనిఖీలు చేసి పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ పదార్థాల్లో నాణ్యత లోపించినట్లు గుర్తించి, దుకాణాలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, దీనిపైనా కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

అత్యంత పారదర్శకంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా ఇసుక టెండర్లు పిలిచాం. ఏటా ప్రభుత్వ ఖజానాకు రూ.765 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.3,825 కోట్ల ఆదాయం వచ్చింది. అంతకు ముందు చంద్రబాబు హయాంలో ఈ ఆదాయం అంతా ఎవరి జేబుల్లోకి వెళ్లింది? ఎవరెవరు ఎంత పంచుకున్నారు? ఇప్పుడు ఇసుక ఉచితంగా ఇస్తామని చెప్పి, మా ప్రభుత్వం కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. 40 లక్షల టన్నుల ఇసుకను దోచేశారు. ఇది కుంభకోణం కాదా? – వైఎస్ జగన్

వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీ కార్యకర్త జిలానీ నడిరోడ్డుపై నరికి పాశవికంగా చంపాడు. రషీద్ కుటుంబాన్ని నేను పరామర్శించేందుకు వెళ్లడం, ఆ వెంటనే ఢిల్లీలో మేం ధర్నాకు వెళుతుండటంతో దానిని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడ్డారు. మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగితే డీజీపీ, సీఐడీ ఏడీజీని హెలికాప్టర్‌లో అక్కడకు పంపారు.





ఉచితం.. ఎక్కడ?

ఇసుక ఆదాయం ఎవరి జేబుల్లోకి వెళ్తోంది బాబూ?

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపాటు
- రాష్ట్రానికి పైసా ఆదాయం రావడం లేదు
- కనీసం ప్రజలకైనా మేలు జరుగుతుందా అంటే అదీ లేదు
- ముందు చూపుతో స్టాక్ యార్డుల్లో 80 లక్షల టన్నులు ఉంచాం
- అధికారంలోకి రాగానే 40 లక్షల టన్నులు మాయం చేశారు
- 2019లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా పారదర్శకంగా టెండర్లు
- ఏటా రూ.765 కోట్ల చొప్పున ఐదేళ్లలో ఖజానాకు రూ.3,825 కోట్ల ఆదాయం

సాక్షి, అమరావతి: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక విధానాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేశాం. ఫలితంగా ఏటా ప్రభుత్వ ఖజానాకు రూ.765 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.3,825 కోట్ల ఆదాయం వచ్చింది. అంతకు ముందు చంద్రబాబు హయాంలో ఈ ఆదాయం అంతా ఎవరి జేబుల్లోకి వెళ్లింది? ఎవరెవరు ఎంత పంచుకున్నారో చెప్పగలరా?' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వచ్చేలా, సామాన్య ప్రజలకు తక్కువ ధరకు ఇసుకను అందుబాటులో ఉండేలా చూస్తే అవినీతి జరిగిపోయిందంటూ లేనిపోని దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక ఇస్తామని నమ్మబలికి, తీరా ఇప్పుడు ఉచిత ఇసుక మచ్చుకైనా కన్పించని విధంగా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇసుక పాలసీపై చంద్రబాబు విడుదల చేసిన వైట్ పేపర్‌పై జగన్ ఫ్యాక్ట్ పేపర్ ద్వారా వాస్తవాలను ప్రజల ముందుంచారు. ఈ సందర్భంగా జగన్ ఏమన్నారంటే..

ఏ రేటుకు అమ్మాలో పత్రికల్లో ప్రచారం చేసే వాళ్లం

ఉచిత ఇసుక పేరిట జరిగిన దోపిడీకీ అడ్డుకట్ట వేస్తూ 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అత్యంత పారదర్శకంగా ఇసుక పాలసీని తీసుకొచ్చాం. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కాకుండా, కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా టెండర్లు పిలిచాం. ఈ టెండర్లలో ఎవరైనా పాల్గొనవచ్చు. చంద్రబాబు, రామోజీ మనుషులే కాదు.. ఎవరైనా నేరుగా పాల్గొనే అవకాశం ఉంది. 2 కోట్ల మెట్రిక్ టన్నుల మినిమమ్ గ్యారంటీ పెడుతూ ఏటా రూ.765 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కట్టేలా చర్యలు తీసుకున్నాం. ఫలితంగా ఐదేళ్లలో రూ.3,825 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. పైగా ప్రతి టన్నుకు రూ.375 చొప్పున ముందుగా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించిన తర్వాతే ఇసుక తవ్వే కార్యక్రమం చేపట్టాం. ఇలా తవ్విన ఇసుకను రీజనబుల్ ట్రాన్స్‌పోర్టు చార్జీతో కలిపి ఏ నియోజకవర్గంలో ఏ రేటుకు విక్రయించాలో ప్రజలందరికీ తెలిసేలా ప్రతి ఆదివారం పత్రికల ద్వారా ప్రచారం చేశాం. నిర్దేశించిన ధరకు ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసినా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని టోల్ ఫ్రీ నంబర్ ఇచ్చాం. తప్పు చేస్తే 2 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల వరకు జరిమానా అంటూ ప్రతి వారం పత్రికల్లో ప్రచారం చేశాం.

40 లక్షల టన్నుల ఇసుక కాజేశారు

వర్షా కాలంలో ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ముందు చూపుతో రాష్ట్ర వ్యాప్తంగా 80 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ యార్డుల్లో నిల్వ చేస్తే ఎన్నికల్లో ఆ యార్డుల వద్దకు చంద్రబాబు, ఆయన కొడుకు లోకేశ్ వెళ్లి సెల్ఫీలు దిగారు. ఇసుకగుట్టలు చూపించి లేనిపోని దుష్ప్రచారం చేశారు. ఇప్పుడా ఇసుక గుట్టలు, కొండలు ఏమైపోయాయి? అధికారంలోకి వచ్చీ రాగానే ఏకంగా 40 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను టీడీపీ ఎమ్మెల్యేలు, చంద్రబాబు మనుషులు ఎడాపెడా అమ్మేసుకున్నారు. వాళ్లపై యాక్షన్ తీసుకునే ధైర్యం చంద్రబాబుకు ఉందా? ఈ రోజు ఉచిత ఇసుక అని చెప్పిన చంద్రబాబు.. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇచ్చిన రేటు కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. వైఎస్సార్‌సీపీ హయాంలో టన్నుకు రూ.375 చొప్పున ఏటా రూ.765 కోట్లు రాష్ట్ర ఖజానాకు ఆదాయం వస్తే నేడు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పరిస్థితి లేదు. అలాగని ఉచిత ఇసుక అమలవుతుందా.. అంటే అదీ లేదు. ఎడాపెడా దోచుకుంటున్నారు. ఇసుక రేట్లు చూస్తుంటే వైఎస్సార్‌సీపీ హయాంలోనే మేలు.. అప్పుడే రేట్లు తక్కువగా ఉన్నాయని ప్రజలు బాహాటంగానే చెబుతున్నారు. ఎక్కడా స్టాక్ లేదు. దోచేయడమే పనిగా పెట్టుకున్నారు. కళ్లెదుట దోపిడీ కనిపిస్తుంటే వేరొకరిపై వేలెత్తి చూపిస్తున్నారు.

మత్తు మాటలవి!

మద్యం అమ్మకాల పరిమాణం తగ్గి.. ప్రభుత్వానికి ఆదాయం పెరిగితే కుంభకోణమా?

బాగా మందు తాగిన వ్యక్తి కూడా చంద్రబాబులా అబద్ధాలు ఆడడు

మద్యంపై దుష్ప్రచారంపై కడిగిపడేసిన మాజీ సీఎం వైఎస్ జగన్


- ప్రస్తుతం చలామణిలో ఉన్న బ్రాండ్‌లకు అనుమతులు ఇచ్చింది బాబే
- రాష్ట్రంలో 20 డిస్టిలరీలుంటే అందులో 14కు 2014-19 మధ్య అనుమతులు
- మిగిలినవి అంతకు ముందు ప్రభుత్వంలో ఏర్పాటు
- మా ప్రభుత్వంలో కొత్తగా డిస్టిలరీలకు అనుమతివ్వలేదు



ఉక్కుపాదం మోపడం ద్వారా మద్యపానాన్ని నియంత్రిస్తూ, మద్యం అమ్మకాల పరిమాణాన్ని తగ్గించాం. ఇదే సమయంలో ధరలు పెంచడం ద్వారా ప్రభుత్వ ఆదాయం పెంచితే అదెలా కుంభకోణం అవుతుంది? కనీస పరిజ్ఞానం లేకుండా చంద్రబాబు ఆరోపణలు చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే బాగా మందు తాగిన వ్యక్తి కూడా చంద్రబాబులా అబద్ధాలు చెప్పరని అర్థమవుతోంది. - వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడే 14 డిస్టిలరీలకు అనుమతులిచ్చారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు, మేం అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు ఆ డిస్టిలరీల నుంచే మద్యం సరఫరా అవుతోంది. అయితే మా హయాంలో విషం అయిన మద్యం.. చంద్రబాబు హయాంలో అమృతం అవుతుందా?' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శ్వేతపత్రం పేరుతో అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారని ధ్వజమెత్తారు. 2014–19 మధ్య లిక్కర్ అమ్మకాల్లో ఏటా 15 శాతం వృద్ధి నమోదైందన్నారు. ఈ లెక్కన 2018–19 నాటికి 3.84 కోట్ల కేసుల మద్యం విక్రయించారని చెప్పారు. దీన్ని బట్టి పరిశీలిస్తే 2023–24 నాటికి లిక్కర్ విక్రయాలు గణనీయంగా పెరగాల్సి ఉండగా 3.2 కోట్ల కేసుల లిక్కర్ అమ్మకాలు తగ్గాయన్నారు. 2018–19లో 2.77 కోట్ల కేసుల బీర్లు అమ్ముడు పోతే, తమ ప్రభుత్వంలో 2023–24లో 1.12 కోట్ల కేసులు మాత్రమే విక్రయించామని చెప్పారు. దీన్ని బట్టి కమీషన్ల, లంచాల కోసం అధిక పరిమాణంలో మద్యం విక్రయాలను ఎవరు పెంచారో ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. మద్య నియంత్రణ చర్యల్లో భాగంగా షాక్ కొట్టేలా ధరలను పెంచడంతో విక్రయాలు తగ్గినప్పటికీ ప్రభుత్వానికి ఆదాయం పెరిగిందని స్పష్టం చేశారు. నాణ్యత లేని మద్యం సరఫరా చేసి, ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీశామని తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో చలామణిలో ఉన్న బ్రాండ్లన్నింటికీ 2014–19 మధ్య బాబు పాలనలోనే అనుమతులిచ్చారని మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

■ గవర్నర్ రిజర్వ్, లెఫైర్ నెపోలియన్, ఓక్టోన్ బారెల్ ఏజ్డ్, సెవెన్త్ హెవెన్ బ్లూ వంటి దాదాపు 15 బ్రాండ్ల విస్కీ, బ్రాందీ బ్రాండ్‌లకు 2018 అక్టోబర్ 26న చంద్రబాబు ప్రభుత్వంలో అనుమతి ఇచ్చారు. ప్రెసిడెంట్ మెడల్, హైదరాబాద్ బ్లూ డీలక్స్ విస్కీకి 2017 నవంబరు 22న అనుమతిచ్చారు. హైవోల్టేజ్, వోల్టేజ్ గోల్డ్, ఎస్ఎన్‌జీ 10000, బ్రిటీష్ ఎంపైర్ సూపర్ స్ట్రాంగ్ ప్రీమియం బీర్, బ్రిటీష్ ఎంపైర్ అల్ట్రా బ్రాండ్ల బీర్లు సైతం చంద్రబాబు ప్రభుత్వ నిర్వాకమే. వాటన్నింటికీ 2017 జూన్ 7న అనుమతి జారీ చేశారు. రాయల్ ప్యాలెస్, న్యూకింగ్, సైన్ అవుట్ బ్రాండ్ల విస్కీ, బ్రాందీకి కూడా 2018 నవంబరు 9న, బిరా 91 పేరుతో మూడు రకాల బీర్ బ్రాండ్లకు కూడా అపద్ధర్మ సీఎంగా చంద్రబాబు 2019 మే 14న అనుమతి ఇచ్చారు. మరో అడుగు ముందుకేసి ఆ మర్నాడే 2019 మే 15న టీఐ మ్యాన్షన్ హౌస్, టీఐ కొరియర్ నెపోలియన్.. బ్రాండ్ల విస్కీ, బ్రాందీకి కూడా క్లియరెన్స్ ఇచ్చారు. రాష్ట్రంలో 20 మద్యం డిస్టిలరీలు ఉంటే. వాటిలో 14 డిస్టిలరీలకు చంద్రబాబు హయాంలోనే అనుమతినిచ్చారు. మిగిలిన 6 డిస్టిలరీలకు అంతకు ముందున్న ప్రభుత్వాలు అనుమతి ఇచ్చాయి. మా ప్రభుత్వ హయాంలో ఒక్క డిస్టిలరీకి కూడా అనుమతి ఇవ్వలేదు. అందుకే టీడీపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చిన డిస్టిలరీలు తయారు చేసిన మద్యమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కూడా సరఫరా అయ్యింది. ఈ లెక్కన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్తగా చేసిన అక్రమం ఏముంది? దీనికి చంద్రబాబు సమాధానం చెప్పగలరా? 2014–19 మధ్య టీడీపీ హయాంలో బడి, గుడి అన్న తేడా లేకుండా మద్యం సిండికేట్‌లు.. పర్మిట్ రూమ్‌లు, బెల్ట్ దుకాణాలతో మద్యం 24 గంటలూ ఏరులై పారించారు. 4,380 మద్యం దుకాణాలకు అనుమతించి, 43 వేలకు పైగా బెల్టుషాపుల్లో అమ్మకాలు చేపట్టారు. వాటిలో మద్యం గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ) కంటే 25 శాతం అధిక ధరకు విక్రయించారు.



మాకు, వాళ్లకు మధ్య ఇదీ తేడా..

- దశలవారీ మద్య నియంత్రణను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసింది.
- టీడీపీ ప్రభుత్వ హయాంలో 4,380 మద్యం దుకాణాలు ఉండగా, వాటిని 2,934కు తగ్గించాం.
- 2019కి ముందు ప్రతి వైన్ షాప్‌కు అనుబంధంగా ఉన్న 4,380 పర్మిట్ రూమ్‌లు రద్దు చేశాం. ఊరూరా విచ్చలవిడిగా కొనసాగిన 43 వేల బెల్ట్‌షాప్‌లకు స్వస్తి పలికాం. కొత్త బార్లకు లైసెన్సులు ఇవ్వలేదు.
- ప్రైవేటు మద్యం దుకాణ విధానాన్ని రద్దు చేసి.. 2019 అక్టోబరు 1 నుంచి ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగించాం.
- మద్యం విక్రయ వేళలు కుదించాం. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకే మద్యం విక్రయాలు అనుమతించాం.
- ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీకి కట్టుబడుతూ, మద్యం వినియోగాన్ని నిరుత్సాహ పర్చేందుకు షాక్ కొట్టేలా ధరలు పెంచాం.
- అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఏర్పాటు చేశాం.
- తద్వారా గత టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే మా ప్రభుత్వంలో మద్యం విక్రయాలు దాదాపు సగానికి తగ్గాయి.
- మద్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్ విధానాన్ని ప్రవేశపెట్టింది మా ప్రభుత్వమే. అయినా మాపై పదే పదే దుష్ప్రచారం చేస్తున్నారు.

నాణ్యతలేని ఆరోపణలు

నాణ్యత లేని మద్యం సరఫరాతో, వినియోగదార్ల ఆరోగ్యం దెబ్బతిందంటూ నాణ్యత లేని ఆరోపణలు, దుష్ప్రచారం చేశారు. నాటి మద్యంలో విషపు అవశేషాలు ఉన్నట్లు చెన్నైలోని ఎస్‌జీఎస్ ల్యాబొరేటరీ పేరిట ఓ తప్పుడు నివేదికను టీడీపీ ప్రచారంలోకి తెచ్చింది. అలాంటి రిపోర్ట్ మేం ఇవ్వలేదని ఆ సంస్థనే చెప్పింది. తమ నివేదికను తప్పుగా అన్వయించారని పేర్కొంది. అయినప్పటికీ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మద్యం నమూనాలను హైదరాబాద్‌లోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ల్యాబ్‌లో పరీక్షించాం. ఆ శాంపిల్స్ అన్నీ నిర్దేశిత ప్రమాణాల ప్రకారమే ఉన్నాయని ఐఐసీటీ కూడా నివేదిక ఇచ్చింది.

అరాచకం.. ఆటవికం.. 'రెడ్' రూల్!

కూటమి సర్కారు పాలనపై వైఎస్ జగన్ కన్నెర్ర

హామీలపై నిలదీస్తారనే భయంతోనే టీడీపీ భయోత్పాతం

- ఏకంగా లోకేశ్ రెడ్‌బుక్ పేరిట హోర్డింగ్‌లు
- దీన్ని చూసి గ్రామస్థాయి నుంచి రెచ్చిపోతున్న టీడీపీ మూకలు
- ప్రత్యర్థులపై కక్ష సాధింపులు, హత్యలు, హత్యాచారాలు, ఆస్తుల ధ్వంసం
- గత 45 రోజుల్లో 8 మంది మహిళలు, బాలికలపై అత్యాచార ఘటనలు
- నలుగురు మహిళలు, బాలికలపై అత్యాచారం, హత్య
- వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా మహిళలకు అండగా 'దిశ'
- వైఎస్ జగన్‌కు పేరు వస్తోందనే దుగ్ధతోనే ఆ వ్యవస్థను నీరుగార్చారు

సాక్షి, అమరావతి:

"ఏపీ" అంటే ఈరోజు అరాచకం, ఆటవికం, రెడ్‌బుక్ పాలన అన్నట్లుగా కూటమి సర్కారు మార్చేసిందని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీల అమలుపై ఏ ఒక్కరూ ప్రశ్నించకూడదని ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు నరమేధం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అధఃపాతాళానికి దిగజారినా ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సీఎం కుమారుడు, మంత్రి లోకేశ్ రెడ్‌బుక్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా హోర్డింగ్‌లు పెట్టారు. వీటి ద్వారా పోలీసులకు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారు? హత్యలు, ఆస్తుల ధ్వంసానికి పాల్పడతాం..! పోలీసులు ప్రేక్షక పాత్ర వహించండని చెబుతున్నట్లే ఉంది! ఆయా ఘటనలపై కేసులు పెడితే తోలు తీస్తాం..! బాధితులపైనే తిరిగి కేసులు పెట్టండి అని అనడానికి ఇది నిదర్శనం కాదా?' అని నిలదీశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

రెడ్‌బుక్ పేరిట హత్యలు.. హత్యాచారాలు.. దాడులు

లోకేశ్ రెడ్‌బుక్‌ను చూసి గ్రామాల్లో టీడీపీ నాయకులు రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. టీడీపీ విధ్వంసకాండపై మేం ఢిల్లీలో నిరసన తెలుపుతుంటే పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సాంబిరెడ్డిపై దాడి చేశారు. కాళ్లు, చేతులు విరగ్గొట్టారు. ఆయన చనిపోయాడని భావించి వదిలేశారు. రాజకీయంగా విభేదించారని ఇలా దాడులు చేస్తారా? ప్రతిపక్షం అనేదే లేకుండా చేయాలని దాడులకు తెగబడటం ధర్మమేనా? చంద్రబాబు ఇచ్చిన అలవిగాని హామీలపై ఎవరూ ప్రశ్నించకూడదు! ఒకవేళ రోడ్డు ఎక్కి అడిగితే ఏం జరుగుతుందోనని భయం కల్పించేందుకే ఇలా కిరాతకంగా వ్యవహరిస్తున్నారు.



రెడ్‌బుక్ హోర్డింగ్‌లను చూపిస్తూ మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

పల్నాడులో పరాకాష్టకు సాధింపులు

వినుకొండలో రషీద్‌ను హత్య చేసిన నిందితుడు జిలాని స్థానిక ఎమ్మెల్యే భార్యకు కేక్ తినిపిస్తూ ఫొటోలు దిగాడు. ఎమ్మెల్యే, టీడీపీ నాయకులతో నిందితుడు అంటకాగినా కేసులో ఎక్కడా వారి పేర్లు లేవు. మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై అక్రమ కేసులు బనాయించారు. పోలింగ్‌కు ముందు అక్కడ ఎస్పీగా ఉన్న రవిశంకర్‌రెడ్డి సమర్థంగా పని చేస్తుండటంతో ఆయన్ను బదిలీ చేయించి బిందుమాధవ్‌ను తెచ్చుకున్నారు. ఆయన చేసిన అకృత్యాలు తెలుసుకుని ఈసీ సస్పెండ్ చేసింది. అనంతరం వచ్చిన మలికాగార్గ్ టీడీపీ నాయకుల మాట వినడం లేదని శ్రీనివాస్‌ను ఎస్పీగా తెచ్చారు. ఆ తరువాత మూడో రోజే రషీద్‌ను నడి రోడ్డు మీదే దారుణంగా నరికేశారు.

మహిళల భద్రత గాలికి

కేవలం గత 45 రోజుల వ్యవధిలో ఎనిమిది మంది మహిళలు, బాలికలపై అత్యాచార ఘటనలు రాష్ట్రంలో చోటు చేసుకున్నాయి. నలుగురిపై అత్యాచారం, హత్యా ఘటనలు జరిగాయి. 12 మంది మహిళలు, చిన్నారి బాలికలపై అత్యంత దారుణమైన ఘటనలు కూడా వెలికి చూశాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి మహిళకు దిశ యాప్ రక్షణ కవచంలా నిలిచింది. 1.41 కోట్ల మంది ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఎవరైనా ప్రమాదంలో ఉన్న మహిళలు, యువతులు ఫోన్‌ను షేక్ చేసినా.. ఎస్‌వోఎస్ బటన్ నొక్కినా వెంటనే పోలీసులకు అలెర్ట్ వెళ్లేది. పోలీసులు తక్షణమే బాధిత మహిళకు ఫోన్ చేసేవారు. ఒకవేళ బాధితులు ఫోన్ లిఫ్ట్ చేసే పరిస్థితిలో లేకుంటే పోలీసులే నేరుగా ఘటనా స్థలికి వెళ్లి రక్షించేవారు. ప్రతి గ్రామంలోనూ మహిళా పోలీసులు ఉండేవారు. ప్రస్తుతం మహిళల భద్రత గురించి కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దిశ యాప్‌తో జగన్‌కు క్రెడిట్ వస్తోందనే దుగ్ధతో దాన్ని వదిలేశారు. దిశ పోలీస్ స్టేషన్‌లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లది ఇదే పరిస్థితి!

చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్

సీఎం చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. దారుణ హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని నేను పరామర్శించడం, రాష్ట్రంలోని అరాచక పరిస్థితులపై ఢిల్లీలో ధర్నాకు సిద్ధమవడంతో ప్రజల దృష్టి మళ్లించేందుకు మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అగ్ని ప్రమాదంపై సీఎం రెండుసార్లు సమీక్ష నిర్వహించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై నిందలు మోపుతూ దుష్ప్రచారం చేశారు. హుటాహుటిన డీజీపీ, సీఐడీ ఏడీజీని చంద్రబాబు అక్కడికి హెలికాప్టర్‌లో పంపారు. ఆర్డీవో కార్యాలయంలో రికార్డులు కాలిపోతే కలెక్టరేట్, సీసీఎల్ఏలో రికార్డులు ఉంటాయి కదా? చివరకు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటాయి. అయినా కూడా ఏదో జరిగిపోతున్నట్లు హైడ్రామా సృష్టించారు. పెద్దిరెడ్డిని ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఆయన కుమారుడు మిథున్‌ను మూడు సార్లు ఎంపీగా ప్రజలు ఎన్నుకున్నారు. ప్రజాదరణ ఉన్న కుటుంబాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు నిందలు మోపుతున్నారు. మిథున్ కారును ధ్వంసం చేయడంతో పాటు మాజీ ఎంపీ రెడ్డెప్ప కారును కాల్చి వేసి రాళ్లతో దాడులకు పాల్పడ్డారు. దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే తిరిగి బాధితులపైనే కేసులు బనాయిస్తున్నారు. పెద్దిరెడ్డిపై చంద్రబాబుకు ఎందుకంత కోపం అంటే.. కాలేజీలో చదువుకునే సమయంలో ఆయన కొట్టాడట! ఆ కక్షతో పెద్దిరెడ్డి ఏ శాఖకు మంత్రిగా పనిచేసినా ఆ శాఖపై చంద్రబాబు దుష్ప్రచారం చేస్తారు. మదనపల్లెలో అగ్నిప్రమాదం జరిగితే డీజీపీని ప్రత్యేక హెలికాప్టర్‌లో పంపిన చంద్రబాబు నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో మైనర్ బాలిక అదృశ్యమైతే ఆ కుటుంబానికి న్యాయం చేయడానికి మాత్రం ముందుకు రారు. జూలై 7న బాలిక అదృశ్యమైతే 16న ఎస్పీ ప్రెస్‌మీట్ పెడతారు. దళితుడిని లాకప్ డెత్ చేశారు. కేసు విచారణ జరుగుతుండగానే ఎస్పీని బదిలీ చేశారు.

గనుల లీజులపై గలీజు మాటలు

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ మండిపాటు
- 2018–19 నాటికి మైనింగ్ శాఖ ఆదాయం రూ.2,210 కోట్లు.. 2023–24 నాటికి అది రూ.4 వేల కోట్లకు పైమాటే
- ఏపీఎండీసీ ఆదాయం 2018–19 నాటికి రూ.400 కోట్లు మాత్రమే
- 2023–24 నాటికి ఏకంగా రూ.3 వేల కోట్లకుపైగా ఆదాయం
- ఖజానాకు ఆదాయం పెరిగితే అవినీతి అవుతుందా?



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గనుల లీజుల గురించి ఇష్టానుసారం మాట్లాడుతున్నారని సీఎం చంద్రబాబు నాయుడుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మాట్లాడితే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై లేనిపోని అభాండాలు వేయడానికి విపరీతంగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. వాళ్ల కుటుంబాన్ని ఏదో విధంగా తొక్కేయాలి.. వాళ్లను నాశనం చేయాలి.. అన్నట్టుగా చంద్రబాబు తీరు ఉందని చెప్పారు. ఇసుక, గనుల పాలసీపై చంద్రబాబు విడుదల చేసిన వైట్ పేపర్‌పై వైఎస్ జగన్ ఫ్యాక్ట్ పేపర్ ద్వారా వాస్తవాలను శుక్రవారం మీడియాకు వివరించారు. దశాబ్దాలుగా ఈ గనులను అడ్డం పెట్టుకొని సంపాదించింది ఎవరో అందరికి తెలుసన్నారు. మైనర్, మేజర్ ఖనిజాల ద్వారా 2018–19లో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ.2,210 కోట్లని తెలిపారు. ఈ రోజు (2023–24) వస్తోన్న ఆదాయం రూ.4 వేల కోట్లకు పైమాటే అని స్పష్టం చేశారు. 2018–19లో చంద్రబాబు దిగిపోయే నాటికి ఏపీఎండీసీ ఆదాయం రూ.400 కోట్లు అని, ఈ రోజు దాని ఆదాయం రూ.3 వేల కోట్లు పైమాటేనని తెలిపారు. ఇలా ఆదాయం పెంచితే కరప్షన్ జరుగుతున్నట్టా? అని నిలదీశారు. చంద్రబాబు హయాంలో ఆదాయం ఎందుకు పెరగలేదని ప్రశ్నించారు. ఏదైనా ఆరోపణ చేసే ముందు లాజిక్, రీజన్ ఉండాలని హితవు పలికారు. ఇప్పుడు వైట్ పేపర్ అంటూ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఇది ఎంత వరకు సమంజసమో మీరే ఆలోచించాలని కోరారు.

హామీల అమలుపై ప్రశ్నిస్తే.. డేటా డేటా అంటున్నారు. ఏం డేటా కావాలి? రాష్ట్రంలో 43 లక్షల మంది తల్లులు, 84 లక్షల మంది పిల్లలున్నారు. ఈ పిల్లలకే ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం ఇవ్వాలి. 1.80 కోట్ల మంది 18 ఏళ్లు పైబడిన అక్కచెల్లెమ్మలున్నారు. వీరికే నెలకు రూ.1500 చొప్పున ఏటా రూ.18 వేలు ఇవ్వాలి. రాష్ట్రంలో 1.60 కోట్ల గృహాలున్నాయి. ప్రతి ఇంట్లోని నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారని నిలదీస్తున్నారు. - వైఎస్ జగన్

కేంద్ర ప్రభుత్వమే నిర్మించాల్సిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కమీషన్ల కోసం చంద్రబాబు దక్కించుకోవడం తొలి చారిత్రక తప్పిదం. వరదను మళ్లించేలా స్పిల్‌వేను నిర్మించకుండా కాఫర్ డ్యామ్ పనులు చేపట్టడం రెండో తప్పిదం. ఈ తప్పిదాల వల్లే పోలవరంలో విధ్వంసం చోటు చేసుకుంది. ఇది వాస్తవం కాదని చెప్పే ధైర్యం చంద్రబాబుకు ఉందా? - వైఎస్ జగన్



రీసర్వే, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ఎన్నికల ముందు విపరీతంగా దుష్ప్రచారం చేశారు. దుష్ప్రచారం నుంచి బయట పడటానికి ఈ చట్టాన్ని రద్దు చేశారు. ల్యాండ్ రిఫార్మ్స్ చేపట్టే రాష్ట్రాలకే వడ్డీ లేని రుణాలు ఇస్తామని కేంద్రం ప్రకటించడంతో చంద్రబాబు యూ టర్న్ తీసునే పరిస్థితి వచ్చింది. ఎన్నికల ముందు చేసింది దుష్ప్రచారం అని చెప్పడానికి ఇంతకంటే రుజువు ఏం కావాలి? - వైఎస్ జగన్



రీసర్వే, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్
గొప్ప సంస్కరణ

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్
- అమ్మే వారికి, కొనే వారికి ప్రభుత్వమే గ్యారంటీ.. బీమా రక్షణ
- మరొక పక్క అసైన్డ్, షరతులు, చుక్కల భూములపై హక్కుల కల్పన
- ఇలా లక్షలాది మందికి మంచి చేస్తే అవినీతి ఎలా అవుతుంది?

సాక్షి, అమరావతి: 'భూముల రీసర్వే.. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు.. ఇదొక గొప్ప సంస్కరణ. ఈ చట్టం ద్వారా భూములు కొనుగోలు చేసే వాళ్లకే కాదు.. అమ్మే వాళ్లకు సైతం రాష్ట్ర ప్రభుత్వమే గ్యారంటీగా ఉంటుంది. ఇన్సూరెన్స్ కూడా కల్పిస్తుంది. టైటిల్స్‌ను వెరిఫై చేసి భూ యజమానుల సమక్షంలోనే సరిహద్దు రాళ్ల పాతి.. సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాం. ఇలాంటి చట్టంపై ఎన్నికలకు ముందు కూటమి పార్టీల నేతలు దారుణంగా తప్పుడు ప్రచారం చేశారు. దాన్నుంచి బయట పడేందుకు ఇప్పుడు పాట్లు పడుతున్నారు' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. శ్వేతపత్రం పేరిట ఈ చట్టంపై చంద్రబాబు చేస్తోన్న దుష్ప్రచారాన్ని ఫ్యాక్ట్ పేపర్ పేరిట వైఎస్ జగన్ శుక్రవారం తిప్పికొట్టారు. 'రీ సర్వే కోసం సచివాలయాల్లో 15 వేల మంది సర్వేయర్లను నియమించాం. ఈ ప్రాజెక్టు కోసం నాలుగేళ్లలో రూ.2 వేల కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటి వరకు 9.50 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్రతి ఒక్కరూ ఒరిజినల్ డాక్యుమెంట్లే పొందారు. ఇలా రిజిస్ట్రేషన్ రంగంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చాం. అయినా సరే పనిగట్టుకొని ఈ చట్టంపై ఎన్నికల్లో దుర్మార్గంగా ప్రచారం చేశారు. లేని పోని అపోహలు, భయాందోళనలకు గురిచేశారు. పదేపదే చెప్పిన అబద్ధాలు.. దుష్ప్రచారం నుంచి బయట పడేందుకు అసెంబ్లీలో ఆ చట్టాన్ని రద్దు చేశారు. తీరా ఇప్పుడు ల్యాండ్ రిఫార్మ్స్‌ను ముందుకు తీసుకెళ్లే రాష్ట్రాలకు ఇన్సెంటివ్‌గా 50 ఏళ్లకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని కేంద్రం ప్రకటించడంతో రీ సర్వేపై మళ్లీ యూ టర్న్ తీసుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

రికార్డులన్నీ అప్‌గ్రేడ్

అమెరికా సహా పాశ్చాత్య దేశాల్లో ఎక్కడా ల్యాండ్ టైటిల్ వివాదాలు విన్పించవు. క్రయవిక్రయాల సందర్భంగా ఎక్కడా భూ వివాదాలు తలెత్తవు. కారణం అక్కడ టైటిల్స్ పక్కాగా ఉంటాయి కాబట్టి. కానీ ఇక్కడ ఈరోజు భూములు కొనుక్కోవాలంటే భయపడే పరిస్థితి. రేపొద్దున మీ భూమికి ఓనర్ తామే అంటూ ఎవరో ఒకరు వస్తారని కొనే వాళ్లకు భయం. ఈ పరిస్థితి లేకుండా చేసేందుకే ల్యాండ్ టైట్లింగ్ యాక్టును తీసుకొచ్చాం. ఈ యాక్టు ద్వారా కొనే వారికి, అమ్మే వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వమే గ్యారంటీగా ఉంటుంది. బీమా ఇస్తుంది. ఇందు కోసం 15వేల మంది సర్వేయర్లను నియామకంతో పాటు రోవర్స్, సరిహద్దు రాళ్ల పెట్టాం. రికార్డులన్నీ అప్‌గ్రేడ్ చేశాం. మ్యుటేషన్ పూర్తి చేశాం. సబ్ డివిజన్ చేశాం. ప్రతి రికార్డును సచివాలయంలోనే అందుబాటులో ఉంచాం. టైటిల్స్ వెరిఫై చేసి మీ సమక్షంలోనే సరిహద్దు రాళ్ల పాతి గ్రామ సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఏర్పాటు చేశాం.

ఒక్క ఫిర్యాదు రాలేదు

రాష్ట్ర వ్యాప్తంగా 17 వేల రెవెన్యూ గ్రామాలుంటే వాటిలో 8 వేల గ్రామాలలో రీ సర్వే పూర్తి చేశాం. ఇప్పటికే 9.50 లక్షల మంది రిజిస్ట్రేషన్స్ కూడా చేసుకున్నారు. ప్రతి ఒక్కరికి ఒరిజనల్ డాక్యుమెంట్లు ఇచ్చాం. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి నుంచే కాకుండా, రీ సర్వే పూర్తయిన గ్రామాల నుంచి కూడా ఏ ఒక్కరూ అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. అలాంటి ఈ యాక్టుపై ప్రజల్లో అపోహలు సృష్టించి చేసి ఓ మంచి కార్యక్రమాన్ని పక్కన పెట్టేశారు. ఆ దుష్ప్రచారం నుంచి బయటపడలేక అసెంబ్లీలో చంద్రబాబు ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేసింది. అసైన్డ్, షరతులు, చుక్కల భూముల విషయంలో దశాబ్దాలుగా ఇబ్బందులు పడిన రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేలు చేసింది. 97 వేల మందికి.. 2,06,171 ఎకరాల చుక్కల భూములపై హక్కులు కల్పించింది. 35 వేల ఎకరాల షరతులు కలిగిన భూములను 22ఏ నుంచి తొలగించి 22వేల మంది రైతులకు మేలు చేస్తే అవినీతి అన్నారు. 20 ఏళ్లు పూర్తయిన 27.41 లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై 15,21,160 మంది దళితులు, పేద రైతులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తే అవినీతి, అన్యాయమంటూ దుష్ప్రచారం చేశారు. మా ప్రభుత్వంలో 42,397 మంది రైతులకు 46,463 ఎకరాల అసైన్డ్ భూములు పంపిణీ చేశాం. 1.54 లక్షల మంది గిరిజనులకు 3.26 లక్షల ఎకరాలకు సంబంధించి ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేశాం. విలేజ్ సర్వీస్ ఇనాం ల్యాండ్స్ కింద 1.58 లక్షల ఎకరాలను 22ఏ నుంచి తొలగించి, 1.61లక్షల మంది రైతులకు మంచి చేశాం.

చంద్రబాబు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

లక్షల మందికి మంచి చేస్తే ప్రశంసించాల్సింది పోయి దాన్ని తమకు అనుకూలంగా వక్రభాష్యం చెప్పగలిగినో నాయకుడు ఎవరైనా ఉన్నారంటే ఒక్క చంద్రబాబు నాయుడు మాత్రమే. భూముల విషయంలో ఆయన ఆలోచన విధానం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇవన్నీ ఎందుకు చేయనీయకుండా అడ్డుకుంటున్నాడో ఆలోచించాలి. బహుశా.. ఈ భూములపై హక్కులను తమ వాళ్ల పేరిట మార్చుకొనేందుకు అవకాశం కల్పించేందుకే చంద్రబాబు అడ్డుకుంటున్నాడా.. అని ప్రజలు ఆలోచించాలి. ల్యాండ్ డిస్ప్యూట్స్ ఇలాగే కొనసాగించి, తన మనుషులతో తక్కువ రేటుకు కాజేయాలని అడ్డుకుంటున్నాడేమో అనిపిస్తుంది. పేదలకు వాళ్ల భూములు వాళ్లు అమ్ముకునే స్వేచ్ఛ ఉండకూడదు. అప్పుడే తక్కువ రేటుకు కాజేయొచ్చన్న ఆలోచన చంద్రబాబుది.

అందరి నోటా అదే మాట



- జగన్ సీఎంగా ఉండి ఉంటే.. అనే చర్చ అప్పుడే మొదలైంది
- హామీల అమలు, అరాచకాలపై ప్రశ్నించే వారు లేరనుకోవద్దు
- చంద్రబాబు ప్రభుత్వానికి మాజీ సీఎం వైఎస్ జగన్ చురకలు

సాక్షి, అమరావతి: 'అధికారంలో ఉన్నాం కాబట్టి ఏం చేసినా చెల్లుబాటవుతుంది.. అడిగే వారే లేరని సీఎం చంద్రబాబు అనుకుంటున్నారు. అయితే ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా చర్చ మొదలైంది. జగన్ ఉండి ఉంటే ఈ పాటికే మాకు అమ్మ ఒడి, రైతు భరోసా, మత్స్యకార భరోసా, విద్యా, వసతి దీవెన, సున్నా వడ్డీ ఈ పాటికి అంది ఉండేవని ఆయా వర్గాల ప్రజలు మాట్లాడుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. కూటమి పాలనలో జరుగుతున్న అన్యాయాలపై శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం కింద రూ.26.67 వేల కోట్లను పేద పిల్లల చదువుల కోసం అందించామని చెప్పారు. ఈ క్రమంలో ఇప్పుడు జగన్ ఉండుంటే ఈ పాటికి అమ్మ ఒడి అంది ఉండేదని రాష్ట్రవ్యాప్తంగా 43 లక్షల మంది తల్లులు చర్చించుకుంటున్నారన్నారు. 'జగన్ అయితే తల్లికి 15 వేలు ఇచ్చాడు. నేను అధికారంలోకి వస్తే ఎంత మంది పిల్లలను బడికి పంపితే అంత మందికీ రూ.15 వేల చొప్పున ఇస్తానని చంద్రబాబు చెప్పాడు. అధికారంలోకి వచ్చాక తల్లికి వందనం అని పేరయితే పెట్టాడు కానీ జీవోలో తల్లులకు మాత్రమే పథకం అని నిబంధన పెట్టి పంగనామాలు పెట్టారని అనుకుంటున్నారు. చంద్రబాబును నమ్మి అమ్మ ఒడి కింద అందే రూ.15వేలు నష్టపోయామని బాధపడుతున్నారు. మాట్లాడితే డేటా కావాలి అంటున్నారు. ఏ డేటా కావాలి? ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఉంది. వాటి పరిధిలో ఎన్ని పాఠశాలలున్నాయి.. ఎంత మంది పిల్లలున్నారు అనేది సులువుగా తెలియదా? రాష్ట్రంలో 43 లక్షల మంది తల్లులు, 84 లక్షల మంది పిల్లలున్నారు. ఈ పిల్లలకే తల్లికి వందనం పథకం ఇవ్వాలి' అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఇక్కట్లు పడుతున్న రైతులు



ఇప్పుడు జగన్ సీఎంగా ఉండి ఉంటే ఖరీఫ్ మొదలయ్యే నాటికి రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందేదని రైతన్నలందరూ అనుకుంటున్నారు. జగన్ రూ.13,500 ఇస్తున్నాడు. తానైతే రూ.20 వేలు ఇస్తానని బాబు అన్నాడు. ఈ రోజుకు ఆ ఊసే లేదు. మా ప్రభుత్వం 53 లక్షల మంది రైతులకు రూ.34,378 కోట్లు ఇచ్చింది. 2023-24 ఖరీఫ్‌కు సంబంధించి ఏప్రిల్‌లో పంటల బీమా ప్రీమియం కట్టాలి. అలా కడితే జూన్‌లో బీమా మొత్తం విడుదల చేస్తారు. ప్రీమియం కడితే జగన్‌కు మంచి పేరు వస్తుందని ఎన్నికల కోడ్ సాకు చూపి ప్రీమియం కట్టకుండా అడ్డుపడ్డారు. కోడ్ అయిపోయి ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలైన ఇంకా ప్రీమియం కట్టలేదు. ఉచిత పంటల బీమా కింద రైతు, ప్రభుత్వ వాటా మేమే కట్టాం. ఈ రోజు ప్రతి రైతు మా గురించి పట్టించుకోవడం లేదని నిలదీస్తున్నాడు.

చదువుకునే పిల్లల్లో ఆందోళన


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యా దీవెన, వసతి దీవెన పథకాల కింద ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు రూ.18 వేల కోట్లు ఇచ్చాం. ఇప్పుడూ జగన్ ఉండి ఉంటే క్వార్టర్ ముగియగానే పూర్తి ఫీజు రియింబర్స్‌మెంట్ మా ఖాతాల్లో వేసేవాడని ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థుల తల్లులు అనుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి క్వార్టర్ నిధులు మేలో ఇవ్వాలి. కానీ ఇంకా ఇవ్వలేదు. ఏప్రిల్, మే, జూన్ నిధులు పెండింగ్‌లో పెట్టారు. జగన్ అయితే విద్యా సంవత్సరంలో రెండు సార్లు వసతి దీవెన డబ్బు ఇచ్చి ఉండేవారని తల్లులు తల్చుకుంటున్నారు. ఇప్పుడు బాబు ప్రభుత్వం వీటిని అసలు పట్టించుకోవడం లేదు. కాలేజీల ఫీజులు ఎడాపెడా పెంచుకున్నారు. పెద్ద చదువులు అభ్యసిస్తున్న పేద పిల్లలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అందరిలోనూ అదే ఆవేదన



- పొదుపు సంఘాల్లో ఉండే ప్రతి అక్కచెల్లెమ్మ జగన్ ఉండి ఉంటే సున్నా వడ్డీ కింద ఏటా మే, జూన్‌లో సొమ్ములు జమ చేసేవాడని, ఐదేళ్లలో రూ.4,969 కోట్లు ఇచ్చారని గుర్తు చేసుకుంటున్నారు.



- వేట నిషేధం ముగిసి నెలన్నర అయింది. ఇంకా మత్స్యకారులకు భరోసా నిధులు ఇవ్వలేదు. అదే జగన్ ఉంటే ఈ పాటికి మత్స్యకార భరోసా కింద రూ.10 వేలు ఇచ్చి ఉండేవారని మత్స్యకారులు అనుకుంటున్నారు.
- 18-59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎంత మంది మహిళలు ఉన్నారో తెలియదా? 2.10 కోట్ల మంది మహిళా ఓటర్లుంటే పెన్షనర్‌లను తీసేస్తే మిగిలిన 1.80 కోట్ల మందికి నెలకు రూ.1,500 చొప్పున ఇవ్వాలి. ఇప్పటికే 2నెలలు అయిపోయింది. ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని రాష్ట్రంలోని 1.60 కోట్ల గృహాల నుంచి నిరుద్యోగులు అడుగుతున్నారు.

జీవనాడిని గాడిలో పెట్టిన


మాపై నిందలా?

సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

- విభజన చట్టం ప్రకారం పోలవరాన్ని కట్టాల్సింది కేంద్రమే
- కమీషన్ల కోసం నిర్మాణ బాధ్యతలు దక్కించుకుని చారిత్రక తప్పిదం
- పైగా 2013-14 ధరలతోనే ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ
- స్పిల్ వే నిర్మించకుండానే కమీషన్ల కోసం కాఫర్ డ్యామ్ కట్టి మరో చారిత్రక తప్పిదం
- పునాదుల్లోనే స్పిల్ వే.. వరద మళ్లించడం సాధ్యం కాక కాఫర్ డ్యామ్‌లలో ఖాళీలు
- ఆ ఖాళీల్లో అధిక ఉధృతితో గోదావరి ప్రవహించడంతో కోతకు గురై దెబ్బతిన్న డయా ఫ్రమ్ వాల్
- మేం అధికారంలోకి వచ్చాకే రికార్డు స్థాయిలో పనులు పూర్తి చేశాం
- తప్పులన్నీ ఆయనే చేసి.. ఎదుట వారిపై నిందలు మోపడం బాబుకు అలవాటే



ఎవరి హయాంలో ఎంత మేరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని వివరిస్తున్న వైఎస్ జగన్. (ఇన్‌సెట్‌లో) 2019 మార్చిలో పోలవరం స్పిల్ వే



2023 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పరిస్థితి ఇదీ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో తన తప్పిదాలను కప్పిపుచ్చుతూ ఎదుటి వారిని వేలెత్తి చూపడం ఎంత వరకు సమంజసమని సీఎం చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ నిలదీశారు. జీవనాడి పనులను గాడిలో పెట్టిన తమపైనే నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. పచ్చి అబద్ధాలు వల్లె వేస్తూ చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేశారని ధ్వజమెత్తారు. విభజన చట్టం ప్రకారం కేంద్రమే నిర్మించాల్సిన ప్రాజెక్టును కమీషన్లకు కక్కుర్తి పడి తామే నిర్మిస్తామంటూ చంద్రబాబు దక్కించుకుని చారిత్రక తప్పిదం చేశారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని రీతిలో నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే కట్టకుండానే.. కాఫర్ డ్యామ్‌ల పనులు చేపట్టి చంద్రబాబు మరో చారిత్రక తప్పిదం చేశారని ఎత్తిచూపారు. బాబు నిర్వాకాన్ని తాము అధికారంలోకి వచ్చాక ప్రణాళికా బద్ధంగా ప్రాజెక్టు పనులు చేపట్టి.. శరవేగంగా సరిచేస్తూ ముందుకెళ్లామని వివరించారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

కాసుల కోసం కక్కుర్తితోనే ఇలా..

విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టును నిర్మించాల్సింది కేంద్రమే. కానీ.. కమీషన్ల కక్కుర్తితో ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను చంద్రబాబు తీసుకున్నాడు. అదీ 2013-14లో ఖరారు చేసిన రూ.20,398.61 కోట్లతోనే పూర్తి చేస్తామని అంగీకరించాడు. కానీ.. ప్రాజెక్టు భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికే రూ.33 వేల కోట్ల వ్యయం అవుతుంది. అలాంటిది కేవలం రూ.20,398.61 కోట్లకే ప్రాజెక్టును పూర్తి చేస్తానని చంద్రబాబు ఒప్పుకోవడంలో ఆంతర్యమేమిటి? ఇంత దారుణంగా చేయడమే కాకుండా కాంక్రీట్ పనుల్లో లాభాలు రావని, పెద్దగా కమీషన్లు వచ్చే మట్టి పనులు ముందుగా ప్రారంభించారు. ఇందులో భాగంగా కాఫర్ డ్యామ్ పనులను ఈనాడు రామోజీ వియ్యంకుడు నవయుగకు అప్పగించారు. మట్టి పనులు యనమల రామకృష్ణుడు వియ్యంకుడికి అప్పగించారు. ఇవన్నీ వాస్తవాలు కావా? నేను సరైన ఆధారాలతోనే ఆరోపణలు చేస్తున్నా.. చంద్రబాబూ.. సమాధానం చెప్పండి.

ప్రపంచంలో ఎవరైనా ఇలా కడతారా?

ప్రపంచంలో ఎక్కడైనా సాగునీటి ప్రాజెక్టు నిర్మించాలంటే.. ముందుగా నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే నిర్మించాలి. ఆ తర్వాత కాఫర్ డ్యామ్ కట్టి.. నదీ ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లిస్తూ ప్రధాన డ్యామ్ పనులు చేపడతారు. ప్రధాన డ్యామ్ నిర్మాణానికి వీలుగా.. నదీ ప్రవాహాన్ని స్పిల్ వే వైపు మళ్లించడానికి ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు నిర్మిస్తారు. కాఫర్ డ్యామ్‌ల పనులు స్పిల్ వే పనులు పూర్తయిన తర్వాతే మొదలుపెట్టాలి. కానీ, స్పిల్ వే పునాది స్థాయిలోనే వదిలేసి.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులు చంద్రబాబు చేపట్టారు. స్పిల్ వే పూర్తి కాకపోవడంతో వరద ప్రవాహాన్ని మళ్లించడం సాధ్యం కాక.. రెండు కాఫర్ డ్యామ్‌లకు ఇరు వైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేశారు. దాంతో 2,400 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి.. చిన్న చిన్న ఖాళీ ప్రదేశాల మధ్య కుంచించుకుపోయి ప్రవహించడంతో వరద ఉధృతి పెరిగి ప్రధాన డ్యామ్ గ్యాప్-2లో నిర్మించిన పునాది డయా ఫ్రమ్ వాల్ కోతకు గురై దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో 35 మీటర్ల నుంచి 22 మీటర్ల లోతుతో భారీ అగాధాలు ఏర్పడ్డాయి. బుద్ధి ఉన్న వారెవరైనా ఇలాంటి పనులు చేస్తారా? ఏదైనా ప్రాజెక్టును ప్రణాళికా బద్ధంగా చేపట్టాలి. చంద్రబాబు చేసిన తప్పులన్నింటినీ మేం అధికారంలోకి వచ్చాక సరిదిద్దుతూ.. ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టు పనులు చేపట్టాం.

ప్రణాళికా బద్ధంగా ప్రాజెక్టు పనులు

మేం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు చేసిన తప్పులను సరిదిద్దుతూ.. ప్రణాళికా బద్ధంగా ప్రాజెక్టు పనులు చేపట్టాం. అత్యంత పారదర్శకంగా రివర్స్ టెండరింగ్‌కు వెళ్లి కేంద్రానికి రూ.865 కోట్లు ఆదా చేశాం. కాంట్రాక్టర్‌ను మార్చి స్పిల్ వే పనులు, ఆ తర్వాత అప్రోచ్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేశాం. ప్రధాన డ్యామ్ గ్యాప్-1లో డయా ఫ్రమ్ వాల్ నిర్మించాం. గ్యాప్-3లోకాంక్రీట్ డ్యామ్ నిర్మించాం. పోలవరం జల విద్యుత్ కేంద్రంలో కీలకమైన సొరంగాలను పూర్తి చేశాం. ఇలా ప్రణాళికా బద్ధంగా అన్నీ పూర్తి చేసాం కాబట్టే 2021 జూన్ 11వ తేదీన వరద నీటిని స్పిల్ వే గేట్ల నుంచి 6.1 కి.మీల పొడవునా విజయవంతంగా సముద్రంలోకి మళ్లించగలిగాం. 2022లో గోదావరికి 26 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా స్పిల్ వే మీదుగా సులభంగా దిగువకు విడుదల చేశాం. కాఫర్ డ్యామ్‌కు ఏమీ కాలేదు. ఇప్పుడు కోతకు గురైన డయా ఫ్రం వాల్ స్థానంలో కొత్త డయా ఫ్రమ్ వాల్ కట్టాలా? లేకపోతే రిపేర్ చేసి మిగిలిన పనులు చేపట్టాలా అనేది కేంద్రం నిర్ణయం మేరకు జరగాల్సి ఉంది. మూడేళ్లపాటు పోరాటం చేసి, తాజా ధరల మేరకు నిధులు ఇచ్చేలా కేంద్రాన్ని ఒప్పించి.. పోలవరానికి నిధుల సమస్య లేకుండా చూశాం. ఇదీ వాస్తవం. చెయ్యాల్సిన పని ఏదీ చేయకుండా.. తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వేరే వాళ్ల మీద వేలెత్తి చూపించడం చంద్రబాబు నైజం. పోలవరం ప్రాజెక్టుపై చంద్రబాబు చెప్పింది ఒప్పా? తప్పా? నేను చెప్పింది వాస్తవమా? కాదా? ప్రజలు ఆలోచించాలి.

కలిసి వచ్చే పార్టీలతో

కలిసి పోరాటం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ స్పష్టీకరణ

- టీడీపీ ప్రభుత్వ నరమేధంపై ఢిల్లీలో నిర్వహించిన ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానించాం
- ఇండియా, బీజేపీ కూటముల్లోని పార్టీలను పిలిచాం
- సంఘీభావం తెలిపిన ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్. ఇండియా కూటమి పార్టీలు
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా రాహుల్ గాంధీతో చంద్రబాబుకు సంబంధాలు..
- అందుకే ఢిల్లీలో మా ధర్నాకు సంఘీభావం తెలపని రాహుల్ గాంధీ
- మణిపూర్‌లో కాంగ్రెస్ వ్యతిరేక పార్టీ ఉంది కాబట్టే అక్కడి దాడులను ఖండించిన రాహుల్
- ఏపీలో కాంగ్రెస్ అనుకూల చంద్రబాబు ప్రభుత్వం ఉంది కాబట్టే దాడులను రాహుల్ ఖండించలేదు
- బాబుకు ఎస్కోబార్ సన్నిహితుడేమో.. అందుకే ఆయన పేరు కలవరిస్తున్నారు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం సాగిస్తోన్న నరమేధంపై కలిసి వచ్చే పార్టీలను కలుపుకుని ప్రజా పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ పునరుద్ఘాటించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గత టీడీపీ ప్రభుత్వం సాగిస్తోన్న మారణ హోమాన్ని.. అరాచక, ఆటవిక పాలనను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లాలనే ఢిల్లీలో ధర్నా నిర్వహించామన్నారు. ఈ ధర్నాలో టీడీపీ ప్రభుత్వం సాగిస్తోన్న నరమేధానికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లు.. ఫొటోలు ప్రదర్శించామని చెప్పారు. ఇండియా కూటమిలోని పార్టీలతోపాటు బీజేపీ, ఎన్‌డీఏ కూటమిలోని పార్టీలను ధర్నాలకు ఆహ్వానించామని.. టీడీపీ ప్రభుత్వ హత్యాకాండకు సంబంధించి వీడియో క్లిప్పింగ్‌లు, ఫొటోలు చూశాక.. దమనకాండను ఖండించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు కలిసి రావాలని అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశామన్నారు. తమ విజ్ఞప్తిని మన్నించి.. సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్, జార్ఖండ్ ముక్తి మోర్చా, ఏఐడీఎంకే, శివసేన(ఉద్ధవ్ థాక్రే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, ఆప్, వీసీకే సహా పలు పార్టీలు మద్దతు ఇచ్చాయని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ దమనకాండను ఖండిస్తూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు తమతో కలిసి పోరాటం చేసేందుకు సిద్ధమంటూ ఆ పార్టీలు తమకు సంఘీభావం తెలిపాయన్నారు. ఇండియా కూటమిలో ప్రధాన పక్షమైన కాంగ్రెస్‌ను ధర్నాకు ఆహ్వానించామని.. కానీ రాహుల్ గాంధీ ధర్నాకు సంఘీభావం తెలపలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా రాహుల్ గాంధీతో సీఎం చంద్రబాబు సన్నిహిత సంబంధాలు నెరపుతున్నారని.. అందువల్లే ఢిల్లీలో తాము నిర్వహించిన ధర్నాకు రాహుల్ గాంధీ హాజరు కాలేదని స్పష్టం చేశారు. మణిపూర్‌లో హింస జరుగుతోందని.. అక్కడ కాంగ్రెస్ వ్యతిరేక పార్టీ అధికారంలో ఉంది కాబట్టే.. దాన్ని రాహుల్ గాంధీ ఖండించారని ఎత్తిచూపారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అనుకూల చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్లే.. ఇక్కడ సాగుతోన్న నరమేధాన్ని రాహుల్ గాంధీ ఖండించడం లేదని స్పష్టం చేశారు. కొలంబియన్ మాదకద్రవ్యాల చీకటి సామ్రాజ్యాధిపతి పాబ్లో ఎమిలియో ఎస్కోబార్.. సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు కాబట్టే.. ఆయన చరిత్రను వల్లె వేశారని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎస్కోబార్ సన్నిహితుడు కావడం వల్లే చంద్రబాబు ఆయన పేరును కలవరిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అడ్డగోలుగా సాగుతోన్న డ్రగ్స్ దందాను బట్టి చూస్తే ఎస్కోబార్ చంద్రబాబుకు సన్నిహితుడేమోనని అనుమానం వ్యక్తం చేశారు.

మీడియా పాయింట్

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని శాసన మండలిలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాం. ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్థిక మంత్రిని అడిగాం. 10,000 మందిని గుర్తించారు. కానీ 3 వేల మందిని మాత్రమే రెగ్యులర్ చేశారు. 7,000 మంది మిగిలి పోయారు. అందులో 5,000 మంది ఉపాధ్యాయులే ఉన్నారు. అలాగే అన్ని విశ్వవిద్యాలయాల్లో 5,000 ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీలున్నాయి. అవన్నీ కూడా తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశాం. – వై.లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

వాయిదా తీర్మానానికి ఒప్పుకోలేదు



పీడీఎఫ్ తరపున వాయిదా తీర్మానం ప్రవేశపెట్టమంటే దానికి అనుమతించలేదు. నంద్యాల, తిరుపతి, పశ్చిమ గోదావరి తదితర జిల్లాల్లో 10మంది చిన్నారులపై జరిగిన దాడులపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని హోం మంత్రికి విజ్ఞప్తి చేశాం. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరాం. పిల్లలను, వారి తల్లిదండ్రులను చైతన్యం చేయడంతో పాటు, బాధితులను ఆదుకుని సరైన నష్టపరిహారం చెల్లించాలి. విద్యా కానుక అందరికీ అందేలా చూడాలని కోరాం. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45.7 కాంటూరు లెవెల్‌తో నిర్మాణం చేస్తే నిర్వాసితులు ఇబ్బందులు పడతారని చెప్పాం. ప్రాజెక్టు నిర్వాసితులకు పక్కాగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని సక్రమంగా వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. – ఐ.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ

మండలి ప్రశ్నోత్తరాలు

గంజాయి కట్టడిపై స్పెషల్ డ్రైవ్

- ప్రతిపక్షంలోకి వెళితే ఆటోమేటిక్‌గా కేసులు నమోదవుతాయి
- మండలిలో హోం మంత్రి అనిత



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గంజాయి సాగు, విక్రయాలను అరికట్టడానికి త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు హోం శాఖ మంత్రి అనిత మండలిలో ప్రకటించారు. ఇందుకోసం యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల్లో గంజాయి దుష్పరిణామాలను వివరించే విధంగా విద్యాసంస్థలతో కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. 2020 నుంచి 22,047 మంది నేరస్థులను అరెస్ట్ చేయగా 3,847 మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే 36 రాజకీయ ప్రేరేపిత హత్యలు జరుగుతున్నాయంటూ ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్‌సీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని, ఆ 36 మంది వివరాలు ఇమ్మంటే ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడున్న ఎందరు సభ్యులు కేసులు ఎదుర్కొన్నారో చేతులు ఎత్తమని అడగ్గా మండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం చెయ్యెత్తకపోవడంతో.. అనిత స్పందిస్తూ ప్రతిపక్షంలో ఉంటే ఆటోమేటిక్‌గా కేసులు నమోదవుతాయంటూ చెప్పడం గమనార్హం.

'పోలవరం' నాశనంలో ప్రథమ దోషి చంద్రబాబే..

మాజీ ఎంపీ హర్షకుమార్




రాజమహేంద్రవరం సిటీ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మళ్లీ మొదటి నుంచి చేపట్టాలని సీఎం చంద్రబాబు అంటున్నారని, ఈ ప్రాజెక్టు నాశనం కావడంలో మొదటి దోషి ఆయనేనని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ ధ్వజమెత్తారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోశుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం నిర్మాణ పనులపై జ్యుడీషియల్ విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించిన చంద్రబాబు.. నాణ్యత, పారదర్శకతను పాటించనందునే డయాఫ్రం వాల్ కొట్టుకు పోయిందని చెప్పారు. చంద్రబాబు హయాంలో హార్డ్ రాక్ తాకకుండా నిర్మించినందునే డయాఫ్రం వాల్ దెబ్బ తిందని స్పష్టం చేశారు. పోలవరంలో అనవసర కట్టడాలు నిర్మించారని, మేఘ కంపెనీకి లబ్ధి కోసం రూ.85 కోట్లతో అనవసరంగా గైడ్ బండ్ నిర్మించారని ఆరోపించారు. ఇన్ని అక్రమాలు జరిగినందున కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే ప్రాజెక్టు నిర్మాణంపై టెక్నికల్, జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పనుల్లో అవినీతి, అక్రమాలపై త్వరలో సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రానికి కేంద్రం ప్రకటించిన రూ.15 వేల కోట్లు ఎలా ఇస్తామో తెలియదు కానీ ఇస్తామని మంత్రి నిర్మలా సీతారామన్ అనడం దారుణమని, కేంద్రం ఇంత అన్యాయం చేస్తున్నా పవన్, చంద్రబాబులు ప్రశ్నించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

సూపర్-6 అంటే భయమేస్తోంది..



రూ.100 రాబడి వస్తుంటే రూ.113 ఖర్చు ఉంటోంది

- దీనికి ఎన్నికల హామీలు అదనం
- కేంద్రం రూ.15 వేల కోట్లు అప్పు ఇప్పిస్తామంటే ఆనందపడ్డా
- ప్రాజెక్టులను 'పీపీపీ' మోడల్‌లో ప్రైవేటుకు ఇద్దాం
- సంపద సృష్టించే మార్గాలను సభ్యులు అన్వేషించాలి
- ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి గత ప్రభుత్వమే కారణం
- అమరావతి అభివృద్ధిని నిలిపివేయడంతో భారీ నష్టం
- రాష్ట్ర ఆర్థిక విధానంపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు శ్వేతపత్రం



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి వచ్చే ఆదాయం కంటే ఉద్యోగులకు ఇవ్వాల్సిన జీతభత్యాలు, ఇతర చెల్లింపుల ఖర్చే అధికంగా ఉందని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. ఇవిగాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు చేయాల్సిన ఖర్చు అదనంగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో 'సూపర్-6' అంటే భయమేస్తోందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గత ప్రభుత్వంలో ఆర్థిక పరిస్థితులపై శుక్రవారం సీఎం శ్వేతపత్రం విడుదల చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..రాష్ట్రంలో రూ.100 ఆదాయం వస్తుంటే వేతనాలు, పెన్షన్లు, అప్పులు, వడ్డీలకు రూ.113 ఖర్చవుతోంది. దీంతో రాష్ట్రాభివృద్ధి, ఇచ్చిన హామీల అమలు ఎలాగో తెలీడంలేదు. ప్రస్తుతం సంపద సృష్టించే మార్గాలు కావాలి. సభ్యులు అలాంటి ఆలోచనలు చేయాలి. ఎమ్మెల్యేలు ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలి. 2014–19 మధ్య రాష్ట్రాన్ని నేనెంతో గొప్పగా అభివృద్ధి చేస్తే, 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమంపై పెట్టిన ఖర్చు అభివృద్ధిపై పెట్టకపోవడంతో రాష్ట్ర ఆదాయం తగ్గిపోయింది. రాష్ట్రంలో అంతర్గత రోడ్ల పునర్నిర్మాణం కోసం 'పబ్లిక్-ప్రైవేట్-పార్ట్‌నర్‌షిప్' (పీపీపీ) విధానాన్ని తెచ్చే యోచన చేయాలి. అందుకు కార్లు, బస్సులు, లారీల వంటి వాహనాల నుంచి 'టోల్' వసూలు చేసుకునే అవకాశం కల్పిస్తే రహదారులు బాగుపడతాయి.

మేం ఉంటే 2021కి పోలవరం పూర్తయ్యేది..

మా ప్రభుత్వమే అధికారంలో ఉండి ఉంటే 2021కి పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేది. ఇప్పుడిది ఎప్పుడు పూర్తవుతుందో తెలీదు. ఇది పూర్తయి ఉంటే రూ.45 వేల కోట్ల ఆదాయం వచ్చేది. ఇక ఉమ్మడి రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ.95,185 ఉంటే, విభజన తర్వాత 2014–15లో రూ.93,903కు తగ్గింది. గతంలో మా ప్రభుత్వంలో విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, కడప విమానాశ్రయాలను అభివృద్ధి చేశాం. భోగాపురం కొత్త ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఏర్పాట్లుచేశాం. అలాగే, పాత పోర్టులు కాకుండా మచిలీపట్నం, భావనపాడు, రామాయపట్నం కొత్త పోర్టులను 'పీపీపీ' విధానంలో చేపట్టాం. కానీ, గత ప్రభుత్వం పాలసీని మార్చి ఈపీసీ మోడల్ తీసుకొచ్చింది. ఇక వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ), చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీఐసీ)లను అభివృద్ధి చేశాను. అనేక కంపెనీలుం తీసుకొచ్చా. సంక్షేమాన్నీ మరువలేదు. రూ.200 పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచాం. మళ్లీ ఇప్పుడు రూ.3 వేల నుంచి ఒకేసారి రూ.4 వేలు చేశాం. డ్వాక్రా మహిళల తలసరి ఆదాయం రూ.36 వేల నుంచి రూ.84,670 పెంచాం.

అమరావతి ఆదాయాన్ని దెబ్బతీశారు..

అనుకున్న ప్రకారం అమరావతి పూర్తయితే ప్రపంచంలో గొప్ప సిటీగా మారేది. కానీ, గత ప్రభుత్వం దాన్ని పూర్తిచేయలేదు. అది జరిగి ఉంటే అమరావతిలో ఇప్పటికి 7 లక్షల ఉద్యోగాలు వచ్చేవి. తద్వారా.. రూ.4 లక్షల కోట్ల ఆదాయం వచ్చే అవకాశాన్ని గత ప్రభుత్వం దెబ్బతీసింది. మళ్లీ అమరావతికి పూర్వవైభవం తెస్తాం. అలాగే, గత ప్రభుత్వం రూ.9.74 లక్షల కోట్ల అప్పులు చేసింది. తలసరి అప్పు రూ.74,790 నుంచి రూ.1,44,336కు పెరిగింది. అదే సమయంలో ఆదాయం 13.2 శాతం నుంచి 9.5 శాతానికి తగ్గింది. పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలేవీ గత ప్రభుత్వం చేయలేదు. అప్పులు చేసి నిధులు పక్కదారి పట్టించారు. ప్రస్తుతం కాస్తోకూస్తో ఆదాయం ఎక్సైజ్ నుంచి వస్తే అది అప్పులు కట్టడానికి సరిపోతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేంద్రం రూ.15 వేల కోట్లు అప్పు ఇస్తామంటే సంబరపడిపోయా.

6 రోజులు..27.22 గంటలు

16వ శాసనసభ జరిగిన తీరిది

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 16వ శాసన సభ తొలి సమావేశాలు ఆరు రోజుల్లో 27.22 గంటల పాటు నిర్వహించినట్లు అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు వెల్లడించారు. శుక్రవారం సభలో అజెండా అంశాలపై చర్చలు ముగిసిన తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సభలో 36 నక్షత్ర మార్కు ప్రశ్నలకు, ఒక స్వల్ప వ్యవధి ప్రశ్నలకు సమాధానం లభించిందన్నారు. సీఎం మూడు ప్రకటనలు చేశారన్నారు. రెండు బిల్లులు ప్రవేశ పెట్టగా..ఏకగ్రీవంగా ఆమోదం పొందాయన్నారు. మొత్తం 68 మంది సభ్యులు ప్రసంగించగా.. 344వ నియమం కింద ఒక చర్చ సాగిందన్నారు. సభలో టీడీపీ 135, జనసేన 21, వైఎస్సార్ సీపీ 11, బీజేపీ 8 మంది సభ్యులు ఉన్నారన్నారు.

శాసన మండలి నిరవధిక వాయిదా

సాక్షి, అమరావతి: శాసన మండలి సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు శుక్రవారం ప్రకటించారు. 4 రోజుల పాటు జరిగిన సమావేశాల్లో 14 గంటలపాటు సభను నిర్వహించారు. సభ్యులు అడిగిన 40 ప్రశ్నలకు ప్రభుత్వం బదులివ్వగా 3 అంశాలపై ఆన్ టేబుల్ జవాబులు అందించారు. ప్రభుత్వం పెట్టిన 2 ప్రధాన బిల్లులు ఆమోదించగా 3 ప్రకటనలు ఇచ్చింది. వైఎస్సార్‌సీపీకి 30 మంది, టీడీపీకి 9 మంది, నామినేటెడ్ 8 మంది, స్వతంత్రులు 4 మంది, జనసేనకు ఒక్కరు చొప్పున సభ్యులు ఉన్నారు.

వచ్చే మంగళవారం రూ. 3 వేల కోట్ల అప్పు

సాక్షి, అమరావతి: మంగళవారం వచ్చిందంటే చంద్రబాబు సర్కారు అప్పులు చేయడమే పనిగా పెట్టుకుంది. ఇప్పటికే మూడు మంగళవారాల్లో చంద్రబాబు సర్కారు రూ. 9,000 కోట్లు అప్పు చేసింది. వచ్చే మంగళవారం అంటే ఈ నెల 30వ తేదీన మరో రూ. 3,000 కోట్లు అప్పు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలను వేలం వేయడం ద్వారా ఆ రుణాన్నీ ఆర్‌బీఐ సమీకరించి ఇవ్వనుంది. 15 సంవత్సరాల కాల వ్యవధిలో రూ. 1,000 కోట్లు, 20 సంవత్సరాల కాల వ్యవధిలో మరో రూ. 1,000 కోట్లు, 25 సంవత్సరాల కాల వ్యవధిలో ఇంకో రూ.1,000 కోట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పు చేయనుందని ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది. వచ్చే మంగళవారం చేసే అప్పుతో చంద్రబాబు సర్కారు ఇప్పటికే రూ.12,000 కోట్లు అప్పు చేసినట్లవుతుంది.

వరద బాధిత కుటుంబాలకు రూ.3 వేలు తక్షణ సాయం

- శాసన సభలో సీఎం చంద్రబాబు ప్రకటన
- 25 కిలోల బియ్యం, ఇతర వస్తువులు కూడా ఇస్తామని వెల్లడి
- 4,317 ఎకరాల్లో మాత్రమే వరి పూర్తిగా దెబ్బతిందని స్పష్టీకరణ
- మొక్కజొన్న 3,160 ఎకరాలు, పత్తి 960 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వరదలు, తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు చొప్పున తక్షణ సాయం అందజేస్తున్నట్టు సీఎం చంద్రబాబు శుక్రవారం శాసన సభలో ప్రకటించారు. వరదలు, తుపాన్లతో నెలకొన్న ఆందోళనకర పరిస్థితులపై జరిగిన చర్చలో సీఎం మాట్లాడుతూ.. ఇళ్లు నీట మునగడంతో పాటు పునరావాస శిబిరాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి తక్షణ నగదు సాయంతో పాటు 25 కిలోల బియ్యం, ఒక కేజీ పప్పు, లీటర్ పామాయిల్, కేజీ బంగాళదుంపలు, కేజీ ఉల్లిపాయలు అందిస్తామన్నారు. వ్యవసాయ, ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ మంత్రులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పంట, ఆస్తి నష్టం అంచనా వేయాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఎలా ఇవ్వాలో నివేదిక ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు, వరదలకు 4,317 ఎకరాల్లో మాత్రమే వరి ఆకుమడుల్లో పూర్తిగా దెబ్బతిందన్నారు. మొక్కజొన్న 3,160 ఎకరాలు, పత్తి 960 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేసినట్లు చెప్పారు. 985 ఎకరాల్లో విత్తనాలను రైతులు స్వయంగా సమకూర్చుకుంటున్నారని తెలిపారు. 725 ఎకరాల్లో విత్తనాలు వేసేందుకు 3,600 క్వింటాళ్లు ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉందని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 43,763 హెక్టార్లలో పంట నష్టం: మంత్రి అనిత

రాష్ట్రంలో వరదలు, తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాల బాధితులను, పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కోరారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, పోలవరం ఎమ్మెల్యే బాలరాజు తదితరులు మాట్లాడారు. ఉభయ గోదావరి జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. కాలువలు, డ్రెయినేజీల మరమ్మతులు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. తుపాను, వరదల ప్రభావం 10 జిల్లాలపై తీవ్రంగా ఉందన్నారు. శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పంటలు నీట మునిగినట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 43,763 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 2728.45 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బ తిన్నాయన్నారు. 230 గ్రామాలు ముంపునకు గురైనట్టు చెప్పారు. మొత్తంగా 75,123 మంది ప్రజలు ప్రభావితమయ్యారని, నలుగురు మృతి చెందినట్టు చెప్పారు. 82 సహాయక శిబిరాల్లో 13వేల మంది ఆశ్రయం పొందుతున్నట్టు వివరించారు. 894.69 కిలోమీటర్ల పెద్ద రోడ్లు, మరో 717.8 కిలోమీటర్ల పంచాయతీ రోడ్లు దెబ్బ తిన్నాయని తెలిపారు. 26 జిల్లాల్లోనూ ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు 69.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

ఐదేళ్లలో పంచాయతీలకు రూ.7,587.64 కోట్లు

- కేంద్రం ఇచ్చింది రూ. 8,283.92 కోట్లు
- ఆ నిధులన్నీ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల ఖాతాల్లో వేసింది
- 2023–24లో మాత్రమే కొంత పెండింగ్ ఉంది
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్ర ప్రభుత్వం 8,283.92 కోట్లు పంచాయతీలకు విడుదల చేయగా, అందులో రూ.7,587.64 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీల ఖాతాల్లోకి జమ చేసిందని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తెలిపారు. శాసన సభలో శుక్రవారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. 2019–20లో 2,336.56 కోట్లు, 2020–21లో రూ.1,837.50 కోట్లు, 2021–22లో రూ.1,338.52 కోట్లు, 2022–23లో రూ.1,378.65 కోట్లు, 2023–24లో రూ.1,392.69 కోట్లు విడుదలైందన్నారు. అయితే ఒక్క 2023–24 సంవత్సరంలో 696.41 కోట్లు పంచాయతీలకు చేరిందని, ఆ ఏడాది వచ్చిన నిధుల్లో మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉందని తెలిపారు. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం కుంటుపడిందన్నారు. ఇప్పటికీ పారిశుద్ధ్య కార్మికులకు రూ.103 కోట్లు బకాయిలు ఉన్నట్టు చెప్పారు. పంచాయతీల అనుమతి లేకుండా డిస్కంకు కరెంట్ బిల్లుల కింద రూ.2,285 కోట్లు మళ్లించిందన్నారు. 2018లో నిర్వహించాల్సిన పంచాయతీ ఎన్నికలను రెండేళ్లు ఆలస్యం చేయడం వల్ల సమస్యలు తిష్టవేసినట్టు తన సమీక్షల్లో తేలిందన్నారు. పంచాయతీ ఖాతాల్లోకి లావాదేవీలు జరిగినప్పటికీ, ఇప్పుడు బ్లీచింగ్ కొనడానికి కూడా డబ్బులు లేవన్నారు. పంచాయతీల్లో నిధుల వినియోగం, మళ్లింపుపై సుదీర్ఘంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

మడ అడవులు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

మడ అడవులను విధ్వంసం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. మడ అడవుల పరిరక్షణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మంగళగిరిలోని రాష్ట్ర అటవీ శాఖ కార్యాలయం అరణ్య భవన్‌లో అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. పొలాల్లోకి, నివాస ప్రాంతాల్లోకి వచ్చే ఏనుగుల గుంపును తిరిగి అడవుల్లోకి పంపించేందుకు అటవీ శాఖ దగ్గర కుంకీ ఏనుగుల కొరత ఉందని అధికారులు తెలిపారు. దీనిపై పవన్ స్పందిస్తూ కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వంతో కుంకీ ఏనుగుల గురించి తాను స్వయంగా చర్చిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంతరాము, అటవీ దళాల అధిపతి చిరంజీవి చౌదరి, వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ ఎ.కె.నాయక్, అటవీ శాఖ ప్రత్యేక కార్యదర్శి శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఒక్క బ్రూవరేజ్‌కు అనుమతివ్వలేదు



గత ఐదేళ్లలో రాష్ట్రంలో కొత్తగా ఒక్క బ్రూవరేజ్‌కు కూడా అనుమతి ఇవ్వలేదని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎమ్మెల్యే బొండా ఉమా ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మైక్రో బ్రూవరేజ్‌లకు మాత్రమే అనుమతులు ఇచ్చారన్నారు. లైసెన్సుల జారీ, మార్గదర్శకాల అమల్లో ఎటువంటి ఉల్లంఘనలు గుర్తించలేదని చెప్పారు.

ఉద్యోగాల కల్పన హామీకి కట్టుబడి ఉన్నాం

శాసనమండలిలో మంత్రి లోకేశ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీకి కట్టుబడి ఉన్నామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. శుక్రవారం శాసనమండలిలో పలువురి సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. తల్లికి వందనం పథకానికి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు. ఉద్యోగ కల్పన ఆధారంగా పరిశ్రమలకు రాయితీలను అందిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జూనియర్ కాలేజీల నుంచి విశ్వవిద్యాలయాల వరకు 3,320 బోధన, 4,663 మంది బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటిని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయడానికి కృషి చేస్తామన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగు, బూట్లు, యూనిఫాం అందించే విద్యాకానుక పథకాన్ని కొనసాగిస్తామని చెప్పారు. గతంలో ఈ పథకంలో అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఇక బైలింగ్వల్ పుస్తకాలు, బైజూస్ ట్యాబ్‌లను కొనసాగించే విషయంపై అందరి అభిప్రాయం తీసుకొంటామన్నారు. ఇక అసెంబ్లీ లాబీలో ఆయన అనుకూల మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తన దగ్గరున్న రెడ్ బుక్ ఇంకా తెరవలేదన్నారు. గత ఐదేళ్లలో సీఎంగా ఉన్నప్పుడు రెండు ప్రెస్‌మీట్లు పెట్టిన జగన్, 11 సీట్లు వచ్చాక నెల రోజుల వ్యవధిలో 5 ప్రెస్‌మీట్‌లు పెట్టారన్నారు. జగన్ చెప్పే విషయాలన్నీ అసెంబ్లీకి వచ్చి చెప్తే.. ఆయన్ను గౌరవంగా చూసుకుని వాస్తవాలు అర్థమయ్యేలా వివరిస్తామన్నారు.

నా దందాల జోలికి రావద్దు

- విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాకు టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వార్నింగ్?
- సుజనా చౌదరి ఇంటికి వెళ్లి వాగ్వాదం
- కార్పొరేషన్, దుర్గగుడి తనకు వదిలేయాలని హెచ్చరిక
- కుదరదంటున్న సుజనా చౌదరి



బుద్దా వెంకన్న



సుజనా చౌదరి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడలో కూటమి నేతల మధ్య దందాల పంచాయితీ తీవ్రస్థాయిలో నడుస్తోంది. మరీ ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. తన దందాల జోలికి వస్తే ఊరుకోబోమంటూ సుజనా చౌదరి ఇంటికి వెళ్లి మరీ బుద్దా వెంకన్న గట్టిగా హెచ్చరించినట్లు సమాచారం .కూటమి నేతల కథనం ప్రకారం.. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో కార్పొరేషన్ వ్యవహారాలు ఓ పార్టీ నేతలు, దుర్గగుడి ఇతర విభాగాల వ్యవహారాలు మరో పార్టీ చూసుకోవాలంటూ సెటిల్‌మెంట్ చేసుకున్నారు. ఇందులో బుద్దా వెంకన్న, మాజీ ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వలేదు. దీంతో తన పరిధిలో తనకు అవకాశం ఇవ్వకుండా ఏమి చేస్తారో చూస్తానంటూ బుద్దా, ఆయన వర్గీయులు తీవ్రంగా మండిపడుతున్నారు. మరోపక్క ఎమ్మెల్యే సుజనా తాను చెప్పిన వారికే పనులు చేయాలని పలువురు అధికారులకు బహిరంగంగానే చెప్పారు. ఆయన ఇటీవల శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానానికి వెళ్లి కూటమి పార్టీల నుంచి ఎవరు ఏం చెప్పినా స్థానిక ఎమ్మెల్యేగా తనకు చెప్పకుండా చేయవద్దని అధికారులకు స్పష్టంగా చెప్పారు. బీజేపీ అభ్యర్థి గెలిస్తే స్థానికంగా తానే ఎమ్మెల్యేలా పని చేయవచ్చని భావించిన బుద్దాకు కార్పొరేషన్ పార్కింగ్‌లు, దుర్గగుడిలో పైరవీలకు సుజనా అడ్డంకిగా మారటం మింగుడు పడలేదు. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన సుజనా ఇంటికి వెళ్లి మరీ బుద్దా వెంకన్న వాగ్వాదానికి దిగారు. 'నా దందాల జోలికి రావద్దు. మేం పని చేస్తేనే మీరు గెలిచారు. కార్పొరేషన్, దుర్గగుడి విషయాల్లో జోక్యం చేసుకోకండి. వాటిని మాకు వదిలేయండి' అంటూ సుజనాను బుద్దా గట్టిగా హెచ్చరించారు. సుజనా కూడా ఎమ్మెల్యేనైన తనకు తెలియకుండా ఏదీ జరగకూడదని, దోపిడీలు, దందాలు చేయొద్దని గట్టిగానే హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇద్దరూ గట్టిగా వాదులాడుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యవహారంపై లోకేశ్‌కు ఫిర్యాదు చేయడానికి పలువురు నేతలు సిద్ధమయ్యారు.

నెల రోజుల్లో విచ్చలవిడిగా దందాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలన్నరే అయినా ఆ పార్టీ నేతలు విచ్చలవిడిగా దందాలకు పాల్పడుతున్నారు. విద్యాధరపురంలో ఏడాది క్రితం నిర్మించిన భవనాన్ని ప్లాన్ ప్రకారం కట్టలేదని పూర్తిగా ధ్వంసం చేయించినట్లు తెలిసింది. కనీసం రూ.35 లక్షలు ఇస్తేనే దానికి అనుమతిస్తామంటూ టీడీపీ నేతలు డిమాండ్ చేసినట్లు సమాచారం. నగరంలోని మల్లికార్జునపేటలోనూ ఇదే తరహాలో మరో భవనానికి సంబంధించి భారీగా నగదును తీసుకున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో నాలుగు ప్రధానమైన పార్కింగ్‌లను ఎటువంటి టెండర్లు లేకుండా ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని పార్కింగ్‌లకు బినామీలతో తక్కువ పాట పోయేలా చూడాలని ఆదేశించారు.

'ప్రకటనల'పైనా దుష్ప్రచారమే!

- పత్రికలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రకటనలపై టీడీపీ సభ్యుల వక్రీకరణ
- నిబంధనలు, ఏబీసీ గణాంకాలను అనుసరించే పత్రికలకు ప్రకటనలు

సాక్షి, అమరావతి: శాసన సభ వేదికగా టీడీపీ కూటమి ప్రభుత్వం 'సాక్షి' పత్రికపై మరోసారి దుష్ప్రచారానికి తెగించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వివిధ పత్రికలకు ఇచ్చిన ప్రకటనల వ్యయాన్ని వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించింది. వాస్తవానికి సమాచార శాఖ నిబంధనలు, ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ (ఏబీసీ) గణాంకాలను పరిగణనలోకి తీసుకునే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ పత్రికలకు ప్రకటనలు ఇచ్చింది. కానీ, శాసన సభలో మంత్రి పార్థసారథి, టీడీపీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, బెందాళం అశోక్ తదితరులు వాస్తవాలను వక్రీకరిస్తూ దుష్ప్రచారానికి యత్నించారు. సమాచార శాఖ ద్వారా సాక్షి పత్రికకు రూ. 293 కోట్లు, వివిధ శాఖల ద్వారా రూ.78 కోట్లు.. మొత్తం రూ.371 కోట్ల మేర ప్రకటనలు ఇచ్చినట్టు తెలిపారు. కానీ ఈనాడు పత్రికకు అంతకంటే తక్కువగా ప్రకటనలు జారీ చేశారని ఆరోపించారు. వాస్తవం ఏమిటంటే సాక్షి, ఈనాడు పత్రికలకు సమానంగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చింది. సాక్షి పత్రికకు ఐదేళ్లలో సమాచార శాఖ, ఇతర శాఖల ద్వారా మొత్తంగా రూ.371 కోట్ల విలువైన ప్రకటనలు జారీ చేసింది. అదే రీతిలో ఈనాడు పత్రికకు కూడా మూడున్నరేళ్లపాటు ప్రకటనలు ఇచ్చింది. ఆ మూడున్నరేళ్లలోనే ఈనాడుకు సమాచార శాఖ ద్వారా రూ.190 కోట్లు, వివిధ శాఖల ద్వారా రూ.53 కోట్లు.. మొత్తం రూ.243 కోట్లు విలువైన ప్రకటనలు ఇచ్చింది. మూడున్నరేళ్ల తరువాత ఈనాడు యాజమాన్యం తమకు ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వొద్దని, తాము ప్రచురించబోమని అధికారికంగా సమాచార శాఖకు లేఖ రాసింది. దాంతో చివరి ఏడాదిన్నర ఈనాడు పత్రికకు ప్రకటనలు ఇవ్వలేదు. అదీ.. ఈనాడు పత్రిక యాజమాన్యం స్వచ్ఛందంగా వద్దని లేఖ రాయడంతోనే. ఆ ఏడాదిన్నర కూడా ఈనాడు పత్రిక యాజమాన్యం ప్రకటనలు తీసుకొని ఉంటే ప్రభుత్వం మరో రూ.125 కోట్ల వరకు విలువైన ప్రకటనలు ఇచ్చేది. దాంతో సాక్షి పత్రికతో సమానంగా ఈనాడు పత్రికకు కూడా ప్రకటనల బడ్జెట్ కేటాయించినట్టు అయ్యేది. పైగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈనాడు పత్రికకు ప్రకటనల బిల్లులు పూర్తిగా చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందని టీడీపీ ఎమ్మెల్యేలు విమర్శించారు. వాస్తవమేమిటంటే.. ఈనాడు పత్రికకే కాదు.. సాక్షి పత్రికకు కూడా ప్రకటనల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనాడు పత్రికకు చెల్లించాల్సిన ప్రకటన బకాయిలు రూ. 51 కోట్లు ఉండగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అయినప్పటికీ సాక్షి పత్రికకు రూ.104.85 కోట్ల యాడ్స్ బకాయిలు పెండింగులో ఉన్నాయి. ఇవీ వాస్తవాలు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలలో ప్రచురితమయ్యే 22 పెద్ద పత్రికలతో పాటు ఎన్నో చిన్న పత్రికలు, మేగజైన్లకు కూడా ప్రకటనలు ఇచ్చింది. మార్గదర్శకాలను ఏమాత్రం ఉల్లంఘించకుండా, వివక్షకు తావు లేకుండా ప్రకటనలు ఇచ్చింది. కానీ, మంత్రి పార్థసారథి, టీడీపీ ఎమ్మెల్యేలు ఈ విషయాలను వక్రీకరిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషం చిమ్మారు.

'సాక్షి'లో ప్రకటనలకు రూ. 371 కోట్లు : మంత్రి పార్థసారథి



సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం వార్తా పత్రికలకు ప్రకటనలు ఇవ్వడంలో ఎటువంటి పక్షపాత ధోరణి చూపలేదని గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శాసన సభలో సభ్యుల ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. జీవో నంబర్ 431లో ప్రభుత్వ శాఖల ప్రకటనలు ఇచ్చేందుకు సమాచార పౌర సంబంధాల శాఖకు విచక్షణ అధికారం కల్పించారని, దీని ప్రకారం అధికారులు ప్రకటనల జారీపై నిర్ణయం తీసుకుని ఉంటారని అభిప్రాయపడ్డారు. ఇందులో ఏదైనా తప్పు దొర్లితే విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే ఐదేళ్లలో సాక్షి దినపత్రికకు రూ.371 కోట్లు, మిగిలిన పత్రికలకు రూ.488 కోట్లు మాత్రమే ప్రకటనలకు ఖర్చు చేశారన్నారు. ఇతర శాఖల ద్వారా సాక్షి పత్రిక కొనేలా జీవో జారీ చేసి రూ.32.75 కోట్లు అదనంగా లబ్ధి చేకూర్చారని తెలిపారు. సాక్షితో సమానంగా సర్క్యులేషన్ ఉన్న ఈనాడు పత్రికకు ప్రకటనలు ఇస్తున్నప్పటికీ, చెల్లింపులు జాప్యం చేస్తున్నరంటూ ఆ పత్రిక ప్రకటనలు వదులుకుందని చెప్పారు. సాక్షికి ప్రకటనలు ఇవ్వడంపై సభ్యులు సూచనల మేరకు హౌస్ కమిటీకి వెళ్లే అంశంపై సభాపతి, ముఖ్యమంత్రితో చర్చిస్తామని అన్నారు.

ఢిల్లీకి సీఎం చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం రాత్రి ఢిల్లీకి విచ్చేశారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో ఆయన ఇక్కడికి చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా జనపథ్-1లోని తన నివాసానికి సీఎం చేరుకున్నారు. ప్రధానమంత్రి మోదీ అధ్యక్షతన శనివారం జరిగే నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు. చంద్రబాబు ఢిల్లీకి రావడం ఇది మూడోసారి.



యుద్ధం చూద్దాం...

25 ఏళ్ల కార్గిల్

కార్గిల్ వార్‌లో భారత పతాకం విజయగర్వంతో నిలబడి 25 ఏళ్లు. వీరులు శూరులై ప్రాణాలను చిరునవ్వుతో త్యాగం చేసి ఎందరో సైనికులు అమరులైతే మనకా విజయం సిద్ధించింది. వారి కథలు గాథలు తలుచుకోవాల్సిన సమయం ఇది. అందుకై 'రజత్ జయంతి వర్ష్' పేరుతో ఉత్సవాలు సాగుతున్నాయి. ఆ యుద్ధ సమయపు తెగువను బాలీవుడ్ గొప్పగా చూపించింది. ఆ సినిమాలను పిల్లలకు చూపించాలి ఈ వీకెండ్.

పాతికేళ్లంటే కనీసం మూడుతరాలు వచ్చి ఉంటాయ్. దేశం దాటిన క్లిష్ట పరిస్థితులు ఏ తరానికి ఆ తరం స్ఫూర్తిదాయకంగా అందిస్తూ ఉండాలి. అప్పుడే ఆ స్ఫూర్తిని కొత్తతరం అందిపుచ్చుకుంటూ ఉంటుంది. అనూహ్యంగా మన ప్రాంతంలో చొరబడి వాస్తవాధీన రేఖ దగ్గర 1999లో టైగర్ హిల్‌ను ఆక్రమించింది పాకిస్తాన్. వారిని వెనక్కు తరిమి కొట్టడానికి భారత సైన్యం రంగంలో దిగింది. మే 2 నుంచి జూలై 26 వరకు అంటే రెండు నెలల మూడు వారాల రెండు రోజుల పాటు ఈ యుద్ధం సాగింది. ఆక్రమిత ప్రాంతం కొండ కావడంతో పై నుంచి శత్రువులు సులభంగా దాడి చేసే పరిస్థితి ఉండటంతో ఈ యుద్ధం ఒక సవాలుగా మారింది. అయినా సరే మన ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ కలిసి విజయం సాధించాయి. తర్వాతి కాలంలో ఈ యుద్ధ నేపథ్యంలో ఎంతో సాహిత్యం, పుస్తకాలు, సినిమాలు వచ్చాయి. వాటిలో బాలీవుడ్ నుంచి వచ్చిన ముఖ్యమైన సినిమాలు ఇవి... 1) లక్ష్య 2) షేర్ షా 3) ఎల్‌ఓసి కార్గిల్ 4) గుంజన్‌సక్సేనా 5. ధూప్.

1. లక్ష్య (2004)

లక్ష్య రహితమైన ఒక యువకుడు కార్గిల్ యుద్ధంలో దేశానికి సేవ చేయడమే తన లక్ష్యం అని గ్రహించడమే 'లక్ష్య'. హృతిక్ రోషన్ నటించిన ఈ సినిమాలో అమితాబ్, బొమన్ ఇరాని, ఓం పురి వంటి ఉద్ధండులు నటించారు. పెద్దగా బాధ్యత పట్టని హృతిక్ రోషన్ తన స్నేహితుడు రాస్తున్నాడని డిఫెన్స్ సర్వీస్ అకాడెమీ పరీక్షలు రాసి ఇండియన్ మిలటరీ అకాడెమీలో సీట్ తెచ్చుకుంటాడు. కాని ట్రయినింగ్ అతని వల్ల కాదు. పారిపోయి వస్తాడు. అయితే అందరూ అతణ్ణి తక్కువ దృష్టితో చూసే సరికి ఈసారి పట్టుదలగా వెళ్లి ట్రయినింగ్ పూర్తి చేసి పంజాబ్ బెటాలియన్‌కు ఎంపికవుతాడు. అదే సమయంలో కార్గిల్ యుద్ధం మొదలవుతుంది. ఆ యుద్ధంలో 1000 అడుగుల కొండ మొనపై ఉన్న పాకిస్తాన్ యూనిట్‌ను కడతేర్చడానికి భారత సైన్యం నుంచి బయలుదేరిన 12 మందిలో హృతిక్ కూడా ఒకడు. వీరిలో ఆరుగురు మరణించినా పాకిస్తాన్ యూనిట్‌ను ధ్వంసం చేసి విజయం సాధిస్తారు. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా విడుదల సమయంలో ఆదరణ పొందకపోయినా తర్వాత కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. చాలా మంది కుర్రాళ్లను సైన్యంలో చేరేందుకు ఈ సినిమా ప్రేరేపించింది.

2. షేర్‌షా (2021)

'యుద్ధానికి వెళుతున్నాను. మన దేశపతాకాన్ని ఎగరేసి వస్తాను లేదా అందులో చుట్టబడైనా వస్తాను' అని చెప్పిన ఆర్మీ ఆఫీసర్ విక్రమ్ బాత్ర బయోపిక్ షేర్‌షా. కార్గిల్ యుద్ధంలో ఊరికే ఆరాకొరా శత్రువులను నేల రాల్చడం తన తత్వం కాదని 'ఏ దిల్ మాంగే మోర్' తన నినాదమని అందరు శత్రువులను నామరూపాల్లేకుండా చేస్తానని చెప్పిన విక్రమ్ బాత్ర అలాగే చేసి మన పతాకం ఎగురవేసి ప్రాణాలు కోల్పోయాడు. సిద్దార్థ్ మల్హోత్ర, కియారా అద్వానీ నటించిన ఈ సినిమా కోవిడ్ కారణంగా అమెజాన్‌లో స్ట్రీమ్ అయ్యింది. తమ ప్లాట్‌ఫామ్ మీద అత్యధికులు వీక్షించిన సినిమా షేర్‌షా అని అమెజాన్ తెలిపింది. తుపాకీ గుళ్ల మరఫిరంగుల ఫీంకారాలు మాత్రమే వినపడే యుద్ధ రంగంలో సైనికుల మానసిక స్థితి, వారు ప్రదర్శించే స్థయిర్యం ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూడాలి. కార్గిల్ వీరునికి గొప్ప నివాళి ఈ సినిమా.

3.ఎల్‌ఓసి కార్గిల్ (2003)

1997లో 'బోర్డర్' వంటి సూపర్‌హిట్ తీసిన జె.పి.దత్తా కార్గిల్‌వార్ మీద తీసిన 4 గంటల 15 నిమిషాల సుదీర్ఘమైన సినిమా ఎల్‌ఓసి కార్గిల్. వాస్తవాధీన రేఖను దాటి పాకిస్తాన్ సైన్యం కార్గిల్‌లో తిష్ట వేశాక వివిధ దళాలు ఎన్ని విధాలుగా కార్యరంగంలో దిగుతాయి సైనిక తంత్రాలు ఎలా ఉంటాయి ఆఫీసర్లకు వారి దళాలకు సమన్వయం ఎలా ఉంటుందో ఇవన్నీ దాదాపుగా తెలియాలంటే ఈ సినిమా తీయాలి. నిడివి రీత్యా ప్రేక్షకులు ఈ సినిమాను చూడలేకపోయినా దర్శకుడు పట్టుబట్టి అలాగే ఉంచేశాడు. సంజయ్ దత్, అజయ్ దేవగణ్, సన్ని డియోల్, సునీల్ శెట్టి, అభిషేక్ బచ్చన్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో ఉంది.

4. గుంజన్ సక్సేనా (2020)

'కార్గిల్ గర్ల్'గా ఖ్యాతి గడించిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్ పైలట్ గుంజన్ సక్సేనా బయోపిక్ ఇది. ఉత్తర్‌ప్రదేశ్‌లో జన్మించిన గుంజన్ పైలట్ కావాలని కలలు కంది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అమ్మాయిలకు అప్పుడే ప్రవేశం కల్పించినా ట్రయినింగ్ సమయంలో ఆ మగవాళ్ల ప్రపంచంలో సవాళ్లు ఎదుర్కొంది గుంజన్. 1996లో భారతదేశ తొలి ఎయిర్‌ఫోర్స్ మహిళా పైలట్‌లలో ఒకరైన గుంజన్ 1999లో కార్గిల్‌లో చురుకైన పాత్ర పోషించింది. యుద్ధ సమయంలో గాయపడిన వారిని బేస్ క్యాంప్‌కు తరలించి వైద్యం అందించడంలో లెక్కకు మించి చక్కర్లు కొట్టింది. మిస్సయిల్స్‌కు అందితే ప్రాణాలు చెల్లాచెదురవుతాయని తెలిసినా ఆమె సాహసం కొనసాగింది. జాన్వీ కపూర్ నటించిన ఈ సినిమా అమ్మాయిలకు సమాన అవకాశాలు అన్నింటా కావాలని చెబుతుంది.

5. ధూప్ (2003)

యుద్ధంలో బలిదానం ఇచ్చిన వీరులను శ్లాఘించడం సరే నిజ జీవితంలో వారి కుటుంబం ఎటువంటి గౌరవాన్ని పొందుతోంది అని ప్రశ్నించే సినిమా ధూప్. కార్గిల్ యుద్ధంలో మరణించిన కెప్టెన్ అనుజ్ నయ్యర్ కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులను ఆధారం చేసుకుని ఈ సినిమా తీశారు. అనుజ్ మరణించాక ప్రభుత్వం వారికి ఒక పెట్రోల్ బంక్ కేటాయిస్తుంది. కుటుంబ సభ్యులు ఇందుకు మొదట నిరాకరించినా కొడుకు స్మృతిని నిలబెట్టడానికి ఇదొక మార్గమని భావించి అందుకు అంగీకరిస్తుంది. అయితే అక్కడి నుంచే కథ మొదలవుతుంది. ప్రభుత్వం కేటాయించిన పెట్రోల్ బంక్ వాస్తవ రూపం దాల్చాలంటే ఎన్ని లంచాలు, ఎన్ని అడ్డంకులు, ఎన్ని అవమానాలు ఎదురవుతాయో ఈ సినిమా చూపిస్తుంది. చివరకు కుటుంబం పెట్రోల్ బంక్ సాధించి దానికి 'కార్గిల్ హైట్స్' అని పేరు పెడుతుంది. అమరుల రుణం తీర్చుకునే దారిలో ప్రభుత్వం, పౌరులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని చెప్పే చిత్రం ఇది. ఓంపురి,రేవతి తారాగణం.





"సియాచిన్ మాది" అంటోంది పాకిస్థాన్. "కాదు, మాది" అంటోంది భారత్. ప్రపంచంలోనే అతి ఎత్తైయిన ఈ యుద్ధక్షేత్రంలో రెండు దేశాల సైన్యాలు దశాబ్దాలుగా ఘర్షణ పడుతూనే ఉన్నాయి. భారత్ నలభై ఏళ్ల క్రితమే 'ఆపరేషన్ మేఘదూత్' పేరుతో సైనిక చర్య జరిపి సియాచిన్‌పై నియంత్రణ సాధించినా.. పాక్ తన పట్టు వీడటం లేదు. ఈ పరిస్థితిని "చక్కబరచటానికి" భారత సైన్యం ఇటీవలే సియాచిన్ డ్యూటీకి ప్రత్యేకంగా ఒక ఆర్మీ ఆఫీసర్‌ను పంపింది. ఆ ఆఫీసరే.. సుప్రీత. కెప్టెన్ సుప్రీత. సియాచిన్‌పైకి వెళ్లిన తొలి మహిళా సేనాని!

సియాచిన్ పైకి మహిళా సేనాని!

భారత సైన్యంలో 40 విభాగాలు ఉంటాయి. 14 ప్రధాన ఉప–విభాగాలు ఉంటాయి. ఈ ఉప విభాగాలను 'కోర్స్' అంటారు. వాటిల్లో ఒకటి 'కోర్స్ ఆఫ్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్'. అందులో సైనికాధికారిగా విధులు నిర్వర్తిస్తుంటారు కెప్టెన్ సుప్రీత.

సముద్ర మట్టానికి 18,875 అడుగుల ఎత్తున, హిమాలయాల్లోని తూర్పు కారకోరం పర్వత శ్రేణుల్లో ఉంటుంది సియాచిన్ గ్లేసియర్. నది గడ్డ కట్టినట్లుగా ఉండే ఆ ప్రాంతంలో కెప్టెన్ సుప్రీతకు డ్యూటీ పడింది! ఈ నెల 18నే.. వెళ్లి చేరారు. సియాచిన్ గ్లేసియర్‌లో విధులు నిర్వర్తిస్తున్న తొలి ఉమన్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ ఆఫీసర్‌గా రికార్డు సృష్టించారు.

ఈ ఏడాది గణతంత్ర వేడుకల్లో.. ఒక అరుదైన విషయం అందరి దృష్టినీ ఆకర్షించింది. కొత్తగా పెళ్లయిన ఒక యువ జంటలో – భర్త ఒక సైనిక దళానికి, భార్య మరొక దళానికి నేతృత్వం వహించారు! భర్తది తమిళనాడు. భార్యది కర్ణాటక. అనుకోకుండా ఇద్దరికీ ఢిల్లీ వేడుకల్లో దళాలను పరేడ్ చేయించే అవకాశం వచ్చింది. ఆ భర్త.. మేజర్ జెర్రీ బ్లైజ్. ఆ భార్య.. కెప్టెన్ సుప్రీత. అసలు మహిళలు ఆర్మీలోకి రావటమే గొప్ప సంగతైతే, సుప్రీత అక్కడి నుంచి సియాచిన్ వరకు 'ఎదగటం' చెప్పుకోదగ్గ విశేషం. భారత సైన్యంలో ఆమె కెరీర్ 2021లో లెఫ్టినెంట్‌గా మొదలైంది. చెన్నైలోని 'ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ (ఒ.టి.ఎ.)లో ఆమె శిక్షణ పొందారు. కాలేజ్‌లో ఎన్సీసీతో మొదలైన ఆమె దేశ రక్షణ దళ ప్రయాణం.. ముందు వరుస యుద్ధ క్షేత్రం వరకు దృఢచిత్తంతో ముందుకు సాగింది.

సుప్రీత మైసూర్ అమ్మాయి. అక్కడి కృష్ణరాజనగరంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్లో చదివారు. మైసూరులోనే మరిమల్లప్ప ప్రీ–యూనివర్శిటీ కాలేజ్‌లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదవటానికి ముందు, జె.ఎస్.ఎస్. లా కాలేజ్‌లో డిగ్రీ చేశారు. ఆమె తండ్రి తిరుమల్లేశ్ మైసూరు దగ్గరి తలాకాడులో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్. తల్లి నిర్మల గృహిణి. ఆర్మీపై తనకున్న ఇష్టాన్ని గౌరవించిన తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సుప్రీత ఎన్సీసీలో ఎయిర్ వింగ్ 'సి' సర్టిఫికెట్ సాధించారు. న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్ (రాజ్‌పథ్)లో రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా కర్ణాటక–గోవా నడిపించారు. 2016లో ఆలిండియా వాయు సైనిక్ క్యాంప్‌లో కర్ణాటకకు ప్రాతినిధ్యం వహించారు. ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్ అయ్యాక సియాచిన్‌ను అధిరోహించటానికి మళ్లీ ఓ.టి.ఎ.లో చేరారు. శిక్షణలో భాగంగా ఆమెను వ్యూహాత్మకంగా ప్రాధాన్యం కలిగిన అనంత్‌నాగ్, జబల్పూర్, లేహ్ ప్రాంతాలకు పంపించారు. ఆ శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు సుప్రీత.

సుప్రీత, బ్లైజ్‌ల వివాహం గత ఏడాదే జరిగింది. సుప్రీత మామగారు రిటైర్డ్ కల్నల్ రిచర్డ్ బ్లెయిజ్. సుప్రీత అత్తగారు లెఫ్టినెంట్ కల్నల్ విజయలక్ష్మి. పుట్టినింటి, మెట్టినింటి రెండూ ప్రోత్సాహాలు సుప్రీత కెరీర్‌కు కలిసి వచ్చాయనే అనుకోవాలి. అంతకంటే కూడా ఆమె దీక్ష, పట్టుదల.

సినిమా


● నాని

రైటర్ నాని?

హీరో నాని రైటర్‌గా మారనున్నారా? అంటే అవుననే మాట ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. తన నిర్మాణ సంస్థ వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై దర్శకుడు శైలేష్ కొలనుతో 'హిట్, హిట్ 2' సినిమాలను నిర్మించారు నాని. ఈ రెండు చిత్రాలకు మంచి ప్రేక్షకాదరణ లభించింది. 'హిట్ 2' సినిమా చివర్లో 'హిట్ 3'లో నాని హీరోగా పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్ పాత్రలో నటించనున్నట్లుగా మేకర్స్ వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ ఏడాదిలోనే 'హిట్ 3' చిత్రీకరణ ప్రారంభం కానుందట. 'హిట్, హిట్ 2' సినిమాలకు దర్శకత్వం వహించిన శైలేష్ కొలనే 'హిట్ 3'ని తెరకెక్కించనున్నారు. కానీ ఈ సినిమాకు నాని కథ–స్క్రీన్‌ప్లే అందించనున్నారని భోగట్టా. మరి.. ఈ సినిమాతో నాని రైటర్‌గా మారతారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు నాని హీరోగా నటించిన 'సరిపోదా శనివారం' సినిమా ఆగస్టు 29న రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఇంకా 'దసరా' తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరో సినిమా కమిటైన సంగతి తెలిసిందే.


● అమలా పాల్


● కాలేజ్ ఈవెంట్‌లో...

నాకు తప్పుగా అనిపించలేదు

''లెవల్ క్రాస్' మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ఓ కళాశాలలో జరిగిన ఈవెంట్‌లో పాల్గొన్నాను. ఆ ఈవెంట్‌కి నేను వేసుకుని వెళ్లిన డ్రెస్ నాకు చాలా సౌకర్యంగా అనిపించింది. ఆ దుస్తుల్లో ఆ ఈవెంట్‌కు వెళ్లడం నాకు తప్పుగా అనిపించలేదు'' అని హీరోయిన్ అమలాపాల్ అన్నారు. ఆమె నటించిన తాజా మలయాళ చిత్రం 'లెవల్ క్రాస్' శుక్రవారం (జూలై 26) విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా కేరళలోని ఎర్నాకులంలో ఓ కాలేజ్‌లో నిర్వహించిన ఈవెంట్‌లో పాల్గొన్నారు అమలా పాల్. అయితే ఈ కార్యక్రమంలో ఆమె వేసుకున్న డ్రెస్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. పొట్టి దుస్తుల్లో కాలేజీకి వెళ్లి విద్యార్థులకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు? విద్యా సంస్థల్లో జరిగే కార్యక్రమాలకు వెళ్లేటప్పుడు పద్ధతిగా వెళితే బాగుంటుంది? అంటూ అమలా పాల్‌ను ట్రోల్ చేస్తూ విమర్శిస్తున్నారు పలువురు నెటిజన్లు. ఈ విమర్శలపై అమలా పాల్ స్పందిస్తూ– ''కాలేజ్‌లో జరిగిన ఈవెంట్‌లో నేను ధరించిన డ్రెస్ నాకు సౌకర్యంగా అనిపించింది. ఆ డ్రెస్‌లో నన్ను చూడటం విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యంగా అనిపించలేదు. నిజానికి నా దుస్తులను కెమెరాలు ఎలా చూపిస్తాయన్నదే అసలు సమస్య. కాలేజీకి నేను ఆ డ్రెస్ వేసుకుని వెళ్లడం వెనక ఉన్న ఉద్దేశం విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడానికే. నేను మోడ్రన్ డ్రెస్సులతో పాటు సంప్రదాయ దుస్తులు కూడా ధరిస్తాను'' అన్నారు.

ట్రైలర్ చూస్తే చిన్న సినిమా కాదని అర్థమైంది - సిద్ధు జొన్నలగడ్డ


● సిద్ధు జొన్నలగడ్డ, నిహారిక, యదు వంశీ


''కమిటీ కుర్రోళ్ళు' ట్రైలర్ చూస్తే చిన్న సినిమా కాదని అర్థమైంది. విజువల్స్ బాగున్నాయి. అసలు చిన్న సినిమా పెద్ద సినిమా అనేది ఉండదు. ఓ సినిమాకు తక్కువ ఖర్చు పెడతాం... మరో సినిమాకి ఎక్కువ ఖర్చు పెడతాం... అంతే'' అని హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. నూతన నటీనటులతో యదు వంశీ దర్శకత్వం వహించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించారు. ఆగస్టు 9న విడుదల కానున్న ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ– ''కొత్తవారితో 'కమిటీ కుర్రోళ్ళు' వంటి మంచి చిత్రాన్ని తీయడం మామూలు విషయం కాదు. ఇలాంటి సినిమాని ప్రేక్షకులు పెద్ద హిట్ చేస్తారు'' అన్నారు. ''ఈ సినిమా కోసం మూడేళ్లుగా పని చేస్తున్నాం. అందరూ వారి వారి పాత్రలకు ప్రాణం పోశారు'' అన్నారు నిహారిక. ''నిహారిక, ఫణిగార్లు లేకపోతే ఇంత మంచి సినిమా తీసేవాళ్లం కాదు'' అన్నారు యదు వంశీ. ''మంచి సినిమా తీశాం. అందరూ చూడండి'' అన్నారు నిర్మాత ఫణి అడపాక. ఈ వేడుకలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేష్, మ్యూజిక్ డైరెక్టర్ అనుదీప్ దేవ్, కెమెరామేన్ రాజు మాట్లాడారు.

సస్పెన్స్... థ్రిల్

కృష్ణసాయి, మీనాక్షీ జైస్వాల్ జంటగా నటించిన చిత్రం 'జ్యువెల్ థీఫ్'. పీఎస్ నారాయణ దర్శకత్వం వహించిన ఈ మూవీలో ప్రేమ, అజయ్, శివారెడ్డి, శ్రావణి, శ్వేతారెడ్డి నటించారు. మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఈ చిత్రం టీజర్, ఆడియో లాంచ్ వేడుకకి ముఖ్య అతిథులుగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డీఐజీ అనిల్ మింజ్, ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్ లాల్ లవిదియ, అతిథిగా నటి ఎస్తేర్ హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. కృష్ణ సాయి మాట్లాడుతూ– 'సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'జ్యువెల్ థీఫ్'' అన్నారు. ''కృష్ణ సాయికి తగ్గ కథను పది రోజుల్లోనే పూర్తి చేశాను. అందర్నీ ఆకట్టుకునే సినిమా ఇది'' అన్నారు పీఎస్ నారాయణ. ''ఈ మూవీలో మంచి పాత్ర చేశాను'' అన్నారు నటి ప్రేమ.


● ప్రేమ, కృష్ణసాయి, మీనాక్షి

శతమానం భవతిలా అలరిస్తుంది - నరేశ్ వీకే


● అనురాగ్, నరేశ్ వీకే, తిరువీర్

''శతమానం భవతి' సినిమా ఎన్ఆర్ఐ ప్రేక్షకులని విశేషంగా ఆకట్టుకుంది. 'వీరాంజనేయులు విహార యాత్ర' కూడా అలానే అలరిస్తుంది. అద్భుతమైన భావోద్వేగాలున్న కథ ఇది'' అని నటుడు నరేశ్ వీకే అన్నారు. అనురాగ్ పలుట్ల దర్శకత్వంలో డా. నరేశ్ వీకే, రాగ్ మయూర్, ప్రియా వడ్లమాని లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'వీరాంజనేయులు విహారయాత్ర'. బాపినీడు .బి, సుధీర్ ఈదర నిర్మించిన ఈ సినిమా ఆగస్ట్ 14న ఈటీవీ విన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని నటి పవిత్రా లోకేశ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నరేశ్ వీకే మాట్లాడుతూ– ''వీరాంజనేయులు విహారయాత్ర' కథ విన్నాక జంధ్యాల, త్రివిక్రమ్, వివేక్ ఆత్రేయలాంటి వినూత్నమైన ఒరవడి అనురాగ్‌లో కనిపించింది. ఇది నాకు గోల్డెన్ జూబ్లీ ఫిల్మ్.. గోల్డెన్ ఫిల్మ్'' అన్నారు. 'హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'వీరాంజనేయులు విహార యాత్ర' నాలుగు కాలాల పాటు గుర్తుంటుంది. ఈ మాట పొగరుతో కాదు ప్రేమతో చెబుతున్నాను'' అన్నారు అనురాగ్ పలుట్ల. ''ఫ్యామిలీ రోడ్ ట్రిప్ నేపథ్యంలో సాగే ఈ మూవీ కొత్తగా ఉంటుంది'' అన్నారు రాగ్ మయూర్. ''మా సినిమాని అందరూ సపోర్ట్ చేయాలి'' అన్నారు ప్రియా వడ్లమాని. ఈ టీజర్ లాంచ్ వేడుకలో డైరెక్టర్ సందీప్ రాజ్, హీరో తిరువీర్, ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే చిత్రాలు చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో 'హాట్ స్పాట్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

మూడు కథల సినిమా



సినిమాలో స్క్రీన్‌ప్లే అన్నది గాలి పటానికి దారం లాంటిది. ఆ దారాన్ని దర్శకుడు సరైన పంథాలో నడిపిస్తే గాలిపటం ప్రేక్షకుల అభిమాన ఆకాశంలో అందనంత ఎత్తు ఎగురుతుంది. స్క్రీన్‌ప్లేలో ఎంత వైవిధ్యం ఉంటే అంత ప్రేక్షకులు దగ్గరవుతారు. నేటి దర్శకులు వాస్తవికతను చూపడానికి విభిన్న కోణాలు ఎంచుకుంటున్నారు. ఆ కోవలో రిలీజ్ అయిన సినిమా 'హాట్ స్పాట్'. సినిమా మాతృక తమిళం అయినా తెలుగు డబ్బింగ్‌తో ఆహా ఓటీటీ ద్వారా అందుబాటులో ఉంది. ఈ సినిమా దర్శకులు విఘ్నేష్ కార్తీక్. ఈ సినిమా మూడు కథల సమ్మిళితం. దర్శకుడు ఒక్కో కథకు ఒక్కో సందేశాన్నివ్వడం గమనార్హం. అలా అని ఇది పూర్తి సందేశాత్మక చిత్రం కాదు. యువతను విపరీతంగా ఆకట్టుకునే సినిమా. ఎందుకంటే దర్శకుడు మొదటి ఫ్రేమ్‌లోనే ఇది అడల్ట్ సినిమా అని చెప్తాడు.

'హాట్ స్పాట్' సినిమాను దర్శకుడు విభిన్న తరహాలో ప్రారంభిస్తాడు. సాధారణంగా ఓ దర్శకుడు ఎలా అయితే నిర్మాత దగ్గర తన కథను ప్రెజెంట్ చేస్తాడో అదే విధంగా ఈ సినిమా మొదలవడం గమనార్హం. ముందుగా చెప్పినట్టు ఈ సినిమాకి మూడు కథలు. ఒక కథకు ఇంకో కథకి అస్సలు సంబంధం వుండదు. ప్రతి కథకు ఓ భావోద్వేగం ఉంటుంది.

- మొదటి కథలో కొత్తగా పెళ్లయిన జంటకు పెళ్లి తరువాత ఇంట్లో వాళ్ళ వల్ల వచ్చే ఇబ్బందులను విభిన్నంగా చూపించారు. ఇక్కడ విభిన్నం అనే కన్నా కొత్త పంథా అని చెప్పవచ్చు. ఈ కథలో కుటుంబ విలువలు అన్న సూత్రాన్ని సరదా సరదా సన్నివేశాలతో అలరించారు.
- రెండో కథ ప్రేమానురాగం అన్న అంశం మీద నడుస్తుంది. ఇద్దరి ప్రేమికుల మధ్య వచ్చే సాధారణ అపోహలను, అపార్థాలను సున్నితమైన పరిష్కారంతో ఎలా దూరం చేశారు అన్నది రొమాంటిక్ యాంగిల్‌లో అద్భుతంగా చిత్రీకరించారు. ఈ రోజుల్లో ఏ సినిమా చూసినా ప్రేక్షకులు తరువాత వచ్చే సన్నివేశం గురించి ఊహించడమో లేదా పక్కనున్న వారితో చర్చించడమో చేస్తారు. కాని ఈ సినిమా చూసేటప్పుడు ప్రేక్షకుడి మనస్సు కథతో మాత్రమే ప్రయాణిస్తుంది.
- మూడో కథ ఆడపిల్లల సంరక్షణ మీద నడుస్తుంది. చిన్న పిల్లాడు మందు వేసుకోనని మారాం చేస్తే వాడికి ఇష్టమైన వంటకం చూపించి మనమెలాగైనా మందు తినిపిస్తాం. అలాగే దర్శకుడు ఈ కథలో తాను చెప్పదలచుకున్న పాయింట్ యువతకు సరైన రీతిలో చేరే విధంగా తెరకెక్కించారు. ఈ కథను చూసిన తరువాత ఎదిగే మన పిల్లల మీద మనం ఎంతో జాగ్రత్తను కనబరుస్తాం. కథ పాయింట్ ప్రకారం ఓ బీద కుటుంబంలోని అమ్మాయి తన ప్రతిభతో ఓ టెలివిజన్ షోకి ఎంపికవుతుంది. ఆ షోలో ఆ అమ్మాయి చాలా రౌండ్స్ గెలిచి ఇంకో రౌండ్ ఉండగా ఓడిపోతుంది. ఆ అమ్మాయి ఎందుకు ఓడిపోతుంది? ఆ తర్వాత తను ఎదుర్కొన్న పరిస్థితులేంటి? అనే అంశాలతో రియాల్టీ షోల ప్రభావం పిల్లలపై ఎలా ఉంది? అనేది ప్రధానాంశంగా చూపించారు. ఈ సినిమా సందేశం సమాజంలోని ప్రతి ఒక్కరికీ అవసరం.

ఇలా మూడు కథల సమాహారంతో రూపొందిన 'హాట్ స్పాట్' బాధ్యతతో చూడాల్సిన సినిమా.

– ఇంటూరు హరికృష్ణ



తొలి 'డోపీ' దొరికాడు!

ఒలింపిక్స్‌లో ప్రారంభోత్సవ వేడుకలకు ముందే డోపింగ్‌తో ఆటగాడు సస్పెండ్ అయ్యాడు. ఇరాక్‌కు చెందిన జూడో ఆటగాడు సజ్జాద్ సెహెన్ నిషేధిత ఉత్ప్రేరకాలు మెటాన్‌డినోన్, బోల్డెనోన్ తీసుకున్నట్లుగా పరీక్షల్లో తేలింది. మంగళవారం జరిగే పోటీల్లో ఈ జూడో ప్లేయర్ 81 కేజీల విభాగంలో పోటీ పడాల్సి ఉండగా, ఇప్పుడు 'పాజిటివ్'గా దొరికిపోయాడు. దాంతో అతడిని పోటీల నుంచి తప్పించడంతో పాటు ఒలింపిక్స్‌కు సంబంధించిన ఎలాంటి కార్యక్రమంలోనూ పాల్గొనకుండా నిషేధం విధిస్తున్నట్లు ఇంటర్నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) ప్రకటించింది.

3 ముగ్గురు బ్రెజిల్ ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు ఒలింపిక్స్ ప్రారంభోత్సవం రోజే 'కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్'లో అప్పీల్ నెగ్గి అనూహ్యంగా పారిస్ విశ్వక్రీడలకు అర్హత సంపాదించారు. షాట్ పుటర్ లివియా అవన్సిని, రేస్ వాకర్ మ్యాక్స్ బటిస్టా, స్ప్రింటర్ హైగోర్ బెజెరాలకు ముగ్గురు జడ్జిల ప్యానెల్ అనుకూలంగా ఫాస్ట్‌ట్రాక్ తీర్పునిచ్చింది.

ప్రతి అథ్లెట్ దేశానికి గర్వకారణం: మోదీ

"పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న భారత అథ్లెట్లకు శుభాకాంక్షలు. ప్రతి క్రీడాకారుడు దేశానికి గర్వకారణం. విశ్వ వేదికపై అసాధారణమైన ప్రదర్శనలతో క్రీడాస్ఫూర్తిని ప్రకాశింపజేయండి. మీ ఆటతీరుతో భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవండి.

–నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

లాహిరి లాహిరి లాహిరిలో...

అట్టహాసంగా ఒలింపిక్స్ క్రీడోత్సవం • ఫ్రెంచ్ పరిమళం గుబాళింపు
సెన్ నదీ తీరం వెంట సాగిన వేడుకలు • ఆతిథ్య దేశపు ఘనతల ప్రదర్శన

ఈఫిల్ టవర్ సమీపాన చారిత్రక 'ట్రొకార్డో' వద్ద ప్రారంభమైన పరేడ్ సెన్ నదీ తీరం వెంట సాగింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్, ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాక్‌తో పాటు దాదాపు 100 దేశాలకు చెందిన ప్రతినిధులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. అన్నింటికంటే ముందు సెన్ నదిపై ఉన్న పాంట్ డి ఆస్టర్‌లిజ్ బ్రిడ్జిపై ఫ్రాన్స్ జాతీయ పతాకంలోని ఎరుపు, తెలుపు, నీలి రంగులను వెదజల్లుతూ నయనానందకరంగా కార్యక్రమం మొదలైంది. మిమ్మల్ని కలవడం చాలా ఆనందంగా ఉంది అంటూ ఫ్రెంచ్ భాషలో 'ఎన్‌చాంట్' నినాదంతో పడవలపై ఆటగాళ్ల పరేడ్ మొదలైంది. ఎప్పటిలాగే తొలి ఒలింపిక్స్‌కు వేదికైన గ్రీస్ బృందం అందరికంటే ముందుగా రాగా, ఐఓసీ శరణార్థి టీమ్ దానిని అనుసరించింది. ఫ్రెంచ్ అక్షరమాలలో జట్లు వరుసగా వచ్చాయి. బోట్‌లు వెళుతున్న సమయంలో ఫ్రెంచ్ సంగీతాన్ని నేపథ్యంలో వినిపించారు. అనంతరం ప్రఖ్యాత పాప్ సింగ్ లేడీ గాగా తన ఆటపాటతో అలరించింది.







పారిస్: ప్రారంభోత్సవంలో భాగంగా ఆ తర్వాత ఫ్రాన్స్ దేశపు చరిత్ర, సంస్కృతి, సంగీతం అన్నీ ప్రతిబింబించేలా వరుసగా కార్యక్రమాలు సాగాయి. 80 మంది కళాకారులతో ఫ్రెంచ్ క్యాబరే డ్యాన్స్ 'కెన్ కెన్'ను ప్రదర్శించగా... పారిస్ ఒలింపిక్ క్రీడలను నిర్వహించడంలో పని చేసిన కార్మికులు, సామాన్య ప్రజలకు అంకితం ఇస్తూ 'సింక్రొనిసిటీ' పేరుతో షోను ఫ్రాన్స్ పర్యాటక ప్రదేశాల్లో ప్రఖ్యాతమైన 'నోటర్ డేమ్ క్యాథడ్రిల్' వద్ద నిర్వహించారు. ఆపై ఫ్రెంచ్ సాహిత్యం విశేషాలు తెలిపే, ఆ దేశపు ప్రస్థానాన్ని తెలిపే థీమ్‌తో ప్రోగ్రాం జరిగింది. ఈ క్రమంలో ఫ్రెంచ్ విప్లవ కాలపు గీతాలను కూడా వినిపించారు. చారిత్రక ల్యూర్ మ్యూజియం, మేడలీన్ చిత్రం తదితర కళాఖండాలను గుర్తుకు తెస్తూ వాటిని కళ్లకు కట్టినట్లుగా చూపించారు. ఆ తర్వాత ఫ్రెంచ్ సినిమాకు నీరాజనం అంటూ కార్యక్రమం సాగింది. అనంతరం ఫ్రాన్స్ జాతీయ గీతాన్ని వినిపించారు. ఈ సమయంలో ఫ్రెంచ్ చరిత్రలో పది మంది ప్రముఖ మహిళల బంగారు విగ్రహాలను ప్రదర్శించారు.





78 మందితో మన బృందం...

బోట్‌లపై పరేడ్‌లో 84వ స్థానంలో భారత జట్టు వచ్చింది. ఫ్లాగ్ బేరర్లు పీవీ సింధు, ఆచంట శరత్ కమల్ ముందుండి భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శించగా... ఇతర అథ్లెట్లు కూడా చేతుల్లో చిన్న పతాకాలతో అభివందనం చేశారు. ఒలింపిక్స్‌లాంటి విశ్వ సంబరంలో పాల్గొంటున్న ఆనందం అందరిలోనూ కనిపించింది. దీపిక కుమారి, లవ్లీనా బొర్గొహైన్, మనికా బత్రా, రోహన్ బోపన్న, సుమీత్ నగాల్, శ్రీరామ్ బాలాజీ తదితరులు పరేడ్‌లో భాగమయ్యారు. ప్రారంభోత్సవ వేడుకల్లో భారత్ నుంచి ఆటగాళ్లు, అధికారులు కలిపి మొత్తం 78 మంది పాల్గొన్నారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష, పారిస్ ఒలింపిక్స్‌లో భారత చెఫ్ డి మిషన్ గగన్ నారంగ్ కలిసి ఈ బృందాన్ని ఎంపిక చేశారు. శనివారం పోటీలో పాల్గొనే ప్లేయర్లతో పాటు ఇంకా పారిస్‌కు చేరుకోని అథ్లెట్లు, వెయిట్‌లిఫ్టర్లు, రెజ్లర్లు ఈ కార్యక్రమంలో భాగం కాలేదు. శనివారం తమ పోటీలు లేని షూటర్లు అంజుమ్, సిఫ్ట్ కౌర్, ఐశ్వర్య ప్రతాప్, అనీశ్ కూడా ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. భారత హాకీ జట్టు నేడు న్యూజిలాండ్‌తో తలపడనుండటంతో జట్టులోని రిజర్వ్ ఆటగాళ్లు మాత్రమే హాజరయ్యారు.

'తస్వ' డిజైన్లతో...

ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారత బృందం ధరించిన డ్రెస్‌లను ప్రముఖ కంపెనీ 'తస్వ' తయారు చేసింది. పురుషుల డ్రెస్‌లలో, మహిళల చీరకట్టులో కూడా అంచులను భారత త్రివర్ణ పతాకపు మూడు రంగులతో డిజైన్ చేశారు. 'తస్వ' కంపెనీ ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందినది కాగా... ఇందులో భాగంగా ఉన్న ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిలియాని పర్యవేక్షణలోనే భారత టీమ్ డ్రెస్ రూపకల్పన జరిగింది. మరో వైపు మన ఆటగాళ్లు పోటీల్లో పాల్గొనే సమయంలో ఉపయోగించే కిట్‌లను ప్రముఖ సంస్థ జిందాల్ గ్రూప్‌నకు చెందిన 'ఇన్‌స్పైర్' రూపొందించింది. జిందాల్ గ్రూప్ గతంలో 2022 కామన్వెల్త్ క్రీడల్లో, 2023 ఆసియా క్రీడల్లో కూడా భారత బృందానికి కిట్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత ప్లేయర్లు వాడే స్పోర్ట్స్ కిట్‌లను డిజైనర్ ఆఖిబ్ వాని రూపొందించాడు. నీరజ్ చోప్రా, మనూ భాకర్, మనికా బాత్రా తదితర ఆటగాళ్లు జిందాల్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ గ్రూప్‌లో భాగంగా ఉన్నారు.

తొలి రోజు 14 స్వర్ణాల కోసం...

పారిస్: విశ్వ క్రీడల్లో తొలిరోజు 14 స్వర్ణాల కోసం క్రీడాకారులు పోటీపడనున్నారు. ఎనిమిది క్రీడాంశాల్లో మెడల్ ఈవెంట్స్ ఉన్నాయి. డైవింగ్, రగ్బీ సెవెన్స్, షూటింగ్, స్కేట్ బోర్డింగ్ క్రీడాంశాల్లో ఒక్కో స్వర్ణ పతకం కోసం తలపడతారు. స్విమ్మింగ్‌లో అత్యధికంగా నాలుగు స్వర్ణాలు లభిస్తాయి. రోడ్ సైక్లింగ్, ఫెన్సింగ్, జూడో క్రీడాంశాల్లో రెండు చొప్పున పసిడి పతకాలు అందజేస్తారు.



జైస్మీన్, నిఖత్, ప్రీతి, అమిత్, నిశాంత్ దేవ్, లవ్లీనా

భారత బాక్సర్లకు క్లిష్టమైన 'డ్రా'

పారిస్: విశ్వ క్రీడల్లో భారత బాక్సర్లు పతకాలు సాధించాలంటే శక్తివంతమైన 'పంచ్'లు విసరాల్సిందే. టోక్యో ఒలింపిక్స్‌లో 69 కేజీల విభాగంలో కాంస్య పతకం గెలిచిన లవ్లీనా బొర్గొహైన్... తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్‌తోపాటు ప్రీతి పవార్, జైస్మీన్ లంబోరియాలకు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. 50 కేజీల తొలి రౌండ్‌లో నిఖత్ జర్మనీ ప్లేయర్ మాక్సీ క్లొట్జెర్‌తో ఆడుతుంది. ఈ బౌట్‌లో గెలిస్తే రెండో రౌండ్‌లో ప్రస్తుత ఆసియా చాంపియన్, వరల్డ్ చాంపియన్ వు యు (చైనా)తో తలపడాల్సి ఉంటుంది. ఈ అడ్డంకిని నిఖత్ దాటితే క్వార్టర్ ఫైనల్లో చుట్‌హమట్ రక్సాట్ (థాయ్‌లాండ్) లేదా సబీనా బొబొకులోవా (ఉజ్బెకిస్తాన్)లలో ఒకరితో ఆడుతుంది. ఇటీవల స్ట్రాండ్జా స్మారక టోర్నీ ఫైనల్లో సబీనా చేతిలో, గత ఏడాది ఆసియా క్రీడల సెమీఫైనల్లో రక్సాట్ చేతిలో నిఖత్ ఓడిపోయింది. ఈసారి 75 కేజీల విభాగంలో పోటీపడుతున్న లవ్లీనా తొలి రౌండ్‌లో సునీవా హాఫ్‌స్టడ్ (నార్వే)తో ఆడుతుంది. క్వార్టర్ ఫైనల్లో లవ్లీనాకు ప్రత్యర్థిగా రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత లీ కియాన్ (చైనా) ఎదురుకావచ్చు. గత ఆసియా క్రీడల్లో ఫైనల్లో లీ కియాన్ చేతిలో లవ్లీనా ఓడిపోయింది. జైస్మీన్ (57 కేజీలు) తొలి రౌండ్‌లో నెస్తీ పెటెసియో (ఫిలిప్పీన్స్)తో ఆడుతుంది. తొలి రౌండ్‌లో జైస్మీన్ నెగ్గితే రెండో రౌండ్‌లో యూరోపియన్ చాంపియన్, మూడో సీడ్ అమీనా జిదాని (ఫ్రాన్స్)తో ఆడే అవకాశం ఉంది. ప్రీతి పవార్ (54 కేజీలు) తొలి రౌండ్‌లో వియత్నాం బాక్సర్ వో థి కిమ్ అన్‌తో ఆడుతుంది. మరోవైపు పురుషుల విభాగంలో ఇద్దరు భారత బాక్సర్లు అమిత్ పంఘాల్ (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) తొలి రౌండ్‌లో 'బై' పొందారు.

బాక్సింగ్

మహిళల 54 కేజీల తొలి రౌండ్ బౌట్: ప్రీతి పవార్ x థి కిమ్ అన్ వో (వియత్నాం); అర్ధరాత్రి గం. 12:05 నుంచి.

రోయింగ్

పురుషుల సింగిల్ స్కల్స్ హీట్స్: బలరాజ్ పన్వర్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి).

టేబుల్ టెన్నిస్

పురుషుల సింగిల్స్ ప్రిలిమినరీ రౌండ్ మ్యాచ్: హర్మీత్ దేశాయ్ x జైద్ అబో యమన్ (జోర్డాన్) రాత్రి గం. 7:15 నుంచి.

టెన్నిస్

పురుషుల డబుల్స్ తొలి రౌండ్: రోహన్ బోపన్న–శ్రీరామ్ బాలాజీ x రోజర్ వాసెలిన్–ఫాబియన్ రెబూల్ (ఫ్రాన్స్) మధ్యాహ్నం గం. 3:30 నుంచి.

విశ్వ క్రీడల ప్రారంభోత్సవం ముగిసింది. ఇక నేటి నుంచి పతకాల వేట మొదలుకానుంది. భారత్ విషయానికొస్తే తొలి రోజు శనివారం షూటింగ్ క్రీడాంశంలో మన షూటర్లు పతకాల కోసం తమ తుపాకీలకు పని చెప్పనున్నారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ నుంచి రెండు జోడీలు ముందుగా క్వాలిఫయింగ్‌లో పోటీపడనున్నాయి. క్వాలిఫయింగ్‌లో టాప్–4లో నిలిచిన నాలుగు జోడీలు స్వర్ణ, రజత, కాంస్య పతకాల కోసం పోటీపడతాయి.

గురి అదరాలి... తీపి కబురు వినాలి

నేటి నుంచి భారత షూటర్ల పతకాల వేట

- తొలి రోజు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్
- బరిలో రెండు భారత జోడీలు

పారిస్: ఒలింపిక్స్ క్రీడల్లో భారత షూటర్లు పతకాలు సాధించి పుష్కరకాలం గడిచింది. చివరిసారి 2012 లండన్ ఒలింపిక్స్‌లో గగన్ నారంగ్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించగా... విజయ్ కుమార్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో రజత పతకం గెలిచాడు. ఆ తర్వాత 2016 రియో ఒలింపిక్స్‌లో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత షూటర్లు గురి తప్పారు. ఒక్క పతకం కూడా నెగ్గకుండానే రిక్తహస్తాలతో తిరిగి వచ్చారు. ఈసారి పారిస్ ఒలింపిక్స్‌లో రికార్డుస్థాయిలో భారత్ నుంచి అత్యధికంగా 21 మంది షూటర్లు అర్హత సాధించారు. ప్రతి మెడల్ ఈవెంట్‌లో భారత షూటర్లు బరిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో శనివారం షూటర్లకు తొలి పరీక్ష ఎదురుకానుంది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మెడల్ ఈవెంట్ ఉంది. ఈ విభాగంలో భారత్ నుంచి అర్జున్ బబూటా–రమితా జిందాల్ జోడీ... సందీప్ సింగ్–ఇలవేనిల్ వలారివన్ జోడీ పోటీపడతాయి. ఓవరాల్‌గా 28 జోడీలు క్వాలిఫయింగ్‌లో ఉన్నాయి. క్వాలిఫయింగ్ ముగిశాక టాప్–4లో నిలిచిన జోడీలు మెడల్ రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. టాప్–2లో నిలిచిన జంటలు స్వర్ణ–రజత పతకాల కోసం... మూడు–నాలుగు స్థానాల్లో నిలిచిన జోడీలు కాంస్య పతకం కోసం పోటీపడతాయి. శనివారమే పురుషుల, మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్వాలిఫయింగ్ ఈవెంట్ జరుగుతుంది.



రమిత జిందాల్, అర్జున్, సందీప్ సింగ్, ఇలవేనిల్

షూటింగ్

10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫయింగ్: సందీప్ సింగ్/ఇలవేనిల్ వలారివన్; అర్జున్ బబూటా/రమితా జిందాల్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). ఫైనల్: మధ్యాహ్నం గం. 2 నుంచి

పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్వాలిఫయింగ్: అర్జున్ సింగ్ చీమా, సరబ్‌జోత్ సింగ్ (మధ్యాహ్నం గం. 2 నుంచి)

మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్వాలిఫయింగ్: మనూ భాకర్, రిథమ్ సాంగ్వాన్ (సాయంత్రం గం. 4 నుంచి).



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

బ్యాడ్మింటన్

పురుషుల సింగిల్స్ గ్రూప్ 'ఎల్' తొలి లీగ్ మ్యాచ్: లక్ష్య సేన్ x కెవిన్ కార్డన్ (గ్వాటెమాలా) రాత్రి గం. 7:10 నుంచి.

పురుషుల డబుల్స్ గ్రూప్ 'సి' తొలి లీగ్ మ్యాచ్: సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి x లుకాస్ కొర్వీ–రోనన్ లాబర్ (ఫ్రాన్స్) రాత్రి గం. 8 నుంచి.

మహిళల డబుల్స్ గ్రూప్ 'సి' తొలి లీగ్ మ్యాచ్: అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో x కిమ్ సో యోంగ్–కాంగ్ హీ యోంగ్ (దక్షిణ కొరియా) రాత్రి గం. 11:50 నుంచి.

విజయమే లక్ష్యంగా...

నేడు తొలి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత్ 'ఢీ'

రాత్రి గం. 9 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

పారిస్: మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించి 41 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన భారత పురుషుల హాకీ జట్టు అదే జోరును 'పారిస్'లోనూ కొనసాగించాలనే లక్ష్యంతో ఉంది. నేడు జరిగే పూల్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత జట్టు తలపడనుంది. హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని టీమిండియా స్థాయికి తగ్గట్టు ఆడితే శుభారంభం చేస్తుంది. పూల్ 'బి'లోనే డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, ఐర్లాండ్ జట్లున్నాయి. మరోవైపు పూల్ 'ఎ'లో నెదర్లాండ్స్, జర్మనీ, బ్రిటన్, స్పెయిన్, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్ జట్లున్నాయి. లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక రెండు గ్రూప్‌ల నుంచి టాప్–4లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధిస్తాయి. న్యూజిలాండ్‌తో మ్యాచ్ తర్వాత భారత జట్టు వరుసగా అర్జెంటీనా (29న), ఐర్లాండ్ (30న), బెల్జియం (ఆగస్టు 1న), ఆస్ట్రేలియా (ఆగస్టు 2న) జట్లతో ఆడుతుంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత అంతర్జాతీయ హాకీకి గుడ్‌బై చెబుతానని ప్రకటించిన మేటి గోల్‌కీపర్ శ్రీజేశ్‌కు వీడ్కోలు కానుకగా పతకం అందించాలని హర్మన్‌ప్రీత్ బృందం పట్టుదలతో ఉంది. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం భారత్, న్యూజిలాండ్ జట్లు ఇప్పటి వరకు ముఖాముఖిగా 105 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. 58 మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొందగా...30 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ నెగ్గింది. 17 మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి. శనివారమే జరిగే ఇతర గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియాతో అర్జెంటీనా... బెల్జియంతో ఐర్లాండ్ తలపడతాయి. గ్రూప్ 'ఎ'లో బ్రిటన్‌తో స్పెయిన్; దక్షిణాఫ్రికాతో నెదర్లాండ్స్; జర్మనీతో ఫ్రాన్స్ ఆడతాయి.



పారిస్ ఒలింపిక్ క్రీడా గ్రామంలో భారత హాకీ జట్టు

సాక్షి బిజినెస్
శనివారం
27-7-2024

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▲	నిఫ్టీ ▲
1,293	429
81,333	24,835

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్‌	17,431	▲	250
డోజోన్స్‌	40,712	▲	777
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,286	▲	99
డాక్స్‌	18,418	▲	119
షాంఘై	2,891	▲	4
నికాయ్‌	37,667	▼	202

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌
రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్‌)		
68,131	▼	96
బంగారం (22 క్యారెట్‌)		
67,858	▼	96
వెండి (కిలో)		
81,271	▼	203

ఫారెక్స్‌ రేట్లు
రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	83.33	84.35
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	106.55	109.12
€	యూరో	ఎస్‌బీఐ	89.84	92.20
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	53.91	55.10
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	53.96	55.88
S$	సింగపూర్‌ డాలర్‌	థామస్‌కుక్‌	60.04	64.74
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	21.91	23.69
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	10.68	12.50

'ఎలక్ట్రిక్‌' స్కీమ్‌
మరో రెండు నెలలు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్‌ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఎలక్ట్రిక్‌ మొబిలిటీ ప్రమోషన్‌ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మరో 2 నెలలు పొడిగించింది. భారీ పరిశ్రమ శాఖ రూ.500 కోట్ల బడ్జెట్‌ కేటాయిస్తూ 2024 ఏప్రిల్‌ 1 నుంచి అమలులోకి తెచ్చిన ఈ పథకం వాస్తవానికి జూలై 31తో ముగియనుంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఈ స్కీమ్‌ సెప్టెంబర్‌ 30 వరకు కొనసాగనుంది. బడ్జెట్‌ కేటాయింపులను ప్రభుత్వం మొత్తం రూ.778 కోట్లకు పెంచింది.

విజయ్‌ మాల్యా
మూడేళ్ల బహిష్కరణ



న్యూఢిల్లీ: విదేశాలకు పరారైన వ్యాపారవేత్త విజయ్‌మాల్యా భారత సెక్యూరిటీస్‌ మార్కెట్లలో మూడేళ్ల పాటు పాల్గొనకుండా సెబీ నిషేధించింది. 2006 జనవరి నుంచి 2008 మార్చి మధ్య కాలంలో 'మ్యాటర్‌హార్న్‌ వెంచర్స్‌' అనే విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్‌ (ఎఫ్‌ఐఐ) ద్వారా విజయ్‌ మాల్యా, తన గ్రూపు కంపెనీలైన హెర్బర్ట్‌సన్స్‌ లిమిటెడ్‌, యునైటెడ్‌ స్పిరిట్స్‌ లిమిటెడ్‌లో రహస్యంగా లావాదేవీలు జరిపినట్లు సెబీ తేల్చింది. పలు విదేశీ బ్యాంక్‌ ఖాతాల ద్వారా నిర్వహించినట్లు తేలడంతో సెబీ ఈ చర్య తీసుకుంది.

జియో ఎయిర్‌ఫైబర్‌
రూ.1,000 డిస్కౌంట్‌



హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో: రిలయన్స్‌ జియో ఎయిర్‌ఫైబర్‌ ఇన్‌స్టలేషన్‌పై రూ.1,000 డిస్కౌంట్‌ ప్రకటించింది. అన్ని నెలవారీ ప్యాక్‌లపై ఈ ఆఫర్‌ వర్తిస్తుంది. ప్రస్తుతం కంపెనీ రూ.599, 888, 899, రూ.1,199 ప్యాక్‌లను అందుబాటులో ఉంచింది. ఆగస్ట్‌ 15 వరకు ఆఫర్‌ ఉంటుంది. ఏప్రిల్‌–జూన్‌ మధ్య 11 లక్షల పైగా కొత్త ఎయిర్‌ఫైబర్‌ కస్టమర్లు చేరారు. మొత్తం ఎయిర్‌ఫైబర్‌ యూజర్లు దేశవ్యాప్తంగా 1.2 కోట్ల మంది ఉన్నారు.

మార్కెట్‌ పోల్‌వాల్ట్‌!



- సెన్సెక్స్‌ 1,293 పాయింట్లు జంప్‌
- నిఫ్టీ 429 పాయింట్లు అప్‌
- సరికొత్త గరిష్టానికి నిఫ్టీ
- 5 రోజుల నష్టాలకు ఒక్క రోజులో చెక్‌

గత వారాంతం నుంచి నష్టాల బాటలో సాగుతున్న దేశీ స్టాక్‌ మార్కెట్లు ఒక్కసారిగా యూటర్న్‌ తీసుకున్నాయి. భారీ లాభాలతో కదం తొక్కాయి. ఐదు రోజుల్లో వాటిల్లిన నష్టాలను ఒక్క రోజులోనే లాభాలతో మరిపించాయి. దీంతో ఎన్‌ఎస్‌ఈ ప్రధాన ఇండెక్స్‌ నిఫ్టీ చరిత్రాత్మక గరిష్టాన్ని చేరింది.

ముంబై: గత వారం చివర్లో ప్రారంభమైన అమ్మకాలకు ఈ వారం చివర్లో చెక్‌ పడింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో ప్రారంభం నుంచీ మార్కెట్లు బలపడుతూ వచ్చాయి. ట్రేడింగ్‌ ముగిసేసరికి సెన్సెక్స్‌ 1,293 పాయింట్లు జంప్‌చేసి 81,333 వద్ద నిలిచింది. ఒక దశలో 1,387 పాయింట్లు (81,427)వరకూ ఎగసింది. ఇక నిఫ్టీ 429 పాయింట్లు దూసుకెళ్లి 24,835 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,861 వరకూ బలపడింది. ఇవి సరికొత్త గరిష్టాలుకావడం విశేషం! ఫలితంగా గత ఐదు రోజుల్లో కోల్పోయిన 1,304 పాయింట్లను సెన్సెక్స్‌, 395 పాయింట్లను నిఫ్టీ రికవర్‌ చేసుకున్నాయి. కొత్త డెరివేటివ్‌ సిరీస్‌ తొలి రోజు మార్కెట్లు ఉన్నట్టుండి జోరు చూపినట్లు నిపుణులు పేర్కొన్నారు. యూఎస్‌ జీడీపీ గణాంకాలు ఇన్వెస్టర్లకు జోష్‌నిచ్చినట్లు అభిప్రాయపడ్డారు.

ఓఎన్‌జీసీ మాత్రమే

ఎన్‌ఎస్‌ఈలో అన్ని రంగాలూ లాభపడ్డాయి. మెటల్‌, ఐటీ, ఫార్మా, ఆటో 3–2.5 శాతం మధ్య వృద్ధి చూపాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఓఎన్‌జీసీ మాత్రమే ప్రస్తావించదగ్గ స్థాయిలో(1 శాతం) నీరసించగా.. మిగిలిన 49 బ్లూచిప్స్‌లో 40 వరకూ 10–0.5 శాతం మధ్య ఎగశాయంటే కొనుగోళ్ల జోరును అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా శ్రీరామ్‌ ఫైనాన్స్‌, సిప్లా, దివీస్‌, ఎయిర్‌టెల్‌, అపోలో, అదానీ ద్వయం, విప్రో, టాటా స్టీల్‌, సన్‌ ఫార్మా, హెచ్‌సీఎల్‌ టెక్‌, ఇన్ఫోసిస్‌, హిందాల్కో, సీఐఎల్‌, ఎంఅండ్‌ఎం, ఐటీసీ 10–2.5 శాతం మధ్య లాభపడ్డాయి.

చిన్న షేర్ల స్పీడ్‌

మార్కెట్ల బాటలో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్‌ 2 శాతం, స్మాల్‌క్యాప్‌ 1 శాతం చొప్పున పెరిగాయి. ట్రేడైన షేర్లలో 2,595 లాభపడగా.. 1,354 నష్టపోయాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు రూ. 2,546 కోట్లు, దేశీ ఫండ్స్‌ రూ. 2,774 కోట్లు చొప్పున ఇన్వెస్ట్‌ చేశాయి.

వేదాంతా రూ. 4 డివిడెండ్‌



వేదాంతా ఈ ఏడాదికి రెండో మధ్యంతర డివిడెండ్‌గా షేరుకి రూ. 4 ప్రకటించింది. దీంతో షేరు 3% ఎగసి రూ. 445 వద్ద ముగిసింది.

పేటీఎం అప్పర్‌ సర్క్యూట్‌



పేటీఎం పేమెంట్‌ సర్వీసెస్‌లో రూ.50 కోట్ల పెట్టు బడులకు ఆర్‌బీఐ అనుమతించిదన్న వార్తలతో శుక్రవారం పేటీఎం షేరు అప్పర్‌ సర్క్యూట్‌ను (10%) తాకి రూ. 509 వద్ద క్లోజయ్యింది. కంపెనీ షేరు ఫిబ్రవరి 8 తర్వాత రూ. 500 మార్కును దాటడం ఇదే తొలిసారి.

ఐటీసీ 20 వేల కోట్ల పెట్టుబడి ప్రణాళిక
ఎఫ్‌ఎంసీజీ విభాగం భారీ విస్తరణ



న్యూఢిల్లీ: పారిశ్రామిక దిగ్గజం ఐటీసీ తమ కార్యకలాపాలను మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ఎఫ్‌ఎంసీజీ విభాగం సామర్థ్యాలను పెంచుకోవడం, ఆధునీకరించడం, నవకల్పనలపై మధ్యకాలికంగా రూ. 20,000 కోట్లు ఇన్వెస్ట్‌ చేసే ప్రణాళికల్లో ఉంది. సంస్థ వార్షిక సర్వసభ్య సమావేశంలో చైర్మన్‌ సంజీవ్‌పురి ఈ విషయాలు తెలిపారు. ప్రతికూలతలు ఉన్నప్పటికీ ప్రత్యర్థి సంస్థలకు దీటుగా పోటీనిచ్చేందుకు వివిధ వ్యాపార విభాగాలపై ఇప్పటికే గణనీయంగా పెట్టుబడులు పెట్టినట్లు ఆయన వివరించారు. అత్యంత వేగంగా ఎదుగుతున్న పెద్ద ఎకానమీగా నిలుస్తున్న భారత్‌ భవిష్యత్‌ వృద్ధి అవకాశాలు ఆశావహంగా ఉన్నాయని పురి పేర్కొన్నారు. రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలతో సర్వత్రా సంక్షోభ పరిస్థితులు నెలకొన్న తరుణంలో వృద్ధి సాధనకు భారతదేశం స్ఫూర్తిమంతమైన దీపస్తంభంలాగా నిలుస్తోందన్నారు. గడిచిన నాలుగేళ్లలో తమ ఆదాయాలు వార్షికంగా 10.8 శాతం వృద్ధి చెంది రూ. 79,000 కోట్ల స్థాయికి చేరుకున్నాయని చెప్పారు. కరోనా మహమ్మారితో తీవ్రంగా దెబ్బతిన్న హోటల్స్‌, సిగరెట్‌ వ్యాపారాలు క్రమంగా కోలుకుంటున్నాయని వివరించారు. గత రెండేళ్లుగా సిగరెట్స్‌ వ్యాపారం 13.5% వార్షిక వృద్ధి నమోదు చేసిందని తెలిపారు.

'సాక్షి ప్లస్‌' ఈ-పేపర్‌లో ..
ఇంట్రాడే ట్రేడింగ్‌లో నష్టాలే అధికం / చైనా నిపుణులకు వీసాల జోరు పెంచండి

శాన్‌స్టార్‌ లిస్టింగ్‌ గుడ్‌



ఇటీవలే ఐపీవో ముగించుకున్న మొక్కల ఆధారిత స్పెషాలిటీ ప్రొడక్టుల కంపెనీ శాన్‌స్టార్‌ లిమిటెడ్‌ ఇష్యూ ధర రూ. 95తో పోలిస్తే తొలిరోజు 12 శాతం ప్రీమియంతో రూ. 106.4 వద్ద లిస్టయ్యింది. బీఎస్‌ఈలో తదుపరి 34 శాతం జంప్‌చేసి రూ. 128కు చేరింది. చివరికి 21 శాతం లాభంతో రూ. 115 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలోనూ ఇదేవిధంగా కదిలి రూ. 115 వద్ద స్థిరపడింది. ఐపీవో ద్వారా రూ. 510 కోట్లు సమీకరించిన కంపెనీ మార్కెట్‌ విలువ రూ. 2,097 కోట్లను తాకింది.

రూ. 7 లక్షల కోట్లు ప్లస్‌



ఐదు రోజుల నష్టాలకు చెక్‌ పెడుతూ మార్కెట్లు హైజంప్‌ చేయడంతో ఒక్క రోజులో బీఎస్‌ఈ లిస్టెడ్‌ కంపెనీల విలువ రూ. 7.1 లక్షల కోట్లమేర బలపడింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే మార్కెట్‌ విలువ రూ. 4,56,92,671 కోట్లను అధిగమించింది. డాలర్లలో 5.46 ట్రిలియన్లకు చేరింది. వెరసి బీఎస్‌ఈ లిస్టెడ్‌ కంపెనీల విలువలో సరికొత్త రికార్డు నమోదైంది.

ఇండస్‌ఇండ్‌ లాభం ప్లస్‌
క్యూ1లో రూ. 2,171 కోట్లు



ముంబై: ప్రైవేట్‌ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్‌ బ్యాంక్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. ఏప్రిల్‌–జూన్‌(క్యూ1)లో కన్సాలిడేటెడ్‌ నికర లాభం 2 శాతం స్వల్ప వృద్ధితో రూ. 2,171 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,124 కోట్లు ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం 11 శాతం పుంజుకుని రూ. 5,408 కోట్లకు చేరింది. ఇతర ఆదాయం 10 శాతం అధికంగా రూ. 2,441 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 4.25 శాతం వద్ద ఫ్లాట్‌గా నమోదయ్యాయి. త్రైమాసికవారీగా స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.94 శాతం నుంచి 2.02 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.58% నుంచి 0.6 శాతానికి పెరిగాయి. పన్నులు, కంటింజెన్సీలు కాకుండా ప్రొవిజన్లు రూ. 992 కోట్ల నుంచి రూ. 1,050 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్‌ షేరు 1.7 శాతం లాభంతో రూ. 1,403 వద్ద ముగిసింది.

ఇండిగో లాభం రూ. 2,729 కోట్లు



న్యూఢిల్లీ: విమానయాన దిగ్గజం ఇంటర్‌గ్లోబ్‌ ఏవియేషన్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. ఏప్రిల్‌–జూన్‌(క్యూ1)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 2,729 కోట్లకు పరిమితమైంది. ఇండిగో బ్రాండ్‌ కంపెనీ గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 3,091 కోట్లు ఆర్జించింది. అధిక ఇంధన ధరలు, ఇతర వ్యయాలు లాభాలను దెబ్బతీశాయి. అయితే విదేశీ మారక ప్రభావాన్ని మినహాయిస్తే తాజా త్రైమాసికంలో ఇండిగో లాభం రూ. 2,786 కోట్లకు చేరినట్లు కంపెనీ పేర్కొంది. మొత్తం ఆదాయం మాత్రం 18 శాతం ఎగసి రూ. 20,249 కోట్లను తాకింది. మొత్తం వ్యయాలు సైతం 24 శాతం పెరిగి రూ. 17,445 కోట్లకు చేరాయి. వీటిలో ఇంధన ఖర్చులు 23 శాతం పెరిగి రూ. 6,417 కోట్లుగా నమోదయ్యాయి. అంతేకాకుండా విమానాలు, ఇంజిన్ల అద్దె వ్యయాలు రూ. 195 కోట్ల నుంచి రూ. 624 కోట్లకు జంప్‌చేశాయి. జూన్‌ చివరికల్లా కంపెనీ 18 లీజులతో కలిపి 382 విమానాలను కలిగి ఉంది.

ఇండిగో షేరు 1.4 శాతం ఎగసి రూ. 4,491 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్‌



రిత్విక్‌ జోడీకి నిరాశ

అట్లాంటా ఓపెన్‌ ఏటీపీ–250 టెన్నిస్‌ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్‌ చౌదరీ పురుషుల డబుల్స్‌ విభాగంలో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి రౌండ్‌లో రిత్విక్‌–నిక్కీ పునాచా (భారత్‌) ద్వయం 6–7 (5/7), 4–6తో రెండో సీడ్‌ నథానియల్‌ లామోన్స్‌–జాక్సన్‌ విత్రో (అమెరికా) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. 81 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్‌–నిక్కీ జోడి 10 ఏస్‌లు సంధించింది. రిత్విక్‌–నిక్కీలకు 4,130 డాలర్ల (రూ. 3 లక్షల 46 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

యూకీ బాంబ్రీ జోడీ పరాజయం

క్రొయేషియా ఓపెన్‌ ఏటీపీ–250 టెన్నిస్‌ టోర్నీలో పురుషుల డబుల్స్‌ క్వార్టర్‌ ఫైనల్లో టాప్‌ సీడ్‌ యూకీ బాంబ్రీ (భారత్‌)–ఒలివెట్టి (ఫ్రాన్స్‌) జోడీ 4–6, 6–1, 6–10తో గినార్డ్‌–గ్రెగోరి జాక్‌ (ఫ్రాన్స్‌) జోడీ చేతిలో ఓడిపోయింది. యూకీ–ఒలివెట్టిలకు 9,600 యూరోల (రూ. 8 లక్షల 72 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

శుభారంభంపై భారత్‌ దృష్టి

- నేడు శ్రీలంకతో తొలి టి20
- యువ ఆటగాళ్ల సత్తాకు పరీక్ష
- తొలిసారి గంభీర్‌ శిక్షణలో టీమిండియా బరిలోకి
- రాత్రి 7 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



టి20 సిరీస్‌ ట్రోఫీతో అసలంక, సూర్యకుమార్‌

పల్లెకెలె: భారత్‌ కొత్తకొత్తగా లంక పర్యటనను ప్రారంభించేందుకు సిద్ధమైంది. గతంలో టి20 సారథిగా వ్యవహరించినప్పటికీ సూర్యకుమార్‌ యాదవ్‌ ఈసారి గంభీర్‌ కోచింగ్‌లో నడవడం కొత్తే! టాపార్డర్‌లో రోహిత్‌ శర్మ, కోహ్లితో పాటు ఆల్‌రౌండర్‌ జడేజా పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పడంతో ఆ చాలెంజింగ్‌ స్థానాలు భర్తీ చేసే ఆటగాళ్లకు ఈ సిరీస్‌ సరికొత్తగా స్వాగతం పలకబోతోంది. మొత్తం పల్లెకెలె వేదికపైనే జరిగే మూడు టి20ల సిరీస్‌లో నేడు తొలి మ్యాచ్‌ జరుగుతోంది. కొత్త కోచ్‌ గౌతమ్‌ గంభీర్‌ అనుభవం, సూర్యకుమార్‌ సారథ్యం, సత్తాగల యువ ఆటగాళ్లతో భారత్‌ సమతూకంగా ఉంది. కొత్త జట్టు మేళవింపుతో శుభారంభంపై దృష్టి సారించింది. కొత్త కోచ్‌ గురించి కొత్తగా చెప్పుకోవాల్సిందేమీ లేదు. గంభీర్‌ ఓపెనర్‌గా నిరూపించుకున్నాడు. అంతకుమించి రెండు ప్రపంచకప్‌ (2007 టి20; 2011 వన్డే) విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. అలాగే దీనితో పోల్చలేకపోయినా కూడా... ఐపీఎల్‌లో విజయవంతమైన సారథిగా, అనంతరం మెంటార్‌గానూ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు టైటిళ్లు అందించాడు. కాబట్టి గంభీర్‌ మార్గదర్శనంపై ఎవరికీ ఏ అనుమానాలు లేవు. అయితే పూర్తిగా యువ ఆటగాళ్లతో కూడిన జట్టును ఏ విధంగా సన్నద్ధం చేస్తారన్నదానిపైనే సర్వత్రా ఆసక్తినెలకొంది.

దుర్భేధ్యంగా టీమిండియా

ఈ ఏడాది భారత జట్టు అద్భుతంగా రాణిస్తోంది. ప్రపంచకప్‌లో ట్రోఫీ గెలిచేదాకా జైత్రయాత్ర కొనసాగించింది. ఓవరాల్‌గా ఈ ఏడాది 16 టి20లు ఆడిన భారత్‌ 15 మ్యాచ్‌ల్లో గెలిచింది. జింబాబ్వేకెళ్లిన ద్వితీయశ్రేణి భారత జట్టు తొలి మ్యాచ్‌లో ఓటమి తప్ప సిరీస్‌ 4–1తో గెలిచి సత్తా చాటుకుంది. ఓపెనింగ్‌లో యశస్వి, గిల్‌లతో పాటు వన్‌డౌన్‌లో రిషభ్‌ పంత్‌ మెరిపిస్తే మిడిలార్డర్‌ను సూర్యకుమార్‌తో పాటు అనుభవజ్ఞుడైన హార్దిక్‌ పాండ్యా నడిపించగలడు. బౌలింగ్‌లో బుమ్రా కూడా విశ్రాంతిలో ఉండటంతో.... మొత్తం మీద అనుభవజ్ఞుల్లేని టీమిండియాకు ప్రస్తుతం పాండ్యానే పెద్ద దిక్కు. బౌలింగ్‌లో సిరాజ్‌, అర్ష్‌దీప్‌ సింగ్‌లు సత్తా చాటితే ఆరంభంలోనే వికెట్లు కూలుతాయి. గంభీర్‌ ప్లాన్‌ ముగ్గురు స్పిన్నర్లయితే వాషింగ్టన్‌ సుందర్‌, అక్షర్‌ పటేల్‌లతో పాటు రవి బిష్ణోయ్‌కి చాన్స్‌ లభిస్తుంది.

లంక ఎదురునిలిచేనా...

స్టార్లు లేకపోయినా భారత్‌ సత్తాపై ఎవరికీ ఏ అనుమానాల్లేవు. కానీ కొన్నేళ్లుగా శ్రీలంక ప్రదర్శన మాత్రం నిరాశజనకంగా సాగుతోంది. ఇలాంటి జట్టును అనుభవం లేని కెప్టెన్‌ చరిత్‌ అసలంక ఏ మేరకు నడిపిస్తాడో చూడాలి. టాపార్డర్‌లో నిసాంక, కుశాల్‌ మెండిస్‌ బౌలింగ్‌లో హసరంగ, పతిరణ తప్ప జట్టులో నిలకడగా ఆడే ఆటగాళ్లే కరువయ్యారు. సొంతగడ్డపై అనుకూలత కూడా టి20లకు ఏమాత్రం అక్కరకు రాదు. కాబట్టి భారత్‌ యువ ఆటగాళ్లతో ఉన్నా... వారిలో ఐపీఎల్‌ అపారమైన అనుభవాన్నిచ్చింది. ఈ నేపథ్యంలో శ్రీలంక సిరీస్‌ గెలిచేందుకు కాదు... మ్యాచ్‌ నెగ్గేందుకే ప్రతిసారీ యుద్ధం చేయక తప్పదు!

జట్లు (అంచనా)

భారత్‌: సూర్యకుమార్‌ (కెప్టెన్‌), యశస్వి, శుబ్‌మన్‌, రిషభ్‌ పంత్‌, హార్దిక్‌ పాండ్యా, శివమ్‌ దూబే, సుందర్‌, అక్షర్‌, అర్ష్‌దీప్‌, రవి బిష్ణోయ్‌/ఖలీల్‌ అహ్మద్‌, సిరాజ్‌. **శ్రీలంక:** అసలంక (కెప్టెన్‌), నిసాంక, కుశాల్‌ మెండిస్‌, పెరీరా, ఫెర్నాండో, షనక, హసరంగ, తీక్షణ, బినుర ఫెర్నాండో, మదుషంక, పతిరణ.

పిచ్‌, వాతావరణం

ఇది స్పిన్‌ వికెట్‌. నిలదొక్కుకుంటే 180 పైచిలుకు స్కోరు సాధించవచ్చు. అయితే స్పిన్నర్లతో ఇబ్బందులు తప్పవు. శనివారం పగటివేళ వర్షం కురిసే అవకాశముంది. కానీ రాత్రికల్లా తెరిపినిస్తుందని స్థానిక వాతావరణశాఖ తెలిపింది.

భారీ విజయంతో ఫైనల్లోకి భారత్‌

- సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై 10 వికెట్లతో జయభేరి
- రాణించిన రేణుక, రాధ
- స్మృతి మంధాన మెరుపులు
- ఆదివారం శ్రీలంకతో టైటిల్‌ పోరు





దంబుల్లా: బౌలర్ల క్రమశిక్షణకు బ్యాటర్ల సహకారం తోడవడంతో... భారత మహిళల జట్టు ఆసియా కప్‌ టి20 టోర్నీ ఫైనల్లోకి ప్రవేశించింది. లీగ్‌ దశలో సంపూర్ణ ఆధిపత్యంతో నాకౌట్‌కు చేరిన టీమిండియా... శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో 10 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించింది. మహిళల ఆసియాకప్‌లో భారత జట్టు తుదిపోరుకు చేరడం ఇది తొమ్మిదోసారి కాగా.. టి20 ఫార్మాట్‌లో నిర్వహించిన ఐదుసార్లూ ఫైనల్లో అడుగుపెట్టింది. టాస్‌ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. కెప్టెన్‌ నిగార్‌ సుల్తానా (32), షోర్నా అక్తర్‌ (19 నాటౌట్‌) మాత్రమే రెండంకెల స్కోరు చేయగా మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' రేణుక, రాధ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో టీమిండియా 11 ఓవర్లలో వికెట్‌ నష్టపోకుండా 83 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు స్మృతి మంధాన (39 బంతుల్లో 55 నాటౌట్‌; 9 ఫోర్లు, ఒక సిక్సర్‌), షఫాలీ వర్మ (26 నాటౌట్‌) రాణించారు. ఆదివారం జరిగే ఫైనల్లో ఆతిథ్య శ్రీలంక జట్టుతో భారత్‌ తలపడుతుంది. రెండో సెమీఫైనల్లో శ్రీలంక మూడు వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ జట్టును ఓడించింది.

రేణుక అదుర్స్‌

మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాకు ఏదీ కలిసి రాలేదు. ఇన్నింగ్స్‌ తొలి ఓవర్‌లోనే ఓపెనర్‌ దిలారా అక్తర్‌ (6)ను అవుట్‌ చేసిన రేణుక, తన తదుపరి ఓవర్‌లో ఇస్మా (8)ను పెవిలియన్‌కు పంపించింది. ఆరో ఓవర్‌లో ముర్షిదా ఖాతూన్‌ (4) కూడా వెనుదిరిగింది. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి బంగ్లా 25/3తో నిలిచింది. ఈ మూడు వికెట్లు రేణుక ఖాతాలోకే వెళ్లాయి. ఇక అక్కడి నుంచి బంగ్లా మహిళల జట్టు కోలుకోలేకపోయింది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి స్వల్ప స్కోరే చేసింది.

ఇద్దరే కొట్టేశారు

స్వల్ప లక్ష్యఛేదనలో భారత ఓపెనర్లు చెలరేగిపోయారు. స్మృతి, షఫాలీ విజృంభణతో 11 ఓవర్లలోనే భారత జట్టు విజయం సాధించింది. భారత అమ్మాయిలు అదరగొట్టిన చోట బంగ్లా బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. దీంతో స్మృతి ఫోర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ క్రమంలో అర్ధశతకం పూర్తి చేసుకున్న మంధాన .. నాకౌట్‌ మ్యాచ్‌ల్లో నాలుగో హాఫ్‌ సెంచరీ తన పేరిట లిఖించుకుంది. అలాగే పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక పరుగుల జాబితాలో రెండోస్థానానికి చేరింది.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్‌ ఇన్నింగ్స్‌: దిలారా అక్తర్‌ (సి) ఉమ (బి) రేణుక 6; ముర్షిదా ఖాతూన్‌ (సి) షఫాలీ (బి) రేణుక 4; ఇస్మా తన్జీమ్‌ (సి) తనూజ (బి) రేణుక 8; నిగార్‌ సుల్తానా (సి) దీప్తి (బి) రాధ 32; రుమానా (బి) రాధ 1; రాబియా ఖాన్‌ (సి) షఫాలీ (బి) పూజ 1; రీతు మోనీ (స్టంప్డ్‌) రిచా (బి) దీప్తి 5; షోర్నా (నాటౌట్‌) 19; నహిద (బి) రాధ 0; మారుఫా (నాటౌట్‌) 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 80. వికెట్ల పతనం:** 1–7, 2–17, 3–21, 4–30, 5–33, 6–44, 7–80, 8–80. **బౌలింగ్‌:** రేణుక 4–1–10–3, పూజ 4–0–25–1, తనూజ 4–0–16–0, దీప్తి 4–0–14–1, రాధ 4–1–14–3.

భారత్‌ ఇన్నింగ్స్‌: షఫాలీ వర్మ (నాటౌట్‌) 26; స్మృతి (నాటౌట్‌) 55; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (11 ఓవర్లలో వికెట్‌ నష్టపోకుండా) 83. బౌలింగ్‌:** మారుఫా 2–0–17–0, నహిద 3–0–34–0, జహనారా ఆలమ్‌ 3–0–17–0, రాబియా ఖాన్‌ 2–0–10–0, రుమానా అహ్మద్‌ 1–0–5–0.

9 మహిళల ఆసియాకప్‌లో (వన్డే, టి20 ఫార్మాట్‌ కలిపి) భారత జట్టు ఫైనల్‌ చేరడం ఇది తొమ్మిదోసారి. ఇందులో ఏడుసార్లు ట్రోఫీ గెలుచుకుంది. 2018లో రన్నరప్‌గా నిలిచింది.

3 టి20ల్లో భారత మహిళల జట్టు 10 వికెట్ల తేడాతో విజయం సాధించడం ఇది మూడోసారి. ఇటీవల దక్షిణాఫ్రికాపై 85 పరుగుల లక్ష్యాన్ని అజేయంగా ఛేదించిన భారత్‌.. 2019లో వెస్టిండీస్‌పై 104 పరుగుల టార్గెట్‌ను వికెట్‌ కోల్పోకుండా అధిగమించింది.

1 టి20 క్రికెట్‌లో రెండుసార్లు 20వ ఓవర్‌ మెయిడెన్‌ వేసిన తొలి బౌలర్‌గా రాధ యాదవ్‌ రికార్డుల్లోకెక్కింది. ఓవరాల్‌గా పురుషుల క్రికెట్‌లో ఎనిమిది మంది, మహిళల క్రికెట్‌లో తొమ్మిది మంది బౌలర్లు ఇన్నింగ్స్‌ చివరి ఓవర్‌ను మెయిడెన్‌ చేశారు.

2 మహిళల టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో స్మృతి మంధాన (3433) రెండోస్థానానికి దూసుకెళ్లింది. సూజీ బేట్స్‌ (4348 ; న్యూజిలాండ్‌) టాప్‌ ర్యాంక్‌లో ఉంది.

విండీస్‌ 282 ఆలౌట్‌


హోల్డర్‌

బర్మింగ్‌హామ్‌: ఇంగ్లండ్‌తో జరుగుతున్న చివరిదైన మూడో టెస్టులో వెస్టిండీస్‌ బ్యాటర్లు బ్రాత్‌వైట్‌ (61; 8 ఫోర్లు), హోల్డర్‌ (59; 6 ఫోర్లు, 1 సిక్స్‌) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. దీంతో టాస్‌ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన కరీబియన్‌ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 75.1 ఓవర్లలో 282 పరుగుల వద్ద ఆలౌటైంది. మిడిలార్డర్‌లో జొషువా సిల్వా (49; 3 ఫోర్లు) కూడా రాణించాడు. ఒక దశలో 76/1గా ఉన్న విండీస్‌ 115/5 స్కోరు వద్ద కష్టాల్లో పడింది. అనంతరం జొషువా, హోల్డర్‌లు ఆరో వికెట్‌కు 109 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. వోక్స్‌ (3/69) ఈ జోడీని విడగొట్టి విండీస్‌ పతనానికి శ్రీకారం చుట్టాడు. అట్కిన్సన్‌ (4/67) కీలకమైన వికెట్లు తీసి విండీస్‌ ఆట కట్టించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ ఆరంభించిన ఇంగ్లండ్‌ ఆటముగిసే సమయానికి 3 వికెట్లకు 38 పరుగులు చేసింది.

■ ప్రేమ ఎంత 'మధు'రం



విలువలు అంతరించిపోతున్న నేటి సమాజంలో.. తన మధ్య లేని తల్లిదండ్రులు కొండా బాలిరెడ్డి, ఈశ్వరమ్మ, సోదరుడు డాక్టర్ శైలేంద్రారెడ్డిపై ఉన్న అమితమైన ప్రేమ, జ్ఞాపకాలను ఓ వ్యక్తి పదిలంగా కాపాడుకుంటున్నాడు. వారికి గుడికట్టి, విగ్రహాలను కూడా నెలకొల్పాడు నంద్యాల జిల్లా గాజులపల్లెకు చెందిన కొండా మధుసూదన్ రెడ్డి. అంతేకాదు ఏటా వీరికి వర్ధంతి కార్యక్రమాలు చేస్తూ కనుమరుగువుతున్న బంధాలకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. – మహానంది



■ మేమేం పాపం చేశాం

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఎంపేడు గ్రామ పంచాయతీలోని ఈశ్వరయ్య కాలనీకి చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి ఓటేశాయన్న కారణంతో టీడీపీ నేతలు గ్రామం నుంచి బహిష్కరించారు. ఈ కుటుంబాలన్నీ ప్రాణభయంతో ఒడిశాకు వెళ్లిపోయి తలదాచుకొంటున్నాయి. ఆ కుటుంబాలకు చెందిన పిల్లలే



వీరు. మొన్నటివరకు గ్రామంలో చదువుకొంటున్నామని, ఇప్పుడు తాము చదువుకొనేదెలా అంటున్నారు. తామేం పాపం చేశామని ప్రశ్నిస్తున్నారు. తమ కుటుంబాలకు రక్షణ కల్పించి, తాము చదువుకొనే అవకాశం కల్పించాలని వేడుకొంటున్నారు. – రేణిగుంట

■ నిప్పులపై నమాజ్

అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలోని హసేన్‌-హుసేన్ పీర్ల చావిడి వద్ద చిన్న పీర్ల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో ముజావర్ నమాజ్ చదివి అందరినీ అబ్బుర పరిచాడు. శుక్రవారం అగ్నిగుండంలో ముజావర్ దోదా షఫీవుల్లా నమాజ్ చదివాడు. ఈ దృశ్యాన్ని చూసేందుకు ఉరవకొండ పట్టణంతో పాటు చుట్టుపక్కల వారు భారీ సంఖ్యలో తరలివచ్చారు. – ఉరవకొండ



క్లుప్తంగా...

టెట్‌లో మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మైనారిటీ విద్యార్థులకు టెట్ పరీక్ష కోసం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శుక్రవారం తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్ (బీసీ–సీ), సిక్కులు, బుద్ధులు, జైనులు తదితర మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 25 వరకు ఉచిత శిక్షణకు రాష్ట్రవ్యాప్తంగా 19 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

మడ అడవుల సంరక్షణతోనే భవిష్యత్



మాట్లాడుతున్న రాజేంద్రసింగ్

తాళ్లరేవు: పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్న మడ అడవుల సంరక్షణతోనే భావితరాల భవిష్యత్ ముడిపడి ఉందని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత, ద వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ అన్నారు. శుక్రవారం కోరంగి అభయారణ్యంలో ఆయన పర్యటించారు. ప్రపంచ మడ అడవుల సంరక్షణ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మడ అడవులు వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకోవడంతోపాటు ఇతర చెట్ల కంటే సుమారు 8 రెట్లు అధికంగా ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తాయని తెలిపారు. ఇప్పుడు భూమి, నీరు తదితర వాటిని వ్యాపార వస్తువులుగా మార్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

చేతకాదని చెప్పండి.. సాధ్యం కాదని అనకండి

పవన్ వ్యాఖ్యలపై జన విజ్ఞాన వేదిక ఖండన

పిఠాపురం: 'మీవల్ల కానప్పుడు.. మీరు చేయలేనప్పుడు.. మాకు చేత కాదు.. మేం చేయలేం అని చెప్పండి. అంతేగాని సాధ్యం కాదని మాత్రం చెప్పకండి. అది మీ చేతగానితనం అవుతుంది' అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జన విజ్ఞాన వేదిక, మద్య, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ ఫైర్ అయ్యారు. మద్యపాన నిషేధం అమలు చేయడం సాధ్యం కాదని, అది చాలా కష్టమని అసెంబ్లీ సమావేశాల్లో పవన్ కల్యాణ్ చెప్పడాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన తీవ్రంగా ఖండించారు. 'మాజీ సీఎం ఎన్టీఆర్‌ను తెగ పొగుడుతున్న మీరు.. ఆయనలా మద్యపాన నిషేధాన్ని ఎందుకు చేయలేరు?' అని ప్రశ్నించారు. 'ఒకసారి పాత రికార్డులను పరిశీలించండి. ఎన్టీఆర్ మద్యపాన నిషేధం ఎలా అమలు చేశారో చూడండి. అసాధ్యాలను సుసాధ్యాలు చేసిన చరిత్ర మనకుంది' అని పవన్ కల్యాణ్‌కు హితవు పలికారు.

ఏటీఎంలలో నింపాల్సిన డబ్బుతో పరార్

- రాజమహేంద్రవరంలో రూ. 2.35 కోట్ల అపహరణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో భారీ చోరీ జరిగింది. ఏటీఎంలలో నింపాల్సిన రూ.2.35 కోట్ల మొత్తాన్ని సంబంధిత నిర్వాహక సంస్థ ఉద్యోగి అపహరించి, పరారైన ఘటన నగరంలో సంచలనం రేపింది. స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంలలో నిత్యం నగదు నింపేందుకు హిటాచీ సంస్థతో ఒప్పందం ఉంది. ఆ సంస్థకు సంబంధించిన వ్యాను, సెక్యూరిటీ సిబ్బంది కలిపి ఐదుగురు ఉద్యోగులు ప్రతి రోజూ దానవాయిపేటలోని హెచ్‌డీఎఫ్‌సీ మెయిన్ బ్రాంచి నుంచి నగదు తీసుకెళ్లి ఏటీఎంలలో నింపుతుంటారు. అదేక్రమంలో శుక్రవారం మధ్యాహ్నం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం మాచరమెట్టకు చెందిన వాసంశెట్టి అశోక్ కుమార్ బ్యాంకులోకి వెళ్లి రూ. 2.35 కోట్ల నగదు తీసుకున్నాడు. ఆ సొమ్మును సర్దుతున్నట్లుగా నటించి.. ముందుగా వేసిన పథకం ప్రకారం సిద్ధం చేసుకున్న కారులో ఉడాయించాడు. కొంతసేపటి తర్వాత ఇది గుర్తించిన ఇతర ఏటీఎం నిర్వాహక సిబ్బంది అశోక్ కుమార్‌కు ఫోన్ చేయగా.. అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మిగిలిన సిబ్బందిని విచారించారు. అశోక్ కుమార్ ముందస్తు పథకం ప్రకారమే ఈ చోరీకి పాల్పడ్డాడని ప్రాథమిక నిర్ధారణకు వచ్చి అతడి కోసం గాలింపు చేపట్టారు. ఈ దోపిడీకి పాల్పడిన నిందితుడి ఆచూకీ తెలిసిన వారు రాజమహేంద్రవరం వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారికి తగిన బహుమతి ఇస్తామని పోలీసులు ప్రకటించారు.

నచ్చిన వర్సిటీలో చోటు.. మెచ్చిన కోర్సులో సీటు!

నేషనల్ డిజిటల్ యూనివర్సిటీతో సాకారం ■ ప్రవేశం, బోధన అంతా ఆన్‌లైన్‌లోనే

- ఐఐటీలు, ఐఐఎంల్లోనూ చేరే అవకాశం
- ఒకే సమయంలో రెండు కోర్సులు చదవొచ్చు జాబ్ మార్కెట్ అవసరాలకనుగుణంగా నైపుణ్యాల పెంపు
- కేంద్ర బడ్జెట్‌లో ఎన్‌డీయూకు రూ.100 కోట్లు కేటాయింపు
- ఈ ఏడాది నుంచే పట్టాలెక్కే అవకాశం

నేషనల్ డిజిటల్ యూనివర్సిటీతో ప్రయోజనాలు..

- దేశంలోని అన్ని ప్రముఖ యూనివర్సిటీల్లో విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో ప్రవేశం పొందొచ్చు.
- సాధారణ వర్సిటీలే కాకుండా.. ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఐఐఎంల్లోనూ తమకు నచ్చిన కోర్సులు చదవొచ్చు.
- అడ్మిషన్ కోసం ఎలాంటి ప్రవేశ పరీక్షలు రాయనక్కర్లేదు.
- సంప్రదాయ డిగ్రీ కోర్సులు మొదలుకొని వృత్తివిద్యా కోర్సుల్లోనూ ప్రవేశం పొందొచ్చు.
- విద్యార్థులకు బోధన, అభ్యసన సాధనాలు అన్నీ ఆన్‌లైన్ రూపంలోనే ఉంటాయి.
- ప్రత్యక్షంగా తరగతులకు హాజరు కావాల్సిన అవసరం ఉండదు. 'స్వయం' వెబ్ పోర్టల్ ద్వారా తరగతులు వినాల్సి ఉంటుంది.
- తాము చేరిన కోర్సుకు సంబంధించి ఆన్‌లైన్‌లోనే పాఠ్యాంశాలను చదువుకోవచ్చు.
- విద్యార్థులు భారీగా ఫీజులను చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆఫ్‌లైన్‌తో పోల్చితే ఆన్‌లైన్‌లో ఫీజులు తక్కువగా ఉంటాయి.
- ముఖ్యంగా అధిక ఫీజుల భారం భరించలేని మధ్యతరగతి, నిరుపేద విద్యార్థులకు ఈ విధానం ఎంతో ఉపయోగం.
- కోర్సులు పూర్తి చేసుకున్నాక ఆ సర్టిఫికెట్లకు.. ఇండస్ట్రీ వర్గాల నుంచి గుర్తింపు కల్పిస్తారు. దీంతో జాబ్ మార్కెట్‌లో పోటీ పడే అవకాశం కూడా లభిస్తుంది.

సాక్షి, ఎడ్యుకేషన్ డెస్క్:

సాధారణంగా బ్యాచిలర్ డిగ్రీ, పీజీ డిగ్రీల్లో అడుగు పెట్టాలంటే.. ఆయా యూనివర్సిటీలు నిర్వహించే ప్రవేశపరీక్షలు రాయాల్సి ఉంటుంది. వాటిలో ఉత్తీర్ణత సాధించినా సీట్లు తక్కువ ఉంటే ప్రవేశం కష్టం. ప్రవేశం లభించినా భారీగా ఉండే ఫీజులు భయపెట్టడం ఖాయం. ఈ సమస్యలకు ఇక పరిష్కారం లభించనుంది. విద్యార్థులు తమకు నచ్చిన యూనివర్సిటీలో, మెచ్చిన కోర్సులో అడుగుపెట్టి.. సర్టిఫికెట్లు సొంతం చేసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించనుంది. ఈ మేరకు ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ (ఎన్‌డీయూ)ని ప్రకటించింది. దీనికి రూ.100 కోట్ల నిధులను సైతం కేటాయించింది. ఈ నేపథ్యంలో అసలు నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ ఎందుకు? దీని ఉద్దేశం ఏమిటి? ఇదెలా పనిచేస్తుంది? దీనివల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనాలపై విశ్లేషణ..

2030 నాటికి జీఈఆర్ పెంచడమే లక్ష్యం

2030 నాటికి దేశంలో ఉన్నత విద్యలో విద్యార్థుల స్థూల చేరికల నిష్పత్తి (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్))ను 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం జీఈఆర్ 27 శాతంగానే ఉండడంతో ఈ నిర్ణయం తీసుకుంది. జాబ్ మార్కెట్‌లో క్రేజ్ ఉన్న కోర్సుల్లో నైపుణ్యాలను అందించి.. విద్యార్థుల్లో ఉద్యోగిత సామర్థ్యాన్ని పెంచడం కూడా ఎన్‌డీయూ ఏర్పాటుకు మరో కారణం.

నచ్చిన ఇన్‌స్టిట్యూట్ నుంచి సర్టిఫికెట్లు..

ఎన్‌డీయూలో ప్రవేశం పొందిన విద్యార్థులు.. తమకు నచ్చిన ఇన్‌స్టిట్యూట్ నుంచి సర్టిఫికెట్లు కూడా సొంతం చేసుకోవచ్చు. ఇందుకోసం వారు కనీసం 50 క్రెడిట్స్ పొందాల్సి ఉంటుంది. ప్రాథమిక దశలో థియరీ సబ్జెక్టులు ఎక్కువగా ఉండే కోర్సులనే కోర్ కోర్సులుగా అందించనున్నారు. ప్రాక్టికల్స్, ల్యాబ్ వర్క్ అవసరం ఉన్న కోర్సులను తర్వాత దశలో అందుబాటులోకి తెస్తారు. ఈ క్రమంలో ప్రాక్టికల్ కోర్సులకు దేశవ్యాప్తంగా ఆఫ్‌లైన్ బోధన అందించేందుకు నిర్దేశిత ప్రాంతాల్లో నోడల్/హబ్ ఇన్‌స్టిట్యూట్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ముందుగా డిప్లొమా, సర్టిఫికెట్, బ్యాచిలర్ డిగ్రీలను, వచ్చే ఏడాది నుంచి పీజీ కోర్సులను అందిస్తామని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఒకే సమయంలో రెండు కోర్సులు..

ఎన్‌డీయూ ద్వారా విద్యార్థులు ఒకే సమయంలో రెండు కోర్సులు చదువుకునే అవకాశం లభించనుంది. ఇప్పటికే తాము రెగ్యులర్‌గా చదువుతున్న కోర్సులకు అదనంగా.. ఎన్‌డీయూలో మరో కోర్సుకు నమోదు చేసుకోవచ్చు. దానికి క్రెడిట్స్ కూడా పొందితే రెండు సర్టిఫికెట్లు చేతిలో ఉంటాయి. ఒకవేళ తక్షణం సర్టిఫికెట్ వద్దనుకుంటే ఆ క్రెడిట్స్‌ను అకడమిక్ క్రెడిట్ బ్యాంక్‌లో నిక్షిప్తం చేసుకోవచ్చు.

పది లక్షల మందికిపైగా విద్యార్థులకు ప్రయోజనం



నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా.. దేశంలో దాదాపు పది లక్షల మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. ఇప్పటికే పలు ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ హబ్ సెంటర్లుగా వ్యవహరించేందుకు ముందుకొచ్చాయి. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుంది. కోర్ కోర్సులతో పాటు, జాబ్ మార్కెట్‌కు అవసరమైన కోర్సుల్లో మరిన్ని నైపుణ్యాలు పొందొచ్చు. ఈ కోర్సులకు గుర్తింపు విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదు. కచ్చితంగా వీటికి ఇండస్ట్రీ గుర్తింపు లభించేలా చర్యలు తీసుకుంటాం.

– ప్రొఫెసర్ ఎం. జగదీశ్ కుమార్, చైర్మన్, యూజీసీ

చెన్నై–మైసూర్ మధ్య హైస్పీడ్ రైలు

వయా చిత్తూరు మీదుగా పరుగులు



సాక్షి, అమరావతి : దక్షిణ భారతదేశంలో చెన్నై–మైసూర్ మధ్య తొలి హైస్పీడ్ రైలును ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల మీదుగా ప్రత్యేక కారిడార్‌ను నిర్మించాలని జాతీయ హైస్పీడ్ రైల్ కారిడార్ కార్పొరేషన్ ప్రణాళిక రూపొందించింది. మొత్తం 463 కి.మీ. మేర ఈ కారిడార్‌ను నిర్మిస్తారు. మన రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలోనూ 83 కి.మీ.మేర నిర్మించనున్నారు. ఈ మేరకు ప్రాజెక్టు డిజైన్‌ను రైల్వేశాఖ సూత్రప్రాయంగా ఆమోదించి భూసేకరణ ప్రణాళికపై కసరత్తు చేస్తోంది. అనంతరం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఖరారు చేయనుంది.

మూడు రాష్ట్రాల మీదుగా..

ఈ హైస్పీడ్ రైల్ కారిడార్‌ను తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మీదుగా నిర్మిస్తారు. తమిళనాడు రాజధాని చెన్నై నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, కర్ణాటక రాజధాని బెంగళూరు మీదుగా మైసూర్ వరకు నిర్మిస్తారు. మొత్తం 463 కి.మీ. పొడవైన ఈ కారిడార్ ఆంధ్రప్రదేశ్‌లో 83 కి.మీ. మేర ఉంటుంది. తమిళనాడులో 122 కి.మీ., కర్ణాటకలో 258 కి.మీ. మేర నిర్మిస్తారు. రెండు దశలుగా చేపట్టే ఈ ప్రాజెక్టును మొదటి దశ కింద చెన్నై నుంచి బెంగళూరు వరకు 306 కి.మీ., రెండో దశ కింద బెంగళూరు నుంచి మైసూర్ వరకు 157 కి.మీ. మేర నిర్మించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఇక అత్యంత ఆధునికంగా నిర్మించే ఈ హైస్పీడ్ కారిడార్‌లో భాగంగా ఎలివేటెడ్ కారిడార్, ఎట్ గ్రేడ్, టన్నెల్, గ్రీన్‌ఫీల్డ్ సెగ్మెంట్లుగా నిర్మించాలని డిజైన్‌ను ఖరారుచేశారు. ఈ కారిడార్‌లో భాగంగా 30 కి.మీ.మేర సొరంగాలు ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. చెన్నైలో 2.8 కి.మీ., చిత్తూరులో 11.8 కి.మీ., బెంగళూరు రూరల్‌లో 2 కి.మీ., బెంగళూరులో 11 కి.మీ. మేర వీటిని నిర్మిస్తారు.

మొత్తం 11 స్టేషన్లు.. ఏపీలో చిత్తూరులో హాల్ట్..

ఇక ఈ హైస్పీడ్ రైలుకు చెన్నై–మైసూర్ మధ్య 11 చోట్ల హాల్ట్‌లు కల్పిస్తారు. ఏపీలో ఒక్క చిత్తూరులోనే ఉంటుంది. దీంతోపాటు చెన్నై, పూనమల్లి, కోలార్, కొడహళ్లి, వైట్‌ఫీల్డ్, బైయపనహళ్లి, ఎలక్ట్రానిక్స్ సిటీ, కెంగేరీ, మాండ్య, మైసూర్‌లలో ఎలివేటెడ్ రైల్వేస్టేషన్లను నిర్మిస్తారు.

భూసేకరణ ప్రక్రియపై కసరత్తు..

హైస్పీడ్ రైల్ కారిడార్ మొత్తం 303 గ్రామాలు, పట్టణాల మీదుగా నిర్మించాల్సి ఉంటుందని రైల్వేశాఖ ప్రకటించింది. అందుకోసం తమిళనాడులోని చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, వేలూరు, ఏపీలోని చిత్తూరు, కర్ణాటకలోని కోలార్, బెంగళూరు రూరల్, బెంగళూరు అర్బన్, రామనగర, మాండ్య, మైసూర్ జిల్లాల్లో 2,905 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుందని అంచనా వేశారు. ఇందులో 2,660 ఎకరాలు ప్రైవేటు భూములే. ప్రస్తుతం రైల్వేశాఖ ఈ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావ అధ్యయన నివేదికను రూపొందించే ప్రక్రియను వేగవంతం చేసింది. మరోవైపు.. భూసేకరణ ప్రక్రియపై ప్రాథమిక కసరత్తు చేపట్టింది. అనంతరం డీపీఆర్‌ను ఖరారు చేయనుంది. కేంద్ర ప్రభుత్వం దీనిని ఆమోదించిన అనంతరం టెండర్ల ప్రక్రియ చేపట్టాలని భావిస్తోంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలన్నది రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

గరిష్ట వేగం గంటకు 350 కి.మీ..

ఇక ఈ హైస్పీడ్ రైల్ గంటకు గరిష్టంగా 350 కి.మీ. వేగంతో దూసుకపోయే సామర్థ్యం కలిగి ఉంటుంది. దీని నిర్వహణ వేగం గంటకు 320 కి.మీ.గా నిర్ణయించారు. సగటు వేగం గంటకు 250 కి.మీ. ఉంటుందని రైల్వేశాఖ ప్రకటించింది. మొత్తం 730 మంది ప్రయాణికుల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

బిట్రగుంట వద్ద పట్టాలు తప్పిన మరో గూడ్స్

మూడు రోజుల వ్యవధిలో రెండో ఘటన

బిట్రగుంట: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వేస్టేషన్ 144వ నంబరు ఎల్‌సీ గేటు సమీపంలోని క్రాస్ ఓవర్ పాయింట్ వద్ద నెల్లూరు నుంచి విజయవాడకు సరుకుల లోడుతో యార్డులోకి వస్తున్న గూడ్స్ రైలు శుక్రవారం వేకువజామున పట్టాలు తప్పింది. జిల్లా పర్యటనలో ఉన్న విజయవాడ రైల్వే డివిజన్ ఉన్నతాధికారులకు సమాచారం తెలిసిన వెంటనే బిట్రగుంట చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. యుద్ధప్రాతిపదికన పట్టాలు తప్పిన వ్యాగన్‌ను సరిచేసి మరమ్మతులు పూర్తి చేయించారు. ప్రమాద కారణాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. ఇదిలా ఉంటే.. ఈనెల 23న బిట్రగుంట యార్డులోకి వస్తున్న గూడ్స్ పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. మూడురోజుల వ్యవధిలో రెండో ఘటన చోటు చేసుకోవడంతో రైల్వే అధికారులు ఉలిక్కిపడ్డారు.



పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్

అన్నీ అసత్యాలు.. దుష్ప్రచారాలు

గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ



సాక్షి, అమరావతి: 'టీడీపీ కూటమి ప్రభుత్వం గవర్నర్ వంటి రాజ్యాంగ వ్యవస్థను దుర్వినియోగం చేసింది. అవాస్తవాలు, వక్రీకరణలతో కూడిన ప్రసంగాన్ని గవర్నర్‌తో చెప్పించి దుష్ప్రచారం వ్యాప్తికి వాడుకుంది' అని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం తమ ప్రణాళికను గవర్నర్ ప్రసంగం ద్వారా వివరించాల్సిన టీడీపీ కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా అవాస్తవాలు, తప్పుడు సమాచారాన్ని చెప్పించింది అని తెలిపారు. ఈమేరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు శుక్రవారం లేఖ రాశారు. గత ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయించేందుకు పూర్తిగా అసత్యాలతో కూడిన ప్రసంగం చేయించడం ద్వారా గవర్నర్ స్థాయిని టీడీపీ కూటమి ప్రభుత్వం దిగజార్చిందని ఆ లేఖలో పేర్కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం సాధించకపోయినా.. విజయాలను సాధించినట్టుగా చెప్పించేందుకు సాహసించిందన్నారు. అంతేకాకుండా ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని చెప్పించడం ద్వారా టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా తప్పించుకునేందుకు ఎత్తుగడ వేసిందన్నారు. ఉభయ సభల సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చెప్పించిన అసత్యాలు, దుష్ప్రచారాన్ని అంశాల వారీగా ప్రస్తావిస్తూ వైఎస్ జగన్ లేఖ రాశారు.

అన్నీ వక్రీకరణలే..

గత ప్రభుత్వ హయాంలో కుళాయిల ఏర్పాటు నుంచి అప్పులు, పీపీఏలు, మూలధన వ్యయం తదితరాలపై టీడీపీ కూటమి ప్రభుత్వానివి అన్నీ వక్రీకరణలే అని లేఖలో పేర్కొన్నారు. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పులు 18.15 శాతం పెరగగా.. 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పులు కేవలం 13.80 శాతమే పెరిగాయని చెప్పారు. 2014–19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ శాఖ రుణాలు రూ. 29,551 కోట్ల నుంచి రూ. 86,215 కోట్లకు పెరిగాయని, ఇక ఉదయ్ కార్యక్రమం ద్వారా డిస్కమ్‌లకు విడుదల చేసిన రూ. 8,255 కోట్లు రుణం దీనికి అదనమని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మూలధన వ్యయం రూ. 76,139 కోట్లు ఉండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మూలధన వ్యయం కింద రూ. 87,636 కోట్లు వెచ్చించారని కాగ్ నివేదిక వెల్లడించిందన్నారు. విద్యుత్ రంగం విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క పీపీఏను కూడా రద్దు చేయలేదని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏకంగా 73.46 శాతం ఇళ్లకు తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేశామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ మొత్తం వ్యయం రూ. 55,548.87 కోట్లు. కానీ టీడీపీ ప్రభుత్వం 2014–19లో కేవలం రూ. 11,923 కోట్లు వెచ్చించింది. మరి అది మొత్తం వ్యయంలో 72 శాతం ఎలా అవుతుంది? అని ప్రశ్నించారు.

వచ్చే ఏడాది నాలుగు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక

రెండు గ్రాడ్యుయేట్, రెండు టీచర్ల ఎమ్మెల్సీ స్థానాలు..

సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది రెండు గ్రాడ్యుయేట్, రెండు టీచర్ల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేస్తున్నది. తూర్పు–పశ్చిమ గోదావరి గ్రాడ్యుయేట్స్ నుంచి ఎంపికైన ఇళ్ల వెంకటేశ్వరరావు, కృష్ణ–గుంటూరు గ్రాడ్యుయేట్స్ నుంచి ఎన్నికైన కేఎస్ లక్ష్మణ్ రావు, శ్రీకాకుళం–విజయనగరం–విశాఖ టీచర్ల నియోజకవర్గం నుంచి ఎంపికయిన పి.రఘువర్మ పదవీ కాలపరిమితి మార్చి29, 2025తో ముగియనుంది. అదే విధంగా ఇప్పటికే ఖాళీగా ఉన్న తూర్పు–పశ్చిమ గోదావరి టీచర్ నియోజకవర్గం ఎన్నికలను ఒకేసారి నిర్వహించనుంది. ఇందుకోసం కొత్త ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ శుక్రవారం విడుదల చేశారు. గ్రాడ్యుయేట్, టీచర్ల నియోజకవర్గాల్లో కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి సెప్టెంబర్ 30న పబ్లిక్ నోటీసు జారీ చేయడం ద్వారా ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలుపెట్టి డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

ఏపీలో తీర ప్రాంతం అభివృద్ధికి 29 ప్రతిపాదనలు

లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో కేంద్ర నౌకాయాన మంత్రి సర్బానంద





సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లోని తీరప్రాంతం, పోర్టుల అభివృద్ధి నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.3,300 కోట్లకు సంబంధించి 29 ప్రతిపాదనలు వచ్చాయని కేంద్రం నౌకాయాన మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. ఏపీలో ప్రస్తుతం సాగరమాలలో భాగంగా రూ.2,500 కోట్ల విలువైన 13 ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు టీడీపీ సభ్యుడు టి. కృష్ణప్రసాద్, వైఎస్సార్‌సీపీ సభ్యుడు అవినాష్‌రెడ్డిల ప్రశ్నకు సోమవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో సమాధానమిచ్చారు.

పీసీపీఐఆర్ ద్వారా 86,123 మందికి ఉపాధి..

ఏపీలో పెట్రోలియం కెమికల్స్, పెట్రో కెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పీసీపీఐఆర్) ద్వారా ఇప్పటివరకు 86,123 మందికి ఉపాధి దక్కినట్లు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. 2009లో కేంద్ర ప్రభుత్వం పీసీపీఐఆర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని, ఇప్పటివరకూ రూ.58,918.70 కోట్లు విలువైన పెట్టుబడులు వచ్చాయని వైఎస్సార్‌సీపీ సభ్యుడు మిథున్‌రెడ్డి ప్రశ్నకు శుక్రవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో నడ్డా బదులిచ్చారు. భోగాపురంలోని నూతన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం 31 శాతం పూర్తయిందని, 2026 డిసెంబరు కల్లా పూర్తవుతుందన్నారు. కాకినాడ గేట్‌వే పోర్టును పీపీపీ విధానంలో ఏపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని, 2026 జూన్‌కల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. దీంతోపాటు శ్రీకాకుళంలో మూలపేట పోర్టును కూడా ఏపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు.

ప్రత్యేక హోదా అమలుచేయాలి : రాజ్యసభలో నిరంజన్‌రెడ్డి



ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామన్న ప్రత్యేక హోదా హామీ అమలుచేయాలని వైఎస్సార్‌సీపీ సభ్యుడు నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. విభజన సమయంలో ఇదే సభలో నాటి ప్రధాని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రాజ్యసభలో బడ్జెట్‌పై శుక్రవారం జరిగిన చర్చలో నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏపీకి ప్రత్యేక హోదా హామీ ఇచ్చినప్పుడు అన్ని రాష్ట్రాలకు చెందిన సభ్యులు సభలో ఉన్నారని వారెవరూ అభ్యంతరం చెప్పలేదన్నారు. ఏపీ ప్రత్యేక హోదా ప్రకటనకు అన్ని రాష్ట్రాల ప్రతినిధులు సాక్ష్యమని గుర్తుచేశారు. ప్రస్తుతం కూడా ఎవరూ అభ్యంతరం చెప్పే పరిస్థితిలేదని తెలిపారు. ఏపీకి విభజన హామీలు పూర్తిగా అమలుచేయాలని ఆయన కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ పైకి చూస్తే ఒకలా.. సూక్ష్మంగా చూస్తే మరోలా ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. 2035 నాటికి యువ జనాభా బాగా పెరగనుందని.. ఈ నేపథ్యంలో డెమోగ్రఫిక్ డివిడెండ్‌పై దృష్టిసారించాలని నిరంజన్‌రెడ్డి కోరారు. జీఎస్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ గురించి మాట్లాడుతూ.. రూ.80 కోట్లు, రూ100 కోట్లు వారిని కాకుండా రూ.2 రూ.3 కోట్లు వారికి సమన్లు పంపుతున్నారని, సదరు వ్యాపారులపై అధికారులు భౌతికంగా కూడా దాడులు చేశారంటూ హైదరాబాద్, ఢిల్లీ కోర్టుల్లో కేసులున్నాయని ఎంపీ తెలిపారు. వ్యాపారులకు సహకరించేలా అధికారులు వ్యవహరించాలన్నారు. జీఎస్టీ అధికారులంటే వ్యాపారులు భయపడే పరిస్థితి ఉండరాదని ఎంపీ నిరంజన్‌రెడ్డి సూచించారు. దేశంలో వికసిత్ జ్యుడీషియరీ కూడా ఉండాలని, జ్యుడీషియరీకి ప్రభుత్వ సహకారం ఉండాలని తెలిపారు. లీగల్, డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంకు రూ.200 కోట్లు కేటాయించడాన్ని ఆయన అభినందించారు. ఈ–కోర్టుల తరహాలో ఈ–ట్రిబ్యునళ్లపైనా దృష్టిసారించాలని ఎంపీ నిరంజన్‌రెడ్డి కోరారు.

మత్స్య సంపద ఎగుమతుల్లో ఏపీ టాప్

- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశం నలుమూలల నుంచి వివిధ ప్రాంతాలకు మత్స్య సంపద (సీ ఫుడ్) ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ టాప్ ప్లేస్‌లో నిలిచింది. 2023–24కి ఏపీలోని సముద్ర ప్రాంతాల నుంచి 4,27,237.92 లక్షల టన్నుల మత్స్య సంపద (చేపలు, రొయ్యలు, పీతలు, నత్తలు, తదితర ఆహార పదార్థాలు) ఎగుమతి అయినట్లు శుక్రవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. 3,45,052.39 లక్షల టన్నులతో గుజరాత్ రెండో స్థానంలో, 2,73,509.37 టన్నులతో కర్ణాటక మూడో స్థానంలో నిలిచాయి. 2023–24లో దేశవ్యాప్తంగా ఉన్న సముద్ర ప్రాంతాల నుంచి పలు ప్రాంతాలకు 18.19 లక్షల టన్నులు ఎగుమతి అయ్యి, రూ. 61,043.68 కోట్ల వ్యాపారం జరిగినట్లు వెల్లడించింది. 2024–25లో కేవలం ఏప్రిల్, మే నెలల్లో 2.5 లక్షల టన్నులు ఎగుమతులు అయ్యి రూ.8,924.01 కోట్ల వ్యాపారం జరిగినట్లు వివరించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.